మిసిమి

మాసపత్రిక

సంపుటి 32 సంచిక 2

ఫిబ్రవరి 2021

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI Since 1946

Printed & Published by

BAPANNA ALAPATI

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

Hyderabad - 500 020.

Ph: 040 - 27612436, 27645538.

పత్రిక ప్రతి నెలా ఒకటవ తేది మీ ముంగిట వాలుతుంది...

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-

విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

కార్యదర్శి : వి. ఆశారాణి

ఫోన్ : 040 – 27645536. సెల్ : 994 951 6567.

LIBRARY OF CONGRESS

LCCN 91-903060

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

ISSN 2454-4329

E-mail: **misimi90monthly@gmail.com**

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

YouTube : **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

మిసిమి

ఫిబ్రవరి నెల సూచికలు...

కమ్మతెమ్మెరలు : ... 5
జ్ఞానవైకల్యం : డా. అవధానం రఘుకుమార్... 7
పుంభావ ఊర్వశి : ఆచార్య కొలకలూరి ఇనాక్... 12
ప్రేమ : డా. ఎన్. గోపి... 12
ఆంధ్ర నాట్యం : ఆచార్య పప్పు వేణుగోపాల రావు... 13
జుంపా లాహిరి : డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల... 21
చెరగని బాల్యపు పద చిహ్నాలివి : క్రాంతి శివరాత్రి... 28
చలనచిత్ర గీతాలలో శాస్త్రీయ సంగీతం - 4 : డా. ఎమ్. పురుషోత్తమాచార్య... 29
అద్భుతాల గని మన మెదడు : కిల్లాడ సత్యనారాయణ... 37
గురుదేవుడు గురజాడ : పిల్లా తిరుపతిరావు... 43
'పర్వ'ను నడిపిన స్త్రీమూర్తులు : డా. సి.హెచ్. సుశీల... 47
శ్రీ శ్రీరామ్ వేంకట భుజంగరాయ శర్మ : కాసుల శ్రీనివాసులు... 55
డాక్టరు శ్రీమతి ముత్తులక్ష్మిరెడ్డి : గారపాటి కోటమ్మ... 58
ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారిణులు : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్... 59
మైసూరు వాసుదేవాచార్యులు : వేలూరి కృష్ణమూర్తి... 67
నేహల : రాజా రామమోహన రావు... 73
లఘుకావ్యం అక్షరాంజలి : రాయవరపు సత్యనారాయణ... 77
చదవండి... : *మిసిమి*... 80

ఫిబ్రవరి 11 - ఆలపాటి రవీంద్రనాథ్ 25వ వర్థంతి

అట్టమీద బొమ్మలు

ఎలీసబత్ విజీ లే బ్రాన్
(స్వీయచిత్రం)

నేనంటే నాకిష్టం

ఇష్టం లేని పెళ్లి



రోజా బూనర్
(స్వీయచిత్రం)

(ఫెంచి చిత్రకారుడు: అగస్టే టోల్‌మోషి (Auguste Toulmauche) (1829-1890)

మరిన్ని వివరాల ప్రత్యేక వ్యాసం - ***ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారిణులు*** - పుట: *59*

కమ్మతెమ్మెరలు

"....చలనచిత్ర గీతాలలో శాస్త్రీయ సంగీతం అనే నా సుదీర్ఘ వ్యాసాన్ని **మిసిమి** నవంబరు-2020 సంచిక నుండి ప్రారంభించిన **మిసిమి** వారి సహృదయానికి, సౌజన్యానికి అనేక ధన్యవాదాలు. ఎ.కె. గారికి ప్రణామాలు. ఈ వ్యాసాన్ని చదివిన అభిమానులు, పెద్దలు ఎందరో ఫోన్లు చేసి అభినందించారు, ఆశీర్వదించారు. వారందరికీ కృతజ్ఞలు. విశేషించి ప్రతి నెల **మిసిమి** ని చదువుతున్న అభిమానులకు నమస్కారాలు. ప్రత్యేకంగా పత్రికాముఖంగా అభినందించిన డా. తెంగడ కిషన్‌రావుగారికి ప్రణామాలు. పూజ్యులు మాన్యశ్రీ వి.ఎ.కె. రంగారావుగారు నాపై అభిమానంతో చేసిన రెండు దిద్దుబాట్లను హృదయపూర్వకంగా స్వీకరిస్తున్నాను. వారికి సదా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. సంక్షిప్త సందేశాల ద్వారా, వారు నాకందిస్తున్న సమాచారం ఎంతో విలువైనది. వారి సహకారం మరువరానిదని మనవి చేస్తున్నాను...."

- ఎమ్. పురుషోత్తమాచార్య, నల్గొండ

"....మీ *రజ్జు సర్ప భ్రాంతి* అనువాదం ఎక్కడా అనువాదంలాగా లేదు. స్వతంత్ర్య నవలగా అనిపించింది.

సాంద్రమైన ఆలోచనల రాపిడివల్ల అంత వేగంగా చదవలేకపోయాను. మూడుగంటల్లో ముగించవలసిన నవల ముప్పైగంటలు పట్టింది. ఒక గంటకు పది పుటలకు మించి చదువటం సాగలేదు. ఒక్కొక్కసారి ఒక్కో వాక్యం, పదం, బొడ్లో చేయేసి నిలబెట్టి ఆలోచింపజేసేవి. ప్రేమ, వేదాంతం, తర్కం, నిలదీసి ఆలోచించిమరీ ఆదేశించేవి. మీ మనస్తత్వానికి, రాజారావు మనస్తత్వానికి గాఢమైన బంధం ఉంది. రాజారావు మీలో పరకాయప్రవేశం చేసి ఈ నవల అనువదింపజేశాడు. అద్భుతమైన అనువాదం. బ్రాహ్మణ్యం, భారతీయం, భారతీయ జీవన దృక్పథం, రాజారావు జీవితాన్ని, ఆలోచనల్ని ప్రభావితం చేసి, ప్రపంచంలో భారతదేశ సంబంధమైన సమస్తం తారతమ్యంగా చర్చించి, ఉన్నతంగా రాజారావు తీర్చిదిద్దటంలో కృతకృత్యుడు కావటమే కాదు, అంగీకృతుడు కావటం అద్భుతం.. మంచి నవల అనువదించిన మీకు అభినందనలు. ఇంత బాగా అనువదించినందుకు శుభాకాంక్షలు. మీ కృషి ధన్యం, ప్రశంసాపాత్రం..."

- ఆచార్య కొలకలూరి ఇనాక్, హైదరాబాద్

".... **మిసిమి** నవంబర్ - 2020 సంచికలో *చలనచిత్ర గీతాలలో శాస్త్రీయ సంగీతం* వ్యాసంలో అరియక్కుడి రామానుజ అయ్యంగార్ బదులు అయ్యర్ అని వ్రాయబడింది. బహుశా అది అచ్చుతప్పు అనుకుంటాను. **మిసిమి** డిసెంబర్ - 2020 సంచికలో కోడూరు పుల్లారెడ్డిగారి వ్యాసం ప్రముఖ చిత్రకారుడు Titian జీవితాన్నేకాక ఆయన చిత్రాలపై కూడా సమగ్రంగా వ్రాశారు. ఆయన జననం 1490 బదులు 1480 అని ముద్రించారనుకుంటాను. చిత్రకారుడు Tintoretto కూడా ఆయన వద్ద Apprenticeగా ఉన్నారు. Michael Angeloలాంటి చిత్రీకరణ Titian అంత గొప్ప Colour Effectతో చిత్రీకరించాలని Tintoretto ఆశించారు. Alps పర్వతశ్రేణి ప్రాంతంలో పుట్టడంవల్లనేమో ఆయన చిత్రాలలో వెనీస్‌లోని కాలువలు పడవలకంటే పర్వత ప్రాంతాలనే ఎక్కువగా తన చిత్రాలలో Backgroundగా చిత్రీకరించాడనుకుంటాను. ఆయన చిత్రీకరించిన "The Assumption of the Virgin" (1515-18) Academia నుండి 1919లో మళ్ళీ తిరిగి తీసుకువచ్చి Santa Maria Frari Churchలో ఉంచారు. శిల్పి Canova దీనిని ప్రపంచంలో అత్యుత్తమ చిత్రంగా ప్రశంసించారు. Raphael చిత్రీకరించిన (1517-20) Transfiguration కూడా ఈ శైలిలో ఉండటం గమనించదగిన విషయం. కానీ Raphael

పిన్న వయస్సులోనే మరణించాడు. దాదాపు ఎనభైఅయిదేళ్ల పైగా జీవించిన Titian ఎంతోమంది సమకాలీన చిత్రకారులకు మార్గదర్శకుడయ్యాడు. మరెందరో చిత్రకారుల ప్రశంసలు, రాజాదరణ పొందాడు...."

- మోటూరు శివరాం ప్రసాద్, హైదరాబాద్

"...." ***మిసిమి*** కి నమస్కారం. ***మిసిమి*** కొత్త రూపు సంతరించుకున్నప్పటినుంచే నాకు పరిచయం. బాగా ఆస్వాదిస్తున్నాను. కోవిడ్ 19 విధించిన గృహ నిర్బంధంలో ***మిసిమి*** కోసం ఎదురు చూడటం, చదవటం కాస్త సాంత్వన కలిగించే విషయాలు. అందుకు ***మిసిమి*** కి ధన్యవాదాలు. ఈ నెల (జనవరి-2021) ***మిసిమి*** లో P. విజయకుమార్ గారి 'గాలిబ్ కవితల్లో మానవీయ విలువలు' 80వ పడిలో ఉన్న నాకు చాలా సాంత్వన కలిగించింది. అదే ఈ ఉత్తరానికి ప్రేరణ. ఇంతకు ముందు గాలిబ్ కవితల్ని గురించి కొంత విన్నాను. 'రసగుల్లా బాగుంటుంది' అన్నట్లు 'గాలిబ్ కవితలు బాగుంటాయి' అంతవరకే తెలుసు. ఈ రోజు గాలిబ్‌నీ, వారి కవితల్ని చక్కగా పరిచయం చేశారు విజయకుమార్ గారు. ధన్యవాదాలు. గాలిబ్ కవితామృతం మరింత కావాలనిపిస్తోంది. దాశరథి వ్రాసిన గాలిబ్ కోసం వెతకాలి...."

- అక్కినేని వెంకటరత్నం, గుడివాడ

"...." ***మిసిమి*** నూతన సంవత్సర - జనవరి 2021 సంచిక సంతోషంతో అందుకున్నాను. మీకు, ***మిసిమి*** కుటుంబానికి ఆరోగ్యప్రద, ఆనందదాయక నూతన 2021 సంవత్సర శుభాకాంక్షలు. ***మిసిమి*** నా దైనందిన జీవనంలో ఒక అంతర్భాగం. ***మిసిమి*** మార్గదర్శి. ***మిసిమి*** నిత్య మనోజ్ఞం.ఎంత అభినందించినా తక్కువే...."

- రాయవరపు సత్యనారాయణ, ముంబై/కాకినాడ

"...." ***మిసిమి*** జనవరి - 2021 సంచిక - కిల్లాడ సత్యనారాయణగారి వ్యాసం *ఉత్తరప్రదేశ్‌లో ప్రాథమిక విద్య - ఒక పరిశోధన పరిశోధనాత్మక వ్యాసం* ఆసాంతం చదివాను. చాలా మంచి విశ్లేషణ. పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇవ్వడం పోటీతత్వంతోపాటు ఉత్సాహంగా పనిచేసే వాతావరణం కల్పిస్తుంది. మాట్లాడే పెట్టె మన దగ్గర కూడా గతంలో అమలు చేశాం. అదేకాకుండా గోడ పత్రిక, నిజాయితీ దుకాణంవంటి వినూత్న కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకతను పెంచడంతోబాటు విలువలను నేర్పుతున్నాయి. మీరు చెప్పినట్లు రాజకీయాలు, యూనియన్లు ఉపాధ్యాయుని పాత్రను దిగజార్చింది అనడంలో ఎటువంటి సందేహం లేదు. వీటికన్నిటికీ అతీతంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. నాకైతే ఉపాధ్యాయులలో స్ఫూర్తి నింపే కార్యక్రమాలు తరచుగా చేపట్టాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తేనే ఈ రుగ్మతలను తొలగించవచ్చు. మీ విశ్లేషణతో నాకు అర్థం అయ్యింది ప్రతి రాష్ట్రంలోనూ ప్రభుత్వ బడుల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నాయని. ఢిల్లీలో ఇందుకు భిన్నంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెరిగింది. అనూహ్యమైన మార్పులు తీసుకువచ్చారు. టీచర్లను బాగా మోటివేట్ చేశారు. ఉపాధ్యాయులు కర్తవ్యదిశగా నడిపించడంలోనే ప్రభుత్వాలు బాధ్యత వహించాలి...."

- స్వర్ణలత, పశ్చిమ గోదావరి

"...." ***మిసిమి*** వరుసగా చదువుతున్నాను. పల్లెవాసుల జీవనశైలి, కొసరాజు వెంకటేశ్వరరావు వ్యాసం వరుసగా చదువుతున్నాను. ఇది చరిత్ర నేటి స్వరూపం. రాబోవు కాలానికి చరిత్ర ఆధారం. గత 500 సంవత్సరాలలో జరగని అన్ని రంగాలలో మార్పులు అతి వేగంగా ఈ 70 సంవత్సరాలలో సాగుతున్నవి. దీనికి గ్రామాలు వేరే కావు. యంత్రయుగం పేరుట, విజ్ఞాన పేరిట, విద్య, వైవిధ్యం, వికసించినవి. గ్రామాలు వేగంగా మారుతున్నవి. గ్రామాలలో పాత జీవనం మళ్ళీ దొరకదు. చరిత్ర అంశం అయినది...."

- కందుకూరి యాదవరావు, నిజామాబాద్

భారతీయ మేధావులు :
జ్ఞానవైకల్యం

– అవధానం రఘుకుమార్

భారతీయ జ్ఞాన వైకల్యానికి కాయకల్ప చికిత్స చేసిన వైద్యుడు - ధర్మపాల్

అది 1976వ సంవత్సరం. క్లాడ్ ఆల్వేర్స్ అనే వ్యక్తి హాలండ్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో Homo Faber: Technology and Culture in India, China and the West : 1500 to the Present Day అనే విషయంపై పి.హెచ్.డి చేస్తున్నాడు. అతనికి పాశ్చాత్య దేశాల గురించి, చైనా గురించి, ఆ దేశాల సాంకేతికత, సంస్కృతి గురించి ఇండియాలో సంస్కృతి గురించిన రచనలు విరివిగా కనిపిస్తున్నాయి. కానీ భారతదేశపు సాంకేతికత, ముఖ్యంగా 1500-1900 కాలంనాటి సాంకేతికత గురించి పెద్దగా పుస్తకాలు దొరకటం లేదు.

అనుకోకుండా ఒకరోజు ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఓ వీధిలో South East Asian Instituteలో ఓ అరలో ధర్మపాల్ అనే వ్యక్తి వ్రాసిన "Indian Science and Technology in the Eighteenth Century" అనే పుస్తకం దొరికింది. దానితో ఆల్వేర్స్ మనస్సులో భారతదేశం గురించి ఉన్న ఆలోచనలన్నీ ఒక్కసారిగా మారిపోయాయి. ఈ ధర్మపాల్ రచనలు తరువాత కాలంలో కాన్పూర్, మద్రాస్ I.I.T.లలో అధ్యాపకుల్ని, విద్యార్థులని కూడా చాలా కాలం ప్రభావితం చేసి, వారిచేత The Patriotic and People-Oriented Science and Technology (PPST) అనే సంస్థని స్థాపించి, అనేక పరిశోధనలకి ప్రేరణగా నిలిచాయి.

ధర్మపాల్ రచనలు 1970-80 ప్రాంతాలలో గొప్ప సంచలనాన్నే కలిగించాయి. సగటు భారతీయుడులో నిరాశ, నిస్పృహలని చాలామేరకు తొలగించి, తనమీద, తన గతంమీద కొంత విశ్వాసాన్ని పెంచితే, ఆక్స్‌ఫర్డ్‌లు, కేంబ్రిడ్జ్‌లలో చదువుకుని, పాశ్చాత్యులు చెప్పిన చరిత్రలు చదువుకున్న చాలామంది జ్ఞానులని మాత్రం బాగానే భయపెట్టింది. పరిశోధనల పేరుతో, పి.హెచ్.డి.ల పేరుతో దశాబ్దాలుగా వారు వ్రాస్తున్న చిలుక పలుకులకు ధర్మపాల్ రచనలు కొరకరాని కొయ్యలే అయి కూర్చున్నాయి.

ఈ మధ్య ఓ వెబినార్‌లో 2011-13ల మధ్య తానా అధ్యక్షుడుగా పనిచేసిన ప్రసాద్‌గారు మాట్లాడుతూ - ఒక వ్యక్తి లేదా జాతి తన జాతి చరిత్రను, మూలాలను సంపూర్ణంగా మర్చిపోవాలంటే అయిదు లేదా ఆరు తరాలని వారి గతం నుండి దూరం చేస్తే చాలు అని ఓ పరిశోధనలో తేలింది అని చెప్పారు. ప్రతి ఒక్క తరానికి 16-20 శాతం జ్ఞాపకాలని చెరిపేయవచ్చును, అలా అయిదు, ఆరు తరాల మనుషుల్ని గతం నుండి వేరు చేస్తే, ఆ జాతి, వ్యక్తులు వారి చరిత్రని పూర్తిగా మరచిపోతారు అన్నారు. 1757 నుండి 1857ల మధ్య భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యం దాదాపు అదే పని చేసినట్లు అనిపిస్తోంది. తిరిగి ఏ పాశ్చాత్య మేధావో గుర్తు చేస్తే తప్ప తమంటే ఏమిటో భారతీయ సమాజం పూర్తిగా మరచిపోయినట్టే ఉంది.

నిజానికి బ్రిటిష్‌వారి ప్రయత్నం ఇంకా ఎక్కువ ఫలితాలనే సాధించింది. జాతి నిర్వీర్యం అయిపోవడమే కాదు భయంకరమైన అపరాధ భావనలోకి చేరిపోయింది. తన గతమంతా అత్యంత హేయనీయమని, అందులో ఏ ఔన్నత్యం లేదనీ, బ్రిటీష్‌వారు లేదా పాశ్చాత్య సమాజం ఎంతో దయతో మనకి జ్ఞాన భిక్ష చేయకపోతే మనమంతా అజ్ఞానపుటంధయుగంలో తచ్చాడుతూ ఉండేవారమనే భావనలోకి చాలా తీవ్రంగానే వెళ్లిపోయింది. రెండవ రౌండ్‌టేబుల్ సమావేశాల కోసం లండన్ వెళ్ళిన గాంధీజీ

అక్కడి రాయల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ (Royal Institute of International Affairs) తమ సంస్థని సంబోధించి మాట్లాడమని పిలిచింది. 20-10-1931న గాంధీ ఆ సంస్థలో మాట్లాడారు. సభకి అనేకమంది బ్రిటిష్ మేధావులు వచ్చారు. లార్డ్ లోథియన్ ఆ సభకి అధ్యక్షత వహించారు. గాంధీ మాట్లాడవలసిన విషయం - "భారత దేశపు భవిష్యత్తు." దానిపై మాట్లాడే ముందు గాంధీ - "హిందూ-ముస్లిం-సిఖ్"ల సమస్య, "అంటరానితనం", "గ్రామాల్లోని పేదరికం" అనే అంశాలని స్పృశిస్తూ, చాలా అలవోకగా, అంతర్వాణి ప్రబోధించినట్లుగా "బ్రిటిష్ వారు రావడానికి ముందుకంటే భారతదేశంలో ఇప్పుడు నిరక్షరాస్యులు ఎక్కువ ఉన్నారు", "బ్రిటిష్‌వారు విద్యావ్యవస్థని మెరుగుపరచడం ప్రక్కన ఉంచి, దాన్ని సమూలంగా పెకలించి వేశారు. ఓ చెట్టు మొదలును తవ్వి, వేరుని బయటికితీసి, అలా వదిలేశారు. ఓ అందమైన వృక్షం నాశనమయ్యింది" అన్నారు. చాలా ప్రగాఢ విశ్వాసంతో "అవసరమయితే నా ప్రకటనని ఎవరైనా అంకెలతో ప్రశ్నించవచ్చును" అన్నారు.

సభలో అలజడి. బ్రిటిషువారు రాకముందు భారతదేశంలో ఎక్కువ అక్షరాస్యులు ఉన్నారు. అన్న గాంధీ మాటలు బ్రిటీష్‌వారికి తీవ్రమైన అరోపణలుగా తోచాయి. ఇది బ్రిటిష్ సభ్యసమాజాన్ని చాలా తీవ్రంగా కలవరపరచింది. చాలామంది నిశ్చేష్టులై, మౌనంగా ఉండిపోయినా, గాంధీ విసిరిన ఈ ఆరోపణని సర్ ఫిలిప్ హార్టోగ్ అనే వ్యక్తి ఒప్పుకోలేదు. ఈయన తూర్పు దేశాల అధ్యయన సంస్థ School of Oriental Studies స్థాపకుడు, అంతకు ముందు ఢాకా యూనివర్సిటీ ఉపకులపతి, బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో విద్యావ్యవస్థల మెరుగుకోసం 1918-30ల మధ్య వేసిన అనేక కమిటీలకి చైర్మన్. ఆ మీటింగ్‌లోనే గాంధీని ప్రశ్నించడమేకాక, దాదాపు ఓ దశాబ్దంపాటు గాంధీని - నీవు చెప్పిన మాటలు బుజువుచేయి, లేకపోతే బహిరంగంగా నీ మాటలు వెనక్కి తీసుకుని, క్షమాపణ కోరమని వెంటబడతాడు. గాంధీ కూడా తను చెప్పింది తప్పు అని తేలితే తనమాటల్ని వెనక్కి తీసుకుంటాను అని, భారతదేశం తిరిగి వెళ్ళాక దీని సంబంధించిన ఆధారాలు బయటపెడతాను అని అన్నాడు. ఇండియాకి తిరిగి రాగానే గాంధీ అరెస్టయి ఎరవాడ జైలులో వుండటం, ఈ విషయమై విషయసేకరణ చేయమని కె.టి. షాని ఆదేశించడం జరుగుతుంది. కె.టి. షా హార్తోగ్‌కి గతంలో మాక్స్‌ముల్లర్, లడ్‌లో, ప్రెండర్‌గాస్ట్, థామస్ మన్రో, డబ్ల్యూ, ఆడమ్, జి.డబ్ల్యూ, లీటర్స్... ఇలా అనేకమంది 17, 18 శతాబ్దాల భారత విద్యావ్యవస్థ గురించి చేసిన వ్యాఖ్యానాలు, రిపోర్ట్‌లు అధ్యయనాలతో కలిపిన వివరణాత్మకమైన ఉత్తరం వ్రాస్తాడు. కానీ ఎన్ని ఆధారాలు చూపినా హార్తోగ్ ఒప్పుకోక, గాంధీని తన మాటల్ని ఉపసంహరించుకోమని పట్టుబడతాడు. గాంధీ తప్పు చెప్పాడా?

ధర్మపాల్ (1922-2006) ఓ గాంధేయవాది, గాంధీ ఆలోచనల గురించి చాలా విస్తృతంగా పరిశోధించి, దాదాపు 16 పుస్తకాలు, 8 విశిష్టమైన వ్యాసాలు, 23 పరిశోధక పత్రాలు, 40 ఉపన్యాసాలు - వ్యాసాలు, 9 ప్రత్యేక రచనలు, 10 ఇంటర్వ్యూలు, 25 హిందీ రచనలు చేసిన విశిష్ట వ్యక్తి. తన రచనల ద్వారా రామ్ మనోహర్ లోహియాకి, ఇంకా అనేకమైన గాంధీ అనుయాయులకి గాంధీ గురించి, భారతదేశపు చారిత్రక విషయాల గురించి, అనేక విషయాలు చెప్పిన వ్యక్తి. ముఖ్యంగా 17, 18, 19 శతాబ్దాల భారత చరిత్ర గురించిన విభిన్న అంశాలు-చరిత్ర, సంస్కృతి, విద్య, సైన్స్, సాంకేతికరంగం... ఇలా అనేక అంశాలపై పరిశోధించి సాధికారక పరిశోధనాంశాలను ఆయుధాలుగా ఇచ్చాడు.

19-02-1922లో ఉత్తరప్రదేశ్‌లోని కంధాలలో జన్మించిన ధర్మపాల్, 7 సంవత్సరాల వయస్సులో భారత జాతీయ కాంగ్రెస్ లాహోర్ సమావేశాలకి నాన్నతో కలసి హాజరయ్యాడు. 1938లో లాహోర్‌లో ఫెర్గ్యూసన్ కాలేజీలో బి.ఎస్.సి. (ఫిజిక్స్)లో చేరి, తరువాత 1940లో బదిలీపై మీరట్ కాలేజీలో చేరారు. 1940లోనే స్వాతంత్ర్య పోరాటంలో భాగంలో కాలేజీ చదువులు వదిలేసి ఉద్యమంలో చేరి, ఆగస్ట్ 8, 1942 క్విట్ ఇండియా సమావేశాలలో పాల్గొని, తరువాత అరెస్ట్ అయ్యి 1943 ఏప్రిల్ - జూన్లలో పోలీసు కస్టడీలో ఉన్నారు. 1944లో మీరాబెన్‌తో కలసి రూర్కీ, హరిద్వార్‌లలో గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 1947 నుండి కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో దేశవిభజన

సమయంలోని కాందిశీకుల పునర్వికాస కేంద్రాలకు నిర్వాహకుడుగా ఉన్నాడు. లోహియాతోనూ, కమలాదేవి ఛోటోపాధ్యాయులతో కలసి పనిచేశాడు.

1949లో ఫిల్లీస్ ఎల్లేన్ ఫోర్డ్ అనే ఆంగ్ల యువతిని పెళ్ళి చేసుకున్నాడు. 1950లో తిరిగి మీరాబెహన్ కలిసి రిషికేశ్‌లో సహకార విధానాలపై ఓ గ్రామాన్ని నిర్మించాడు. తిరిగి 1954లో లండన్ వెళ్ళి, 1957లో ఇండియా వచ్చి, పంచాయితీ రాజ్ వ్యవస్థపై అనేక పరిశోధనలు చేశాడు. 1965లో బ్రిటన్ తిరిగివెళ్ళి - 18, 19 శతాబ్దాల భారతదేశ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విషయాలపై బ్రిటిష్ పాత రికార్డుల అధారంగా అనేక పరిశోధనలు చేశాడు. ఇలా మధ్యలో లండన్, తిరిగి ఇండియాలో ఉంటూ అనేక ప్రాచ్య, పాశ్చాత్య చారిత్రకాంశాలపై పరిశోధించి - తొలి గ్రంథం - (Panchayat Raj and Indian Policy - 1962)ని ప్రచురించారు. కానీ ఆయన పరిశోధనల్లో అత్యంత చర్చనీయాంశమైన కొన్ని పుస్తకాలు - "18వ శతాబ్దంలో ఇండియాలో సైన్స్ మరియు టెక్నాలజీ" (Indian Science and Technology in the Eighteenth Century - 1971), "సహాయ నిరాకరణ - భారతీయ సాంప్రదాయం" (Civil Disobedience in Indian Tradition - 1971), "భారతీయ చిత్త, మానస, కాల" (Bharatiya Chitta, Manasa and Kala - 1991), "గాంధీజీని అర్థం చేసుకోవడం" (Understanding Gandhi 2003)... అయితే ఆయన 1983లో ప్రచురించిన "అందమైన వృక్షం - పద్దెనిమిదవ శతాబ్దంలో భారతదేశంలో స్వదేశీ విద్య" (The Beautiful Tree : Indigenous Indian Education in Eighteenth Century) ఓ సంచలనాన్నే సృష్టించింది. అది 1931లో గాంధీ రాయల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్, లండన్‌లో చెప్పిన మాటని ఋజువు చేసే ప్రయత్నం. విశేషమైన శ్రమతో, విస్తృతంగా ఇండియా, లండన్లలోని అనేక ప్రాచీన లిఖిత ఆధారాలను సేకరించి, చదివి, విపులీకరించిన ప్రయత్నం.

ఇరవైయవ శతాబ్ధపు తొలినాళ్ళకి భారతదేశంలో జ్ఞానులు, చదువుకున్నవారు, ఇంగ్లీషువారి స్పర్శతోనే భారతీయుల్లో జ్ఞానం ఉదయించింది అని బలంగా నమ్మేవారు. ఇప్పటికి ఆ ఆలోచన విద్యాధికుల్లో చాలా గాఢంగా ఉంది. 1800 నుండి 1900ల మధ్య పుట్టిన మూడు, నాలుగు తరాలు తమ గురించి తాము పూర్తిగా మరచిపోయేలా చాలా విజయవంతంగా చేయగలిగారు బ్రిటిష్‌వారు. ఈ మధ్య కెన్యా నవలా రచయిత, వలసవాదానంతర సైద్ధాంతికకర్త - న్యూగీ వా థియాంగో (Ngui Wa Thiango) వ్రాసిన Decolonizing the Mind : The Politics of Languageను చదివి ఊగిపోయిన భారతీయ మేధావులకి ధర్మపాల్ అర్థం కాలేదు. ఎందుకంటే బయటి నుండి వచ్చే జ్ఞానానికి అలవాటుపట్ట సగటు భారతీయ చదువరికి, మేధావికి ధర్మపాల్, గాంధీలు అర్థం అవడం కష్టమే!

మన దుస్థితి ఏమిటంటే మన గురించి మనం తెలుసుకోడానికి బ్రిటిష్‌వారి రికార్డులలో వెతుక్కోవడం. ఆ మధ్య ప్రణబ్ ముఖర్జీ (దివంగత మాజీ భారతదేశ అధ్యక్షులు) పార్లమెంటులో ఆర్థిక శాఖామంత్రిగా ఉంటూ (08-12-2011న) అప్పటి ఆర్థిక పరిస్థితిపై FDI ల గురించి మాట్లాడుతూ - "ఈ FDIలు లేకముందు మనమేమీ బల్లుల్ని తింటూ ఉండలేదు" ("We did't eat lizards when there was no FDI") అన్నారు. అలాగే బ్రిటిషు వారు రాకముందు ఈ దేశంలో సైన్స్, టెక్నాలజీ, చదువులు లేవన్న అసంబద్ధ భావనని ప్రశ్నించడమే ఈ The Beautiful Tree ఉద్దేశ్యం. నిజానికి అదే సమయంలో (సుమారు 1700లలో) భారతదేశ ఆర్థిక, విద్యా, శాస్త్ర, సాంకేతిక రంగాలు ఇంగ్లాండ్‌కంటే చాలా ఎక్కువ స్థాయిలో ఉన్నాయి. en.www.wikipedia.org>wiki>economicsలో Economic History of India అనే విషయం చదివితే 1700 నాటికి ఇండియా జనాభా 16.5 కోట్లు, GDP (ppp) (1990 డాలర్లు) లెక్కల్లో 9075 కోట్ల డాలర్లు. భారత్ ఆ నాటికి ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. అసలు ఇంగ్లాండ్ ఎదుగుదల అమెరికా, భారత్, ఆసియా, ఆఫ్రికా దేశాల సహజ వనరుల దోపిడీ పలితమే అని లోహియాతోసహా అనేకమంది భారతీయ చింతనాపరులు కూడా చెప్పారు.

"18వ శతాబ్దంలో ఇండియన్ శాస్త్ర, సాంకేతికత" (Indian Science and Technology in the Enghteenth

Century (1971)లో అనేక ఉదాహరణలతో ఇండియాలోని ఆ కాలపు శాస్త్ర, సాంకేతికతల ఔన్నత్యాన్ని వివరించిన ధర్మపాల్, The Beautiful Treeలో 17, 18 శతాబ్దంలో భారతదేశంలో విద్య గురించి సోదాహరణంగా వివరించారు. నిజానికి యూరోప్ అంతటా 17, 18వ శతాబ్దాలనాటికి భారతదేశ వ్యవస్థ గురించి ఉత్సుకత పెరిగి, అనేక అంశాలపై నిజాలు సేకరించే పనిలోపడ్డారు. వోల్టేర్, అబ్బే రేనాల్, జోన్ సిల్వెయిన్‌లేకాక, ఆడమ్ ఫెర్గ్యూసన్, విల్లియమ్ రాబర్ట్‌సన్, జాన్ ప్లేఫెయిర్‌లు (ఎడింబర్గ్ విశ్వవిద్యాలయం) కూడా చాలా వివరాలు సేకరించారు. అదే సమయంలో చార్లెస్ విల్కిన్స్, విల్లియమ్ జోన్స్... తదితరులు సంస్కృతం, ఇతర భారతీయ భాషల అధ్యయనంపై మక్కువ పెంచుకున్నారు.

విల్లియమ్ ఆడమ్స్ అనే అతను 1830లలో బెంగాల్, బీహారులలో సర్వే చేసి - ఈ ప్రాంతాలలో సుమారుగా 1,00,000 గ్రామ పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. తరువాతి కాలంలో చాలామంది బ్రిటిష్ విధాన రూపకర్తలు ఈ నిజాన్ని తిరస్కరించడానికి చాలా కష్టపడ్డారు. ఆడమ్స్‌కు ముందే మద్రాస్ ప్రెసిడెన్సీ గురించి జి.ఎల్. పెండెర్‌గాస్ట్ అనే బ్రిటిష్ అధికారి కూడా 1820లలో "ఈ ప్రాంతం మొత్తంలో కనీసం ఒక్క పాఠశాల కూడా లేని చిన్నా, పెద్ద గ్రామం లేదు. పెద్ద గ్రామాలలో ఇంకా ఎక్కువ ఉన్నాయి" అని రిపోర్టు చేశాడు. 1850లలో పంజాబ్ ప్రాంతంపై పరిశోధించిన డా.జి. డబ్ల్యు లీటర్ ఇలాంటి స్థితినే గమనించాడు. ఈ రిపోర్టులు చూసిన మిషనరీ అధికారులు వీటిని చాలా తీవ్రమైన అసత్యాలుగా తిరస్కరించడం మొదలుపెట్టారు. ఎందుకంటే తెల్లవాడే ఉన్నతుడు అనే భావన వారిని కమ్మేసింది. ఆ సమయానికి ఇంగ్లాండ్‌లో చాలా తక్కువమంది స్కూళ్ళు, చాలా తక్కువ విద్యార్థులు మాత్రమే ఉండేవారు! ఉదాహరణకి తెలుగు మాట్లాడే ప్రాంతంలో సుమారు 1823ల ప్రాంతాలలో 3,454 స్కూళ్ళు, 32,801 మంది విద్యార్థులు, అలాగే 606 కళాశాలలు, 2592 మంది విద్యార్థులు ఉన్నారు అంటే మనం నమ్మగలమా ఈ రోజు? అలాగే కులాలపరంగా చూస్తే 13,893 (బ్రాహ్మణులు) 121 (క్షత్రీయులు, రాజులు) 7676 (వైశ్యులు), 10,076 (శూద్ర), 4,755 (ఇతర కులాలు) 1,639 (ముస్లింలు) విద్యార్థులుగా ఉన్నారు అని గణాంకాలు చెబుతున్నాయట! (టేబుల్ I & II పబ్లికేషన్స్ డివిజన్, 2015, Essential Writings of Dharmapal, పబ్లికేషన్స్ డివిజన్, 2015, P. 212-13) (ఈ వివరాలు బ్రిటిస్ అధికారులు బ్రిటిష్ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా తయారు చేసినవని ధర్మపాల్ వివరణ). బ్రిటిష్‌వారు రావడానికి ముందు కేవలం ఉన్నత కులాలు, తరగతులకే విద్య పరిమితమైందని సాధారణంగా నమ్మే భారతీయ మేధావులకు ఈ లెక్కలు కొంత జీర్ణమవడం కష్టమే! ఇలా ఈ పుస్తకాలలో పురుష, స్త్రీల లెక్కలూ ఉన్నాయి. అలాగే కనీస వయస్సు, విద్యాకాలం చదివే సబ్జెక్టులూ ఉన్నాయి. రామాయణం, భారతం, భాగవతం కామన్ సబ్జెక్టులుగా ఉన్నా, విద్యార్థుల సామాజిక నేపథ్యంబట్టి - విశ్వకర్మ పురాణంలాంటి ఇతర విషయాలు (ఉత్పత్తి కులాల విషయంలో) చెన్న, *బసవపురాణం* తదితరాలు (లింగాయతు పిల్లలకి), పంచతంత్ర ఇత్యాదులు, నిఘంటువులు, వ్యాకరణాలు పాఠ్యాంశాలుగా ఉండేవని తెలుస్తోంది. మొల్ల రామాయణం, *దాశరధీ శతకం*, *సుమతీ శతకం* ఇత్యాదులు పాఠ్యాంశాలుగా ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే ఉన్నత విద్యలలో ఎక్కువగా బ్రాహ్మణాధిక్యం ఉన్నా అవి కేవలం మత, తత్వ, నీతి, న్యాయశాస్త్రాల వరకు పరిమితం అనీ, ఖగోళశాస్త్రం, వైద్యంలాంటి శాస్త్రాలు అన్ని కులాల, వర్గాలవారు దాదాపు సమానంగా చదివినట్టు ధర్మపాల్ చెబుతున్నారు. 1812ల ప్రాంతంలో మలబారు, మద్రాసు ప్రాంతాలలో 808 మంది ఖగోళశాస్త్రం చదువుతుంటే కేవలం 78 మంది బ్రాహ్మణులని, అలాగే 194 మంది వైద్యశాస్త్రం చదువుతూంటే అందులో 31 మంది మాత్రమే బ్రాహ్మణులనీ, మిగతావారు అన్యకులస్థులనీ ధర్మపాల్ చెబుతున్నారు. (ఇదే పుస్తకం, పేజీ 221) శస్త్రచికిత్సలో ఎక్కువమంది మంగలి కులంవారు గొప్పనితనం కలిగి ఉన్నవారని ఆ కాలపు బ్రిటిష్ వైద్య నిపుణులు భావించినట్టూ తెలుస్తోంది. అలాగే స్త్రీల విద్య విషయంలోనూ అప్పటి మలబార్, జోయపూర్ (విజయనగరం) ప్రాంతాల గణాంకాలనుబట్టి ప్రాథమిక

విద్యలో బ్రాహ్మణుల పురుష-స్త్రీ నిష్పత్తి సూచిక 2230-5, వైశ్యులలో 84-13, శూద్రులలో 3697-707, ఇతరులలో 2756-343, ముస్లింలలో 3196-1122 (మలబారు ప్రాంతం), అలాగే జోయ్‌పూర్ ప్రాంతంలో 941-254 (బ్రాహ్మణ), 38-01 (వైశ్య) 266-71 (శూద్ర) 213-64 (ఇతర) మరియు 0-0 (ముస్లిములు)గ ఉంది. అయితే గాంధీగారి మాటల్లోని సత్యాలని వెదికే ప్రయత్నం ధర్మపాల్‌గారు కేవలం విద్యకు మాత్రమే పరిమితం చేయలేదు. బ్రిటిష్‌వారు రావడానికి ముందు ఆర్థిక, రాజకీయ, వ్యవస్థలని, సైన్సు, టెక్నాలజీలని, పంచాయతీ వ్యవస్థనీ.. ఇలాగే అనేక అంశాలని స్పృశిస్తూ, ఆనాటి యూరోప్‌తో పోల్చుకుంటే అనేక రంగాలలో ఇండియా ఉన్నత స్థితిలో ఉందని, బ్రిటిష్‌వారి వివక్షతో కూడిన విధానాలు తరువాతి కాలంలో అనేక రంగాలని భయంకరంగ దెబ్బతీశాయనే నిజం, కొంచెం కటువుగా ఉన్నా సరే, మనకు తెలపుతోంది. ధర్మపాల్ రచనలు 5 భాగాలుగా దొరుకుతున్నా, భారత ప్రభుత్వపు అధికార ప్రచురణగా Essential Writings of Dharmapal అనే పేరుతో పబ్లికేషన్ డివిజన్‌వారు 2015లో వేశారు. భారతదేశాన్ని తిరిగి అర్థం చేసుకునే అనేక పుస్తకాలు ఈ మధ్య వస్తున్నాయి. కానీ ఆ సాహిత్యపు తొలి మార్గనిర్దేశకులలో ధర్మపాల్ ఒకరు. చక్కని గాంధేయవాది. న్యూగీ వా ధయాంగో, ఫ్రాంజ్ ఫెనాన్‌లను ఊకదంపుడు ఉపన్యాసాలుగా, వ్యాసాలుగా దేశంపై వదిలే జ్ఞానులు, ధర్మపాల్ రచనల పట్ల మాత్రం చాలా విచిత్రమైన మౌనం వహిస్తారు. ఎందుకంటే ఇప్పటికీ చాలామందిలో, బయటికి ఎన్ని చెప్పినా, ఆ వలసవాదం సృష్టించిన మనస్తత్వాలే బలంగా ఉన్నాయి. ఇప్పటికైనా ఈ మేధావులు భారతదేశ చరిత్రని, ముఖ్యంగా గత 2 లేదా 3 వందల సంవత్సరాల చరిత్రని తిరిగి చదవాల్సిన అవసరం ఉంది అని గాంధేయవాది ధర్మపాల్ గుర్తు చేస్తున్నారు.

భారతీయుల్లో చాలా తక్కువమందికే ధర్మపాల్ తెలుసు. 2004 సం॥ల బ్రిటిష్ వలస పాలనలో తమ గతాన్ని మరచిపోయి, ఒక విచిత్రమైన జ్ఞాన వైకల్యానికి గురి అయిన భారతీయ మేధావులకి శస్త్రచికిత్స చేసే ప్రయత్నం చేసిన వ్యక్తుల్లో ధర్మపాల్ ప్రధాన వ్యక్తి. అయితే "గతమెంతో ఘనకీర్తి" అని అర్థం, పర్థం లేని ఘనతలు చెప్పకుండా, వాటి ఆధారాలను శాస్త్రీయంగా పరిశోధించి, పరిశీలించి మనకు వివరించి చెప్పడం ధర్మపాల్ ప్రత్యేకత. ధర్మపాల్‌ని గురించి తెలుసుకోవడం, అర్థం చేసుకోవడం అంటే భారతదేశ ఆత్మని ఆవిష్కరించే ప్రయత్నం చేయడం.

ఇప్పటిదాకా మనం ధర్మపాల్ గారి పరిచయం, ఆయన చేసిన విస్తృత పరిశోధనలు, అవి ఆ నాటి మేధో వర్గాలలో కలిగించిన సంచలనం గురించి ఓ విహంగ వీక్షణం చేశాం. వచ్చే సంచికలో ప్రత్యేకంగా మద్రాస్ ప్రెసిడెన్సీ పరిధిలో 1822-26ల మధ్య మన విద్యా వ్యవస్థ ఎలా ఉండిందో మరింత సమగ్రంగా, విపులంగా అధ్యయనం చేద్దాం!

డా. అవధానం రఘు కుమార్, హైదరాబాద్. ఫోన్: 944 101 5709.

భారతీయుల కళాప్రాభవం

మోహన రాగం

సీ. భారతీయుల కళాప్రాభవమ్మొలికించి
తీయగా పాడిన కోయిలమ్మ
కమనీయ వంగ వంగడమెల్ల మూర్తిలో
ప్రసరించినట్టి మేల్ పసిడిబొమ్మ
స్వారాజ్య వీర విహార రంగములోన
కోరి దూకిన తెన్గు కోడలమ్మ
మానవ కల్యాణ మంగళారతిజ్యోతి
చేయెత్తి చూపిన చెల్లెలమ్మ
ప్రాక్పశ్చిమాలు విస్ఫారించి, ప్రేమింప
పాఠాలు నేర్పిన పంతులమ్మ

తే.గీ. భరతనారీ ప్రతాప ప్రభావ గరిమ
ఖండ ఖండాలు జల్లి విఖ్యాతిగన్న
దివ్యమూర్తి సరోజినిదేవి వోలె
దీర్ఘసూత్రాన ఆ దేవి దివ్య సుగుణ
పుష్పముల నేరి విరిదండ పూర్తిచేసి
పుణ్య భారతమాతను పూజచేసి
ఘనతకెక్కుడి భారత వనితలార!

రచన: తోలేటి వెంకటరెడ్డి
(ఘంటసాల స్వరపరచి పాడిన పద్యం)

పుంభావ ఊర్వశి

– కొలకలూరి ఇనాక్

సౌందర్యమే మూర్తీభవించిన సౌభాగ్యమైతే,
రాసిక్యమే ప్రజ్వలిత రహస్యమైతే,
సౌకుమార్యమే మృదుమంజుల సంగీతమైతే,
ఆత్మార్పణమే రూపెత్తిన ఆమని ఐతే, ఆమె ఊర్వశి.

శృంగారమే సురుచిర మలయమారుతమైతే,
రతిమాధుర్యమే తరంగిత గీతమైతే,
నిద్రలేని రాత్రుల నిత్యజాగృత కాంక్ష శరీరమైతే,
సర్వశక్తులూ సంచరించే చైతన్యమే స్త్రీ అయితే,
ఆమె ఊర్వశి.

పరీమళ ప్రవాహం గుండెలో దాచుకొన్న పువ్వు
అస్పష్ట స్వప్నకాంతులు నర్తించే వెన్నెల
మృదుల హృదయ రక్తిరమ్య నవనీతం
సహస్రాబ్ది మానవాత్మాన్వేషణార్తి పుంజం
స్త్రీ అయితే ఆమె ఊర్వశి.

కాలానికి ప్రాణదానం చేసే చైతన్య స్పర్శ,
పురుషికాంక్షామత్త మానవి తనూజ్వాలి,
వేకువకు కనులు మొలిపించే కాంతికిరణం,
కాలం కన్నీటిని పొదవుకొన్న కనురెప్ప
స్త్రీ అయితే ఆమె ఊర్వశి.

నిఖిల భువన నిర్వికల్ప నిశ్చల సమాశ్లేషి,
నిద్రకు ముద్దులు తినిపించే ఉషోదయం,
ఎన్నిసార్లు స్పర్శించినా తనివితీరని తపన,
భూమి మీద మొలకెత్తిన స్వర్గాకాంక్షాగ్ని
స్త్రీ అయితే ఆమె ఊర్వశి.

ఊర్వశి పుంభావమూర్తి అయితే, అతడెవరు?
అయితే, సదాబాలకుడు, సదాజ్వలితుడు టాగూరు.
అయినా, సుదీర్ఘ తపనుడు, సుదీప్త భావుకుడు కృష్ణశాస్త్రి.
నేటికీ ఊర్వశిని ఆరాధించే వీళ్ళు
విశ్వప్రేమికులు, రసికతా దీపకులు

ఆచార్య కొలకలూరి ఇనాక్
హైదరాబాద్. ఫోన్: 944 024 3433.

ప్రేమ

– ఎన్. గోపి

'ఏం ప్రేమనయా' అని
అనకు
అది బేకార్ మాట కాదు.
ఉక్కిరిబిక్కిరి చేసే
అర్థంగాని పెనుతుఫాను.
మలినం, అమలినం
అంటూ
వేరుగా ఉండదు
జ్వలనం దాని తత్వం.
రక్తసముద్రం పైన
తెల్లని ఆకాశం
తెరుచుకుంటుంది.
చెరువులోని చంద్రుడు
వెండిచేపలా
ఈదుతుంటాడు.
ఎవరైనా రాయొచ్చు
ప్రేమగీతం
కాని చిక్కల్లా
ఇంతకు ముందు
ఎందరో రాసి ఉంటారు.
అది నిత్యనూతన
సనాతనం
ప్రేమ అనే రెండక్షరాలను
ఎవరికి వారు
వాడుతుంటారు
ఆత్మలాగ.
అదొక నిర్విరామ స్వప్నం
అన్వేషణ / నిరీక్షణ
ఒక ఉపాసన
ప్రేమ శాశ్వతం
కాకపోవచ్చు
మెరుపులా వచ్చి
వానలా వెళ్లిపోవచ్చు
కాపాడుకోవడమే ఉత్తమం.
శుద్ధప్రేమ ఉంటుందా
అంటే
దానిలో అందమైన
అవసరం కూడా
కలిసే ఉంటుంది.
వయఃకింకిణులు
దానికి తోడు కావచ్చు.
అలమారిలో మెమెంటో
గడ్డకట్టిన జ్ఞాపకం కాదు
విచ్చుకోడానికి
సిద్ధంగా ఉన్న తేనెతుట్టె.
అయితే ఒక మాట!
తొలిప్రేమ ఇప్పుడు
ఎదుట లేకపోవచ్చు
కాని దాని పరిమళం
జీవితమంతా
పరుచుకుంటుంది.
బహుశా జీవితాన్ని
అది నడిపిస్తుంది.
ఇంతకూ ప్రేమ ఏమిటో
అర్థమైందా!
అర్థమైతే
ఈ కవిత ఎందుకు రాస్తాను.

డా. ఎన్. గోపి
హైదరాబాద్.
ఫోన్: 939 102 8496.



నటరాజ రామకృష్ణ

ఆంధ్ర నాట్యం

– పప్పు వేణుగోపాల రావు

'ఆంధ్రత్వం ఆంధ్రభాషాచ నాల్పస్య తపసః ఫలం' అని అప్పయ్యదీక్షితులవారు చెప్పారు. తెలుగువాడిగా పుట్టడమో, తెలుగు మాట్లాడడమో, గొప్ప తపస్సు చేసినవాళ్లకేగాని, ఏదో కొంచెం తపస్సు చేసేవాళ్లకి లభించే యోగం కాదు.

ఆంధ్రుల ప్రసక్తి మొట్టమొదట ఐతరేయ బ్రాహ్మణం శునశ్శేపోపాఖ్యానం లో కనిపిస్తుంది. ఆంధ్రులు ఒక జాతి, తరువాత ఒక దేశం, వారుపయోగించే భాష తెలుగు. అదే భాషను ఆంధ్రము అనడం కూడా పరిపాటి. ఆంధ్రులకు సంగీత నృత్య నాట్యాది లలితకళలో ప్రావీణ్యం ఉందని చారిత్రిక ఆధారాలు ఉన్నాయి, సాహిత్యం మాత్రం 11వ శతాబ్దంవరకు లేకపోడానికి కారణం, ఆంధ్రుల సాహిత్యభాష సంస్కృతం, వ్యవహార భాష తెలుగు. వందలకొలది శిల్పాలు, శాసనాలు, లక్షణ గ్రంథాలు దీనికి సాక్ష్యం.

మొట్టమొదట ఆంధ్రుల నాట్యకళను, సంగీత ప్రావీణ్యతను అంగీకరించి తాను రచించిన నాట్యశాస్త్రంలో ఉటంకించినవాడు క్రీస్తు పూర్వం 2వ శతాబ్దికి చెందిన భరత ముని. ఆయన తన నాట్యశాస్త్రంలో దాక్షిణాత్యులు కైశికీ వృత్తిగల మధుర లలిత అంగాభినయం చేస్తారని, వీరు బహు నృత్త, గీత, వాద్య ప్రియులని చెప్పాడు.

ఇక్కడే దాక్షిణాత్యులు ఎవరు అనేది వివరిస్తూ మూడు శ్లోకాలు ఇచ్చాడు అవి ఇవి:

మహేంద్రో మలయః సహ్యో మేకలః పాలమ్బరః
ఏతేషు యే శ్రితా దేశాః స జ్ఞేయో దక్షిణా పథః
కోసలాస్తోసలాశ్చైవ కళింగా ఏవ మోసలః
ద్రవిడాంధ్ర మహారాష్ట్రాః వేణ్ణా వానవాసజాః
దక్షిణస్య సముద్రస్య తథా విన్ధ్యస్యచాన్తరే
యే దేశాస్తేషు యుత దాక్షిణాత్యాం తు నిత్యశః

(నా. శా. 13-38-40)

ఇందులో మోసల అంటే మచిలీపట్టణం. వేణ్ణా అంటే కృష్ణానదీ తీరం. (పుట 603, నా.శా. II సంపుటం. మన్మోహన్ ఘోష్). అన్నిటికన్నా ముఖ్యమైన ప్రస్తావన ఏమిటంటే భరతముని ద్రవిడులలో కలపకుండా ఆంధ్రులను ప్రత్యేకంగా పేర్కొనడం. అంటే ఆంధ్రులకు ఆనాటికే తమదైన ఒక సంస్కృతి, సంగీతం, వాద్యం, నృత్యం, నాట్యం ఉండి ఉండాలి.

నాట్యానికి పుట్టినిల్లు ఆంధ్రదేశం. దీనికి అనేక తార్కాణాలున్నాయి. సంస్కృతంలో కాళిదాసు, మాఘుడు, భారవి, శ్రీహర్షుడు మొదలైనవారికి వ్యాఖ్యానాలు వ్రాసిన మల్లినాథసూరి తెలుగువాడు. కాళిదాసుని మాలవికాగ్నిమిత్రంలో శుంగులకు, ఆంధ్రులకు విదర్భపై ఆధిపత్యముకై జరిగిన యుద్ధము సూచింపబడినది.

ఆంధ్రదేశము, కృష్ణానదీ తీరప్రాంతము, మచిలీపట్టణ ప్రాంతములు కళలకు ఆటపట్టయి ఉండేవి. ఆంధ్రదేశం గురించి ఇంత ప్రస్ఫుటంగా భరతముని పేర్కొనడం ఒక ఎత్తు, ఆంధ్రులు నాట్యానికీ సంగీతానికీ చేసిన సేవ మరొక విశిష్టమైన ప్రక్రియ, ఇది ఒక ఎత్తు. ఎందఱో తెలుగువారు సంగీత నృత్యాలకు లక్షణ గ్రంథాలు వెలయించారు.

అందులో కొన్ని ముఖ్యమైనవి పేర్కొనాలి. మొదటిది జాయసేనాపతి రచించిన నృత్త రత్నావళి (1253). ఇందులో మొదటి నాలుగు అధ్యాయాలు భరతముని నాట్య శాస్త్రంలో చెప్పినవే కాని అందులో అభినవగుప్తుడు కూడా తీర్చలేని సందేహాలను నివృత్తి చేస్తూ వ్రాసినవి నృత్త అధ్యాయాలు. నేను డాక్టరు యశోద కలిసి వ్రాసిన దీని

ఆంగ్లానువాదం మొదట కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వరంగలువారు ప్రచురించారు (2013). తరువాత విశిష్ట విమర్శనతో రెండు సంపుటాలుగా ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ (IGNCA) 2019లో ప్రచురించారు.

ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన రాజులలో రెడ్డి రాజులయుగం (1325-1448) ఒకటి కళలను ప్రోత్సహించి పోషించినది. వీరిలో కుమారగిరిరెడ్డి (1386-1402) 'వసంతరాజీయం' ఒక లక్షణ గ్రంథం. వీరి రాజధాని ముందు అద్దంకితో ప్రారంభమై కొండవీడు, తరువాత రాజమహేంద్రవరంకు మార్చబడింది. ఈయన ఆస్థానంలో లకుమా అనే నాట్యశాస్త్ర ప్రవీణురాలుండేది. ఈయన గురించి ఈయన బావమరది వ్రాసిన శ్లోకం ఒకటి మంచి చారిత్రిక సాక్ష్యం:

జయతి మహిమా లోకాతీతః కుమారగిరి ప్రభోః
సదసి లకుమా దేవీ యస్య శ్రియసదృశీ ప్రియా
నవమభినయం నాట్యా ర్థానాం తనోతి సహస్రధా

ఆంధ్రదేశంలో 13-16 శతాబ్దుల మధ్యలో ఎన్నో ముఖ్యమైన లక్షణ గ్రంథాలు వెలిశాయి.

అందులో కొన్ని సింహభూపాలుని 'రసార్ణవ సుధాకరం', ఇది నాట్య లక్షణ గ్రంథం

విద్యానాథుని 'ప్రతాపరుద్రయశోవిభూషణం', ఇది అలంకారశాస్త్రం వేమభూపాలుని 'సంగీత చింతామణి', ఇది సంగీత శాస్త్రం.

ఇలా లక్షణ గ్రంథాలతో లక్ష్యభూతమైన నర్తకీమణులతో విలసిల్లింది ఆంధ్ర దేశం.

ఈ నేపథ్యంలో పరిశోధన చేస్తే చరిత్ర చెప్పినవి కొన్ని, చెప్పనవి కొన్ని కలిపి చూస్తే ఆంధ్రుల నాట్య కళ అవగతం అవుతుంది.

ఈ ఆంధ్ర నాట్యం గురించి మాట్లాడేటప్పుడు కొందరు ప్రాతఃస్మరణీయులను తలుచుకోవాలి. ఆంధ్రదేశంలో ఆదిలాబాదు నుంచి అనంతపురంవరకు, శ్రీకాకుళం నుంచి చిత్తూరువరకు, కర్నూలు నుంచి కాకినాడవరకు ఎన్నో సంస్థానాలు, ప్రతి సంస్థానానికి దేవాలయాలు, ప్రతి దేవాలయానికీ దేవదాసీలు ఉండేవారు. ఆంధ్రుల నృత్యకళను, సంగీతాన్ని పరిరక్షించి పోషించిన ఘనత ముందు ఆ దేవదాసీలకు, వారికే దక్కుతుంది. వారే ప్రాతస్మరణీయులు. ఇంకొక తపస్వి నిరాడంబరులు, మహర్షి నటరాజ రామకృష్ణగారు. జీవితాన్ని ఈ కళల పునరుద్ధరణకు అంకితం చేసి, నిద్రాహారాలు మాని, ఈ దేవాసీల విషయాలు సేకరించి వారివద్దకు వెళ్లి, వారినుంచి నేర్చుకుని, అవి అక్షరరూపంలో వ్రాసి ప్రచురించి ఆంధ్ర నాట్యాన్ని పునరుద్ధరించి పునర్ నిర్మాణం గావించిన ఘనత వారికి దక్కుతుంది.

అసలు ఆంధ్ర నాట్యం అనేది ఒకటి కాదు. అది ఒక అనిర్వచనీయమైన బహువర్ణ, సర్వ సౌరభాసమన్వితమైన ఒక పుష్పగుచ్ఛం. అందులో నట్టువమేళాలున్నాయి, నాట్య మేళాలున్నాయి, ఆగమ సంప్రదాయంతో చేసే నృత్యాలున్నాయి, ఆస్థాన నృత్యాలున్నాయి, వివిధ నాట్య, నాటక, నృత్య రీతులున్నాయి. ఆ కదంబమే ఆంధ్ర నాట్యం.

అయితే 26.7.1982న ఆంధ్రప్రదేశ్ నృత్య అకాడెమీ కార్యాలయంలో ఒక సమావేశం జరిగింది. దానికి అధ్యక్షులు డాక్టర్ నటరాజ రామకృష్ణగారు, అందులో కోరాడ నరసింహారావు, సరిదే మాణిక్యం, జంప ముత్యం, దుగ్గిరాల జగదాంబ పాల్గొన్నారు. వాళ్ళు ఆనాటికి ముందునించి వస్తున్న, అప్పటికి ఉన్న, స్త్రీల లాస్య నృత్యానికి ఒక పేరు పెట్టాలని నిర్ణయించారు. వారు స్త్రీల లాస్య నృత్యానికి చేసిన నామకరణమే 'ఆంధ్ర నాట్యం'.

అంతేకాకుండా వాళ్ళు అందరు ఈ ఆంధ్రనాట్యానికి పాఠ్యక్రమం అంటే సిలబస్ ఏర్పరిచారు. ఈ వ్యాసంలో నేను వ్రాస్తున్నది ఆంధ్రదేశంలో అనాదిగా ఉన్న వివిధ నృత్యరీతులు. నా దృష్టిలో అవన్నీ ఆంధ్రనాట్యమే. కాకపోతే ఒక తపస్వియై, అవిరామమైన కృషిచేసి, ఒక పద్ధతిని ఏర్పరచిన నటరాజ రామకృష్ణగారి 'ఆంధ్ర నాట్యం' కూడా ఈ వ్యాసంలో చర్చిస్తాను. నేను వ్రాస్తున్న ఆంధ్ర నాట్యం బహు విస్తృతమైనది. అది నటరాజ రామకృష్ణగారి ఆంధ్రనాట్యంలా పరిమితమైన స్త్రీల లాస్య నృత్యం మాత్రమే కాదు. వారుకూడా దీనికీ పేరు పెట్టే ముందు విస్తృతంగా కృషిచేసి ఎన్నో పద్ధతులు పునర్నిర్మించారు, పేరిణి, నవ జనార్దనం, దాక్షిణాత్యుల నాట్యకళా వీటన్నిటి మీద పరిశోధన చేశారు. ఒకవంక స్త్రీల లాస్య రీతులకే

పరిమితం అని ఆంధ్ర నాట్యానికి పేరుపెట్టినా, నటరాజ రామకృష్ణగారి కళాపిపాస అంతులేనిది. వారు ప్రాసిన మొదటి సిలబస్‌లో 41 విషయాలు చేర్చారు. ఆ జాబితా చూస్తే వారికీ ఆంధ్రుల నాట్య రీతులలో ఏదీ వదిలిపెట్టాలని లేదని తెలుస్తుంది. వారు చేసిన కృషి ఒక హిమాలయం, నా వ్యాసం దాన్ని అద్దంలో చూపించే ప్రయత్నం.



నటరాజ రామకృష్ణ

నేను ప్రాస్తున్న ఆంధ్రనాట్యంలో చాలావరకు శాస్త్రీయ నృత్యాలు, కొన్ని దేశి నృత్యాలు. దేశి అంటే ఆ ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఆ ప్రజల సంస్కృతి సంప్రదాయాలను, రసజ్ఞతను ప్రతిబింబించేవి. శాస్త్రీయ కళలకున్నన్ని గ్రంథాలు దేశి కళలకు లేవు, జానపద కళలు గురించి కూడా ఇటీవల కొన్ని గ్రంథాలు వెలువడుతున్నాయి. మతంగుని బృహద్దేశి, సోమేశ్వరుని అభిలాషితార్థ చింతామణి అని పిలువబడే మానసోల్లాసము, శారంగదేవుని సంగీత రత్నాకరము, పార్శ్వదేవుని సంగీత సమయసారము, జాయసేనాపతి నృత్త రత్నావళి, దేశీయ కళల గురించి ఉటంకించిన కొన్ని ముఖ్యమైన గ్రంథాలు.

జాయసేనాపతి నృత్తరత్నావళి లో 7వ అధ్యాయంలో దాదాపు 150 శ్లోకాలలో విభిన్న దేశీయ నృత్య రీతులు వివరించాడు. ఆంధ్ర దేశంలో నృత్యం ప్రాథమికంగా రెండు తెరగులు, ఒకటి నట్టువమేళం అంటే స్త్రీలు చేసే నృత్యం, రెండోది నాట్యమేళం అంటే పురుషుల నృత్యం. స్త్రీలు చేసే నృత్యాలు అనేక రకాలుగా వింగడించవచ్చు. ప్రముఖంగా రాజ నర్తకులు, అంటే రాజుల ఆస్థానాలలో నృత్యం చేసేవారు, దేవదాసీలు అంటే దేవాలయాలలో నృత్యం చేసేవారు. ఇవి ఒక్కొక్కటి కొన్ని వర్గీకరణలు చేస్తే మనకు ఆంధ్ర దేశంలో ఎంత పుష్కలమైన నాట్య, నృత్య, రీతులుండేవో తెలుస్తుంది. అలాగే పురుషులు చేసే నృత్య రీతులు కూడా అనేకం. పురుషులు పురుషులుగానే చేసేవి కొన్ని, పురుషులే స్త్రీ పాత్రలు ధరించేవి మరికొన్ని. ఆగమ నృత్యాలు కొన్ని. ఆరాధనకు సంబంధించినవి అంటే స్వామివారికి ఉపచారాలు చేసేటప్పుడు అందులో భాగంగా స్వామికి చేసే నృత్యసేవ. 'నృత్యం సమర్పయామి', అని నివేదించే నృత్యం. ఇది కాకుండా నాట్యమండపంలో భక్తుల కోసం ప్రదర్శించే నృత్యాలు వేరు. ఇవే వినోద నృత్యాలు. ఉత్సవాలకు చేసే దేవదాసీ నృత్యాలు.



ఇంకా వీటిలో మరిన్ని రకాలు అంతర్విభాగాలు ఉన్నాయి. ఆగమ శాస్త్రాలు దేవాలయంలో అర్చనా విధానాన్ని నిర్వచించి, వాటి ప్రక్రియలను దృవీకరించాయి. మరీచి మహర్షి ఆనంద సంహితలో అర్చన మూడు విధాలని చెప్పారు. అవి:

మానసం వాచికం వాపి కాయికం వాపి యత్ త్రయం. *(1-34)*

అంటే మనోవాక్కాయ కర్మలు. అందుకే

మనం చేసే పనులన్నీ త్రికరణశుద్ధిగలిగి ఉండాలి అంటాము. మామూలుగా గృహస్థులు చేసే అర్చనలో ఉపచారాలు 16. అందుకనే వాటిని షోడశ ఉపచారాలు అంటారు, అంటే ధూపం, దీపం, నైవేద్యం మొదలైనవి. ఆలయాలలో ఆయా నిర్దిష్టమైన ఆగమశాస్త్రానుసారంగా 16 నుంచి 128కిగాని అంతకు మించిగాని ఉపచారాలు ఉంటాయి. ఆగమ శాస్త్రగ్రంథాలలో తంత్రసారం, సిద్ధయామలంవంటి గ్రంథాలు దాదాపు 64 ఉపచారాలని విపులీకరించాయి. అందులో ముఖ్యమైనవి నృత్యసేవ, సంగీత సేవ. దేవదాసీలు చేసే నృత్యం ఇందులో భాగం. ఈ నృత్యాలు ఉపచారంగా స్వామి ముందు చేసేది ఆగమ విదితమైనది. 'నృత్యం దర్శయామి' అని పూజారి చెప్పినప్పుడు ఆలయ నర్తకి ఈ నృత్యం చేస్తుంది. పురుషోత్తమ సంహిత, నారదీయ సంహిత, ఈశ్వర సంహిత, పద్మ సంహిత అలాగే ఉత్తరాకారణాగమ మొదలైన గ్రంథాలలో ఉత్సవం అంటే ఏమిటి అందులో ఏమేం చెయ్యాలి అనే వివరణ కనిపిస్తుంది. ఉత్సవాలలో, ప్రత్యేక విశేష పూజలు చేసే రోజులలో ఆలయంలోని నాట్యమండపంలో నృత్యం చేస్తారు. ఇవి ప్రజలు దర్శించి భక్తి, రక్తి, ముక్తి, పొందే మార్గంలో ఆగమ విహితమయి ఉంటాయి. ఆలయంలో పూజలు ముఖ్యంగా మూడు విధాలు, నిత్య పూజలు, అంటే రోజూ చేసేవి, నైమిత్తిక పూజలు, అంటే ఉత్సవాలు మొదలైన విశేష పూజాదినాలు, మూడవది కామిక పూజలు, ఎదో ఒక కోరిక తీరడం కోసం చేసే పూజలు. ఉదాహరణకి వానలు పడలేదనుకోండి, వర్షాలు పడాలని సహస్ర కలశాభిషేకం మొదలైన విశేష పూజలు చేసి వాటిలోనూ నృత్య ప్రదర్శన చేస్తారు.

ఒక ఆలయంలో పూజారికి ఎంత ప్రాముఖ్యం ఉందో అంతటి హోదా అంత విశిష్టత దేవదాసీలకు ఉండేది. ఒక కొంతమంది ఆ వ్యవస్థను దిగజార్చి ఉండవచ్చు, కాని వ్యక్తులను మార్చలేక వ్యవస్థను తుడిచివేయడం తీవ్రమైన, ఆగమశాస్త్ర విరుద్ధమైన చర్య. నృత్యం లేని పూజ అసంపూర్ణమైనది. మరి ఏ మతంలోనూ జోక్యం చెయ్యలేని ప్రభుత్వం హిందూ ఆగమ విధానానికి వ్యతిరేకంగా దేవదాసీ పద్ధతిని తీసివేయడం ఒక తీరని లోటు.

దేవాలయాలలో చేసే ఆగమవి హితమైన నృత్యాలు అనేకం. సుప్రభాత సేవతో ఆలయ నృత్యాలు ప్రారంభమవుతాయి. సొన్నాయి, నాదస్వరం, డోలుతో సంగీతం భూపాల రాగంలో వినిపించగానే, ఆలయ కవాటాలు తెరుచుకుంటాయి. అప్పుడు ఆలయ నర్తకులు కలశ నర్తనం చేసేవారు. ఎప్పుడెప్పుడు అర్చన, నివేదన, జరిగినా నృత్యం కూడా ఆయా సమయాల్లో చేసేవారు. సాయంత్రం సంధ్యాహారతి సమయం నృత్యానికి ఒక ప్రత్యేక సన్నివేశం. అర్చనానంతరం దేవదాసి కుంభ హారతినిచ్చి, పుష్పాంజలి సమర్పించి, అద్దిమోహరి అనే ప్రక్రియ చేసి, తరువాత కేళిక ప్రదర్శించేవారు. రాత్రి పవళింపు సమయంలో స్వామికి జోల పాడేవారు, జోల వేరు, లాలి వేరు. స్వామిని లాలించి వసంతోత్సవాలలో ఊయల ఊపేది లాలి, రాత్రి పవ్వళింపులో చేసేది జోల. ఒక మాటలో చెప్పాలంటే లాలించునది లాలి, జోగొట్టునది జోల. విశిష్టమైన ఉత్సవాలలో ధ్వజారోహణంలో అష్టదిగ్బంధ సమయంలో, ప్రత్యేకమైన నర్తన ప్రదర్శనం జరిగేది. నటరాజ రామకృష్ణగారువారి పుస్తకంలో 33 కోట్ల దేవతలను ఆహ్వానించడానికి 33 రాగాలలో నాట్యం ప్రదర్శించేవారని పేర్కొనడం గమనింపదగిన విషయం.

శైవ ఆలయాలలో నృత్యాలు వేరు, వైష్ణవ ఆలయాలలో నృత్యాలు వేరు. నృత్యానికి ఆగమా శాస్త్రానికి, ఆలయానికి విడదీయరాని అనుబంధం ఉండేది, ఉంది. దేవాసీలను తొలగించి ఉండవచ్చు, మళ్ళీ తిరిగి ఇవాళ దేవాలయాలలో నృత్యోత్సవాలు చేస్తున్నారు, కోణార్క, మహాబలిపురం, చిదుంబరం ఇలా ఎన్నో దేవాలయాలలో వార్షికంగా నృత్యోత్సవాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం చేసిన అపరాధం ఏమిటంటే దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా హిందూ దేవాలయాల నిర్వహణ తీసుకుని, దేవాలయాల ఆర్థిక వనరులను ఉపయోగించుకుంటూ, ఆగమ శాస్త్ర విరుద్ధంగా దేవాసీ వ్యవస్థను నిర్మూలించడం.

విశ్వనాథ సత్యనారయణగారి వేయిపడగలు లో గిరిక దేవదాసీయే. మన దేశంలో దేవదాసీలను అనేక పేర్లతో పిలిచేవారు. వీరినే భోగంవారని, నిత్యసుమంగళి అని, గుడిసాని అని, భోగిని అని సాని అని పిలిచేవారు. ఈ సాని

అనే మాట స్వామిని పదంలోంచి వచ్చింది, అందుకే జమీందారీలో దొరసాని అనే మాట వినవస్తుంది. *భరతముని నాట్యశాస్త్రం* లో 24వ అధ్యాయంలో అంతఃపుర స్త్రీలను పేర్కొంటూ:

మహాదేవీ తథా దేవీ - స్వామినీ స్థాయినీ తథా
భోగినీ శిల్పకరిణీ - నాటకీయాథ నర్తకీ *(24-30)*..

అని భోగినిని, స్వామినిని పేర్కొన్నాడు. వీరే భోగంవారు, సానులు. నిత్యసుమంగళి అని కళావంతులని ఇలాఎన్నో పేర్లు. నేను విజయనగరంలో చదువుకున్నాను. అక్కడ ఒక వీధి పేరు సాని వీధి. ఆంధ్రదేశంలో చాలా ఊళ్ళల్లో ఈ వీధులు ఉండేవి. వీరుకాక దేవదాసీలలో ఒక రకంవారు రుద్రగణికలు. వీరిని ఆలయాలే శిక్షణగరిపి దేవాలయాలలో నియమించేవారు. ఎన్నో వందలకొలది శాసనాలు ఈ దేవాలయ నృత్యాలకై అంకితం చెయ్యబడిన నర్తకీమణులకు సాక్షి. శాసనాలు రాసే తొలి రోజుల నుంచే ఈ ఆలయాలకు ఫలానా రాజుగారు ఇంతమంది నర్తకులను ఈ దేవాలయానికి ఇచ్చారు అని శాసనాలు దక్షిణ దేశం అంతటా కోకొల్లలుగా కనిపిస్తాయి.

తంజావూరు బృహదీశ్వరాలయంలో మొత్తం 64 శాసనాలు కనిపిస్తాయి, ఇందులో ఒక శాసనంలో రెండు వందలకు పైబడి నర్తకీమణులు ఉన్నారు. వీరిని 44 వివిధ దేవాలయాల నుంచి రప్పించారట, వీళ్ళు 17 వివిధ ఊళ్లకు చెందినవారట. తంజావూరును చాలాకాలం నాయకులు, తెలుగువాళ్ళు పరిపాలించారు. కాకతీయుల కాలంలో గణపతిదేవుని పరిపాలనలో ఎన్నో శాసనాలు దేవదాసీలకు, దేవాలయాలకు వారికి రాజులిచ్చిన మడిమాన్యాలకు సంబంధించినవి కనిపిస్తాయి. నృత్తరత్నావళి రచించిన జాయసేనాపతిని చేబ్రోలుకు పరిపాలకుడుగా నియమించిన ఒక శాసనంలో 16 మంది దేవదాసీలు, రుద్రమదేవి వ్రాయించిన మల్కాపురం శాసనంలో 10 మంది దేవదాసీలు, ఇలా ఎన్నో సాక్ష్యాలు కనిపించడమే కాకుండా ఇప్పటికీ కాకతీయుల కళావైభావానికి ప్రతీకగా గణపతిదేవుని సైన్యాధికారి రేచెర్ల రుద్రదేవుడు పాలంపేటలో 1213లో నిర్మించిన రామప్పగుడి నిలిచి ఉంది. జాయన 1253లో రచించిన నృత్తరత్నావళి అధ్యయనానికి ఇది మార్గదర్శనమైన


రామప్ప గుడి

గ్రంథం. దేవాలయాలలో నృత్యానికి సంబంధించిన శిల్పాలు, దేవాలయాలలో నృత్యం, ఆంధ్రులకు మాత్రమే పరిమితం కాకపోయినా, ఎక్కడెక్కడ ఆంధ్రులు పరిపాలించినా, వారు శైవులైనా, వైష్ణవులైనా, ఆలయాలలో నృత్య శిల్పాలను చెక్కించారు, దేవదాసీల నృత్యంతో స్వామివారిని సేవించారు. ఆంధ్రుల నృత్యకళను ప్రతిబింబించే రామప్పగుడి ఫోటోలు కొన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాను. రామప్పగుడి నిర్మించిన ఇటుకలు నీటిలో తెలుతాయంటే మీరు నమ్ముతారా? మేము నృత్తరత్నావళి ఆంగ్లంలోకి అనువదించే రోజులలో, దానిని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌వారు ప్రచురించారు. అప్పుడు మేము రామప్పగుడికి వెళ్లి తీసిన కొన్ని అద్భుతమైన ఫోటోలలో ఆంధ్రులు గర్వించదగిన నృత్య, నాట్య శిల్పాలు ఎన్నో ఉన్నాయి. ఒక్కొక్కటి ఒక కళాఖండం. తెలంగాణాలో ఈ ప్రదేశం మణిమకుటమానమైనది.

ఇంక రాజ నర్తకి విషయానికొస్తే ఎన్నో రమణీయమైన చిత్రాలు మన మనసులో మెదులుతాయి. వసంతసేన, వాసవదత్త, లకుమ, మధురవాణి ఇలాంటి మనోహరమైన రాజనర్తకుల కథలు కోకొల్లలు. భరతశాస్త్రం, సాహిత్యం, సంగీతంలో ప్రావీణ్యం ఉన్న అతిలోక సుందరులైన కొందరు చరిత్రలో మిగిలిపోయారు. వ్యాయామం, నృత్యశిక్షణ, అలంకార శాస్త్రం, పంచకావ్యాల అవలోడనం, అన్నీ చేసిన తరువాతనే ఆస్థానంలో స్థానం. ఇతిహాసాలు, పురాణాలలో ప్రవేశం, నాట్యంలో పాండిత్యం ఉంటే తప్ప రాజనర్తకి హోదా దొరకదు. రంగపూజ సమయంలోనే పండితులు, విద్వాంసులు వేసిన ప్రశ్నలకు సమాధానం

కోలాటం

చెప్పి, ఒప్పించిన తరువాతనే రాజు కొలువులో నర్తనం చేసే అవకాశం లభించేది. ఆస్థానంలో కవి పండితులకెంత ప్రాధాన్యమో రాజ నర్తకికీ అంతే హోదా. సంగీతం అంటే ఏమిటో సంగీత రత్నాకరంలో శార్ఙదేవుడు ఇలా నిర్వచించాడు.

'గీతం వాద్యం చ నృత్యం చ త్రయం సంగీతముచ్యతే'.. అని. అంటే గీతము, వాయిద్యము, నృత్యం మూడింటిని కలిపితే దాని పేరు సంగీతం. రాజ నర్తకికీ సంగీతంలో, తాళంలో శృతిలయలలో ప్రావీణ్యం ఉండేది. తను స్వయంగా శృతిశుద్ధంగా పాడగలిగేది. లయబద్ధంగా నాట్యం చేసేది. రాజనర్తకులు చేసే నృత్యంలో నృత్తం, నృత్యం, నాట్యం అంతర్భాగంగా ఉండేవి. నటరాజ రామకృష్ణగారు ఆంధ్రదేశంలో ఆస్థాన నర్తకీమణులు ఏయే నృత్యాలు ప్రదర్శించేవారో, ఆయన చిన్నతనంలో ఆయన కలిసిన కొందరు వృద్ధులైన రాజనర్తకులనడిగి విషయసేకరణ చేశారు. ఆయన నాతో ఎన్నోసార్లు వ్యక్తిగతంగా కలిసినప్పుడు చర్చించినవి, పుస్తకంలో వ్రాసినవే కొన్ని మార్పులతో ఇక్కడ పొందుపరుస్తాను. సాధారణంగా ఆస్థాన నర్తకి రాజ సభలో ప్రవేశించగానే ముందు పుష్పాంజలి, తరువాత రాజును కీర్తించే కైవారం ప్రదర్శిస్తుంది. ఇప్పుడు


రామప్పగుడి స్తంభాలు

దండ రాసకం

మరుగుపడిన ఒక ముఖ్యమైన ప్రక్రియ యతినాట్యం. ఇది ఒక ప్రౌఢమైన లయాన్వితమైన రచన. ఇందులో జతులు అన్నీ ఒకేలా ఉంటే దాన్ని సమయాతి అంటారు, ఒక్కొక్క పాదం నిడివి వేరు వేరుగా ఉంటే విషమయతి అంటారు, ముందు పెద్దగా ప్రారంభమై రానురాను సన్నబడితే గోపుచ్ఛ యతి అని, ముందు చిన్నగా ప్రారంభమై రానురాను పెద్దదయితే స్రోతోవహయతి అని, ఈ రెండూ కలిపిచేస్తే డమరుకయతి అని అంటారు. ఇవి జతివిన్యాసాలు, ఇందులో నృత్తానికే ప్రాధాన్యత. దాని నడకనుబట్టి జతులను, హరిణగతి అంటే లేడిలా నడిచేవి, మయూరగతి అంటే నెమలి నడకగలవి, మత్తేభగతి అంటే ఏనుగు నడకగలవి ఇలా రకరకాలు, వృషభగతి, అశ్వగతి మొదలైనవి. ఇంతేకాక వివిధ బంధాలు, భ్రమణాలు, ఉత్ప్లవనాలు అంటే ఎగిరి గెంతడం మొదలైనవి ప్రదర్శించేవారు. అన్నిటికన్నా ముఖ్యం సాత్త్వికాభినయం, ఎదో పదమో, జావళీయో, ఒక శృంగార రచన తీసుకుని నృత్తం లేకుండా కూర్చునిగాని ఎక్కువ నృత్యం లేకుండా రసాభినయం చేసేవారు. సాత్త్వికాభినయానికి రాజ నర్తకీమణులకు బిరుదులూ సన్మానాలు లభించేవి. రాజనర్తకిని పల్లకిలో ఆస్థానానికి తీసుకుని వచ్చి సాదరంగా సత్కరించేవారు. ఇలా రాజనర్తకులై చరిత్రలో నిలిచిపోయిన మహా కళాకారిణులు ఎందరో. కాకతీయుల కాలంలో వారి రాజనర్తకిగా ఉండిన మాచల్ దేవి, శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానంలో ఉండిన రంజకం కుప్పాయి, రఘునాధరాయలు ఆస్థానంలో తంజావూరును అలంకరించిన ముద్దు చంద్రరేఖ, హైదరాబాదు నవాబుల ఆస్థానాన్ని అలంకరించిన భాగమతి కొందరు ప్రముఖులు. కొందరు, మంత్రులతో, రాజపురోహితులతో, సమానమైన హోదాగలిగి ఉండేవారు. రాజకీయంగా మంతనాలు చెయ్యడానికి కూడా వీరిని ఉపయోగించేవారు. పెద్దపెద్ద ఆస్థానాలలోనే కాదు చిన్నచిన్న సంస్థానాలలోను నర్తకీమణులు ఉండేవారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క ప్రత్యేకత, కాని అందరికీ మూలం భరతముని విరచించిన నాట్యశాస్త్రం. వారు కేవలం

నర్తకులే కాదు, వివిధ శాస్త్రాలలో పాండితీ ప్రతిభగలిగిన విదుషీ మణులు. వీరు సామాన్య ప్రజలకు అందరికీ అందుబాటులో ఉండే నర్తకిలు కారు. సామాన్యులకు అందుబాటులో ఉండే ప్రజానర్తకులు ఉండేవారు. వారు అటు ఆలయానికి, ఇటు రాజాస్థానానికి చెందని నర్తకిలు. ప్రజలకు వినోదాన్నందించే ఈ నృత్యం చాలావరకు దేశి నృత్యం. ఈ కోవకు చెందినదే మేజువాణి. ఒక శతాబ్దం కిందటివరకు, ఉన్నత తరగతికి చెందినవాళ్ళ ఇళ్ళల్లో ఏదైనా పెళ్లి, ఉత్సవం జరిగితే ఈ మేజువాణిని పిలిచేవారు. వారి నర్తనం ఒక కుటుంబ హోదాకి ప్రతీక. ఆ పెళ్ళికి వచ్చినవారందరికీ అదే వినోదం. ఇవికాక, నృత్యనాటకాలు, పౌరాణికాలు, యక్షగానాలు ఇవన్నీ ఇందులోకి వస్తాయి. ఈ కళాకారులు ఏ ఆస్థానానికీ, ఏ దేవాలయానికీ చెందినవారు కాదు, ప్రజానాట్యం ప్రజల వినోదం వీరి మనుగడ. నటరాజ రామకృష్ణగారి ఆంధ్ర నాట్యం, పేరిణి, నవజనార్దనం ఒక విహంగ వీక్షణగా పరిశీలిద్దాం. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడెమీ రాజమహేంద్రవరంలో 1970 ఆగష్టు నెలలో ఒక 2 రోజులు సమావేశం ఏర్పరచి, ఈ లాస్య నృత్యాన్ని ఆంధ్రనాట్యం అని పిలవాలని నిర్ణయించారు. ఒక సిలబస్ కమిటీని వేశారు. 5 సంవత్సరాల కోర్సు తయారు చేశారు. ఆ రకంగా తయారయిన ఆంధ్రనాట్యం 1995లో ఒక GO ద్వారా గుర్తింపు పొందింది. కౌత్వం, కైవారం మొదలైన ఆగమ నర్తన ప్రక్రియలు నేర్పిన తరువాత లాస్య నృత్యానికి అవసరమైన అస్థాన నృత్య రీతులు నేర్పుతారు. ఇందులో పదవర్ణాలు, దశావతారాలు, తరంగాలు, శబ్దం, సలాంజతి, పదం మొదలైనవి నేర్పిస్తారు. పదార్థాభినయం, పదం అంటే ఒక్కొక్క పదానికి అభినయ చెయ్యడం, వాక్యార్థ అభినయం, భావాభినయం నేర్పిస్తారు. ఇంక మూడవది నవజనార్దన పారిజాతం. ఇది పిఠాపురంలో వెలసిన కుంతీ మాధవస్వామి ఆలయంలో నాలుగు శతాబ్దాలపాటు పెండ్యాల కుటుంబానికి చెందిన నర్తకీమణులు ప్రదర్శిస్తూ ఉండేవారు. నవ అంటే తొమ్మిది, కొత్త అని రెండర్థాలు. ఈ నవజనార్దన పారిజాతం 9 రాత్రులు, ఆడిన దరువు ఆడకుండా, ఎప్పటికప్పుడు కొత్త కొత్తగా చేసే అద్భుతమైన ఒక ప్రక్రియ. ఇందులో చతుర్దశ నాట్యాలు, ఏకాదశ

సమపాదం

భావాలు, దశవిధ తీరికలు (లయ విన్యాసాలు), అష్ట నాయికలు, సప్త తాళాలు కలబోసి ప్రదర్శించేవారు. 18 రాగాలు ఉపయోగించేవారు. నటరాజ రామకృష్ణగారు పెండ్యాల వంశంవారిదగ్గర ఇవి నేర్చుకుని, ఎందరికో నేర్పారు. మిత్రుడు కళాకృష్ణ ఈ నవజనార్దనం చేస్తూ ఉంటే లౌకికమైన ఆలోచనలేవీ లేకుండా రసజ్ఞులు రసలోకాలలో విహరించేవారు. మాస్టారి పేరణి ఇంకొక అపురూప సృష్టి. ఆయన దృష్టిలో పేరిణి, ప్రేరణ అనే పదం నుంచి వచ్చిందని అభిప్రాయం. శైవ నృత్యం, ప్రార్థనాపరమైనది, బృంద నృత్యం, లయబద్ధమైన ప్రక్రియ, శివుడు పూనినట్టు నర్తకులు పేరిణి చేస్తారు. జాయసేనాపతి నృత్త రత్నావళి లో 7వ అధ్యాయంలో పేరిణి లక్షణము, నేపథ్యం, పేరిణికి ఉన్న ఐదు అంగాలు, పద్ధతి, 34-68వ శ్లోకంవరకు వివరించాడు. నలుగురు నుంచి ఎనిమిదిమంది బృంద నృత్యంగా పేరిణి నిర్వహిస్తారు. గవ్వలు, బంగారు నగలు, విభూతి, గుండు చేసుకొనిగాని, అధికమైన జుట్టు కలిగిగాని ఉండాలి. ఇందులో నృత్తము, కైవారము, గర్భరము, వికటము, గీతము అని ఐదు అంగాలు. వీళ్ళు చావడ చేస్తారు అంటే అరికాళ్ళతో నేలను తడుతూ

కళాకృష్ణ

స్వస్తికం

నృత్యం చేస్తారు. గజ్జెల వాద్యమునకు ప్రాధాన్యము. ఒక వ్యక్తి, ఒకే వ్యక్తి, తానే ఒక వ్యవస్థ అయి, ఒక నాట్య ప్రక్రియను పునర్నిర్మించి, పునరుద్ధరించి, దానికి జీవంపోసి, పాఠ్యాంశం తయారుచేసి, తానూ నిర్విరామంగా నేర్చుకుని, శిష్యులకు నేర్పి, నిరాడంబరంగా తన పని పూర్తయిన తరువాత లోకం నుంచి నిష్క్రమించిన ఒక తపస్వి నటరాజ రామకృష్ణగారు. వారి పనిపై పరిశోధనచేసి గ్రంథ చేసిన అమ్మాయి సువర్చల. వారి ఆత్మ తనలో ఆవేశించిన శిష్యుడు కళాకృష్ణ. అయితే ఆంధ్రదేశం విభజన అయ్యాక ఆంధ్ర నాట్యం భవిష్యత్తు ఏమిటి. ఏ రాష్ట్రంవారు పట్టించుకుంటారు. ఏ పేరుతో దాన్ని పిలిచినా, ఆ పేరుతో పిలవకపోయినా కృష్ణా గోదావరులు తెలుగు నేలన ఎలా ప్రవహిస్తున్నాయో ఆంద్ర నాట్యం అలాగే నిలిచి ఉంటుంది.

ఆచార్య పప్పు వేణుగోపాల రావు, చెన్నై,
e-mail: pappuvenu@gmail.com

సత్యం సౌందర్యం కదా..... సౌందర్యం సౌశీల్యం కాదా!

బొాపూ బొమ్మ! అవునవును, అందరూ 'బొ'నన్న ఆ పిల్ల
ఈ 'బా...మ్మే'
జడ విసరాలా? జందెమెందుకూ...?! రెండు
జళ్ళున్నాయిగా...
ఏళ్ళూ పూళ్ళూ గడిచినా ఎదగదెందుకనో, ఈ ఎలనాగ!
పాతిక వసంతాలు పైబడ్డా, పరికిణీ, ఏమిటి కొంగూ
పట్టు విడువవెందుకనో
పదహారణాల పడుచుపిల్లకు, అవి ప్రతీకలు కాబోలు...
చందమామలోని జింకపిల్లలా, ఈ తన్వీ ధ్రువతారలాగ
దృశ్యమౌతుందా...
వసివాడదు సరే, వంకర చూపులూ
పోనిచ్చుకోదుగదా...!
సిగ్గే, చిలిపితనమే, సింగారమైన ఆ చిన్నది, పక్కున
నవ్వదా ఒక్కసారేనా?
జడకు పెల నాగ సంపెంగా జాజిపూవుల చెండుమల్లీ
ఒడ్డంచున వంగి ఓరచూపు చూస్తుంది కాని,
వడ్డాణాన్ని సడలనివ్వదు కదా! బొరా...
పమిటచెంగు పళ్ల బిగింపులోనే ఉన్నా, జడకొప్పు
జాలువారదేం...!
పారాడే గోరింటాకుకు నడయాడే నాటు కడియం
ఎందుకో... చాదు చుక్కకు చందురిడి వెలుగురేకా...
తనువే వలువల తాపడమా, లేక పురువిప్పిన
పురిపులుగా..!
రవిగాంచని 'బాపు'రేఖల పులుకడిగిన కవి, 'మిత్రుడు'
ముళ్లపూడీ ఈ ముడివిప్పాలి.
కూచిపూడి కురంగి కుమారీ శోభానాయుడి కురుల
కోమలత్వపు చూడామణీ రూపొందిన బొమ్మా... ఈ బా..మ్మ!
కాదంటే, ఆరాణ్మహేందరపురి (ర)కుమారి కాలి
మెట్టెల నికుడంబస్వన నిక్వాణమా...
అహో! ఊహల్ని ఊరించే ఊర్వశి కదా బాపూ బొమ్మ!
బాసలకందని బాపూబొమ్మ నాజూకులెరుగని
నండూరివారి ఎంకితో
నాణానికి, నయనానందంగా, నువ్వటూ నేనిటూ
అంటున్నదా...?
ముక్కెగరేసే ముద్దుగుమ్మా, మురిపిస్తూ ముందుకు
సాగే మాట్లాడని మల్లెమొగ్గా
నీ బింబమే నిలువుటద్దం; అందానికి అద్దంలో
ముత్యమంత పసుపు, బా...మ్మా, నీ ఛాయ...
ప్రణవంలా అక్షరరేఖవైన ఆంధ్రుల లలనా
సత్తెం రాజిల్లితే లావణ్యరేఖవైన లక్ష్మీనారాయణివి;
కల్పాంతాలకందని కలికి తురాయివి...
తెలుగు భారతీయుని తెలివేగుచుక్కవు... బమ్మెర పోతన
భాగవత పదానివి
వసంతోదయాల మిసిమివీ, పంటచేలపై పైరుగాలివీ
చైతన్య జ్యోతివైన నిన్నెలా అలరించటం?
అంజలులందుకో అలవోకగానైనా ఓ సారిటు కడగన్ను తిప్పి...

బాలంరాజు కృష్ణంరాజు
సికింద్రాబాద్. ఫోన్: 955 070 0066.

జుంపా లాహిరి

జుంపా లాహిరి

– రమేష్ ప్రసాద్ రావెళ్ల

జుంపా లాహిరి అసలు పేరు నీలాంజన సుదేష్ణ లాహిరి. జుంపా చిన్నప్పటి ముద్దు పేరు. ఇలా ఒకరికి రెండు పేర్లు ఉండటం అనేది లాహిరి వ్రాసిన ఒక నవలలో మూలాంశము, క్రింద వ్రాసినట్లుగా. జుంపా తల్లిదండ్రులు బెంగాల్ నుండి లండన్‌కి వలస వెళ్ళారు. జుంపా లండన్‌లో 1967లో పుట్టింది. రెండు ఏళ్ల తరువాత ఆ కుటుంబం అమెరికాకు చేరింది. జుంపా రోడ్ ఐలండ్ రాష్ట్రంలో పెరిగింది. న్యూయార్క్‌లోని బార్నర్డ్ కాలేజ్‌లో బి.ఎ. చదివింది. బోస్టన్ యూనివర్సిటీలో ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ., తరువాత పిహెచ్.డి. పట్టాలు పుచ్చుకొన్నది. ప్రస్తుతం ప్రిన్సటన్ యూనివర్సిటీలో కాల్పనిక సాహిత్యంలో ప్రొఫెసరుగా పనిచేస్తున్నది. లాహిరి వ్రాసిన 17 కథలు రెండు సంపుటాలుగా వచ్చాయి. రెండు నవలలు కూడా వ్రాసినది.

అసాధారణమైన లాలిత్యం, నాజూకు కలిగిన రచయత్రి. లాహిరి తన పాత్రలను నిష్పాక్షికంగానూ, సంవేదనతోనూ చిత్రిస్తుంది. - న్యూయార్క్ టైమ్స్.

తళతళమంటూ మెరిసే... - ఫ్రెష్ ఎయిర్ ప్రోగ్రామ్, నేషనల్ పబ్లిక్ రేడియో.

తీవ్రోత్తమము... భావ ప్రేరిత ఖండితము - ఓప్రా మేగజైన్.

అద్భుతం... లాహిరి పాత్రలను ఏమాత్రం తన వేలిముద్రలు లేకుండా నడిపిస్తుంది. - న్యూ యార్క్ టైమ్స్ బుక్ రెవ్యూ.

శోభాయమానము... బహుముఖ సంపూర్ణ వికసిత ప్రజ్ఞాశాలిని - శాన్‌ఫ్రాన్సిస్కో క్రానికల్.

Interpreter of Maladies (1999) జుంపా లాహిరి యొక్క మొదటి కథాసంపుటం. ఈ కథావళికి పులిట్జర్ బహుమతి వచ్చినది. ఇందులో తొమ్మిది కథలున్నాయి. ఒకటి తప్ప అవన్నీ అంతకు ముందు సాహిత్య పత్రికలలో ప్రచురింపబడినవే. *A Temporary Matter* కథలో భార్యాభర్తలు శోభ, సుకుమార్ బోస్టన్‌లో నివసిస్తుంటారు. సుకుమార్ పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసంపై పనిచేస్తున్నాడు. శోభ ఒక ప్రచురణ సంస్థలో ప్రూఫ్ రీడరు. వారి వివాహ జీవితం కుదుటుగా లేదు. ప్రేమ వాత్సల్యాలు తగ్గి, మానసికంగా దూరం అవుతున్నారు. వాళ్ళు ఉంటున్న ప్రాంతంలో కరెంటు లైన్లు బాగుచేయటం కోసం అయిదు రోజుల పాటు రోజూ రాత్రి ఎనిమిదింటికి ఒక గంటసేపు కరెంటు పోతుందని పట్టణ విద్యుత్తు శాఖ నుండి ఉత్తర్వు వస్తుంది. శోభ తన చిన్నప్పుడు ఇండియాలో ఇలా కరెంటుపోతే కుటుంబ సభ్యులు చుట్టూ కూర్చొని వాళ్ళ రహస్యాలు చెప్పుకొనేవాళ్లనీ, ఆ ఆట ఈ అయిదు రోజులు ఆడుకుందామని సుకుమార్‌తో అంటుంది. శోభ తను పెళ్ళికాకముందు సుకుమార్ అపార్టుమెంటుకి వెళ్ళినప్పుడు, అతను పక్క రూములో ఫోనులో మాట్లాడుతున్నప్పుడు అతని అడ్రెసు బుక్‌లో తన పేరూ, ఫోను నంబరు వ్రాసుకొన్నాడేమోనని చూశానని, అందులో తన పేరు లేదనీ చెప్పింది. అప్పటికి



వారిరువురి పరిచయం అయింది రెండు వారాల క్రితమే. సుకుమార్ వారిద్దరూ మొదటిసారి డిన్నరుకి వెళ్ళినప్పుడు వెయిటర్‌కి టిప్ ఇవ్వటం మర్చిపోయాననీ, మరునాడు టాక్సీ వేసుకొని ఆ రెస్టారెంటుకి వెళ్లి, ఆ వెయిటర్‌కి టిప్ ఇచ్చివచ్చానని చెప్పాడు. సుకుమార్ అమ్మ చూడ్డానికి వచ్చిన రోజుల్లో, ఒకనాడు తను ఆఫీసులో లేటుగా పనిచేయాలని అబద్ధం చెప్పానని, కాని నిజానికి తన స్నేహితురాలితో బార్‌కి వెళ్లి, డ్రింకు తాగానని శోభ చెబుతుంది. సుకుమార్ తమ మూడో వివాహ వార్షికోత్సవానికి శోభ ఇచ్చిన స్వెట్టరును స్టోరులో తిరిగిచ్చేశానని చెప్పుతాడు. ఇలా ఆ కరెంటు పోయిన రాత్రులు రహస్యాలు పంచుకొంటూ గడుపుతారు. ఐదో రోజు రాత్రికి కరెంటు వచ్చేస్తుంది. అయినా లైట్లు ఆర్పి రహస్యాలు చెప్పుకొంటారు. తాను ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నానని, వేరే అపార్టుమెంటుకి ఆ రోజే అద్దెకు తీసుకొన్నానని శోభ చెప్పుతుంది. సుకుమార్ కోపంతో రెచ్చిపోతాడు. కసితో తాను ఇప్పటివరకు దాచిన రహస్యం చెప్పుతాడు. ఆరు నెల్ల క్రితం శోభ నిర్జీవ శిశువుని ప్రసవించి, హాస్పిటల్ రూములో నిద్ర పోతున్నపుడు, డాక్టరు, నర్సు ఆ చనిపోయిన బిడ్డను శుభ్రం చేసి తన దగ్గరకు తీసుకు వచ్చారని, తను ఎత్తుకొని, హత్తుకొన్నానని, ఆ మగబిడ్డ ఎంతో చక్కగా ఉన్నాడని చెప్పుతాడు. శోభ ఏడుస్తుంది.

When Mr. Pirzada Came to Dine కథలోఒక పదేళ్ళ అమ్మాయి లిలియా కథకురాలు. లిలియా తండ్రి బోస్టన్ ప్రాంతంలోని ఒక యూనివర్సిటీలో ప్రొఫెసరు. వాళ్ళింటికి ప్రతి రాత్రి డిన్నరుకు అతిథిగా పిర్జాదా వచ్చేవాడు. పిర్జాదా ఒక సంవత్సరంపాటు పరిశోధన చేయటానికి రిసెర్చ్ ఫెలోషిప్ మీద ఢాకా నుంచి వచ్చాడు. లిలియా తల్లిదండ్రులు, పిర్జాదా ప్రతి రాత్రీ డిన్నరు అయ్యాక సినిమా పాటలు వినేవారు, ఇండియా, పాకిస్తాను రాజకీయాల గురించి మాట్లాడుకొనేవారు. పిర్జాదా భార్య, ఏడుగురు కూతుర్లు ఢాకాలో ఉన్నారు.

అవి 1971లో తూర్పు పాకిస్తాను (ఇప్పటి బంగ్లాదేశ్)లో సివిల్ వార్ జరుగుతున్న రోజులు. పిర్జాదాకు తన కుటుంబం నుండి ఉత్తరాలు రావటంలేదు. ఆ సివిల్ వార్ ఇండియా, పాకిస్తాను మధ్య యుద్ధానికి దారి తీస్తుంది. లిలియా తల్లిదండ్రులకు, పిర్జాదాకు మధ్య ఇంతకు ముందు ఉన్న ఆప్యాయత తగ్గిపోతుంది. వారి దేశాలు ఇప్పుడు యుద్ధం చేసుకొంటున్నాయి. లిలియాకి ఇవన్నీ అర్థం కావు. ఫెలోషిప్ ముగిసాక పిర్జాదా ఢాకా వెళ్ళిపోతాడు. కొద్ది నెలల తరువాత తన కుటుంబం అంతా క్షేమంగానే ఉన్నారని, సంవత్సరంలోనే అమ్మాయిలందరూ బాగా పెరిగారని, ప్రొఫెసరు దంపతుల ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలుపుకొంటూ ఉత్తరం వ్రాస్తాడు.

Interpreter of Maladies కథలో, అమెరికాలో పుట్టిపెరిగిన భారత సంతతి యువ దంపతులు దాసు, భార్య, వారి ముగ్గురు పిల్లలతో ఓడిస్సాలోని కోణార్క సూర్య దేవాలయాన్ని చూడటానికి వెళ్తారు. వాళ్ళ కారు డ్రైవరు కపాసి దృష్టి కోణం నుండి ఈ కథ సాగుతుంది. దాసు న్యూ జెర్సీలో స్కూల్ టీచరు. అతని తల్లిదండ్రులు రిటైర్ అయి, బెంగాల్‌లోని అసన్సోల్‌లో ఉంటారు. దాసు కుటుంబం వారిని చూడటానికి రెండేళ్లకొకసారి ఇండియా వెళ్తుంటారు. దాసు దంపతుల మధ్య ప్రేమాన్యోన్యాలు అంతగా లేవని, మానసికంగా పరస్పరం దూరం అయ్యారని కపాసి పసిగడ్తాడు. కపాసి వారంలో రెండురోజులు టూరిస్టులకు గైడు, కారు డ్రైవరుగా పనిచేస్తాడు. మిగతా రోజులు ఒక డాక్టరు దగ్గర అనువాదకర్తగా పనిచేస్తుంటాడు. గుజరాతీ పేషెంట్లు వచ్చినప్పుడు వాళ్ళ రోగాల గురించి వారు చెప్పేది గుజరాతీ నుండి ఒరియాలోకి అనువాదం చేస్తాడు, డాక్టరు కోసం. (రుగ్మతానువాది అనే అర్థంతో ఉన్న ఈ కథ పేరు అలా వచ్చింది. ఈకథా సంపుటి పేరు కూడా ఈ కథ పేరే.) శ్రీమతి దాసు కపాసి చేసే రోగానువాదాలపై ఆసక్తి చూపుతుంది, అందుకు అతన్ని మెచ్చుకొంటుంది. కోణార్క దేవాలయంపై ఉన్న కామోద్దీపక ప్రతిమలను చూసినప్పుడు కపాసికి శ్రీమతి దాసుపై కోరికలు కలుగుతాయి. ఉదయగిరి, ఖండగిరి గుహలు చూడటానికి వెళ్ళినప్పుడు, తనకు కాళ్ళు నొప్పులుగా ఉన్నాయని, కొండలు ఎక్కలేనని అంటుంది శ్రీమతి దాసు. దాసు పిల్లల్ని తీసుకొని వెళ్తాడు. అప్పుడున్న ఏకాంతంలో శ్రీమతి దాసు కపాసితో మనసు విప్పి మాట్లాడుతుంది. తన రెండో కొడుకు బాబీ దాసు కొడుకు కాదని, దాసు స్నేహితుడు

ఒక పంజాబీ అతను వాళ్లింట్లో కొద్దిరోజులు అతిథిగా ఉన్నప్పుడు అతనితో సంయోగించానని చెప్పుతుంది. గుజరాతీ పేషెంట్లు కపాసితో తమ రోగాల గురించి చెప్పుకొన్నట్లే, శ్రీమతి దాసు కూడా తన మానసిక బాధల గురించి అతనితో చెప్పటం ఈ కథలోని రూపకాన్వయం.

Sexy కథలో మిరాండా అనే అమెరికన్ యువతి దేవ్‌ని ఒక డిపార్టుమెంటు స్టోరులో కలుస్తుంది. ఆ పరిచయం కొద్దిరోజులలోనే శృంగారానుబంధంగా మారుతుంది. దేవ్ వివాహితుడు. అతని భార్య కొద్ది వారాలు ఇండియాకి వెళ్ళినప్పుడు దేవ్ మిరాండాతో శృంగారం నడుపుతుంటాడు. రోజూ ఆఫీసు పని అవ్వగానే, మిరాండా, దేవ్ డిన్నర్లకి, మ్యూజియమ్‌లకు, వినోద ప్రదర్శనలకు వెళ్ళుతుంటారు. పడకగది సుఖాలు అనుభవిస్తుంటారు. మిరాండాతో పనిచేసే లక్ష్మి తన చుట్టపు అమ్మాయి భర్త వేరే అమ్మాయితో కాపురం పెట్టి, భార్యను వదిలేశాడని చెప్పుతుంది. ప్రతిరోజూ లక్ష్మి ఆ అమ్మాయి బాధలను గురించి చెప్పుతుంది. మిరాండా తన అక్రమ సంబంధం గురించి ఎవరికీ చెప్పదు. ఈలోపు దేవ్ భార్య ఇండియా నుండి తిరిగివస్తుంది. రోజూ బదులు వారానికి ఒకసారి దేవ్ మిరాండాను కలుస్తుంటాడు. కొద్ది వారాల తరువాత మిరాండా కుంటి సాకులు చెప్పుతూ, దేవ్‌తో సంబంధాన్ని తెంపుకొంటుంది. ఇది సెక్సు స్వాతంత్ర్యాలున్న సమాజంలోని తాత్కాలిక కామక్రీడ కథ.

Unaccustomed Earth (2008) జుంపా లాహిరి ప్రచురించిన రెండవ కథాసంపుటి. ఇందులో ఎనిమిది కథలున్నాయి. వాటిలో నాలుగు న్యూయార్కర్ (The New Yorker) మాగజైనులో వచ్చినవి. Only Goodness ఒక అక్కాతమ్ముళ్ల ప్రేమవాత్సల్యాల కథ. పురోగమించే అక్క, వ్యసనాలతో జీవితం అంచుల నుండి జారిపోతున్న తమ్ముడు, వారిరువురి రేఖాచిత్రం. సుధ, రాహుల్ రెండవ తరం ఇండియన్ అమెరికన్లు. సుధ రాహుల్‌కంటే ఆరేళ్లు పెద్ద. సుధ యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో చదువుతూ సెలవుల్లో ఇంటికి వెళ్లినప్పుడు, వాళ్ళ తల్లిదండ్రుల చాటున అక్కాతమ్ముళ్లు ఇద్దరూ కలిసి బీరు తాగుతుండేవాళ్ళు. అప్పుడు రాహుల్ హైస్కూల్ విద్యార్థి. తరువాత రాహుల్ కార్నెల్ యూనివర్సిటీలో చేరతాడు. సుధ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఉన్నత విద్యా కార్యక్రమంలో చేరుతుంది. తల్లిదండ్రులు ఇద్దరు పిల్లల గురించి ఎంతో గర్వపడతారు. అది ఎంతోకాలం నిలవదు. రాహుల్ త్రాగుడు వ్యసనంలో పడి, క్లాసులకు వెళ్ళటం మానేస్తాడు. అతి తక్కువ గ్రేడులు రావటంతో యూనివర్సిటీ



చదువు మానివేయవలసి వస్తుంది. ఏదో ఒక బట్టలు శుభ్రపరిచే లాండ్రీలో మేనేజరుగా చేరతాడు. రెస్టారెంటులో వెయిటరుగా పనిచేసి అమెరికన్ అమ్మాయితో సహజీవనం చేస్తుంటాడు. సుధ లండన్‌లో రాజర్ అనే బ్రిటిష్ యువకుడిని పెళ్లి చేసుకుంటుంది. రాహుల్ ఉద్యోగం మానేసి దేశద్రిమ్మరిగా తిరుగుతుంటాడు. సుధకు కొడుకు పుడతాడు. రాహుల్‌ని లండన్ రమ్మని ఉత్తరం వ్రాస్తుంది. రాహుల్ లండనులో కొద్దిరోజులు గడిపాక, అక్కనీ, బావనీ ఏదన్నా మూవీకి వెళ్ళమనీ, పది నెలల మేనల్లుడిని తాను చూస్తానని, అంటాడు. వాళ్ళు మూవీ నుండి తిరిగి వచ్చేటప్పటికి రాహుల్ తాగి మైకంలో నిద్రపోతూ ఉంటాడు. బాలుడు నీల్ స్నానం తొట్టిలో నీళ్ళతో ఆడుకొంటుంటాడు. త్రుటిలో ప్రమాదం తప్పుతుంది. రాహుల్ ని సుధ ఇంటి నుండి వెళ్లిపొమ్మంటుంది. రాహుల్ టాక్సీ ఎక్కి ఎయిర్ పోర్టుకు వెళ్లిపోతుంటే, పైనుండి కిటికీలో నుండి చూస్తూ, సుధ ఏడుస్తుంది. తమ్ముడిని పెంచింది, ప్రేమించింది, చివరకు పోగొట్టుకొన్నది.

A Choice of Accommodations కథలో అమిత్ న్యూయార్క్‌లో ఒక మెడికల్ జర్నల్‌కి సంపాదకుడు. భార్య మేగన్ డాక్టరు. ఇద్దరూ అమిత్ హైస్కూలు సహాధ్యాయిని పామ్ పెళ్ళికి వెళ్ళతారు. తమ ఇద్దరి కూతుళ్ళను మేగన్ తల్లిదండ్రుల దగ్గరకు పంపించారు ఆ రెండు రోజులు. ఆ పెళ్లి అమిత్ చదువుకొన్న హైస్కూలులోనే జరుగుతుంది. ఆ పెళ్ళిలో అమిత్ తన క్లాసుమేట్లను చాలామందిని గుర్తుబట్టలేకపోతాడు. మేగన్ పెళ్ళికి కట్టుకొన్న స్కర్టుపై చిన్న చిరుగు కనపడటంతో ఆ పార్టీలో తన హాండ్‌బ్యాగ్ అడ్డం పెట్టుకొంటుంది. ఇద్దరూ ఆ పెళ్లి పార్టీలో అసౌఖ్యంగా



ఇబ్బంది పడతారు. అమిత్ మితం మించి తాగుతాడు. ప్రక్కన కూర్చున్న ఇంకో అతిథితో తమ రెండో అమ్మాయి పుట్టిన తరువాత తనకూ, మేగన్‌కూ దూరం పెరిగిందని వాపోతాడు. తమ పిల్లలు పడుకొనేముందు ఆ రాత్రి ఫోను చేద్దామనుకొంటాడు. మేగన్‌తో చెప్పి, తమ హోటల్ రూముకి వెళ్ళతాడు. కాని మేగన్ తల్లిదండ్రుల ఫోను నంబరు మర్చిపోతాడు. త్రాగిన మైకంలో బెడ్‌మీద పడి నిద్రపోతాడు. ప్రొద్దున్న లేచి పక్కన చూస్తే మేగన్ లేదు. అప్పుడు రాత్రి పార్టీ గుర్తుకు వస్తుంది. హోటలు లాబీలో కూర్చొని కాఫీ తాగుతున్న మేగన్‌ను చూసి క్షమాపణ కోరుతాడు. అమిత్ తనకు, పామ్‌కు హైస్కూలులో చదివేటప్పుడు ఏ విధమయిన సెక్సు సంబంధం లేదని మేగన్‌కు ఉన్న అనుమానాన్ని నివృత్తి చేస్తాడు. ఆ ఉదయం లంచ్‌పార్టీకి ఇద్దరూ మళ్ళీ హైస్కూలుకి వెళ్ళతారు. వీళ్ళు వెళ్ళేటప్పటికి లంచ్‌పార్టీ అయిపోతుంది. అతిథులందరూ వెళ్ళిపోయారు. ఇద్దరూ ఆ హైస్కూలు హాస్టలులో ఒక రూములోకి వెళ్లి తలుపులు వేసుకొని సుఖాన్ని అనుభవిస్తారు. ఆ వారాంతం అంతా అ పెళ్లి పార్టీ సాకుతో శృంగారభరితంగా గడపాలనుకొని ఎంతగానో ఎదురు చూసిన ఆ దంపతుల కోరిక వేరే త్రోవన వెళ్లి, తప్పుల తడకగా మారి, కామోద్రేకంతో ముగుస్తుంది.

The Namesake (2003) జుంపా లాహిరి వ్రాసిన మొదటి నవల. ఇది మొదట న్యూయార్క్ర్ మాగజైనులో కథగా వచ్చినది. తరువాత రచయత్రి ఆ కథను నవలా రూపంలోకి మలిచారు. అశోక్ గంగూలీ బోస్టన్ ప్రాంతంలోని MITలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పిహెచ్.డి. విద్యార్థి. భార్య అషిమ కొడుకుని కంటుంది. అమెరికన్ పద్ధతి ప్రకారం మూడోరోజులోపు పసిబిడ్డ పేరు హాస్పిటల్ వాళ్లకి చెప్పాలి. వాళ్ళు అధికారపూర్వకంగా పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు నమోదు చేస్తారు. అశోక్ తన అభిమాన రష్యన్ రచయత గోగోల్ (నికలాయో గోగోల్, 1809 - 1852) పేరు ఇస్తాడు. గోగోల్ చిన్నప్పుడు తన పేరు అంటే ఇష్టం ఉన్నప్పటికీ, హైస్కూల్‌కి వచ్చేటప్పటికి తన పేరుపై అయిష్టతను పెంచుకొంటాడు. యేల్ యూనివర్సిటీలో చేరేముందు పేరుని నిఖిల్‌గా మార్చుకొంటాడు. అశోక్‌కి అది ఇష్టం ఉండదు. పైగా తను వెళ్ళిన MITకి బదులు నిఖిల్ యేల్ యూనివర్సిటీని ఎంచుకొనడం అశోక్‌కి అసలు ఇష్టం ఉండదు. ఇక మిగతా కథ అంతా జుంపా లాహిరి ఫార్ములా కథయే. కలవడం, ప్రేమించుకోవటం, ప్రేమ కరిగిపోవటం, విడిపోవటం. నిఖిల్ యేల్ యూనివర్సిటీలో బ్యాచిలర్ డిగ్రీ తరువాత న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో ఆర్కిటెక్చరు ప్రాధాన్యంలో మాస్టర్స్ పట్టా పూర్తి చేస్తాడు. న్యూయార్క్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడు మాక్సీన్‌తో పరిచయం అవుతుంది. ఆ పరిచయం ప్రేమగా మారుతుంది, ఇద్దరూ మాక్సీన్ ఇంట్లో ఉంటూ సహజీవనం చేస్తుంటారు. మాక్సీన్‌ను నిఖిల్ తన తల్లిదండ్రులకు పరిచయం చేస్తాడు. తల్లి అషిమకు మాక్సీన్ నచ్చదు. వాళ్ళ ప్రేమ తాత్కాలికం అని, కొద్ది కాలంలోనే నిఖిల్ వదిలేస్తాడులే అని సమాధాన పడుతుంది. అదే జరుగుతుంది. వాళ్ళిద్దరూ విడిపోయాక, అషిమ తన స్నేహితుల కూతురు మౌషిమని కలవమని నిఖిల్‌ని అడుగుతుంది. మౌషిమ బెంగాలీ అమ్మాయి అవటంతో నిఖిల్‌కి ఇష్టం లేకపోయినా, అమ్మ కోసం కలుస్తాడు. వాళ్లిద్దరూ ప్రేమించుకొని పెళ్లి చేసుకొంటారు. వాళ్ల ప్రేమ ఎక్కువ కాలం నిలవదు. వాళ్ళ ప్రేమ అడుగంటిపోతుంది. మౌషిమ వేరే వాడితో సంబంధం పెట్టుకొంటుంది. నిఖిల్ ఒంటరిగా మిగిలిపోతాడు.

వెనక్కు వెళ్ళితే, నిఖిల్ యేల్ యూనివర్సిటీలో చదివేటప్పుడు ఒకరోజు నిఖిల్‌కి గోగోల్ పేరు ఎందుకు పెట్టాడో అశోక్ చెబుతాడు. అశోక్ ఇండియాలో ఉన్నప్పుడు ఒక రైలు ప్రమాదంలో ఇరుక్కుంటాడు. అర్ధరాత్రి జరిగిన ప్రమాదం. ఎందరో చనిపోయారు, గాయపడ్డారు. తుత్తునియలైన రైలు పెట్టె అడుగున పడి ఉన్న అశోక్ చేతిలో తను చదువుతున్న గోగోల్ కథల పుస్తకం రక్షక బృందానికి ఆ చీకట్లో వాళ్ళ ఫ్లాష్ లైట్ల కాంతిలో కనపడుతుంది. ఆ ఆనవాలుతో అశోక్‌ని బయటకు లాగుతారు. గోగోల్ పుస్తకం అశోక్‌కి ప్రాణభిక్ష పెట్టింది. అందుకని గోగోల్ పేరు తనకు పెట్టానని అశోక్ నిఖిల్‌కి చెప్తాడు. ఇది ముందే

తెలిసి ఉన్నట్లయితే, పేరు మార్చుకొని ఉండేవాడిని కాదని తండ్రిని నిఖిల్ క్షమాపణ అడుగుతాడు, బాష్పవదనంతో. ఈ నవల అదే పేరుతో మీరా నాయర్ దర్శకత్వంలో టాబు, ఇర్ఫాన్ ఖాన్ నటనలతో మూవీగా వచ్చింది.

The Lowland (2013) లాహిరి రెండో నవల. ఇది బుకర్ ప్రైజు చిన్న లిస్టువరకూ వచ్చింది. సుభాష్, ఉదయన్ కలకత్తాలో పుట్టిపెరిగిన అన్నదమ్ములు. బాల్యం నుండి అన్యోన్యంగా పెరుగుతారు. యూనివర్సిటీలో చదువుకొనేటప్పుడు వారువురి త్రోవలు విడిపోతాయి. సుభాష్ ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్తాడు. ఉదయన్ విప్లవ భావాలతో నక్సలైట్ ఉద్యమంలోకి వెళ్తాడు. ఉదయన్ గౌరిని పెళ్ళిచేసుకొంటాడు. పోలీసులు ఉదయన్‌ని పట్టుకొని, అతన్ని చంపేస్తారు. అప్పుడు గౌరి గర్భవతి. సుభాష్ అమెరికా నుండి వచ్చి, కుటుంబాన్ని ఓదార్చి, గౌరిని తను పెళ్లి చేసుకుంటానని చెప్తాడు. గౌరి ఒప్పుకొంటుంది. సుభాష్‌తో అమెరికా వెళ్తుంది.

గౌరికి కూతురు బేల పుడుతుంది. గౌరి యూనివర్సిటీలో క్లాసులు తీసుకోవడం మొదలెట్టుతుంది. ఒక ప్రొఫెసరు ప్రోత్సాహంతో ఫిలాసఫీలో పిహెచ్.డి. పూర్తి చేస్తుంది. బేలకు ఏడేళ్లు వచ్చినప్పుడు, సుభాష్ బేలను ఇండియా తీసుకువెళ్తాడు. వాళ్ళిద్దరూ తిరిగి వచ్చేటప్పటికి, గౌరి కాలిఫోర్నియా వెళ్ళిపోయింది. బేలను ఒంటరిగా తననే పెంచమని సుభాష్‌కి ఉత్తరం వ్రాసి ఇంట్లో పెట్టి, వెళ్ళింది. అక్కడ ఫిలాసఫీ ప్రొఫెసరుగా ఉద్యోగంలో చేరుతుంది. బేల పెద్దదయి, కాలేజి డిగ్రీ పూర్తి చేస్తుంది. స్థిరమయిన ఉద్యోగం లేకుండా దేశద్రిమ్మరిగా తాత్కాలిక ఉద్యోగాలతో కాలం జరుపుకుంటుంది. అప్పుడప్పుడూ సుభాష్‌ని చూస్తుంటుంది.

గౌరికి లోర్నా అనే పరిశోధకురాలితో పరిచయం అవుతుంది. అది ప్రేమగా మారి, వారిద్దరి మధ్య స్వలింగ సంపర్క సంబంధం ఏర్పడుతుంది. సుభాష్‌కి ఎలీస్ పరిచయం అవుతుంది. బేలకు ముప్పదేళ్ళు వచ్చేశాయి. బేల గర్భవతి అవుతుంది. ఆ బిడ్డకు తండ్రి ఎవరో చెప్పలేనని సుభాష్‌తో అంటుంది. సుభాష్‌కి కోపం వచ్చి, తను బేలకు తండ్రిని కానని, తన తమ్ముడు బేల తండ్రియని, అంతవరకూ రహస్యంగా దాచిన విషయాన్ని చెప్తాడు. బేల కోపంతో ఇల్లు వదిలి వెళ్లిపోతుందిగాని, మళ్ళీ సమాధానపడి, సుభాష్ దగ్గరకు వచ్చేస్తుంది. కూతురు మేఘనను కంటుంది. సుభాష్ విడాకులు కోరుతూ గౌరికి ఉత్తరం వ్రాస్తాడు. గౌరి సమ్మతించి, విడాకు



కాగితాల మీద సంతకం పెట్టటానికి సుభాష్ దగ్గరకు వస్తుంది. అక్కడ బేలను, మేఘనను చూస్తుంది. తనను, సుభాష్‌ని వదిలి వెళ్లిపోయినందుకు, తన జన్మరహస్యం దాచినందుకు, బేల గౌరితో వాగ్వాదం పెట్టుకొంటుంది. గౌరి కాలిఫోర్నియా వెళ్ళిపోతుంది. సుభాష్ ఎలీస్‌ని పెళ్లి చేసుకొంటాడు. బేలకు డ్రూ అనే అతనితో పరిచయం అవుతుంది. వారిరువురు పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకొంటారు. నవలలో మధ్యమధ్యలో కాలమానంలో వెనక్కు వెళ్ళుతూ, నక్సలైటు ఉద్యమం గురించి వివరాలిస్తుంది రచయత్రి. అవి అమెరికన్ పాఠకులకుగాని, ఇండియన్ చదువరులకుగాని అంతగా ఆనక్తి కలిగించకపోవచ్చును.

న్యూయార్క్ టైమ్స్ విమర్శకురాలు అన్నట్లు, లాహిరి కథానవలల్లో స్త్రీపురుష సంబంధాలు సన్నగిల్లిపోవటం, అందువల్ల వచ్చే ఒంటరితనం, ఓటమి భావనలు ప్రతిబింబిస్తాయి. లాహిరి ఎన్నో ప్రశంసలందుకున్ననూ విమర్శలు కూడాలేకపోలేదు. ఎస్క్వైర్ (Esquire) మేగజైను విమర్శకురాలు లాహిరికి అర్హతకు మించిన పేరు (overrated) వచ్చిందనీ, ఆమె కథలు నిజంగా విసుగు కలిగిస్తాయని తీవ్రంగా విమర్శించింది. నా ఉద్దేశంలో జుంపా లాహిరి వ్రాసిన కథానవలలన్నీ ఒకే మూసలో ఉండటంతో, పాత్రల అనుభవాలు కూడా ఒకే విధంగా ఉండటంతో, పునరుక్తులు కానవస్తాయి. ఇండియా అంటే కలకత్తా ఒకటే కాదు, అమెరికా అంటే బోస్టను మాత్రమే కాదు. ఈ చిన్న పరిధులవల్లను, కథావైవిధ్యలేమి మూలంగానూ, రచయత్రి తన కథాశిల్పంలో తానే ఘనీభవించినట్లుగా అనిపిస్తుంది. అయిననూ రెండు కథాసంపుటాలలోని పదిహేడు

కథలతోనూ, రెండు నవలలతోనూ జుంపా లాహిరి అపారమయిన పేరుప్రతిష్టలు గడించినది.

The Lowland నవల ప్రాసిన తరువాత, జుంపా లాహిరి ఇంగ్లీషులో ప్రాయటం విరమించి, ఇటాలియన్ భాషలో ప్రాయటం మొదలెట్టింది. ఇటాలియన్ భాష స్వంతంగానూ, ట్యూటర్లతోనూ నేర్చుకొన్నది. రెండు సంవత్సరాలు కుటుంబంతో రోమ్‌లో నివసించింది. తన ఇటాలియన్ భాషానుభవాల గురించి **In Altre Parole** అనే ఆత్మకథ ఇటాలియన్‌లో ప్రాసింది. అది *In Other Words (2015)* అనే పేరుతో ఇంగ్లీషు అనువాదంగా ప్రచురించబడింది. అనువాదకర్త వేరే రచయత్రి. తను ఇంగ్లీషులో ప్రాస్తే మళ్ళీ ఇండియన్ అమెరికన్లను గురించే ప్రాయాలని పాఠకులు ఎదురు చూస్తారని, అందునుండి విడివడి కాల్పనిక స్వతంత్రత కోసం ఇటాలియన్ భాషలో నూతనారంభం చేస్తున్నట్లు లాహిరి ప్రాసింది. వాల్‌స్ట్రీట్ జర్నల్, న్యూయార్క్‌ర్ మేగజైన్, ఇటాలియన్ టీవీలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో లాహిరి ఈ విషయం ఇంకా విశదపరిచింది. ఇటాలియన్ భాషలో లాహిరి ప్రాసిన మొదటి నవల పేరు **Dove Mi Trovo** (2018), 'నేనెక్కడున్నాను' అనే అర్థంతో. *Where abouts* పేరుతో స్వకీయానువాదంగా ఇంగ్లీషులో రాబోతున్న ఈ నవల మూలాంశం ఒక స్త్రీ రోమ్ నగరంలో ఏకాంత జీవనం గడపటం. ఆత్మమథనం, ఏకాంతంలో కలిగే మానసిక ప్రశాంతత మిళితమయిన ఈ నవలలో ఇంకా వేరే కథంటూ ఏమీ ఉండదు. ఇండియన్ అమెరికన్ల ప్రవాస కథలు మానివేసి కొంగ్రొత్త నేపథ్యంలో రచనలు చేయాలనుకొన్న జుంపా లాహిరి కోరిక ఈ ఇటాలియన్ నవలతో ఫలించినట్లున్నది.

*

జుంపా లాహిరి ఆత్మకథనం

In Other Words (2015) నుండి ఒక ఖండిక -

ఇటాలియన్‌లో రచన: *జుంపా లాహిరి;*

*ఇంగ్లీషు అనువాదం: **ఆన్ గోల్డ్ స్టీన్;** తెనుగుసేత: **రమేష్ రావెళ్ల.***

నాకు తెలిసిన మూడు భాషల గురించి ఇక్కడ కొంచెం వివరిస్తాను. వాటితో నాకున్న బంధాల గురించి క్లుప్తంగా చెప్పితే, లోతుపాతులు పాఠకులకు విదితం అవుతాయి.

నాకు వచ్చిన మొదటి భాష బెంగాలీ, తల్లిదండ్రుల భాష. నాలుగేళ్ళపాటు, నేను స్కూలుకి వెళ్ళేవరకు, బెంగాలీలోనే మాట్లాడేదాన్ని. ఆ భాష నాకు సులువుగా ఉండేది, నేను పుట్టిపెరిగిన దేశాలు ఇంగ్లీషు మాట్లాడే దేశాలయినప్పటికి. (జుంపా లాహిరి ఇంగ్లండులో జన్మించింది. రెండేళ్ల తరువాత ఆ కుటుంబం అమెరికాకు వలస వెళ్ళారు.) నేను మొట్టమొదట నర్సరీ స్కూలుకి వెళ్ళినప్పటి అనుభవాలు కటువుగానూ, అయిష్టంగానూ ఉండేవి. నా టీచర్లతోనూ, మిగతా పిల్లలతోను మాట్లాడటానికి భాష అడ్డురావటంతో నమ్మికలు, స్నేహాలు కుదిరేవిగావు. ఇంటికి ఎప్పుడు వెళ్ళదామా అని ఎదురు చూస్తుండేదాన్ని. నాకు ఆరేడేళ్ళు వచ్చేటప్పటికి, ఇంగ్లీషు చదవటం వచ్చేసింది, బెంగాలీపై నా పట్టు సన్నగిల్లింది. ఇంగ్లీషు నాకు సవతి తల్లి అయింది. ఇంగ్లీషు నేర్చుకొంటూ, అందులోని మెలకువలు తెలుసుకొంటూ, గట్టి చదువరినయ్యాను. కాని నా మాతృభాష నీడలా నన్ను ఇంకా వెన్నాడుతుండేది. నా తలిదండ్రులు వాళ్ళతోనూ, వారి స్నేహితులతోనూ నన్ను బెంగాలీలోనే మాట్లాడమనేవారు. ఇంట్లో ఇంగ్లీషు మాట్లాడితే చీవాట్లు పెట్టేవారు. నేను ఇంట్లో బెంగాలీ అమ్మాయిని, బయటకు వెళ్ళితే ఇంగ్లీషు మాట్లాడే ఇంకో అమ్మాయిని.

నేను ఆ రెండు భాషల్లో దేనిలోనూ ఇమడలేకపోయాను. అవి నాలో ఒకదాని వెనుక ఇంకోటి దాగి ఉండేవి. పున్నమి చంద్రుడు మబ్బుల్లో దాగిదాగి, ఒక్కసారి తళుక్కుమన్నట్లు, ఒకోసారి ఒక భాషపైకి వచ్చేసేది. రోజంతా స్కూల్లో ఇంగ్లీషు మాట్లాడి, ఇంటికి వెళ్లేసరికి ఆ భాష నిషేధం. నా తలిదండ్రుల సంతృప్తి కోసం ఒక భాష, మరి అమెరికాలో జీవనోపాధికి ఇంకొక భాష. ఆ వైరుధ్యాన్ని అధిగమించలేకపోయాను.

ఆ రెండు భాషలకు ఏమీ పొంతన ఉండేదిగాదు. వాటిమధ్య పొసగని వైరుధ్వం ఉండేదనిపించేది. ఆ రెండిటికీ మధ్యన పొత్తు నేనే. నా తలిదండ్రులకు ఆంగ్ల భాష విదేశ సంస్కృతి కింద లెక్క. కాని అమెరికాలో బెంగాలీ భాష వలస సంస్కృతికి సంబంధించినది. నా టీచర్లకుగాని, స్నేహితులకుగానీ నా బెంగాలీ గురించి ఏమీ తెలీదు, వాళ్లకు తెలుసుకోవాలన్న కుతూహలం కూడా ఉండేదిగాదు. నా తలిదండ్రులకు ఇంగ్లీషు బాగావచ్చు. కాని మాకు తెలిసిన అమెరికన్లకు బెంగాలీ భాష గురించి ఏమీ తెలీదు.

నేను పెరుగుతున్నకొద్దీ ఇంగ్లీషుపై నా మమకారం మెరుగవుతుండేది. నా స్నేహబృందంలో ఎవరూ వేరే భాషలు నేర్చుకోలేదు. అదే సహజ జీవితమని అనిపించేది. నా అమెరికన్ స్నేహితుల దగ్గర బెంగాలీ మాట్లాడాలంటే ఏవగింపుగా ఉండేది. నేను స్నేహితురాళ్ళ ఇంట్లో ఉన్నప్పుడు మా అమ్మ ఫోను చేసి బెంగాలీలో మాట్లాడటం అసహ్యించుకొనేదాన్ని. బెంగాలీతో నా అనుబంధాన్ని దాచాలని, తెంచుకోవాలని అనుకొనేదాన్ని.

నేను నా బెంగాలీ భాషను దాచుకొంటున్నందుకు నన్ను నేనే అసహ్యించుకొనేదానిని. ఇంగ్లీషులో మాట్లాడితే నా తలిదండ్రులను వదిలేసుకొంటున్నానా అనే భావన కలిగేది. మానసికంగా ఒంటరితనం అనుభవించేదానిని.

చక్కటి ఇంగ్లీషు, అమెరికన్ ఉచ్చారణ లేకపోతే వచ్చే పర్యవసానాలను, మా అమ్మానాన్నలు రోజువారీ జీవితంలో ఎదుర్కొనే సమస్యలను నేను చూశాను. కొన్ని పదాలకు అర్థం నేనే వాళ్లకు చెప్పాల్సి వచ్చిన పరిస్థితి ఉండేది, నేను వారికి తల్లినయినట్లుగా. మేము షాపులకు వెళితే, సేల్సు వాళ్ళు నాతో మాట్లాడేవారు, నాది అమెరికన్ ఉచ్చారణ కావటంతో. మా తలిదండ్రుల ఉచ్చారణ మూలంగా వాళ్లకు ఇంగ్లీషు రాదనుకొనేవారో, లేక ఆ షాపుల వాళ్ళు తాము చెప్పేది మా వాళ్లకు అర్థం కాదనుకొనేవారేమో. మా అమ్మానాన్నలకు నేను అమెరికన్ ఉచ్చారణ నేర్పేదాన్ని. వారు కూడా నాలాగే ఇంగ్లీషు మాట్లాడాలనే కోరిక నాకు బలంగా ఉండేది.

ఇలా ఈ రెండు భాషలతో సతమతమవుతున్న నేను నా ఇరవై అయిదో ఏట ఇటాలియన్ భాషను కనుగొన్నాను, నాకు ఆ భాష నేర్చుకోవలసిన అవసరం ఏమీ లేనప్పటికీ. కుటుంబరీత్యాగాని, సాంస్కృతిక పరంగా, ఉద్యోగ రీత్యాగానీ ఇటాలియన్ భాషతో నాకెట్టి అవసరం లేదు.



ఇటాలియన్ భాషమూడో బిందువుగా చేరటంతో, నా భాషా ప్రయాణం త్రికోణంగా మారింది. తిన్నని గీతను మించి దానికొక ఆకారం ఏర్పడింది. త్రికోణం ఒక క్లిష్టాకృతి, చలనశీలరూపం, కదిలే బొమ్మ. ద్వంద్వశక్తుల వైరుధ్యానికి త్రికోణంలోని మూడో బిందువు సమన్వయాన్ని చేకూరుస్తుంది. మొదటి రెండూ నా వారసత్వం. మూడవది నా స్వంతం. అది నా కోరికపై, నా శ్రమపై, నాలో నుండి వచ్చింది.

ఇటాలియన్ నేర్చుకోవటం అనేది నా జీవితంలోని బెంగాలీ, ఇంగ్లీషు భాషల సంఘర్షణ నుండి నేను పారిపోవటమే అనుకొంటాను. అసలు తల్లిని, సవతి తల్లిని వదిలేశాను. ఇది నా సొంతబాట.

మరి ఈ దారి నన్నెక్కడకు తీసుకువెళ్తుంది? నాపలాయనం ఎక్కడ ఆగుతుంది, పయనం ఎప్పుడు ముగుస్తుంది? పరుగెత్తి, పరుగెత్తి ఏమి సాధిస్తాను? తెలియదు, కాని నేను ఇటాలియన్ భాషతో ఎంత దూరం పోదామనుకొన్నా, బెంగాలీ, ఇంగ్లీషు భాషలు నన్నెప్పటికీ వదలవు, నేను వాటిని వదులుకోలేను. త్రికోణంలో లాగానే, ఒక బిందువు నుండి ఇంకో బిందువుకి అవి నన్ను తప్పనిసరిగా చేరుస్తాయి.

వచ్చే సంచికలో: అమితావ్ ఘోష్

*

డా. రమేష్ ప్రసాద్ రావెల్ల
Manassas, Virginia, USA.,
e-mail: rravella2@gmail.com.,
1-703-338-2194 (mobile and whatsapp)

చెరగని బాల్యపు పద చిహ్నాలివి

పుట్టినూరు కన్నతల్లితో సమానమంటారు. పుట్టినూరును వదిలేసిన జీవితం తెగిన గాలిపటమైపోతుందంటారు. ఊరు మారినవాడి పేరూ, గీరు అన్నీ మారిపోతాయంటారు. ఇవన్నీ ఏమోగానీ, 'సొంతూరి' పేరు వినగానే మాత్రం ఓ కెరటమేదో మనసుని చల్లగా తాకుతుంది. అది, వెంటనే మన మధురమైన బాల్యాన్ని గుర్తుకు తెప్పిస్తుంది. మనమీద ఏ బరువులు మోపని ఆ చిన్నతనాన్ని తలచుకొని ఆనందపడేలా చేస్తుంది. ఒకప్పటి ఇరుకు ఇల్లేగానీ, కడు పేదరికంతో బతికిన రోజులేగానీ.. ఇప్పటికీ మనకేదైన బాధనిపిస్తే, బాల్యపు జ్ఞాపకాలను గుర్తు చేసుకొని కాసేపు సంతోషపడతాం. అలా సొంతూరితో, పుట్టే పెరిగిన ఇంటితో, అక్కడి మనుషులతో ముడిపడిన తియ్యని బాల్య జ్ఞాపకాలను మరోసారి గుర్తుకు తెచ్చేవే ఈ 'నల్లగొండ కథలు'.

మొత్తం 21 కథలున్న ఈ పుస్తకంలో మొదటి రెండు, మూడు కథలతోనే.. రచయిత మన చేతుల్ని గట్టిగా పట్టుకొని బాల్యానికి లాక్కెళ్తారు. అక్కడే బలంగా పట్టేసుకొని, మన పక్కనే కూర్చొని ఒక్కో కథను ఆగకుండా.. పుస్తకమంతా చదివిస్తారు. సొంతూరు మట్టి వాసనను గుర్తు చేస్తారు. ఇరుకిరుకుగా కట్టుకునే ఇళ్ళు, ఆ పక్కనే ఉండే పశువుల పాకలను మన కళ్లముందు కట్టినట్లు చూపిస్తారు. అలాగే నాన్న తెచ్చిన కొత్త షూస్‌ను చూసి సంతోషంతో ఎగిరి గంతేసిన రోజులు, రెండు రూపాయలకు గంటసేపు రెంటుకి తీసుకొని తొక్కిన సైకిలు, దసరా సెలవుల్లో ఆడిన ఆటలు, పసితనపు అమాయకత్వంతో చేసిన పనులు, రాత్రుళ్లు ఆరుబయట పడుకొని వెన్నెల్లో చుక్కల్ని చూస్తూ.. కథల్ని చెప్పుకున్న రోజుల జ్ఞాపకాలను మన కళ్ళల్లో మెరిసేలా చేస్తారు. రెక్కలుంటే బాగుండు, ఇప్పటికిప్పుడు పుట్టినూరుకి వేగంగా వెళ్ళి, ఒకప్పటి జ్ఞాపకాలన్నింటినీ వెతుక్కోవాలనిపించేలా చేసే ఈ కథల గురించి ఇంకెంత చెప్పినా తక్కువే! వీటిని చదువుతున్నంతసేపు మనమూ వాటిల్లో పూర్తిగా లీనమైపోతాం. ఆ కథల్లో మనమొక పాత్రవుతాం. ఇదంతా మన కథే కదా అని అనుకుంటాం.

అలా వాటిని చదువుతున్నంతసేపూ, మనల్ని మనం మళ్లీ దోలాడుకుంటున్నట్టు, మనకి మనం మళ్లీ దొరుకుతున్నట్టు అనిపిస్తుంది. నల్లగొండ కథలను చదవడం పూర్తైన చాలా రోజుల వరకూ కూడా ఆ కథలు మనల్ని వెంటాడుతూనే ఉంటాయని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

బాల్యం గురించి ఎందరు ఎంత రాసినా, చెప్పినా, ఇంకా ఏదో మిగిలే ఉంటుంది. అందుకే బాల్యం, అందరికి మధురం. పిల్లల్నీ, వారి అమాయకమైన బాల్యాన్నీ నిండు మనస్సుతో ప్రేమించేవాళ్ళే, ఇలాంటి కథలను ఇంత అందంగా రాస్తారు. చివరగా.. ఈ ఊరుకుల, పరుగుల జీవితంలో.. మధురమైన బాల్యం ఎవరికీ తప్పిపోకూడదనే తపనతో, ఇంత మంచి కథలను మనకందించిన రచయిత మల్లికార్జున్ నుంచి మరిన్ని మంచి కథలను ఆశిస్తూ.. మనసారా అభినందనలు.



*

నల్లగొండ కథలు,
రచయిత - **వి. మల్లికార్జున్.**
పేజీలు: 150. వెల: ₹ 200/- ప్రతులకు: అన్ని నవోదయ పుస్తక కేంద్రాలు.

*

క్రాంతి శివరాత్రి - ఫోన్: 995 159 0398.

చలనచిత్ర గీతాలలో శాస్త్రీయ సంగీతం – 4

– ఎమ్. పురుషోత్తమాచార్య

(గతసంచిక తరువాయి)

అన్నమాచార్యులు (1408-1503)

4. నెయ్యములల్లో నేరేళ్ళో

చిత్రం : శుభలేఖ (1982)
గానం : బాలసుబ్రహ్మణ్యం
సంగీతం : కె.వి. మహదేవన్

గంభీరనాట-ఆది

నెయ్యములల్లో నేరేళ్ళో
ఒయ్యన నూరెడి ఉవ్విళ్ళో ॥నెయ్య॥

1. *పలుచని చెమటల బాహుమూలముల*
చెలమలలో నా చెలువములే
తళతళమను ముత్యపు చెరగు సురటి
దులిపెడి నీళ్ల తుంపిళ్ళో ॥నెయ్య॥

2. *తొటతొట కన్నుల దొరిగేటి నీళ్ళ*
చిటిపొటి యలుకల చిరునగవే
వటఫలంబు నీ వన్నెల మోవికి
గుటకలలోన గుక్కిళ్ళో ॥నెయ్య॥

3. *గరగరికల వేంకటపతి కౌగిట*
పరిమళములలో బచ్చెనలు
మరుని వింటి కమ్మని అంపవిరులు
గురితాకు లినుపగుగ్గిళ్ళో ॥నెయ్య॥ (సం.5-కీ.179)

భావం: అల్లనేరేడుపండులాంటి రుచికరమైన ప్రేమ కోసం ఉవ్విళ్ళూరుతున్నారా? భుజాల క్రింది ప్రాంతంలో కమ్ముకున్న చెమటల మడుగులో అందం కనిపిస్తున్నదా? తళతళ మెరిసే ముత్యాల పయ్యెద అనే విసనకర్ర దులుపుతున్న నీటి తుంపురులా? కన్నుల నుండి జారే బాష్పాలలో ప్రణయకలహాల చిరునవ్వే మెరుస్తున్నదా? మర్రిపండువంటి పెదవిని చూస్తూ గుటకలు వేస్తున్నారా? సింగారాల శ్రీనివాసుని కౌగిటిలో పరిమళాలు మోసపుచ్చుతున్నాయా? మన్మథుని చెఱకువింటి నుండి కమ్మనైన పూలబాణాల తాకిడికి ఇనుము కూడా గుగ్గిళ్ళుగా

మారిపోతున్నదా? నేరేళ్ళు, ఉవ్విళ్ళు, తుంపిళ్ళు, గుక్కిళ్ళు, గుగ్గిళ్ళు అనే తెలుగు భాషలోని దేశిపదాలను అన్నమయ్య చక్కని అంత్యప్రాసలుగా వాడుకున్నారు. బాహుమూలములు, సురటి, వటఫలము, వేంకటపతి, పరిమళము అనేవి తప్ప మిగతా సాహిత్యమంతా స్వచ్ఛమైన దేశ్యపదసంపదతో గుబాళించే సంకీర్తనాకుసుమమిది.

'అల్లోనేరేళ్ళో' అనేది జానపదులు కమ్మగా పాడుకునే చక్కని పదబంధం. ఇలాంటివాటిని ఊతపదంగా చేసుకుని వాళ్ళు ఎన్నో పాటలు పాడుకుంటారు. ముఖ్యంగా కీర్తనలోని చిట్టచివరి రెండు పాదాలు చిక్కని కవితాసామగ్రితో ముగ్ధమనోహరమైన భావాన్ని ప్రకటిస్తున్నాయి. మన్మథుని పూలబాణాల తాకిడికి చలించనివారు ఎవరూ లేరనే విషయాన్ని ఇనుపగుగ్గిళ్ళతో పోల్చారు. అలనాడు పాతివ్రత్య ప్రభావాన్ని నిరూపించుకోవడానికి అనసూయ, నారదుడిచ్చిన ఇనుపగుండ్లను గుగ్గిళ్ళుగా మార్చిన ఘట్టం గుర్తుకు రాకమానదు.

ఈ కీర్తనకు అన్నమయ్య సూచించిన రాగం దేసాళం. ఇది ఇప్పుడు ప్రచారంలో లేదు. మహదేవన్‌గారు దీనికి గంభీరనాట రాగంలో బాణీ సమకూర్చారు. ఈ రాగం ధీరశంకరాభరణరాగజన్యం.

ఆరో : సగమపనిస

అవ : సనిపమగస

తాళాన్ని మధ్యమకాలంలో ద్రుతగతితో రూపొందించారు. సమాజం యొక్క దృష్టిని తనవైపు తిప్పుకునేందుకు చేసే ప్రయత్నంలో కథానాయకుడు చిరంజీవిగారి పైన ఈ పాటను చిత్రించారు. మహదేవన్‌కు చాలా ఇష్టమైన రాగం. ఆయన తన ప్రతి సినిమాలో ఎక్కడో ఒకచోట ఈ రాగాన్ని ఉపయోగిస్తూనే ఉంటారు. ఈ రాగంలో కొన్ని సినిమా పాటలు.....

1. ఈ వీణకు శ్రుతి లేదు.....దేశోద్ధారకులు
2. తిరుతిరు గణనాథ.....100% లవ్

పాట ప్రారంభంలో చిన్నపాటి రాగాలాపన తారషడ్జమం పైన ముగిశాక ఆధారషడ్జమంలో పల్లవి ప్రారంభమవుతుంది. తరువాత మృదంగం ఒక ఆవర్తం వినిపిస్తుంది. మొదటి చరణానికి ముందు బిట్‌వర్క్‌లో వీణ మీటులోని అనుస్వరం విచిత్రంగా సాగి వైణికుని ప్రతిభను ప్రకటిస్తుంది. అయితే కైశికనిషాదస్పర్శతో కలిసి ఈ రాగానికి హిందూస్తానీ రాగమైన 'తెలంగ్' రాగపు రంగును సొగసుగా అద్దినట్లయింది. రెండో చరణం బిట్‌వర్క్‌లో వేణువు స్వరాల్లో కూడా ఈ లక్షణం సూక్ష్మంగా కనిపిస్తుంది. రెండో చరణం మధ్యలో బిట్ ఇచ్చిన వీణపై కైశికనిషాదంతో బాటు చతుశ్రుతి దైవతం, షట్‌శ్రుతి రిషభం కూడా కలిశాయి. ఇక ఇప్పుడు శాస్త్రీయ సంగీతం కాస్తా పక్కా సినిమా పాటగా అయిపోయింది.

రెండో చరణం మధ్యలో తీసిన రాగాలాపనలోనూ చతుశ్రుతి దైవతం కనిపిస్తున్నది. చివరి చరణంలోని 'మరుని వింటి కమ్మని అంపవిరుల' అనే పాదంలో మరుని, కమ్మని పదాల 'ని' అక్షరంపై పలికిన అనుస్వరసంగతి బాలూగారి గానసంతకాన్ని సొగసుగా ప్రకటిస్తున్నది. బాలూగారి సాహిత్య ఉచ్చారణలో మూడు ప్రధానాంశాలు గమనించదగినవి.

1. ఒయ్యన పదాన్ని అన్నమయ్య ద్రుతాంతంగా వాడలేదు. కనుక 'ఒయ్యన నూరెడి' కాదు,'ఊరెడి'
2. మొదటి చరణంలోని రెండవ పాదంలో 'చెలమలలో నా చెలువములే' అని, రెండవ చరణం నాలుగో

పాదంలో 'గుటకలలో నా గుక్కిళ్ళో' అని పాడారు. ఇందులో 'నా'ను విడిగా పాడడంవలన నాయొక్క అనే అర్థం ధ్వనిస్తున్నది. కాని అన్నమయ్య ఉద్దేశ్యం అది కాదు. "లోన్, లోపలన్' ప్రకారంగా ఉన్న నకారమది. 'చెలమలలోనా, గుటకలలోనా' అని 'నా' కలిసి ఉంటుంది. మూలప్రతిలో 'నా' తరువాత అరసున్న (ఁ) ఉంది. దాన్ని గమనించాలి. ఇవి అమ్మవారో, స్వామియో చెబుతున్నవి కావు. అన్నమయ్యే వర్ణిస్తున్నారు. అందుకే రెండవ చరణంలో అమ్మవారినుద్దేశించి "వటఫలంబు నీ వన్నెల మోవికి" అన్నారు.

3. రెండవ చరణం మొదటి పాదంలో 'దొరికేటి' బదులు 'దొరికెడి' అన్నారు. అర్థం ఒకటే కనుక సరే..

మహదేవన్‌గారి బాణీలో చక్కని శాస్త్రీయత తొంగిచూస్తున్నది. తాళాన్ని ఖచ్చితంగా అక్షరకాలానికి తగ్గట్టుగా రూపొందించారు. అన్యస్వరసంచారం కనుక లేకపోతే కచేరీలో పాడుకునే అర్హత వచ్చియుండేదేమో!

5. ముద్దుగారే యశోద ముంగిటి

చిత్రం : పడమటి సంధ్యారాగం (1987)

గానం : ఎస్. జానకి

సంగీతం : ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం

కల్యాణి-ఏక

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు
తిద్దరాని మహిమల దేవకీసుతుడు ॥ముద్దు॥

1 *అంతనింత గొల్లెతల అరచేతి మాణిక్యము*
పంతమాడే కంసుని పాలి వజ్రము
కాంతుల మూడు లోకాల గరుడపచ్చపూస
చెంతల మాలోనున్న చిన్నికృష్ణుడు ॥ముద్దు॥

2. *కాళింగుని తలలపైన గప్పిన పుష్యరాగము*
ఏలేటి శ్రీ వేంకటాద్రి ఇంద్రనీలము
పాలజలనిధిలోన బాయని దివ్యరత్నము
బాలుని వలె దిరిగె పద్మనాభుడు ॥ముద్దు॥ (సం.3-కీ.577)

భావం: ముద్దులొలికే ముత్యంవంటి కృష్ణుడు యశోద ఇంటిముంగిట తిరుగుతున్నాడు. అతడు చెప్పలేనన్ని మహిమలు కలవాడు. గోపకన్యలకు సులభంగా లభించే మాణిక్యంవంటివాడు. కంసుని పాలిటి వజ్రంగా, ముల్లోకాల్లో వెలిగే గరుడపచ్చగా ప్రకాశిస్తున్నాడు. కాళీయుని పడగలపై పుష్యరాగమణివలె వెలుగుతున్నాడు. వేంకటాచలం మీద క్షీరసాగరశయనుడై దివ్యరత్నంగా మెరుస్తున్నవాడు.

బాలకృష్ణుని దివ్యస్వరూపంలో నవరత్నాలు అందమైన అలంకారాలుగా ఎలా భాసిస్తున్నాయో చెబుతూ, ఆయా రత్నాల స్వభావానికి, శ్రీకృష్ణుని తత్త్వానికి సమన్వయం చేస్తూ వర్ణింపబడిన ప్రసిద్ధకీర్తన ఇది. ఇందులో 'తిద్దరాని' పదం సరిక్రొత్త ప్రయోగం. 'చెప్పలేనన్ని' అనే అర్థంలో దీన్ని అపురూపంగా ఉపయోగించారు అన్నమయ్య. దీన్ని తెలుసుకోక చాలామంది "దిద్దరాని" అంటూ పాడడం ఎంతో విచారకరం. అంతేకాదు, 'ముద్దుగారే యశోద ముంగిటి ముత్యం' అంటే ముద్దుగారేది యశోద కాదు, ఆమె ఇంటి ముంగిట తిరిగే కృష్ణుడు ముద్దుగారుతున్నాడు అని అర్థం వచ్చేట్టుగా పాడాలి. అందుకోసం 'యశోద' దగ్గరకాక 'దేవకీసుతుడు' దగ్గర ముగించాలి.

ఈ కీర్తనకు అన్నమయ్య 'సాళంగనాట' రాగాన్ని సూచించినారు. ఇప్పుడు దీన్ని 'సారంగనాట' అంటారు. అయినా ఈ రాగం ఇప్పుడు అంతగా ప్రచారంలో లేదు. ప్రముఖ సంగీత విద్వాంసులు నేదునూరి కృష్ణమూర్తిగారు

ఈ కీర్తనను 'కురంజి' రాగంలో స్వరపరచారు. ఈ రాగం మధ్యమశ్రుతి రాగం. ఇది శంకరాభరణరాగజన్యం. దైవతాన్ని దాటి పాడకూడదు. ఈ బాణీయే ప్రజల అభిమానాన్ని బాగా సంపాదించింది. దీన్ని కాదని బాలూగారు కల్యాణి రాగంలో స్వరపరచినా ఎత్తుగడను గాంధారం నుంచే తీసుకుని 'కురంజి'గా భ్రమింపజేశారు. ఇది ఒక చమత్కారం. అమెరికాలోని పిల్లలపై దీన్ని చిత్రించారు కనుకనే గాయని జానకి మధ్యమధ్య పసిపిల్లల గొంతును అనుకరిస్తూ సరదాగా పాడారు. కురంజిలో వినడం అలవాటైన కళాభిమానులు ఈ బాణీని అంతగా ఆదరించలేదు. పైగా ఈ బాణీలో అంతా లలిత సంగీత ధోరణే తప్ప శాస్త్రీయత లేకపోవడం కూడా ఒక కారణమైంది. చివరి చరణానికి ముందు ఇచ్చిన బిట్‌వర్క్‌లో అక్షరకాలాన్ని కూడా పాటించలేదు. అందుకే ఇది సినిమావరకే పరిమితమైంది. అయితే జానకమ్మగారి గానంలో చాలాచోట్ల అంటే, "యశోద, మహిమల, వజ్రము" మొదలైనచోట్లలో చక్కని అనుస్వర సంగతులను పలికించి శాస్త్రీయతను కొంతవరకైనా తీసుకురాగలిగారు.

నవరత్నాలన్నిటిని వర్ణించాలంటే మూడు చరణాలనూ ఆలపించాల్సి ఉంటుంది. కాని "రతికేళి రుక్మిణికి" అనే రెండవ చరణాన్ని వదిలేశారు. బహుశా 'రతికేళి' పిల్లలకు సరిపడదనుకున్నారో, సమయం సరిపోదనుకున్నారో కాని వదిలేశారు.



6. కొండలలో నెలకొన్న

చిత్రం : అల్లుడుగారు (1990)
గానం : కె.జె. జేసుదాసు
సంగీతం : కె.వి. మహదేవన్

హిందోళం-ఆది

కొండలలో నెలకొన్న కోనేటిరాయడు వాడు
కొండలంత వరములు గుప్పెడువాడు ॥కొండ॥
చ॥ కుమ్మరదాసుడైన కురువరతినంబి
ఇమ్మన్న వరములెల్ల ఇచ్చినవాడు
దొమ్ములు సేసినయట్టి తొండమాన్ చక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు ॥కొండ॥ (సం.1-కీ.151)

భావం: ఏడుకొండలలో నెలకొనియున్న కోనేటిరాయడైన వేంకటేశ్వరుడు కొండలంత వరాలిస్తాడు. కుండలు చేసే వృత్తిలో ఉన్న కురువరతినంబిని కటాక్షించాడు. తనకు మొదటిసారిగా ఆలయాన్ని కట్టించిన తొండమాన్ చక్రవర్తిపై దయను కురిపించినాడు.

మట్టిపూలతో పూజలు చేసినవాడు కురువరతినంబి. బంగారుపూలతో అర్చన చేసినవాడు తొండమాన్ చక్రవర్తి. ఈయన వేసిన బంగారుపూల బదులు మట్టిపూలేస్వామివారి పాదాలవద్ద పడుతూ ఉంటే రాజుకు గర్వభంగం జరిగి కురువరతిని ఆదరించాడు.

ఈ ఒక్క కీర్తనను మొత్తం పాడుకుంటే కురువరతినంబి, తొండమాన్ చక్రవర్తి, అనంతాళ్వార్, తిరుమలనంబి, తిరుక్కచ్చినంబి అనే అయిదుగురు భక్తుల దివ్యకథలను విన్నంత పుణ్యం కలగాలని అన్నమయ్య ఉద్దేశ్యమేమో! ఈ కీర్తన ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విశేషమైన ప్రజాభిమానాన్ని చూరగొన్నది.

ఈ కీర్తనకు అన్నమయ్య సూచించిన రాగం సామంతం. ఇది అంతగా ప్రచారంలో లేదు.

ఇంతటి మహాశక్తిమంతమైన కీర్తనకు శ్రవణసౌఖ్యవంతమైన బాణీని హిందోళరాగం, ఆదితాళంలో సమకూర్చినవారు రాజమండ్రి వాస్తవ్యులైన సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు ఎమ్మెస్. బాలసుబ్రహ్మణ్యశర్మగారు.

వీరి పూర్తి పేరు మామిళ్ళపల్లి సూర్యబాలసుబ్రహ్మణ్యశర్మ. వీరి కాలం 1929-2002. చిన్నతనంలోనే చూపు మందగించినా అధైర్యపడక అకుంఠితదీక్షతో నాదస్వరవిద్వాంసులైన పైడిస్వామిగారివద్ద సంగీతం నేర్చుకున్నారు. ఆదిభట్ల నారాయణదాసు, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి మొదలైన పెద్దల ప్రశంసలను పొందారు. 13వ ఏటనే విజయవాడ ఆకాశవాణి కేంద్రం నుండి హయ్యర్‌గ్రేడ్ పొందారు. సంగీతసమ్రాట్, ఆంధ్రబాలగాయకరత్న, సప్తగిరివిద్వన్మణి మొదలైన ఎన్నో బిరుదులు సాధించారు. వీరు 12 కృతులు,ఒక తత్త్వం, మూడు తిల్లానాలు రచించినారు.
ఈ సంకీర్తనతో పాటు కరుణానిధిం, చందమామ రావో, శరణంటిమాతని, అప్పని వరప్రసాది అనే సంకీర్తనలకు కూడా స్వరకల్పన చేశారు. అల్లుడుగారు సినిమావారు, మహదేవన్‌గారు ఈ సంకీర్తనను ఎమ్మెస్‌గారి బాణీలోనే పాడించారు. కాని మొదటి చరణం ఒక్కటే తీసుకున్నారు. దీన్ని కథానాయకుడు మోహన్‌బాబుగారిపై చిత్రించారు. ఆయన కుదురుగా కూర్చుని మృదంగ సహకారంతో భక్తిగా పాడుతున్నట్టుగా చిత్రించడం హుందాగా ఉంది. మొదట మృదంగవిన్యాసం ఒక ఆవర్తం కాగానే కీర్తనలోని మొదటి పంక్తిని తాళరహితంగా, భావస్ఫోరకంగా ప్రారంభించారు. తరువాత రెండోసారి నుండి మృదంగం అనుసరించింది. "గుప్పెడువాడు"ను మొదటిసారి ఎమ్మెస్‌గారిలాగానే "దదదమ మమమగసా" అని ముగించి, రెండోసారి శోభారాజుగారు పాడిన సంగతిని అంటే 'దనిసగసనిదమగస' అని పాడి పల్లవిని ఎత్తుకున్నారు. చరణం ముందుగా వినిపించిన బిట్‌వర్క్‌లో వయొలిన్ సోలో విన్యాసాన్ని ప్రారంభించి, వయొలిన్స్ సముదాయంతో చక్కని స్వరవిన్యాసాన్ని అందించారు. తరువాత వేణువు, సితార్‌లను కూడా కలిపి రెండు ఆవర్తాలు వినిపించారు. వెంటనే చరణం ప్రారంభమైంది.

ఎందుకోగాని జేసుదాసుగారు 'కురువరత్తి' అని పాడారు. అది తమిళ సంప్రదాయపు వాచికం కావచ్చు. 'దొమ్ములు చేసిన' పాదాన్ని రెండుమార్లు భావాత్మకంగా పాడారు. చివరి పాదంలోని 'నమ్మినవాడు'ను తనదైన అనుస్వరముద్రతో "నినిద దదమ మగసా" అనే సంగతిని వినిపించి చరణాన్ని ముగించడం కమ్మగా ఉంది. దీని తరువాత పల్లవిలోని 'కొండలలో నెలకొన్న' దగ్గర రెండు స్వల్పమైన మనోధర్మస్వరాలను అందంగా వినిపించినారు.

1. 5వ అక్షరం దగ్గరి నుండి ",గమదని సగమా, గసనిదమగస" అని పాడారు.

2. 3వ అక్షరం తరువాత ",సగసమగదమని గమగదమనిదస నిదమగ దమగస" అని పాడినారు.

దీని తరువాత చిత్రీకరణలో నాయిక మనోవేదనను చిత్రించేందుకు అనుగుణంగా బిట్‌వర్క్‌ను ఏడు ఆవర్తాలతో, సితార్, శహనాయ్, వేణువుల స్వరాలను రూపొందించారు. తరువాత మొదటి చరణం బాణీలోనే "ఎదలోని..." అనే చరణాన్ని చిత్ర ఆలపించారు. ఈ చరణాన్ని సిరివెన్నెల రాశారు.

ఇదే కీర్తనను కె. రాఘవేంద్రరావుగారి 'అన్నమయ్య' సినిమాలో బాలసుబ్రహ్మణ్యం శ్రావ్యంగా ఆలపించారు. మొదట కొద్దిగా హిందోళరాగాలాపన వినిపించి మొదటి పాదాన్ని సాకీగా పాడారు. తరువాత లయవాద్యం ఆరంభమైన అర ఆవర్తం తరువాత పల్లవిని ప్రారంభించారు. పల్లవిని రెండుసార్లు పాడాక మూడోసారి 'నెలకొన్న' తరువాత రెండు రకాల ఆలాపనలు చేసి 'కోనేటిరాయడు' దగ్గర పాటను ముగించినారు. మిగిలిన అర ఆవర్తంలో లయవాద్యాలు ముక్తాయింపును ఇచ్చాయి. చరణాలను ఏవీ తీసుకోలేదు. ఈ గానంలో పెద్దగా చెప్పుకోదగిన విశేషాంశాలేవీ లేవు. ఈ సినిమాకు సంగీత దర్శకులైన ఎం.ఎం. కీరవాణిగారు హిందోళపు బాణీని అలాగే ఉంచి పాడించడం అభినందనీయం. ఈ కీర్తనేకాక సినిమాలో మిగతా కీర్తనలలో రెండు, మూడిటినితప్ప అన్నీ ప్రసిద్ధమైన బాణీలనే అనుసరించడాన్ని సంగీతాభిమానులు ఎంతో హర్షించారు. ఆయన స్వంతంగా చేసిన బాణీలను కూడా ఎంతో గౌరవించారు.

ఇదే కీర్తనను "అల్లుడు కోసం" (1987) సినిమాలో ఆర్.జి. శోభారాజుగారు ఆలపించారు. ఆవిడ గతంలో అన్నమయ్య ప్రాజెక్టులో పనిచేసినప్పుడు వెలువరించిన క్యాసెట్టులో ఎలా పాడారో అదేవిధంగా స్వరాలతోసహా

మాత్రాకాలాన్ని పాటిస్తూ పాడారు. సంగీతదర్శకులు సత్యం చిన్నపాటి వీణ బిట్టులు ఇచ్చారు. చిత్రంలో వీణ ధవాయిస్తున్న నటి కల్పనపై దీన్ని చిత్రించారు. దర్శకులు కోటారెడ్డి అభినందనీయులు.

7. అదివో అల్లదివో హరివాసము

చిత్రం : కలియుగదైవం (1983)
గానం : పి. సుశీల
సంగీతం : సత్యం

మధ్యమావతి-ఏక



అదివో అల్లదివో హరివాసము
పదివేల శేషుల పడగలమయము ॥అది॥

1. *అదె వేంకటాచల మఖిలోన్నతము*
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిలమునులకు
అదె చూడు డదె మ్రొక్కు డానందమయము ॥అది॥

2. *చెంగట నల్లదివో శేషాచలము*
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము ॥అది॥

3. *కైవల్యపదము వేంకటనగమదివో*
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకలసంపదరూప మదివో
పావనములకెల్ల పావనమయము ॥అది॥

భావం: అదిగో, శ్రీహరి ఆలయం. పదివేల సర్పాల పడగలవంటి కొండలలో నెలకొనియున్నది. అన్నిటికన్న ఎత్తైనది, వేంకటాచలశిఖరం. అదే బ్రహ్మాది దేవతలకు కూడా ఆశ్చర్యం కలిగిస్తుంది. మునులందరికి నివాసమైనది. ఆనందమయమైన ఆ కొండకు మ్రొక్కండి. మనకు శేషాచలం చాలా దగ్గరలోనే ఉన్నది. దేవతలు కూడా దిగివచ్చి ఇక్కడే వెలసియున్నారు. బంగారు శిఖరాలతో ప్రకాశిస్తున్నది. ఈ దివ్యపర్వతమే మనకు మూలధనంవంటిది. పునర్జన్మ లేకుండ శాశ్వతమైన మోక్షాన్ని ప్రసాదించే వేంకటాచలం అదే. అది శ్రీవేంకటేశ్వరునికి నెలవైనది. సకలసంపదలకు, పావనములకు సుస్థిరమైన స్థలంగా వెలసిన పుణ్యక్షేత్రం అదిగో.... అదే.

నల్లమల కొండల వరుసలను వర్ణించడానికి ఆ పరమవాగ్గేయకారుడల్లిన పోలికను గమనించండి. ఒక్క ఆదిశేషునికే వేయి శిరస్సులుంటాయే, అటువంటిది పదివేలమంది ఆదిశేషుల పడగలను లెక్కేస్తే కోటి పడగలవుతాయి. ఇక ఇంతకన్న ఎవరూ గొప్పగా వర్ణించలేనపట్లు అతిశయంగా ఊహించినారు. మునులు, దేవతలు తిరుమలనే నివాసం చేసుకున్నారట. మరో కీర్తనలో వేదాలన్నీ శిలారూపాలను ధరించాయని, మునులు వృక్షరూపంలో ఉన్నారని వర్ణిస్తారాయన. గరుడాద్రి అని పేరుపొందిన గిరిశిఖరం ప్రక్కనుండి మనం ప్రయాణిస్తున్నప్పుడు ఒక్కసారి శిఖరం అంచును గమనిస్తే గరుత్మంతుడు నిలుచున్న భంగిమ స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే దేవతలంతా వచ్చి ఉన్నారన్నారు. ఏదో ఒక రూపంలో వైకుంఠవాసులంతా తిరుమలకు వచ్చారట. అందుకే దీన్ని 'కలియుగ వైకుంఠం' 'భూలోకవైకుంఠం' అన్నారు మరి!

2,3 చరణాల మధ్యలో "భువనమోహన, శ్రీగిరియు" అనే రెండు గీతపద్యాలను చేర్చారు. వీటిని దుత్తలూరి రామారావు రచించినారు. కథాగమనం, పాత్ర మనస్తత్వం దృశ్యచిత్రీకరణలో మరింత బలోపేతమవుతాయని దర్శకనిర్మాతలుగాని, స్వరకర్త సత్యంగారు కాని భావించి ఈ పద్యాలను చేర్చినట్లనిపిస్తున్నది. అయితే మొదటి పద్యం 'కౌసల్యాసుప్రజా రామ' శ్లోకానికి; రెండో పద్యం "శ్రీశేషశైల గరుడాచల" అనే శ్లోకానికి అనువాదాలుగా కనిపిస్తున్నాయి. పైగా వీటిలో ఛందోభంగాలున్నాయి. ఇంతకుముందు ప్రస్తావించుకున్న మల్లిక్‌గారే ఈ కీర్తనకు కూడా స్వరకల్పన చేశారు. దీన్ని మొదటిసారిగా ఆయన 1946లో రేడియోలో పాడినారు. అదే క్రమక్రమంగా ప్రజల్లోకి చేరి ఇప్పుడు ప్రపంచవ్యాప్తమైంది. ఇక ఇప్పుడు ఈ మధ్యమావతిరాగపు బాణీలో తప్ప ఇతరరాగాల్లో పాడడానికి వీల్లేకుండా తిష్ఠవేసుక్కూర్చున్నది. కీర్తనలోని మూడు చరణాలనూ ఉపయోగించుకుంటూ పూర్తిగా మల్లిక్‌గారి బాణీనే అనుసరించడం అభినందనీయం. దర్శకులు రోసిరాజుగారు, స్వరకర్త సత్యంగారు తమ విశాలహృదయసంస్కారాన్ని చాటుకున్నారు.

ఈ సంకీర్తనకు అన్నమయ్య శ్రీరాగాన్ని సూచించారు. శ్రీరాగంలో ఉండే గాంధారాన్ని, నిషాదాన్ని వదిలేసి చక్కని మధ్యమావతిలోనే సుశీలగారు మధురంగా ఆలపించినారు.



మధ్యమావతి రాగం హరికాంభోజి రాగజన్యం.

ఆరో : సరిమపనిస

అవ : సనిపమరిస

ఈ రాగంలో 'అలకలల్లలాడగగని' అనే త్యాగయ్య కృతి; 'పాలించు కామాక్షి' అనే శ్యామశాస్త్రి కృతి ఎంతో ప్రసిద్ధిని పొందాయి. ఇక సినిమాపాటలు.....

1. సువ్వీ సువ్వీ సువ్వాలమ్మా..... స్వాతిముత్యం
2. ఒహోహో మావయ్యా..... ఆరాధన
3. కోలుకోలోయన్న కోలో..... గుండమ్మకథ
4. శంకరా నాదశరీరా..... శంకరాభరణం

సుశీలగారి గానవైశిష్ట్యం అందరికీ తెలిసిందే. స్వరాక్షరస్పష్టతకు ఆమె పెట్టిందిపేరు. అధిక ప్రచారంలో ఉన్నట్లుగానే 'పదివేల'అనే పాడారు. అందరూ పాడుకుంటున్న 'పపరిసన సనిరిసనీపా' అనే సంగతికిబదులుగా అమె సత్యంగారి సూచనమేరకు 'పదివేల శేషుల'ను "పపనీని సాసానీని" అని ఆలపించినారు. పల్లవిని రెండుసార్లు పాడాక సాధారణంగా కీర్తన చివర చేసే 'అదివో' ఆలాపనను పాడడం ఒక ప్రత్యేకత. చరణాలలోని మొదటి పాదాల చివర తన ముద్ర ఉన్న అనుస్వరసంగతిని ఆమె అందంగా పాడారు. చివరి చరణంలో 'శ్రీవేంకటపతికి' అనేచోట 'శ్రీవేంకటాపతికి' అని పాడకుండా ఉంటే చాలా బాగుండేది. దీన్ని ఎవరూ గమనించినట్టులేదు.

సత్యంగారు ఈ కీర్తనకు చాలావరకు న్యాయం చేశారనే చెప్పవచ్చు. ప్రారంభంలో నాలుగు ఆవర్తాల బిట్ వర్కు సాగి, ఆధారషడ్జమం దగ్గర ముగించగా, వెంటనే తారషడ్జమంలో పల్లవి ప్రారంభమైంది. మొదటిపాదంకాగానే ఒక ఆవర్తం వీణ స్వరాలను పొదిగారు. తరువాత మళ్ళీ పల్లవి ప్రారంభమైంది. అయితే చరణాల ముందు ఇచ్చే బిట్‌వర్కులో మొదటనే చతుశ్రుతి దైవతం ప్రారంభమవుతుంది. ఇది రాగంలో లేని అన్యస్వరం.

"దా; ; నిదమరీ; ; రిమమసనీ; ;సరి నిససా నీమాపా
పానీ సరీస రిగారి గమాగ రీసా నిరిసరినిస పనిసా
దదపమ దానీ మాపా రీగా నినిదమపా *॥అదె॥*

ఈ స్వరసంపుటిలో రాగంలో లేని దైవతంతోబాటు గాంధారాన్ని కూడా ప్రముఖంగా ఉపయోగించారు. అప్పుడిది శ్రీరాగం కూడా కాలేదు. సంపూర్ణంగా సంచారం కనిపిస్తున్నది కాబట్టి ఖరహరప్రియ అనవచ్చు.

చరణం మధ్యలోని సితార్ బిట్లు మాత్రం మధ్యమావతి రాగంలోనే సాగాయి. మొదటి చరణం చివర గంటలు అంతరగాంధారంలో మ్రోగాయి. అక్కడ 'భువనమోహన' పద్యం ప్రారంభమైంది. 2వ చరణం ముందు బిట్టులో కూడా ఖరహరప్రియ లక్షణాలే ఉన్నాయి. తరువాత శుద్ధసావేరి రాగాన్ని అందిస్తూ "మపదస దపమరి సరిమపా" అని సితార్ మీద పలికించారు. వెంటనే 'శ్రీగిరియు' పద్యం ప్రారంభమైంది. పద్యంలోని మూడు పాదాలను సుశీలగారు సామరాగంలో ఆలపించగా,సితార్ బిట్ చివరలో మధ్యమావతి పోలికలు తెచ్చి వదిలేస్తే ఆమె నాల్గవ పాదాన్ని మధ్యమావతిలో చక్కగా ఆలపించారు. వెంటనే మళ్ళీ మొదటి చరణం బిట్టునే అందించారు. మూడవ చరణం మధ్యలోని సితార్ బిట్టులో చతుశ్రుతి దైవతం స్పష్టంగా వినిపిస్తుంది.

మొత్తంమీద సత్యంగారు ఈ కీర్తనను శాస్త్రీయ సంప్రదాయంతో స్వచ్ఛంగా మధ్యమావతిలో వినిపించాలనుకోలేదు. సినిమా పాటగా మలిచే ఉద్దేశ్యంతోనే ఖరహరప్రియ,శుద్ధసావేరి, సామరాగాలను మిళితం చేస్తూ స్వరపరచినట్లుగా తోస్తున్నది. ఆదితాళంలో ప్రసిద్ధి పొందినప్పటికీ అక్షరకాలాన్ని సరిగా పాటించనందున దీన్ని ఏకతాళమనే వ్యవహరించాలి. ఏదియేమైనా మల్లిక్‌గారి బాణీని మాత్రం చెడగొట్టనందుకు సంతోషించాల్సిందే. మిగతాదంతా సినిమా కోసం అనివార్యమే. శాస్త్రాన్ని సవరిస్తే అది ఉపశాస్త్రం. కాస్త ప్రక్కకు జరిగితే అది లలితశాస్త్రీయం. స్వరూపం మారిపోతే సినీ సౌకర్యం అని సర్దుకుపోవాల్సిందే.....

ఈ కీర్తనను రాఘవేంద్రరావుగారి 'అన్నమయ్య' సినిమాలో బాలసుబ్రహ్మణ్యం బృందంతో కలిసి పాడారు. సంగీతదర్శకులు కీరవాణి ఆధ్వర్యంలో ప్రారంభంలో శుద్ధమధ్యమస్వరం మీద ఘంటానినాదం వినిపించాక వేణువు స్వరసంచారం సాగుతుంది. తరువాత బాలూగారి పల్లవి సాకీ..... భక్తులతో కలిసి అన్నమయ్య కొండ ఎక్కుతున్న దృశ్యం కనుక తగిన దృశ్యపద్ధతులతో పాటను రూపొందించారు. 'పదివేలు' అని పలుకుతూ 'పడగల' దగ్గర మంచి సంగతిని బాలూ వినిపించారు. మొదటి చరణానికి ముందు వయొలిన్స్, సితార్లతో మూడు ఆవర్తాల బిట్టునిచ్చారు. 'అఖిలమునులకు' దగ్గర ఎఫెక్టును ఇస్తూ రెండు ఆవర్తాల జాగను వదిలిన కీరవాణిగారు 'అదె చూడుడు' దగ్గరినుండి అక్షరకాలాన్ని పట్టించుకోలేదు. 'అదె చూడుడు, అదె మ్రొక్కుడు' అని జాగా ఇచ్చి పాడించాక, అవే పదాలను మళ్ళీ కలిపి పాడిస్తే అక్షరకాలం సరిగా కుదిరేది. 2వ చరణాన్ని వదిలేశారు. 3వ చరణంలో కూడా అక్షరకాలాన్ని సరిగా పాటించలేదుకనుక దీన్ని ఏకతాళమనే భావించాలి. 'వేంకటపతికి...' అని బాలూగారు స్పష్టంగా పలికారు. 'పావనమయము' దగ్గర శాస్త్రబద్ధమైన సంగతిని మనోహరంగా ఆలపించారు.

టి.టి.డి.వారి సహకారంతో నిర్మించిన "శ్రీవేంకటేశ్వరవైభవం" సినిమాలో ఈ కీర్తనను బృందంగా వినిపించారు. సంగీతదర్శకులు ఎస్. రాజేశ్వరరావు మధ్యమావతిలోనే దీన్ని నిర్వహించారు. అయితే బాణీలో తన ముద్రను కొంత చేరుస్తూ చిన్నచిన్న మార్పులు చేశారు. "అఖిలోన్నతము, అఖిలమునులకు" అనే పాదాల బాణీలో మార్పులు స్వల్పంగా కనిపిస్తాయి. ఇదే కీర్తన పల్లవి మాత్రంగా బాపుగారి 'త్యాగయ్య' సినిమాలో బృందంగా వినవస్తుంది. బాణీ మధ్యమావతిదే.

ఇంకా ఉంది

డా. ఎమ్. పురుషోత్తమాచార్య, నల్లగొండ. ఫోన్: 939 661 1905.



అద్భుతాల గని మన మెదడు

– కిల్లాడ సత్యనారాయణ

బాబిలోన్‌లో వ్రేలాడే ఉద్యానవనం కట్టిందెవరు?

మోనాలిసా చిత్రాన్ని గీసిందెవరు?

డాన్ క్విక్జోట్ రాసిందెవరు?

కంప్యూటర్‌ను కనిపెట్టిందెవరు?

చంద్రమండలంలో అడుగుపెట్టిందెవరు?

ఎవరు? ఎవరు? ఎవరు?

మానవ మేధస్సు. అవునా?

ఒకటిన్నర కిలో బరువుగల పుట్టగొడుగులాంటి మెదడు. అవునా?

ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్న ఈ మెదడు నీ దగ్గరుంది. నా దగ్గరుంది. అందరికీ ఉంది.

మరేంటి ప్రాబ్లెమ్? దానిని వాడడం.

మనం కలలు కనేది దానివల్ల. కలత చెందేది దానివల్ల. నడిచేది అదే. నడిపించేది అదే. విడిచిపెట్టేది అదే. నియంత్రించేది అదే. కాళ్ల గురించి ఆలోచిస్తాం. కళ్ల గురించి పట్టించుకుంటాం. పొట్ట తగ్గించే ప్రయత్నం చేస్తాం. కండలు పెంచేందుకు కృషి చేస్తాం. జుట్టుకు రంగు వేస్తాం. ఒంటికి సెంటు పూస్తాం.

వీటన్నింటినీ నడిపించే మెదడును పట్టించుకోం. బయట రంగుల ప్రపంచంలో చిక్కుకున్నట్లే, శరీరంలో కూడా అవయవాల అవసరాల్లో చిక్కుకుంటున్నాం.

చాలా చాలాసార్లు నాకు అనిపిస్తుంది - అసలు మనం ఈ మెదడుకు యజమానిమేనా అని. లేకుంటే అది అనాథలా ఎందుకు ఉండిపోతుంది.

మెదడులన్నీ ఒక్కటేనా? ఏ మనిషి మెదడు ఆ మనిషికి ప్రత్యేకమా? ప్రతి మెదడూ మంచు పెచ్చులా (స్నోఫ్లేక్) ప్రత్యేకం.

సాధారణ మానవుని మెదడులో 86 బిలియన్ల న్యూరానులు ఉంటాయట. ప్రతి న్యూరాను పదివేల కనెక్షన్లు చేస్తుందట. ఈ కనెక్షన్లు ప్రతి వ్యక్తికీ ప్రత్యేకం. ఆ వ్యక్తి అనుభవాలు, జ్ఞాపకాలు ఆ కనెక్షన్ల ప్రత్యేకతకు కారణం అవుతాయి. దానినే 'కనెక్టోమ్' అంటారు.

వివిధ న్యూరాన్లను కలిపేది నాడీకణాలు (సినాప్సెస్). ఇవి న్యూరాన్ల మధ్య సమాచార సరఫరా చేస్తుంటాయి.

రెండు సంవత్సరాల పిల్లల్లో వంద ట్రిలియన్ల నాడీకణాలు (Synapses) ఉంటాయి. పెద్దవాళ్లకు రెండురెట్లు.

ఏ నాడీకణాలు తొలగిపోతాయి? ఉపయోగించనివి. అడవిలో దారి, నడవకుంటే కొన్నాళ్ళకు కప్పిపోతుంది. లా మార్క్ థీరీ. మెదడూ అంతే.

పిల్లలూ. ఉపయోగించండి మీ మెదడుని. సమర్థవంతంగా. సున్నితంగా. జంగు పట్టనీయకండి దాన్ని.

నువ్వెవరన్నది తెలిసేది నీ మెదడులో పెరిగిన దాన్నిబట్టి కాదు. నీ మెదడు పోగొట్టుకున్న దాన్నిబట్టి.

1966లో రొమేనియా ప్రభుత్వం జనాభా వృద్ధికి, అయిదుగురు పిల్లలకంటే తక్కువ పిల్లలున్న కుటుంబంపై పన్ను విధించింది. పిల్లల్ని పెంచలేక పేదలు చేతులెత్తేశారు. ప్రభుత్వం పిల్లల శరణాలయాలు తెరిచింది.

1989 నాటికి ఈ శరణాలయాల్లో పిల్లలు సుమారు రెండు లక్షలు. ఈ పిల్లల్లో మెదడు అంతగా ఎదగలేదు. ప్రభుత్వం ఈ నిబంధన మార్చింది.

అంటే, మెదడు ఎదగాలంటే, పరిసరాలు కూడా ముఖ్యమే. జంగిల్‌లో జంతువుల మధ్య ఒక పసికందును విడిచిపెట్టమనుకొండీ. అయిదేళ్ల తర్వాత అతడ్ని చూస్తే, అతని ప్రవర్తన జంతువులకు దగ్గరగా ఉంటుంది. భాష రాదు. భావం పరిమితం.

ఎవరి కక్ష్య వారిదే. ఎవరి జన్యువులు వారివే. ఎవరి అనుభవాలు వారివే. అందుకే ఎవరి మెదడు వారిదే.

నీలా ముందు ఎవరూ లేరు. ఇప్పుడు లేరు. రేపు రారు. నువ్వు అద్వితీయం.

పిల్లలూ, పోల్చుకోకండి ఎవరితో. పోటీ పడకండి ఎవరితో. నీకు నువ్వే పోలిక. నీతో నీకే పోటీ. ఎవరి న్యూరాన్ కనెక్షన్లు వారివే. దట్సిట్.

మన మెదడు ఒక సిటీలాంటిది. సిటీలో అర్ధవ్యవస్థ ఎక్కడ దొరుకుతుంది? ఎవ్వరూ చెప్పలేరు. ఆలోచన ఎక్కడ పుడుతుంది? చెప్పలేం. దుకాణాలు, బ్యాంకులు, వ్యాపారులు, వినియోగదారులు, వివిధ వృత్తులు... ఎన్నో కలిస్తే సిటీ ఆర్థిక వ్యవస్థ. మెదడూ అంతే.

మనం కూర్చున్నాం. కాఫీకప్పును టీవి వైపు చూస్తూ నోటి దగ్గరకు తీసుకుంటున్నాం. ఒక సిప్ త్రాగి మళ్ళీ టేబుల్ మీద పెడుతున్నాం. ఈ ప్రక్రియలో మన ప్రమేయం ఎంత? ఇదే పనిని ఒక రోబోచేత చేయించాలంటే ఎంత ప్రోగ్రామింగ్ చేయాలి? ఎంత శక్తి ఖర్చు చేయాలి?

మా అమ్మ బావివద్ద నుండి తలమీద బిందెమీద బిందె పెట్టుకుని, చేతులు పట్టకుండా మాట్లాడుతూ వచ్చేది. అలా చేయాలని నేను శతవిధాలా ప్రయత్నించాను. క్రింద పడిపోయేవి. మా అమ్మకు సునాయాసమైన పని, నాకు కష్టం ఎందుకు?

తడుముకోకుండా మాతృభాష మాట్లాడుతాం. అదే నేర్చుకుంటున్న భాషయితే మాట్లాడడానికి కష్టపడతాం. ఏం?

నేర్చుకున్నదానికి, నేర్చుకుంటున్నదానికి వ్యత్యాసం ఎందుకు? నేర్చుకున్న తర్వాత మన మెదడులో ఏం జరుగుతుంది?

అప్రయత్నంగా రోజూ ఎన్ని పనులు చేస్తున్నామో.

మనల్ని ఎక్స్పర్ట్‌గా నిలబెడుతున్నది సుప్తచేతనా మెదడు.

మనం చేయలేమేమో అని భయపడిన ఎన్నో పనుల్లో మనల్ని ఎక్స్పర్ట్ చేసింది ఈ సుప్తచేతనా మెదడు.

సైకిల్ తొక్కడం, కారు నడపడం, ఈదడం, చెట్లెక్కడం, కంప్యూటర్ వాడడం... ఎన్నో! ఒకప్పుడు ఆమ్మో అన్నవి, ఇప్పుడు ఇంతే అంటున్నాం. ఎలా?

నడవడం, నవ్వడం, తినడం, తిరగడం, పడుకోవడం, పరుగెత్తడం... ఇలాంటివెన్నో పనులు అప్రమేయంగా చేస్తుంటాం. ఎలా?

ఈ పనుల్లో పొరపాటు దొర్లదు. దొరలిందంటే ఆరోగ్యం పాడైయిందని. ఒక్క పనికోసం మన మెదడులో ఎన్ని లక్షల న్యూరాన్ల మధ్య సమన్వయం, సహకారం ఉంటుందో.

నడవడాన్ని తీసుకోండి. కంటికి కనిపించని చిన్న ప్రాంతంలో, మన ఊహకు మించిన లెక్కింపులు జరుగుతాయి. ఈ లెక్కింపులు చెయ్యడానికి సూపర్ కంప్యూటర్ చాలా శక్తి ఖర్చు చేస్తుంది. అదే మన మెదడు 60 వాట్ల బల్బు ఖర్చు చేసేంత శక్తిని మాత్రమే ఉపయోగిస్తుంది.

క్రొత్త విషయాన్ని నేర్చుకున్నప్పుడు మన మెదడులో కొన్ని మార్పులు జరుగుతాయి. కొంతకాలం సాధన చేస్తే, ఆ మార్పులు పాటర్న్‌గా మార్పు చెందుతాయి. అవి భౌతికంగా గట్టి తంత్రిలా (హార్డ్ -వైర్డ్) వృద్ధి చెందుతాయి. ఇవి ప్రక్రియాత్మక జ్ఞాపకంగా మెదడులో నిలువ ఉంటాయి. ఇవి వేగంగాను, సమర్ధవంతంగాను పనిచేస్తాయి. దీన్నే సుప్తచేతనా శక్తిగా పిలుస్తారు.

మా అమ్మ తల మీద బిందెలు పెట్టి నడవడం హార్డ్-వైర్డ్‌గా వృద్ధి చెందింది. ఏ నైపుణ్యమైనా అంతే.

నేర్చుకునేవరకే భయం. ఆ భయం చేతనావస్తది. దాన్ని తోసిరాజని ముందుకు పోవాలి. అప్పుడు నేర్చుకోవడం నీ నైపుణ్యంగా మారుతుంది. యు బికం ఎక్స్పర్ట్. నువ్వు భయపడిన విషయం నీకు ఆనందం అవుతుంది. సో, విద్యార్థులూ! దేనికీ భయపడకండి. దేనికీ తల వంచకండి.

ఇది నేను చెప్పడం లేదు. మీ మెదడు. పుట్టగొడుగులా ఉన్న మీ ముద్దల మెదడు.

ప్రాక్టీస్ మేక్స్ మెన్ పెర్ఫెక్ట్. నిజమే. మెదడు గురించి చదువుతుంటే నాకు తెలిసింది - ఈ మాట అక్షర సత్యమని. రెండు స్తంభాలకు కట్టిన తాడు మీద కళ్లు మూసుకుని ఏ సహాయం లేకుండా నడుస్తుంది ఒక పాప. డీన్ పోటర్ అనే వ్యక్తి తాడూ, రక్షక సాధనాలు ఉపయోగించకుండా క్లిఫ్ పర్వతాలు ఎక్కాడు.

శకుంతలాదేవి రెండువైపులా 13 అంకెల గుణంకాన్ని రెప్పపాటులో చెబుతుంది.

ఇలాంటివారు ఎందరో. అద్భుతాలు చూపించేవాళ్లకు, సాహసాలు చేసేవాళ్లకు సాధనే ఊపిరి.

ప్రాక్టీస్ తో -

ఐ.ఐ.టి. / ఐ.ఐ.ఎం. / నీ.ట్. / నల్సార్‌లోలా / డియూలో బిఎ / జె.ఎన్.యూ.లో ఎం.ఎ. / ఐ.ఎస్.ఐ.లో మేథ్స్.... ప్రవేశం పొందొచ్చు.

ఇంకా -

బ్యాంకు పి.ఓ. / సెంట్రల్ ఎక్సయిజ్ ఇన్స్పెక్టర్ / గ్రూప్ 1/సివిల్స్ / సి.పి.ఎమ్.ఎఫ్.లో కమాండెంట్ / ఎఫ్.సి.ఐ. మేనేజర్.... ఉద్యోగం పొందొచ్చు.

ఇక -

కళలు, కావ్యాలులో నీ ఇష్టం. ఎంతైనా ఎదగొచ్చు.

ప్రాక్టీస్ చేస్తే మనం అనుకున్నది సాధించడం ఓ లెక్కా.

సిగ్మ్మండ్ ఫ్రాయిడ్ ఈ సుప్త చేతన మీద పరిశోధనలు చేశాడు. మనల్ని నడిపిస్తున్న చోదకశక్తి అదే అని నిర్ధారించాడు.

పరిసరాల నుండి మన మెదడు సమాచారాన్ని సేకరిస్తూ ఉంటుంది. వాటి ప్రేరణతో ప్రవర్తన ప్రభావితమవుతుంది. ఉత్తమ పరిసరాలు ఉత్తమ ఫలితాలు ఇస్తాయి.

అనుకోనిది ఎదురైనప్పుడు చేతన చైతన్యవంతం అవుతుంది. మనం నాట్యంలో నిమగ్నమై ఉన్నాం అనుకోండి. ఢమాల్ అని పెద్ద శబ్దం. అందరి దృష్టీ అటు మళ్లుతుంది. ఏంటా అని ఆలోచిస్తారు. అది చేతన.

సంశయంలో సమాధానం చెప్పేది చేతనే. జీవితంలో మనం చేసే వందలాది పనులు బిలియన్ల న్యూరాన్లు నిర్వర్తిస్తున్నాయి. ఈ పనుల మధ్య ఘర్షణ వస్తుంటుంది. కాఫీ త్రాగాలా, ఐస్‌క్రీం తినాలా? సినిమాకు వెళ్లాలా, ట్యూషన్‌కు వెళ్లాలా? ఈ తగవు చేతనే తీరుస్తుంది.

చేతనాశక్తి ప్రణాళిక వేస్తుంది. లక్ష్యాలు నిర్ధారిస్తుంది. మహామంత్రిలా సరైన సమయంలో సరైన సలహాలు ఇస్తుంది.

చేతనాశక్తి ఒక పెద్ద కంపెనీ సి.ఇ.ఓ.లాంటిది. చిన్న కంపెనీలకు సి.ఇ.ఓ. అవసరం ఉండదు. పెద్ద కంపెనీల్లో రోజువారి సమస్యలకు అతీతంగా దీర్ఘకాలిక వృద్ధికోసం సి.ఇ.ఓ. ఉండాలి.

అర్ధమయ్యిందా? చిన్న జీవితాలకు చేతనాశక్తితో పెద్దగా పనుండదు. పెద్దగా జీవించాలంటేనే, సి.ఇ.ఓ. ఉండాలి. మీకు సి.ఇ.ఓ. కావాలా? వద్దా?

ఫ్రీవిల్ సంగతి? చేతన, అచేతన శక్తుల మధ్యే మనిషి జీవిస్తాడా? వీటికి అతీతంగా స్వేచ్ఛగా జీవించలేడా?

ఇది పెద్ద విషయం. ప్రస్తుతం మనం విద్యార్థులం. ఫ్రీవిల్ ఉంటుందని శాస్త్రవేత్తలు అంగీకరిస్తున్నారు.

మన ఒక్క మెదడు కార్యకలాపాలే చాలా సంక్లిష్టం. అలాంటి కోట్ల మెదడ్ల మధ్య మన మెదడు జీవిస్తుంది. ఇవన్నీ ఒకదాని నుంచి మరొకటి ప్రభావితం అవుతాయి. అది మన ఊహకందని సంక్లిష్టత. అందుకే ఒక వ్యక్తి మరుక్షణం ఏం చేస్తాడో చెప్పలేం. భవిష్యత్తును ఖచ్చితంగా అంచనా వేయలేం.

అయినా మెదడు భవిష్యత్తు వైపే పరుగు తీస్తుంది. అందుకే పందాలు, జూదాలు, లాటరీలు, బెట్టింగులు. జ్యోతిషాలు, తంత్రులు, తాయెత్తులు.

మన మెదడు అనుభవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటుంది. ఆ నిర్ణయాల్లో కొన్ని భవిష్యత్తును ఆశించి చేస్తుంది.

మన మెదడు ఒక పార్లమెంట్. అందులో కొన్ని న్యూరాన్లు చదవమంటాయి. కొన్ని తిరగమంటాయి. ఒకేసారి. కొన్ని ప్రేమించమంటాయి. కొన్ని పరిస్థితులకు భయపెడతాయి.

మన మెదడు, రోజులో వేల నిర్ణయాలు తీసుకుంటుంది. అధికారపక్షంలాగే. అన్నింటికీ లక్ష్యాలు, ప్రణాళికలు ఉండవు. కానీ జీవితాన్ని ప్రభావితం చేసే పెద్దనిర్ణయాలకు

సి.ఇ.ఓ. ఉండాలి. మన నిర్ణయాల వెనుక ఎమోషన్స్ కూడా ఉంటాయి. మనం సంతోషంలో తీసుకొనే నిర్ణయాలకు, బాధలో తీసుకొనే నిర్ణయాలకు తేడా ఉంటుంది. జడ్జి ఒకరే. ఆకలిలో, చిరాకులో ఎక్కువ శిక్ష వేస్తారు. సంతోషంలో తక్కువ వేస్తారు. మన మెదడు కూడా జడ్జిలాంటిదే. మన శారీరిక, మానసిక స్థితులు ఎమోషన్స్‌ను నిర్ణయిస్తాయి. మన శారీరిక, మానసిక స్థితులకు ఆధారం అనుభవం. తీపి తినాలా, కారం తినాలా అన్నది అనుభవమే చెబుతుంది.

ప్రతి నిర్ణయం వెనుక న్యూరల్ పార్లమెంటులో పెద్ద వాదన జరుగుతుంది. అయితే, మన నిర్ణయం మనం ఎవరన్నదానిమీద ఆధారపడుతుంది.

అయిందానికి, అవాలనుకున్నదానికి అంతరం ఉంటుంది. ఈ అంతరాన్ని పూరించేందుకు మెదడు ప్రయత్నిస్తూనే ఉంటుంది. అందుకు మెదడులో డోపమైన్ పనిచేస్తుంది. ఈ డోపమైన్ ఒకవిధంగా ఎర్రర్-కరెక్టర్ గా పనిచేస్తుంది. అందుకే ఆకాంక్షలను అందుకోవాలంటే, ప్రయారిటైజ్ చేసుకోవాలి. ఏది ముందు, ఏది తరువాత.

వర్తమానానికి, భవిష్యత్తుకీ మధ్య ఎప్పుడూ తగాదాయేనా? రాజీ కుదరదా?

విద్యార్థులకు ఎదురుగా పరీక్షలు. ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్‌లకు బ్రేక్ ఇవ్వాలి. మనసు లాగుతుంది. కానీ ఎదురుగా భవిష్యత్తు. తేడా వస్తే, పరిణామం దారుణం.

అందుకే మన మెదడు ఒక రాజీ కుదిర్చింది. దాన్నే ఉలిసెస్ రాజీ అంటారు. ఫలితంగా పరీక్షల తయారీ సమయంలో సోషల్ మీడియాకు స్వస్తి. పరీక్షల కోసం తయారీ. నో డిస్ట్రాక్షన్.

ఉలిసిస్ రాజీ మనిషి అన్నివేళలా ఒకేలా ఉండడని చెబుతుంది. సందర్భాన్నిబట్టి మన మెదడు నిర్ణయం తీసుకుంటుంది.

నిర్ణయం తీసుకొనే క్షమత మనిషిని ఇతర ప్రాణుల నుంచి వేరు చేస్తుంది. ఆ నిర్ణయమే, మనం ఎవరం? మనం ఏం చేస్తున్నాం? ఎటు వెళ్తున్నాం? మన చుట్టూ ప్రపంచాన్ని ఎలా భావిస్తున్నాం? తెలియజేస్తుంది. రకరకాల ప్రత్యామ్నాయాలను తూకంవేయాలి. లేకుంటే, మనమూ ఇతర ప్రాణుల్లాగే, బేసిక్ ఇన్‌స్టింక్ట్స్ చేతిలో పావుగా మారుతాం. మన మెదడు భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనం. మన మెదడును కుడి, ఎడమ భాగాలుగా విభజించి చూస్తాం. ఏ ఒక్క పనినీ ఏ ఒక్క న్యూరాన్ నిర్వహించలేదు. అదేవిధంగా న్యూరాన్ల మధ్య నిత్యం సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. వీటి మధ్య సహకారం, సమన్వయం లోపిస్తే, ఎపిలెప్సి, ఏలియన్ హేండ్ సిండ్రోమ్ వంటి వ్యాధుల బారిన పడతాం.

అందుకే, కుడి, ఎడమ మెదడులను కలుపుతూ ఒక సూపర్ హైవే ఉంది. దానిని కొర్పస్ కొల్లోసమ్ అంటారు. మనం ఒక బంతిని పట్టుకోవాలంటే, రెండు చేతుల మధ్య సమన్వయం ఉండాలి. అది కొర్పస్ కొల్లోసమ్ ద్వారా సాధ్యపడుతుంది.

మెదడు సరే, మనసంటే ఏంటి? న్యూరాన్లు, సినాప్సస్, ఎలెక్ట్రో కెమికల్ సిగ్నల్స్, హార్మోనులు, ఆక్సిజన్... వీటన్నింటి క్రియాఫలితమే మనసా? ఆలోచనలు, అనుభవాలు, జ్ఞాపకాలు, అనుభూతులు, ఆశలు, దుఃఖాలు, బాధలు, బందీలు... ఇవన్నీ కలిస్తే మనసవుతుందా?

బాహ్యప్రపంచం నుండి ఎలెక్ట్రో కెమికల్ సిగ్నల్స్ కారణంగా మెదడులో జరుగుతున్న భౌతిక, రసాయన క్రియల ఫలితమే ఆలోచన. అందుకు జ్ఞాపకాలు ఉపకరణాలు.

జ్ఞానం, తెలివి, నిర్ణయాధికారం మెదడు మీద ఆధారపడి ఉంటాయి. అలాగే పంచేంద్రియాల ద్వారా వచ్చే సమాచారాన్ని తీసుకొని, రంగు, రుచి, వాసన, ఉష్ణం, శబ్దంగా మెదడు గుర్తిస్తుంది.

మనం మెదడును ఎంత ఎక్కువ ఉపయోగిస్తే, అన్ని మంచి ఫలితాలు వస్తాయి. వాడకపోతే పాడైపోతుంది, అది మెదడైనా, కంప్యూటరైనా.

రోజూ పదునుబెట్టాలి, కత్తి సానబెట్టినట్లు. రకరకాల పనులు కల్పించాలి సానబెట్టడం అంటే.

1) **క్రొత్త విషయాలు తెలుసుకోవడం:** జ్ఞానార్జన కోసం కొత్త విషయాలు ఏం నేర్చుకున్నాం? సైన్సులో, సాహిత్యంలో, సామాజికశాస్త్రంలో, లెక్కల్లో... ఏదైనా కొత్త విషయం తెలుసుకున్నామా?

2) **క్రొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం**: సైకిలు తొక్కడం, కంప్యూటర్ వాడడం, ఎలెక్ట్రికల్, మెకానికల్ పనులు, వ్యవసాయ పనులు.... ఏమైనా కొత్త నైపుణ్యాలు నేర్చుకున్నామా?

3) **కళల సాధన**: సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, నాటకాలు వేయడం..... ఏమైనా సాధన చేశామా?

4) **ఆటలు, పాటలు**: కబాడీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్‌వంటి ఆటలేమైనా ఆడామా?

సినిమా పాటలు, భక్తి పాటలు, పద్యాలు.... ఏమైనా పాడామా?

5) **కొత్త వ్యక్తులను కలవడం**: మనం కొత్త వ్యక్తులను, మంచివారిని, నిష్ణాతులను, కళాకారులను, సమాజ సేవకులను.... ఎవరినైనా కలిసామా?

6) **క్రొత్త ప్రదేశాలు చూడడం**: ధార్మిక స్థలాలు, చారిత్రక స్థలాలు, రమణీయ స్థలాలు, నదులు, సముద్రాలు.... వంటివి ఏమైనా చూశామా?

7) **క్రొత్తవి తినడం**: రోజూ తినే ఇడ్లి, దోశ, అన్నం, కూరలు కాకుండా కొత్త రుచి ఏదైనా ప్రయత్నించామా?

8) **క్రొత్తవి వినడం**: ఎప్పుడూ వింటున్న సోది కాకుండా క్రొత్తది, అంటే.... పరదేశి భాషలో పాటలు, జోకులు, పక్షుల కిచకిచలు, జలపాత నాదాలు, సముద్ర హోరులు....ఏదైనా విన్నామా?

9) **ప్రశంసించుకోవడం**: రోజులో ఎన్నిసార్లు నిన్ను నువ్వు మెచ్చుకున్నావ్? ఎప్పుడెప్పుడు నీ పనికి నువ్వు శభాష్ అన్నావ్?

అప్పుడు కదా మన మెదడుకు పదునెక్కుతుంది. అప్పుడు కదా మన మెదడులో కొత్త ఆలోచనలు పరుగెత్తుతాయి.

ప్రతి నెలా మొదటి తారీఖున లెక్కలు వ్రాయండి. వీటిలో మనం ఏం చేశాం? ఏం చేయలేదు? నెల నెలా లేదు అని సంవత్సరం గడిచిపోయిందంటే, మన మెదడులో అంత శక్తిని కోల్పోయామని అర్థం. రెండేళ్లు, మూడేళ్లు అలాగే కాలక్షేపమయితే మన మెదడు ఎందుకూ పనికిరాదు.

అందుకే స్పానిష్ కవి పాబ్లో నెరుడా అంటారు -

నీ భద్రతను వదలి / అనిశ్చితిలోకి
నువ్వు అడుగు పెట్టనప్పుడు..
నువ్వు మెల్లగా మరణించడం
మొదలు పెడతావు

కిల్లాడ సత్యనారాయణ
ఉత్తరప్రదేశ్. ఫోన్: 833 398 7838.

ఆకాశం

– బి. రఘురామరాజు

ఆకాశం ఎప్పుడూ
అంతుచిక్కని ఓ రహస్యమే!
పగలు, తలెత్తి తనవేపు చూడకుండా
జాజ్వల్యమానమైన సూర్యుణ్ణి
తిలకంలా నొసట ధరిస్తుంది!
రాత్రి, నక్షత్రాల చమ్కీ పొడిని
ముఖాన అద్దుకుని, చల్లగా
చీకటి వల విసిరేస్తుంది!
కొన్నిసార్లు తెల్లనీ, కొన్నిసార్లు నల్లనీ
మేఘాల పరికిణీ కప్పుకుని
లేని ఆశలు సృష్టిస్తుంది!
కొన్నిసార్లు ఏదీ లేకుండా
దిగంబరంగా మారి, మోహముగ్ధుల్ని చేస్తుంది -
ఉండి కూడా లేనట్లు ఉనికి చాస్తోందా?
లేకుండానే ఉన్నట్లు మాయ చేస్తోందా?
పంచభూతాల్లో ఒక్క ఆకాశమే
మనిషిలా అయోమయంలో పడవేస్తోంది!

బి. రఘురామరాజు, హైదరాబాద్. ఫోన్: 789 378 8326.

".... పసిడికొమ్మ *మనిమి* బొమ్మ అయిన నవంబర్ - 2020 పత్రిక మా ఇంటిల్లిపాదినీ ఆకట్టుకున్నది. *మనిమి* సృష్టికర్త రవీంద్రనాథ్‌గారి 99వ జన్మదిన సందర్భంగా మధురవాణితో భేటీ, తనయుడు బాపన్నగారి జ్ఞాపకాలు ప్రముఖ సాహితీవేత్తల రవీంద్ర స్మృతులు బాగా ఆకట్టుకున్నాయి. నాలాంటి ఈ తరంవారికి *మనిమి* వెనుక ఇంతటి కథాకమామీషు ఉన్నాయా అని ఆశ్చర్యం అయింది. రాళ్లెత్తిన కూలీలను గురించి తెలుసుకోవాలోయ్ కట్టడాన్ని కాదు అనే నానుడి నిజమైనదే. రంగుల రారాజులు శంకర్ (ఇటివీలే స్వర్గస్తులైనారు) చిత్రాలు, వ.పా. గార్ల గురించి బాలిగారు చాలా విషయాలు వ్రాశారు. ఆర్భాటమే గిట్టని మౌనముని పాపయ్యగారు తన రంగుల కుంచెలతో బొమ్మల సామ్రాజ్యానికి రారాజుగా వెలగటం ఆశ్చర్యకరమేకదా! బహుశా రంభ, ఊర్వశి, మేనకలు పాపయ్యగారి బొమ్మలు చూసి తమ కట్టు బొట్టు నేర్చుకొని ఉంటారు. మన దేశంలోని జానపద నృత్యాల వివరాలు నిజంగా అపురూపేయాలు అనడం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. అపురూప విశేషాలను వేణుగోపాలరావుగారు అందజేస్తూ మహావిదుషీమణి శ్రీమతి కపిలవాయి వాత్సాయన్‌గారికి అంకితమివ్వడం సమయోచితంగా ఉన్నది. ప్రవాస సాహిత్యంలో అంతర్జాతీయ కుటుంబ వ్యక్తులే రాణించటానికి కారణం జన్యుసంబంధమైన మూలముతోపాటు వివిధ నైసర్గిక సామాజిక సమస్యల ప్రత్యక్ష అనుభవాలు కారణం కావచ్చు. అనితా దేశాయ్, కిరణ్ దేశాయ్‌ల సాహిత్య కృషి భారతీయ స్త్రీమూలాలు కలిగి ఉండటం మన గర్వకారణము. ఈనాటి సినిమా పాటల బీటు, వాయిద్యాల హోరులో ప్రేక్షకులు ఉక్కిరిబిక్కిరై ఇంటర్‌వెల్ ముందు విన్న పాటను శుభం కార్డు పడేవరకూ కూడా గుర్తుపెట్టుకొనే పరిస్థితులు వచ్చాయి. అలాంటిది ఎక్కడో ఒక పాటలో ఉన్న కొద్దోగొప్పో సంగీత శాస్త్రీయతలను వెలుగులోకి తీసుకువచ్చి పాఠక లోకానికి ముఖ్యంగా సంగీత ప్రియులకు తెలియజెప్పాలి అనే ఉద్దేశం ఎంతో అభినందనీయము. రెండువేల సంవత్సరాలనాటి తమిళ కవి తిరువళ్లువర్‌ను గురించి తెలియజేశారు. ఆనాటి సమాజంలోని హిందూ-ముస్లిమ్ మతపరమైన దాడులు నిరసిస్తూ నైతిక విలువలకు కట్టుబడి దురాచారాలను ఖండిస్తూ ప్రజాకవులైన కబీరు-వేమనలు సమాజ శ్రేయస్సు పరమావధిగా సాహిత్య ప్రక్రియను చేపట్టి నేటి అభ్యుదయవాద రచయితలకు మార్గదర్శకం అయ్యారు. వీరి ముగ్గురి గొప్పతనాన్ని పాశ్చాత్య పండితులు వెలుగులోకి తేవడం గమనార్హం. లక్ష్మీఅయ్యర్‌గారు అమూల్యమైన వ్యాసాన్ని అందించారు. తిరువళ్లువర్ జైనమతస్థుడని, సెయింట్ థామస్ శిష్యుడని కొన్ని వాదనలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా ముగ్గురు సగటు మానవుని హితైషులే. వీరు వ్రాసిన శతకాలైనా ఇతర రచనలైనా సమకాలీన సమాజానికి ఉపయోగపడేవే. శతకసాహిత్యం బాగుంది. ఇదివర లోగడ ఇలాంటి వ్యాసాలు చదివాము. ఎవరు ఏది చెప్పినా సమాజ శ్రేయస్సే పరమావధి. రవీంద్రబాబుగారు బాగానే వర్ణించి, వర్గీకరించి చూపారు. కళాకారులలో సాధారణంగా సున్నిత మనస్కులు ఎక్కువగా ఉంటారు. ప్రతి చిన్న విషయానికి ఎక్కువగా ప్రతిస్పందిస్తుంటారు. అందుకే ఇతర మానవులకన్నా తమదైన కోణంలో చూసి, ఆలోచించి తమదైన కళద్వారా ప్రపంచానికి తెలియజేస్తుంటారు. బహుశ ఇదికూడా ఒక అంగవైకల్యంలాంటిదేమో! జన్యుపరంగా వచ్చే ఈ లోపాలు ఇతర అంశాలకు ఎక్కువ ప్రేరణ ఇస్తాయని శాస్త్రజ్ఞుల ఉవాచ. విదేశీ వ్యక్తుల విషయాలతో పాటు మన దేశ కళాకారుల విశేషాలు వివరిస్తే మరింత ఆకట్టుకునేది వ్యాసం. ఇక ఆఖరుగా మీరు వ్రాసిన 'అస్తిత్వ వేదనలు' ఈ నెల *మనిమి*కి హైలైట్. ఫ్రెంచ్ కటింగ్ గడ్డంతో మోడ్రన్‌గా ఉండే మీలో ఇంతటి ఆధ్యాత్మికత, తాత్వికత ఉండటం నిజంగానే ఆశ్చర్యమేకాక ఆనందంగా ఉంది. ప్రతి వ్యక్తి నేర్చుకోవలసిన, తెలుసుకోవలసిన, గుర్తుంచుకోవలసిన అమ్మ మూలాలు, నేనెవరిని, పుట్టినందుకు మన కర్తవ్యమేమిటి? అనే ఆత్మప్రబోధం మీ రచనలో నిండుగా ఉన్నది. 'రజ్జు సర్ప భ్రాంతి'లో రాజారావుగారి ఆలోచనలను అద్భుతంగా తెలుగువారికి అందజేస్తున్నది. మేథోజీవులైన మీకు మరొక్కమారు ధన్యవాదాలు చెబుతూ ముగిస్తున్నాను.."

జన్నాభట్ల నరసింహప్రసాద్, హైదరాబాద్

గురుదేవుడు గురజాడ

– పిల్లా తిరుపతిరావు

'గురజాడ' బంధం పెనవేసుకుందిలా...

అందరిలాగానే చిన్నతనంలోనే గురజాడ సాహిత్యంతో బంధం ఏర్పడింది. 80వ దశకంలో నేను ప్రాథమికోన్నత విద్యనభ్యసిస్తున్న రోజులవి. ఆనాడు కొన్ని తరగతులలో తెలుగు పాఠ్యాంశాలుగా పూర్ణమ్మ కథ, కన్యక గేయకథలు ఉండేవి. అంతకు మునుపే అనగా ప్రాథమిక విద్యాభ్యసన దశలోనే గురజాడ అప్పారావు గారి 'దేశభక్తి' గేయం కూడా పాఠ్యాంశంగా ఉండటం విశేషం. మా తెలుగు ఉపాధ్యాయులు ఆయా గేయాలను శ్రావ్యంగా ఆలపించడంతో, అప్పారావు గారి రచనలపై స్వతహాగా ఆసక్తి ఏర్పడింది. మరీముఖ్యంగా ఆనాడు తెలుగు భాషపట్ల నాలాంటి మమకారం ఉన్న విద్యార్థులకు ఆసక్తి కాస్త మెండుగానే ఉండేది. ఆ విధంగా ఆ పసితనపు ప్రాయంలోనే ముత్యాల సరాల నడకలు మమ్ము ముందుకు నడిపించాయి. కంఠస్థం చేసి పదేపదే ఆయా గేయాలను ఆలపించడం ద్వారా ఆ కొత్త ఛందస్సు తల్లిలా మమ్మల్ని హత్తుకుని ముద్దాడింది. తండ్రిలా ఆదరించి ఓలలాడించేది. అలా గురజాడ సాహిత్యంతో ఎంతో సాన్నిహిత్యం పెరిగి, గురజాడ పూర్తి సాహిత్యాన్ని చదవాలనే కోరిక మమ్మల్ని నిత్యమూ వెంటాడేది. నాటక రాజం కన్యాశుల్కాన్ని చూసిందీ, చదివింది మాత్రం డిగ్రీ చదువుతున్న రోజులలోనే. విజయనగరం జిల్లా, గరివిడి ఫెర్రో అల్లాయిస్ కర్మాగారం యాజమాన్యం వ్యవస్థాపన చేసిన ప్రతిష్టాత్మక శ్రీ దుర్గా సరోజ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్, శ్రీరామ్‌నగర్‌లో ఆనాడు విద్యార్థిగా చదవడం అంటే, పిల్లలు గౌరవంగా భావించేవారు. కూతవేటు దూరంలో గురజాడ చదువుకున్న చీపురుపల్లి గ్రామం ఉంది. గురజాడ నివసించిన గులివిందాడ అగ్రహారంలోగల ప్రభుత్వ వసతి గృహంలో నేను చదువుకోవడం యాదృచ్ఛికమే కావచ్చు. అందుకేనేమో గరివిడిలో బి.కాం., చదువుతున్న రోజుల్లో కళాశాల గ్రంథాలయం నుండి 'కన్యాశుల్కం' నాటకం తీసుకుని చదవడం ప్రారంభించాను. మొదటిసారి చదివేటప్పుడు నాటకంలో వాడిన భాష అర్థం కాలేదు. వైచిత్రి ఏమిటంటే, నేను ఉత్తరాంధ్రవాసిని అయినప్పటికీ, విజయనగర మాండలికాన్ని అర్థం చేసుకోలేకపోయాను. అంటే 80 ఏళ్ల క్రితం రాసిన పుస్తకంలోని మాండలికానికి, 80వ దశకంలో గ్రామీణ ప్రాంతవాసులు మాట్లాడే వాడుక భాషకు గణనీయంగా తేడా ఉందన్నమాట. బహుశా అందువల్లనేమో నాకు అంతగా వంటబట్టలేదు. మరలా రెండోసారి క్షుణ్ణంగా చదివిన పక్షంలో కథాపరంగా అర్థమైంది. కానీ గురజాడ భావజాలం, గురజాడ తాత్వికత, సామాజిక వాస్తవికత, సంస్కరణాభిలాష మొదలగు ప్రయోజనాలు మాత్రం బోధపడలేదు.

గురజాడ అప్పారావు

చిన్ననాటి నుండి తెలుగు భాషపట్ల అభిరుచి ఉన్నందువల్ల పలు తెలుగు ప్రాచీన, ఆధునిక గ్రంథాలను చదువడం అలవాటయ్యింది. అంతేకాని తెలుగుకు సంబంధించి ప్రత్యేకంగా డిగ్రీగాని మాస్టర్ డిగ్రీగాని చేయలేదు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగు మాస్టర్ డిగ్రీ చేయాలనే కోరిక నాకు కలగానే మిగిలిపోయింది. కానీ పలు సామాజిక సంస్థలు, సాహితీ సాంస్కృతిక సంస్థలు, సుదీర్ఘ ఉపాధ్యాయ ఉద్యమ నేపథ్యంలో క్రియాశీలకంగా పనిచేయడంతో అనేక విషయాలు అవగాహనయ్యాయి. దాంతో గురజాడ, శ్రీశ్రీ, చలం, రాయప్రోలు, తాతాజీ, చాసో, రావిశాస్త్రి, దాశరథి, సినారె మొదలగు లబ్ధప్రతిష్ఠులైన సాహితీ మూర్తుల సాహిత్యంపై దృష్టిపడింది. తర్వాత కాలంలో అది నాకు ఎంతో మేలు చేసింది. నా జీవితంలో కొత్త-కొత్త ఆలోచనలు, వైఖరులు ఏర్పడ్డాయి. ఒకప్రక్క విభిన్న మనస్తత్వాలను అంచనావేస్తూ, మరోప్రక్క ప్రాపంచిక దృక్పథం, ప్రగతిశీల భావాలు కూడా అలవడ్డాయి. ఈ క్రమంలోనే గురజాడ సాహిత్యాన్ని చదవడం మొదలు పెట్టాను. శ్రీకాకుళం జిల్లా, రాజాంలో 'వెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ' ఏకబిగువన 2011 నుంచి 2012 వరకు

ఏడాదిపాటు ''మూడు యాభైల గురజాడ'' అనే కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది. దానిలో క్రియాశీలక పాత్ర పోషించినవారు ఓ పదిమంది దాకా ఉంటే, వారిలో నేను ఒకణ్ణి. ఆ సంస్థ నిర్వాహకులు శాసపు రామినాయుడు గారి ఆధ్వర్యంలో ప్రతి నెలా జరిగే సమావేశాల్లో ప్రఖ్యాతినొందిన సాహితీవేత్తలను ప్రధాన వక్తలుగా ఓ చిన్న పట్టణానికి తీసుకువచ్చి, సిక్కోలు సాహితీ ప్రియులకు పరిచయం చేయడం సామాన్య విషయం కాదు. నెల నెలా వచ్చినవారిలో ప్రముఖ కవి వరవరరావు, *ఆంధ్రజ్యోతి* సంపాదకులు కె. శ్రీనివాస్, సామాజిక రచయిత ఎన్. వేణుగోపాల్, జానపద వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న, సినీనటులు కాకరాల మరియు జె.వి. రమణమూర్తి, విమర్శకులు రామతీర్థ, రచయిత్రి జాజుల గౌరీ, విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు రమేష్ పట్నాయక్, ఉత్తరాంధ్ర కవులు అట్టాడ అప్పలనాయుడు మరియు గంటేడ గౌరి నాయుడు ప్రభృతులు గురజాడపై ప్రసంగించిన ప్రసంగ పాఠాలను 'మూడు యాభైల మన గురజాడ' పేరిట ఒక పుస్తకంగా రూపొందించి ముద్రించడం సంస్థ చేసిన గొప్ప కార్యమేనని చెప్పవచ్చు. ఆ గ్రంథం నేడు ఎందరో పరిశోధక విద్యార్థులకు మార్గదర్శిగా నిలుస్తున్నది. ఆ మహోన్నత కార్యక్రమంలో పాలుపంచుకునే భాగ్యం కలిగినందుకు వెలుగు సంస్థ, రాజాంకు ఎంతో రుణపడి ఉంటాను. ఈ సందర్భంగా నెలనెలా రాజాంలో *కన్యాశుల్కం* నాటకాన్ని సీన్లవారీగా ప్రదర్శించడం ఒక ఎత్తైతే, కార్యక్రమ ప్రారంభపు నెలలో విజయనగరంలోనూ, సంవత్సరాంతమున జరిగిన ముగింపు ఉత్సవాలలో భాగంగా విశాఖపట్టణంలో *కన్యాశుల్కం* నాటకం పూర్తి ప్రదర్శనను సంస్థ నిర్వహించడం గొప్ప విషయమే. విశాఖలో జరిగిన నాటక ప్రదర్శనను తిలకించడానికి ఇసుకేస్తే రాలనంత జనం రావడం విశేషం. అంటే నేటికీ *కన్యాశుల్కం* నాటకానికి ప్రజాదరణ తగ్గలేదని చెప్పడానికి ఈ ఒక్క సంఘటన చాలు. ఈ క్రమంలోనే గురజాడ సాహిత్యం కథ, గేయ ప్రక్రియలకు సంబంధించిన పుస్తకాలను కొనుగోలు చేయడం, అసాంతము చదవడం ద్వారా గురజాడ బంధం మరింత బలపడిందనే చెప్పాలి. దీనిలో భాగంగానే కె.వి. రమణారెడ్డి గారి 'మహోదయం' గ్రంథం పఠించాను. విరసం వ్యవస్థాపక కార్యదర్శి మరియు అధ్యక్షులు కె.వి.ఆర్., వారి సతీమణి శారదాంబ పేరిట 'కె.వి.ఆర్.; శారదాంబ స్మారక కమిటీ,' విజయవాడ వారు *మహోదయం* అనే గ్రంథాన్ని గురజాడ పుట్టి 150 యేళ్లు అయిన సందర్భంగా ఆవిష్కరించారు. గురజాడ జీవిత సాహిత్యాలపై కె.వి.ఆర్. రాసిన *మహోదయం* నేడు తెలుగు సాహితీ లోకంలో ఉత్తమ గ్రంథంగా భాసిల్లుతోంది. అది చదివిన నేను గురజాడ వ్యక్తిత్వం, గురజాడ సాహిత్యంలోని లోతులను గ్రహించాను. కె.వి.ఆర్. *మహోదయం* చదివితే, ఎలాంటి వ్యక్తి అయినా గురజాడ సాహిత్యానికి బానిస కాక తప్పదు. అంతలా గురజాడ సమగ్ర మూర్తిమత్వాన్ని, సాహితీ కోణాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.వి.ఆర్. *మహోదయం* లోని కొన్ని అంశాలను స్పృశిద్దాం.

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని అత్యంత ప్రభావితం చేసిన కవిగా ముందువరుసలో గురజాడ అప్పారావుగారే ఉంటారు. సమకాలీన సంఘటనలు కావ్య వస్తువులుగా ఎంచుకొని రచనలు చేపట్టడంలో గురజాడది అందెవేసిన చేయి. సంస్కరణవాదిగా, సాంఘిక మార్పు ఆకాంక్షించిన వ్యక్తిగా, సామాజిక వాస్తవికతకు పెద్దపీట వేస్తూ, ఎన్నో రచనలను వెలువరించారు గురజాడ. కన్యాశుల్కం కోసం ముక్కుపచ్చలారని బాలికలకు ముదుసలి మొగుడుకు కట్టబెట్టే తల్లిదండ్రుల దురాచారాన్ని ఎండగడుతూ, *కన్యాశుల్కం* నాటకానికి శ్రీకారం చుట్టారు గురజాడ. ఆనాటి విజయనగర సామ్రాజ్య ప్రాంతములో ఒక నివేదిక ద్వారా గజపతులు ఈ కన్యాశుల్కం హెచ్చుస్థాయిలో సమాజంలో పేరుకు పోవడాన్ని గ్రహించారు. వారి సూచన మేరకు గురజాడ *కన్యాశుల్కం* నాటకం రాయడానికి పూనిక వహించారు. దాదాపు 3000 సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు భాష అనేక చారిత్రక కారణాలవల్ల ఇతర భాషల ఆధిపత్యం కింద నలిగిపోయింది. ఆ పరిస్థితిని గమనించిన గురజాడ తన మిత్రుడు గిడుగుతో కలసి వ్యవహారిక భాషోద్యమంలో పాలుపంచుకున్నారు. వాడుక భాషలో వివిధ రకాల రచనలు చేపట్టి తెలుగు భాషా సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు గురజాడ. ఆనాటి కాలంలో ప్రజలు ఎక్కువగా ఇష్టపడేవి నాటకాలు. నాటకానికి శక్తిమంతంగా ప్రజల్లోకి

చొచ్చుకుపోయే గుణముందని గ్రహించిన గురజాడ ఒక కళాత్మక సాహితీ సౌధాన్ని నిర్మించాలనే కల కన్నాడు. దాని నుండి ఉద్భవించినదే అద్వితీయమైన సాహితీ సాంస్కృతిక కళారూపం *కన్యాశుల్కం* నాటకం. *"తెలుగులో నవ్య రీతులకు, నూతన ప్రమాణాలకు ప్రయత్నించిన మొదటి కవిని నేనే. నా కావ్యకళ నవీనం, కావ్య ఇతివృత్తాలు భారతీయం. కవితలో నేను ఉత్తమ ప్రయోజనాలు ఉపలక్షించాను. జీవితాన్ని నూత్న దృక్పథంతో దర్శించి; కథా, కవితా రూపంలో దాని తత్వాన్ని అందించడానికి ప్రయత్నించాను. నాకా కళల పట్ల, జీవితం పట్ల కొన్ని ఆదర్శాలు ఉన్నాయి. వాటిని సంస్కృతి పరులు మాత్రం అర్థం చేసుకుని హర్షించగలరు. సంస్కృతి శూన్యులు కావ్య కథా సంవిధాన, హాస్య ధోరణులను గమనించి అంతటితో సంతృప్తిపడతారు"* అని సగర్వంగా తన కావ్యాల గురించి గురజాడ రాసుకున్నారు. ఛందస్సు దేశితనం, కావ్యభాష సౌలభ్యం, ఇతివృత్తాల నవ్యత్వం, సమకాలీనత్వం, ఉపదేశ బలం ఇదంతా గురజాడ, కవి లోకానికి పెట్టిన భిక్ష. 'ఆగ్రహాన్ని, ఆవేశాన్ని, అసహనాన్ని దరికి చేరనివ్వక, చిరునవ్వులతోనో, ఎత్తిపొడుపులుతోనో, కన్నీళ్లు నిండిన కమ్మని గేయకథలతోనో, కథలతోనో ఆయన ఇతరులను సంస్కరింపబూనాడు. ఆయన సంస్కరింపబూనిన వాళ్లలో పలువురు సంఘసంస్కర్తలు కూడా ఉండడం విశేషం. అందుకే ఆయన సంఘసంస్కర్తల భావసంస్కర్త అయ్యారు. చెళ్లపల్లి వెంకట శాస్త్రి పద్యాన్ని సులభతరం చేశారు. గేయాన్ని పైకెత్తింది మాత్రం గురజాడే. గేయంలో వాడుక మాటలను విస్తృతంగా ఇమిడ్చి, కావ్య గౌరవం కలిగించినవారు, రసస్ఫూర్తికి గ్రాంథిక పదజాలంకంటే వాడుక మాటలే ఎక్కువగా ఉపకరిస్తాయని కె.వి.ఆర్. తన మహోదయంలో ప్రస్తావించారు. గురజాడ అప్పారావుగారు రాసిన గేయాలన్నింటిలోకీ విశేష ప్రజాదరణ పొందిన గేయం 'దేశభక్తి'. తెలుగు జాతి అనధికార జాతీయ గీతమై నేటికీ ప్రజల నాల్కలపై తాండవించడం విశేషం. బంకించంద్ర వందేమాతరం గేయం, రవీంద్రుని జనగణమన గీతాల సరసన నిలిచే ఏకైక గేయం 'దేశభక్తి'యే. ఆ మహనీయుల గీతాలకంటే సార్వజనీనమైన లక్షణం, ప్రాపంచిక దృక్పథం గురజాడ దేశభక్తి గేయానికే ఎక్కువుందని అనడంలో సందేహం లేదు. అందుకే శ్రీశ్రీ "రామాయణ భారతాది ఇతిహాసా లకున్న విలువ ఈ ఒక్క గీతానికే ఉన్నదని, ఇది మహాకావ్యమని, ఆధ్యాత్మిక యాత్రలో భగవద్గీతకు గల స్థానమే దీనికున్నదని, సార్వకాలికమూ సార్వలౌకికమూ అయిన సందేశాన్ని ఇస్తున్న ఈ రచన 'పావురంలాగ ప్రశాంతంగా రవళిస్తూనే, సింహం చేసే క్ష్వేళాధ్వనిని స్ఫురింపజేస్తుంది; 'ఏక కాలంలో ప్రభు సమ్మితంగాను, కాంతా సమ్మితంగాను కూడా' మానవత్వాన్ని ఉపదేశిస్తున్నదని" అన్నారు.

జె.ఎ. ఏట్స్ దొర గురజాడ గురించి ప్రస్తావిస్తూ, "భవిష్యత్తులో ఒక ఏడాది పైబడుతున్న కొద్దీ, గడిచిపోయిన రోజులను వెనక్కి తిరిగి చూసుకునేటప్పుడు, తెలుగువాళ్లు గురజాడకు నమ్రతతో, గౌరవంతో జోహార్లు అర్పిస్తారు. 'దక్షిణ భారతదేశంలోగల మేధావులు, పండితులలో ప్రథమ శ్రేణికి చెందిన వ్యక్తి గురజాడ" అని మార్క్ హంటర్ అంటారు. శ్రీశ్రీ మాటల్లో "ఏ కవి యొక్క ఆవిర్భావంవల్ల, ఈ ప్రపంచం ఇంకో అడుగు ముందుకు వేసిందో! ఆ కవే మహాకవి" గురజాడ అడుగుజాడలే గురుజాడగా భావించి ఎందరో కవులు, రచయితలు సాహితీ బాటలు నిర్మించుకున్నారు. అందుకే గురజాడ యుగపురుషుడు, మహాకవి కాగలిగారు.

1862 సం. సెప్టెంబర్ 21వ తేదీన విశాఖ జిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో తన తాతగారింట గురజాడ వెంకట అప్పారావుగారు జన్మించారు. ఆయన తల్లిదండ్రులు వెంకటరామదాసు, కౌసల్యమ్మ పుణ్యదంపతులు. ఉద్యోగరీత్యా తండ్రి చీపురుపల్లి వెళ్లడంతో గురజాడకు 10 ఏళ్ల వయసు వచ్చిన వరకు అక్కడనే విద్యాభ్యాసం కొనసాగించారు. 1872-1882 మధ్య విజయనగరం మిడిల్ స్కూల్లో, 1882లో మెట్రిక్యులేషన్, 1882-84 వరకు ఎఫ్.ఎ. అభ్యసించారు. 1882లో కక్కూ ఆంగ్ల రచన, 1883లో విద్యార్థి దశలోనే ఇంగ్లీషులో 'సారంగధర' కావ్యరచన చేశారు. ఆ సమయంలోనే తమ్ముడు శ్యామలరావుతో కలిసి విజయనగరంలో నిర్వహించబడుతున్న 'ఇండియన్ లీజర్ అవర్, తెలుగు హార్స్' పత్రికలకు తరచూ ఇంగ్లీష్ పద్యాలు రాసేవారు. మొదటిసారి ఇండియన్ లీజర్ అవర్ పత్రికలో అచ్చయిన సారంగధరను, 'రీస్ అండ్ రయ్యత్' అనే శీర్షికన

వెలువడే ప్రముఖ కలకత్తా పత్రికవారు చూసి రెండోసారి తమ పత్రికలో ప్రచురించారు. ఆ పత్రికాధిపతి శంభుచంద్ర ముఖర్జీ ఎంతో ప్రోత్సహిస్తూ గురజాడకు ఉత్తరం రాశారు. దాంతో ఇద్దరి మధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాయి. ప్రారంభంలో గురజాడను ప్రోత్సహించినవారు ఇండియన్ లీజర్ అవర్ సంపాదకులు గుండుకుర్తి వెంకటరమణయ్య, ముఖర్జీలే. 1884-86 మధ్య బి.ఎ. తత్వశాస్త్రం మరియు సంస్కృతం విద్యార్థిగా విజయనగరం మహారాజా కళాశాలలో చదివారు. అప్పల నరసమ్మతో 1885లో గురజాడకు వివాహం జరిగింది. అప్పటికే మహారాజా కాలేజీ హైస్కూల్లో 25 రూపాయలకు ఉపాధ్యాయ వృత్తి చేస్తున్న గురజాడ, 1886లో ఉద్యోగానికి సెలవు పెట్టి, డిప్యూటీ కలెక్టర్ ఆఫీసులో ఉద్యోగం చేశారు. 1887లో మహారాజా కళాశాలలో నెలకు 100 రూపాయల జీతానికి నాలుగో లెక్చరర్‌గా చేరారు. ఆ సమయంలోనే మహారాజు ఆనందగజపతితో పరిచయం ఏర్పడింది. అదే ఏడాది స్థానిక కాంగ్రెస్ మీటింగ్‌లో పాల్గొనడం, ఇంకా విక్టోరియా రాణి ప్రశంసా పద్యాలను ఇంగ్లీషులో రాశారు కూడా. 1887లో ప్రథమ సంతానం, కుమార్తె ఓలేటి లక్ష్మీనరసమ్మగారు జన్మించారు. 1888లో విశాఖపట్టణం స్వచ్ఛంద సేవా దళంలో సభ్యత్వం స్వీకరించారు. 1889లో ఆనందగజపతి ఆస్థానం డిబేటింగ్ క్లబ్బుకు ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. 1890లో ద్వితీయ సంతానం, కుమారుడు వెంకటరామదాసు జన్మించారు. ఆ తర్వాత 1891లో నెలకు 125 రూపాయలు జీతానికి మూడవ లెక్చరర్‌గా పదోన్నతి పొందారు.

1892లో మద్రాస్ లా కళాశాలలో చదువుతున్న తమ్ముడు శ్యామలరావు మరణించారు. 1892 ఆగస్టు 13న 'జగన్నాధ విలాసినీ' సభచే *కన్యాశుల్కం* నాటకం మొదటి కూర్పు ప్రదర్శన జరిగింది. 1897లో *కన్యాశుల్కం* తొలి కూర్పును ఆనంద గజపతికి అంకితమిచ్చారు. అప్పుడే పీఠిక, ముద్రణ విషయాలలో గ్రాంథిక భాషను ఇమడ్చడంలో ఉండే ఇబ్బందులను మరియు జీవద్భాషను కావ్యభాషగా ఉంచడంలో కలిగే లాభాలను సవివరంగా తెలియజేశారు. దీనిలో భాగంగానే వాడుక భాషను సాహిత్య భాషగా అంగీకరిస్తూ, నవ్య ఆధునిక భాషకు అంకురార్పణ జరిగింది. 1897లో ఆనంద గజపతి మరణించారు. రాజు-బంటు అనే భేదం లేకుండా ఆనందగజపతి వారికి అప్పారావు గారికి అపూర్వమైన స్నేహబంధం కొనసాగేది. ఆనాడు సాహిత్య, సామాజిక, రాజకీయ విషయాలపై గురజాడ, గజపతులు మధ్య ఆసక్తికర చర్చలు జరిగేవి. దాంతో రాజావారి మరణాన్ని గురజాడవారు ఆహ్వానించలేకపోయారు. తనని అందలం ఎక్కించిన ఆత్మబంధువు పరమపదించడం గురజాడను కొన్నాళ్లపాటు కలచివేసింది. రాజావారి ఆప్తమిత్రుడిగా మన్ననలు పొందిన గురజాడ అనివార్యంగా 1898లో ఆనందగజపతిగారి అక్క రీవారాణిగా పేరుగాంచిన అప్పలకొండయాంబకు ఆంతరంగిక కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆనందగజపతి మరణంతో ఆస్తి కోసం దాయాదులు దావా వేశారు. దావాను నడిపించే భారమంతా గురజాడ మీదనే పడింది. 1902లో తృతీయ సంతానం కుమార్తె పులిగెడ్డ కొండయ్యమ్మ పుట్టారు. 1905లో తన తండ్రి మరణించారు. 1906లో కొండుభట్టీయం, 1907లో నీలగిరి పాటలు ప్రచురణ జరిగింది. 1909లో *కన్యాశుల్కం* రెండూ కూర్పు ప్రచురణ జరిగింది. ఆ సంవత్సరం నవంబర్ నెలలో సకల కులాల వారితో బరంపురంలో సహపంక్తి భోజనం చేయడం అప్పట్లో చారిత్రాత్మకం. 1910 ముత్యాల సరాలు, కాసులు, ఆధునిక గీతాలు, ఇతర వ్యాసాలు మరియు ఆధునిక కథలైన మీ పేరేమిటి, దిద్దుబాటు, మెటిల్డా, సంస్కర్త హృదయం మొదలగు కథలు ప్రచురించడం జరిగింది కూడా. 1911లో మద్రాసు యూనివర్సిటీలో బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో సభ్యత్వం పుచ్చుకున్నారు. 1912లో రీవారాణి మరణం. 1913లో మద్రాసు విశ్వవిద్యాలయం 'ఫెల్లో' పదవినిచ్చి గౌరవించింది. 1914 నుంచి అనారోగ్యం గురజాడను వేధించింది. అనారోగ్య పరిస్థితుల్లో కూడా 'దించులంగరు, లంగరెత్తుము' అనే రచనలను చేపట్టడం విశేషం. 1915లో గురజాడ కుటుంబం నూతన గృహప్రవేశం చేశారు. సంవత్సరంపాటు కూడా నూతన గృహానందాన్ని గురజాడ పొందలేకపోయారు. నవంబర్ 30వ తేదీన ఆయన సాహితీ లోకాన్ని విడిచి శాశ్వత నిద్రలోకి జారుకున్నారు.

పిళ్లా తిరుపతిరావు, రాజాం. ఫోన్: 709 518 4846.

'పర్వ'ను నడిపిన స్త్రీమూర్తులు

– సి. హెచ్. సుశీల

భారతీయ నవలా రచయితలలో ప్రముఖులైన డా. ఎస్.ఎల్. భైరప్ప గారు కన్నడ భాషలో రచించిన గొప్ప నవల 'పర్వ'. ప్రాచీన వ్యాస భారతానికి ఇదొక ఆధునిక నవలా రూపం. అయితే భారతంలోని మాయలు, మంత్రాలువంటివి నిజంగా సంభవమా అనే హేతువాద దృక్పథంతో ఎంతో పరిశోధన జరిపి భైరప్పగారు ఈ నవలను రచించారు. ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణగారు సామాన్య పాఠకులకు కూడా అర్థమయ్యేలా తేటతెలుగు పదాలతో, చక్కని వాక్య నిర్మాణంతో తెలుగులోకి 'పర్వ' నవలను అనువదించారు. ప్రఖ్యాత కన్నడ నవలా సామ్రాట్టు డా. ఎస్.ఎల్. భైరప్ప గారి అత్యంత ప్రసిద్ధి చెందిన నవల 'పర్వ' ప్రచురణై 40 ఏళ్ళు గడిచాయి. గత సంవత్సరం డిసెంబరులో బెంగుళూరులో భైరప్ప గారి రచనలపై జరిగిన సాహిత్య సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర సాహిత్య అకాడమి అధ్యక్షులు శ్రీ చంద్రశేఖర కంబార మాట్లాడుతూ "భైరప్ప గారు వ్యాస భారతంలాంటి మహా కావ్య కృతిని 'పర్వ' నవలగా రాసి ఎన్నో శతాబ్దాల మన సంప్రదాయాన్ని రక్షించారు. దాని ద్వారా మనలను ఒక గొప్ప సాంప్రదాయానికి వారసులుగా చేశార"న్నారు. ఉపాధ్యక్షులు డా. మాధవ్ కౌశిక్ మాట్లాడుతూ "భైరప్ప వ్యాస భారతాన్ని భారతీయ దృష్టి కోణంలో రచించారు. ఇతరులు రాసిన మహాభారత రచనలకంటే భైరప్పగారి కృతి భిన్నమైనది. పాఠకులకు ఆప్తమైనది. ప్రతి పాత్ర అంతరాళాన్ని భైరప్ప చూపిన రీతే ఈ కృతికి నవ్యతకు కారణం" అన్నారు.

మహాభారతం అంటే దాయాదుల యుద్ధం, రాజ్యాధికారం కోసం జరిగిన యుద్ధం అనుకొంటారు. కాని, అసలేం జరిగింది అని భైరప్పగారు కొన్ని ఆధారాలతో, హేతుబద్ధమైన ఆలోచనలతో ఈ నవల రాసి, కొన్ని ఊహించని సత్యాల్ని వెలికి తీశారు. ఆయన వెలికి తీసిన ఎన్నో సత్యాల్లో... ప్రధానమైన 'స్త్రీల మానసిక క్షోభ'. ఆనాడు స్త్రీలు మౌనంగా ఎంతటి దుఃఖాన్ని దిగమింగుకున్నారు! తీవ్రమైన కామం తుఫానులో చిక్కుకుని ఊపిరాడక చచ్చిపోయారు కొందరు. రాజకీయ ఒప్పందాలతో సంబంధాలు కలుపుకొని, దానికి 'పెళ్ళి' అనే అందమైన అబద్ధపు పేరు పెట్టి వంచిస్తే, తెలిసి కొంత... తెలియక కొంత నలిబిలి అయిపోయారు కొందరు. ఆర్య... అనార్య... అర్ధార్య అనే ముసుగుల చర్చోపచర్చలవల్ల 'జీవించే' ప్రక్రియ కోల్పోయి 'బ్రతికేశారు' కొందరు. స్త్రీల అశ్రువులతో తడిసి ముద్దయిపోయింది కదా మొత్తం. ఆ కన్నీరు నాడూ నేడూ కూడ కొన్ని ప్రశ్నల్ని సంధిస్తున్నాయి. వాటికి సమాధానాలు నాడూ లేవు, నేడూ లేవు. "ఆనాటి సాంఘిక రాజకీయాలను గుర్తుపెట్టుకొని విమర్శించాలి కానీ, నేటి ఆధునిక



కన్య కుంతి

ధర్మాలతో నాటి భారతాన్ని విమర్శించకూడదు'' అని కొందరు అంటారు. మహాభారతంలోని స్త్రీ పాత్రలను గమనిస్తే ముందుగా స్ఫురించేది.... పృథ, కృష్ణ. భారత కథ మొత్తం వీరి త్యాగంతో, అశ్రువులతో తడిచి ముద్దయిందని చెప్పవచ్చు. తర్వాత ప్రధాన పాత్ర గాంధారి.

అత్యంత ఆధునిక దృక్పథం ఉన్నవారిమి అని చెప్పుకునే కొందరు పృథ గురించి, కృష్ణ గురించి హేళనగా, చులకనతో వ్యాఖ్యానిస్తున్నారు. కానీ, ప్రతికూల పరిస్థితుల్లో కూడ తమ అస్తిత్వం కోసం పెనుగులాడుతూ, మహోన్నత వ్యక్తిత్వాన్ని నిలుపుకోడానికి వారెంతో ప్రయత్నాలు చేశారు. శాస్త్రీయ దృక్పథంతో, తార్కికంగా, హేతుబద్ధంగా పరిశీలించినప్పుడు పృథ, కృష్ణ పలికిన వలుకుల్లో ఉన్న సత్యం గోచరమౌతుంది.

'పర్వ' నవలను పరిశీలిస్తే , భైరప్ప గారి సృజనలో... పృథ! పాండురాజు దౌర్బల్యం తెలిసే 'పృధ'తో వివాహం జరిగింది. అతని నిస్సహాయతకి తోడు ''విపరీత'' మనస్తత్వానికి పృధ శారీరకంగా మానసికంగా ఎంతో హింసను అనుభవించింది. 'శక్తి' వంచన లేకుండా ప్రయత్నించి - ప్రయత్నించి, ఓడిపోయి, అతడు తన 'నిస్సహాయత'ని ఒప్పుకోకుండా పృధని, ఆమె కుటుంబాన్ని ఆడిపోసుకుంటాడు. చివరికి తన నిస్సహాయతని ఒప్పుకొని పృధ ఒడిలో వాలిపోయి బావురుమన్నప్పుడు భూదేవంత పెద్ద గుండెలకు అతన్ని హత్తుకొని, పెద్ద-పెద్ద చేతులతో ఓదార్చింది ఆమే కదా! మద్ర దేశపు స్త్రీలు శృంగార మర్మాలను తెలిసినవారు. వారైనా పాండున్ని ఉద్దీపింపచేయ గలుగుతారని మాద్రిని తెచ్చి వివాహం చేశారు. అంతటి నైపుణ్యంగల మాద్రి కూడ, తన ప్రయత్నాలన్నీ 'నిర్వీర్యం' కాగా పృధ చెంత చేరి విలపించింది. ధృతరాష్ట్రునికి పిల్లలు పుట్టేస్తారేమోనన్న ఆతృతతో రాజ్యం వదిలి, కొండలు గుట్టలు దాటి, ప్రకృతి ఒడిలో, ఆశ్రమంలో, ప్రశాంతమైన మానసిక స్థైర్యం పొందుతూ, దేవగణాలకి చెందిన అశ్వనీ సోదరుల వద్ద శారీరక స్థైర్యం కోసం వైద్యం చేయించుకున్నాడు. ఎన్నాళ్ళిలా ప్రయత్నించడం! ఒక కొడుకు కావాలి, లోకంలో తను తండ్రి అనిపించుకోవాలి అనుకొన్నాడు. 'నియోగ' పద్ధతి ఉంది, అది 'ఆర్య సమ్మతమైంది' అని పృధను ఒప్పించి పర పురుషుడి వద్దకు పంపాడు ఈ ఆర్యపుత్రుడు. ''భర్త అంగీకరిస్తే'' నియోగ ప్రక్రియ తప్పు కాదట. దానికి బదులు, వివాహ పూర్వమే ఆమెకు జన్మించిన కానీనుడు కర్ణుడిని వారు అంగీకరిస్తే పోయేది కదా! ఆర్య సమ్మతం కాదని తెలిసే కదా పృధ భయపడింది, కానీనుని గురించి చెప్పలేకపోయింది. నియోగం అంటే... కేవలం గర్భధారణ కోసమే అని మనసుకు చెప్పుకోవాలట. శరీరం, మనసు స్పందించకూడదట. అక్కడ ఉంది స్త్రీ. ప్రాణం లేని బొమ్మ కాదు. గర్భం ధరించగానే ఆ పరపురుషుణ్ణి తండ్రిగా భావించాలి, ప్రేమ పెంచుకోకూడదు, జీవితంలో మళ్ళీ తలుచుకోకూడదు. ఇదీ నియమం. అప్పుడైనా ఇప్పుడైనా ''ఆమె'' స్త్రీ కాదా! శారీరక, మానసిక స్పందనలు ఉండకూడదా! ఇదేమి 'ధర్మం!' ఈ ధర్మాన్ని నాడూ - నేడూ కూడా మనం నెత్తిన పెట్టుకుని పూజిద్దాం అనడం ఎంతవరకు సమంజసం!

యముడనే దేవగణానికి చెందినవాడు వచ్చినప్పుడు ఎంత సంఘర్షణ పొందింది పృధ! సరే, ధర్ముడు పుట్టాడు. కానీ, పాండునికి మరో (బలమైన) పుత్రుడు కావాలనిపించి దేవగణ సేనాని, మహత్తర బలవంతుడైన మరుత్తుని ఆహ్వానించాడు. మళ్ళీ ఒట్టు, ప్రమాణాలు వేయించి పృధని పంపాడు. మరుత్తు బలమైన చేతుల మధ్య పృధ నిజంగానే శారీరకంగా, మానసికంగా ఆనందించింది. మనస్ఫూర్తిగా ఇద్దరూ ఇష్టపడ్డారు. ''ఇవన్నీ వదిలేసి వచ్చెయ్'' అన్నాడు కూడ మరుత్తు. భయం...! అంతటి పృధ మనసుని కూడ భయం వెనక్కి లాగింది. తన విశాలమైన ఒడి నిండిపోయేంత బలవైన భీముడు జన్మించాడు. అయిందా! ఈ ఉదంతమంతా తెలిసి, పృధ గురించి విని, మోహంతో వచ్చాడు ఇంద్రుడు. భర్త ఒప్పుకోలు అవసరం కదా! ఒప్పించాడు తెలివైన ఇంద్రుడు. రాబోయే మహాసామ్రాజ్యాన్ని జయించే, కాబోయే వీరుడు పుట్టాలిగా అన్న ఆశ పాండు రాజులో. మళ్ళీ ఒట్లు. మళ్ళీ నియోగం. మళ్ళీ సంయోగం. ఈసారి అర్జునుడు. ఇక చాలు. పృధ మనసుని గట్టి చేసుకొని పిల్లల పెంపకంపై కర్తవ్యదీక్ష స్వీకరించింది. మరి మాద్రి! పృధ ఈ క్రియలో ఉన్నప్పుడు పాండురాజు, పిల్లలు ఆమె దగ్గరే ఉన్నారు. అక్కడ ఏం జరుగుతోందో తెలుసు. అసలే మద్రదేశపు శృంగార దేవత. ఆమెకూ ఒక మనసుంది. శారీరక

కోరికలున్నాయి. పాండురాజు, పృధ అనుమతితో అశ్వనీ సోదరులు (వాళ్ళు ఏదైన ఇద్దరూ కలిసే చేస్తారట. హతోస్మి)వల్ల నకుల సహదేవులకు జన్మనిచ్చింది. ఈలోగా పాండురాజులో వైద్యం పనిచేసి, కాసింత శారీరక మానసిక స్థైర్యం పొడచూపినట్లుంది. అతని ఆతృతకు తోడు మద్రదేశపు శృంగార కళలతో ఉన్న మాద్రితో ఏకాంతం! ఫలితం... పాండురాజు విజయంతోనో, పరాజయంతోనో మరణం. దానికి కారణం తానేనన్న పశ్చాత్తాపంతో భర్త నిర్జీవ శరీరంతో పాటు కాలి బూడిదైపోయింది. ఇది త్యాగమా! భయమా! పిల్లలను పెంచలేనన్న నిస్సహాయతా! పృధ అయితే పెంచగలదన్న నమ్మకమా! ఏదైనా, ఒక స్త్రీ జీవితం ఇలా ముగిసిపోయింది.

మళ్ళీ కుంతి వ్యక్తిత్వం మనకు ప్రస్ఫుటంగా కనిపించేది.... భీముడిని హిడింబితో వివాహానికి ఒప్పించడం, "కృష్ణ" ను ఐదుగురు పాండవులకు పత్నిగా ఒప్పించడం... రాబోయే యుద్ధంలో రాక్షస, పాంచాల సైన్యం తమకు అండగా ఉండాలనే. చాలా సందర్భాలలో కుంతి నిదానంగా, ఎంతో ఆలోచించి నిర్వహించింది స్థిరచిత్తయై. పదమూడేళ్ళ తర్వాత వచ్చిన పాండవులు తమతో రమ్మన్నప్పుడు 'యుద్ధంలో జయించి, రాజ్యాన్ని పొంది, నన్ను పిలవండి వస్తాను' అని ఖచ్చితంగా చెప్పింది. కానీనుడైన కర్ణుని కలిసినప్పుడు ఎన్నేళ్ళ నుండో దాచుకున్న వేదన పెల్లుబికింది. అతడు యుద్ధరంగంలో మరణించాడని తెలిసి, రణస్థలి కేగి, పుట్టినప్పుడు జాతక కర్మలు చేయలేదు ఇప్పుడు అంతిమ కర్మలన్నా చేయాలని శవాల మధ్య తన ప్రథమ సంతానం కోసం వెదుక్కుంది, భూదేవంత సహనంగల పృధ. మహాభారతంలో కానీ, భైరప్పగారి కన్నడ నవల 'పర్వ'లో కానీ కుంతి వ్యక్తిత్వం మహోన్నతంగా చూడగలం. ఆచార్య గంగిశెట్టిగారి తెలుగు అనువాదంలో "వాడుకలో ఉన్న తెలుగు పదాలు సహజంగా, అలవోకగా పడ్డాయి. వచన రూపంలో ఉన్నా అంతర్లీనంగా ఒక 'రిధం' కొనసాగింది - మొదటి నుండి చివరివరకు. వాక్యనిర్మాణం సందర్భోచితంగా, ఒద్దికగా ఒదిగిపోయింది కథనంలో. తెలుగువారికి 'పర్వ'ను పదిలంగా అందించడంలో కృతకృత్యులయ్యారు ఆచార్య గంగిశెట్టిగారు.



హిడింబి - భీముడు

కృష్ణ:

కృష్ణ. ఆమె పుట్టినప్పుడు పెట్టిన పేరు. ఆమెను అర్థం చేసుకోవాలంటే బుద్ధివల్లకంటే హృదయంవల్లే అర్థం చేసుకోవాలి. ఒక స్త్రీని ఎంతలా అవమానించాలో, ఎంత దిగజార్చాలో అంతగా ఆమెను అవమానించారానాడు. నేటికీ అవమానిస్తూనే ఉన్నారు. ఆమె తండ్రి దేశం పేరు పేరిట పిలవడం - అంటే ద్రుపద రాజపుత్రి కనుక "ద్రౌపది" అయింది. కాని శబ్దాన్ని అర్థాన్ని అర్థం చేసుకోలేని విషపూరిత వాచాలత్వంగలవారు ద్రౌప'తి' అంటూ, ఎందరో "భర్తలు" కలది అని హేళనగా అన్నారు. ఆమెకు కలిగిన అవమానాలు, ఎదురైన సవాళ్ళు మహాభారతంలో చూసి నాడూ, నేడూ కూడ ఏ స్త్రీ హృదయమైనా క్షోభిస్తుంది. ఎన్నోసార్లు నవ్వుల భారాన్ని ముఖానికి తగిలించుకున్న కృష్ణ మనసులోపలి బాధ ఎవరికి తెలుసు!

భైరప్పగారి 'పర్వ' నవలలో కూడ కృష్ణని అలానే చిత్రించారా అన్న భయం, చదవబోతుండగా ఓ రకమైన బెరుకు!! కాని ఎక్కడా ఆయన 'కృష్ణ'ని తను వర్ణించేటప్పుడు కానీ, ఇతర పాత్రల సంభాషణలలో కానీ ఆమె గౌరవానికి భంగం కలిగేటట్లు రాయలేదు. పైగా - మిగిలిన పాత్రల ద్వారా ఆమె ఔన్నత్యాన్ని గొప్పగా చెప్పించారు అనేక సందర్భాలలో.

హిడింబ శారీరకంగా బలమైన రాక్షస స్త్రీ. భీముడిలాంటివాడిని కూడ ఒడిసిపట్టి ఎత్తుకోగలదు, కోపం వస్తే నాలుగు పిడిగుద్దులు వీపుపై వాయించగలదు. పరిగెత్తడంలో, వేటలో, శృంగారంలో భీమునితో సరిసమానంగా నిలబడగల శక్తిగల స్త్రీ. అలాంటి (తన

మొదటి) స్త్రీని తలుచుకుంటున్నప్పుడు కూడ భీమునికి 'కృష్ణ' గుర్తుకు వస్తుంది అని భైరప్పగారు రాయడం ఆమె వ్యక్తిత్వాన్ని చెప్పకనే చెప్పినట్టుంది.....! "ఆమె సుకుమారి. ఒక పువ్వు. ఆమె మాటల్లో, కనుబొమల విరుపుల్లో, కనుకొలకుల నిశ్శబ్దతతో, కంటి మెరుపులోనే ఆమె ఆశయం అర్థం చేసుకోవాలి. ఆర్య స్త్రీ అంటే అలానే ఉండాలి" అని, "ఆడదంటే.. తాను చూసింది కృష్ణను ఒక్కదాన్నే. ఏదీ నేరుగా చెప్పదు. ఆవిడ లోపలి మనసును ఎవరు బయటకు లాగుతారు?" అనుకుంటాడు. అవును, ఆమె బైటకు చెప్పకపోయినా ఆమె గుండెలో రగిలిన చిచ్చును చల్లార్చగలిగాడు తను మాత్రమే. అర్జునుడు తమ ఐదుగురికి కలిసి ఒక భార్యగా ఉన్నా, తనకు మాత్రమే ప్రత్యేకమైన భార్యగా సుభద్రను తెచ్చుకుంటున్నప్పుడు మనసులో అనుకుంటాడు - "కృష్ణా, నీ శక్తి ప్రసారం జరిగినంత క్షేత్రంలో మిగిలినవారందరు తమ అస్తిత్వాన్ని నిలుపుకోలేరు" అని. అంతటి 'శక్తి ప్రవాహం' మూర్తీభవించిన మహోన్నత స్త్రీ మూర్తి 'కృష్ణ'. జూదం తర్వాత దుశ్శాసనుడు ఆమె చీర లాగినప్పుడు, అరణ్యంలో జయద్రధుడు ఆమెను పట్టుకొని పోతున్నప్పుడు, కీచకుడు ఆమెమీద కన్ను వేసినప్పుడు అవమాన భారంతో, దుఃఖంతో ఆమె గుండెలు రగిలిపోలేదా! అర్జునుడు విలువిద్య నైపుణ్యంతో క్లిష్టమైన గురిని ఒకే దెబ్బతో కొట్టి పోటీలో జయించి, తనను గెలుచుకున్నాడు. ఇక్కడ భైరప్పగారి భావనని గంగిశెట్టిగారు చక్కగా అనువదించారు. "కృష్ణ తన తండ్రి తోటలో నుంచి రాలి సూటిగా అతని ఒళ్ళో పడింది". అంటే ఆ పండుని ఇంతకు ముందు ఎవరూ కోయలేదు. రుచిచూడలేదు అన్నమాట.

గెలుచుకున్న 'సొత్తు'ను తన వెంట, కుమ్మరి వాని గుడిసె వెనుక ఉన్న గుడిసెలోకి తెచ్చినప్పుడు, మిగిలిన నలుగురు అన్నదమ్ములు ఆమెవైపు ఆకర్షితులైనప్పుడు ఒకానొక అయోమయానికి గురైంది. కుంతి ఆమె ప్రక్కనే కూర్చొని చేతిని పట్టుకుంది. (రాజతంత్రం చాలా క్లిష్టమైంది కదా). " నిజంగానే చాలా అందంగా ఉన్నావు. రంగు కొద్దిగా తక్కువైనా నీ ముఖమూ, కళ్ళూ, ముక్కు, నోరు, ఒంటి ఒంపుసొంపులు, ఆకర్షణ అద్భుతం. అసాధ్యం. అనన్యం. నా అయిదుగురు కొడుకులను ఒకటిగా నువ్వు పెళ్ళి చేసుకో. నీ అంతటి దాంపత్య సుఖ సమృద్ధి మన ఆర్యావర్తంలో మరో స్త్రీకి ఉండదుగాక" అని ఆశీర్వదించింది.

హిమవత్పర్వత ప్రాంతంలో ఇలాంటి సంప్రదాయం ఉంది. ఆర్యుల మూల సంప్రదాయాలను ఇప్పటికీ ఆచరించే దేవజాతి ఒకటి హిమాలయంలో ఉంది. కొన్ని ఆర్యేతర ప్రజల్లోనూ ఉంది అనుకుంది కృష్ణ. పైగా కుంతి మాట ఇచ్చింది "నా అయిదుగురు కొడుకులు నీ యిష్టాన్ని ఒక అంగుళమైనా దాటకుండా నేను కట్టుదిట్టం చేస్తాను" అని. అయిదుగురు పాండవులను ఒక చేతికున్న అయిదు వేళ్ళుగా ఒకటిగా కలిపి పట్టి భరించడం కృష్ణకొక నిష్ఠ అయింది. ఆ నిష్ఠను పాటించడంలోఆమె గెలుపు సాధించింది. రోజుకొకరు చొప్పున దృఢకాయులైన అయిదుగురూ కృష్ణను ప్రణయ ప్రవాహంలో ముంచివేశారు. ఒకరు ఒకరోజు వచ్చి మిగిలిన నాలుగు రోజులు కృష్ణ కోసం తపించిపోయేవారు. కాని తర్వాత 'సంవత్సరానికి ఒకరు' అనే నియమం ఏర్పరచింది కుంతి. వారి అభ్యుదయం కోసం, ఐకమత్యం కోసం, ఆ ధర్మాన్ని పాలించడం కోసం కృష్ణ, తానెంత కష్టపడింది! అయిదుగురికి స్వయం సమర్పణ చేసింది. కృష్ణ గర్భమంటే ఫలవంతమైన గర్భం. పెళ్ళయిన వెంటనే గర్భం ధరించింది. అయిదుగురికి అయిదుగురు పుత్రులనిచ్చింది. ప్రతివింధ్య, శ్రుతసోమ, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతసేనుడు.జూదంలో ధర్మరాజు ఓడిన తర్వాత జరిగిన అనేక పరిణామాలలో కృష్ణ జీవితంలో ఎన్నెన్నో కష్టాలు. కన్నీళ్ళు. 'పర్వ'లో చాలా అద్భుతమైన, కృష్ణ మనసులోని కడలి కల్లోలాల్ని, చదువరుల గుండెను కలిచివేసే సన్నివేశం.... "నిజమైన ఆర్యధర్మమంటే ఏమిటి?" అడిగాడు ప్రతివింధ్యుడు. కిలకిల నవ్వింది కృష్ణ. కారణం తెలియకున్నా అతడూ నవ్వాడు. "ఆర్యధర్మమంటే - వేట, తాగడం, ఆడవాళ్ళ సహవాసం, జూదం" అంది మరింత నవ్వుతూ కృష్ణ. ఆనవ్వు... మనసులోని జ్వాల. ఒక అగ్నిపర్వతం. ఉబుగుతున్న లావా. ఇంకా... ఏమో. ఆ నవ్వులోని అర్థాలు ఎన్నెన్నో!! మన మనసుకి ఆమె ఆవేదన, ఆక్రోశం తాకుతుంది ఆ నవ్వుతో. చాల లోతైన పరిశోధన చేశాక భైరప్పగారు ఈ సన్నివేశాన్ని ఇలా చెప్పారు అనిపిస్తుంది. నిజమే. మహాభారత కథ మొత్తం

ఆ నాలుగింటి చుట్టూనే తిరిగింది కదా! వీటివల్ల పరోక్షంగా హింస పడింది స్త్రీలే. మరీ ముఖ్యంగా జూదంవల్ల కృష్ణ జీవితమే తల్లక్రిందులైంది. ధర్మరాజు జూదంలో రాజ్యాన్నంతా ఓడి, తమ్ములను ఓడి, తన్ను తానే ఓడి, కృష్ణను కూడ పణంగా పెట్టి ఓడిపోయాడు. ఏకవస్త్రగా ఉన్న కృష్ణను సభాస్థలికి లాక్కుని వచ్చినప్పుడు పెద్దలైన వారెవ్వరూ వారించలేకపోయారు. దుష్టచతుష్టయం వదరే వికృత కూతలను ఎవరూ అడ్డగించలేకపోయారు. ఆసారికి గాంధారి ధృతరాష్ట్రులు వచ్చి ఆ దురాగతాన్ని ఆపారు. తర్వాత, మరోసారి జూదానికి సన్నద్ధమౌతున్న ధర్మరాజును వద్దని వేడుకొంది కృష్ణ. కాని "ఇది తప్పు" అని మగవారిని ఎదిరించే ధైర్యం "అప్పట్లో" లేదు అంటుంది కృష్ణ తన అయిదుగురి కొడుకులతో.

''మరి ఎప్పుడు ధైర్యం వచ్చింది నీకు'' అని శ్రుతసోముడు అడిగినప్పుడు - "ధర్మమంటే తెలిసినవాడు ఒకడే. కృష్ణ వాసుదేవుడు. పంతానికి మళ్ళీ జూదానికి వెళ్ళిన ధర్మరాజుని మొహం వాచేలా చీవాట్లు పెట్టాడు. 'దుర్యోధనునివంటి దాయాది మనసు ఎలా పనిచేస్తుందో తెలుసుకునే తెలివి నీకు లేకపోయింది. ఆ సమయంలో నేను అక్కడికి వచ్చి ఉంటే అది అధర్మమని నీకూ దుర్యోధనునికి బుద్ధి చెప్పి ఉండేవాడిని. వినకుంటే ఇద్దరి చేతుల్ని నరికి ఉండేవాడిని. జూదమాడేవారికి అదే శిక్ష" అన్నాడు కృష్ణుడు. ధర్ముడు తననిలా జూదంలో ఒడ్డడం ధర్మమా అని కృష్ణ ప్రశ్నిస్తే భీష్మ ద్రోణాదులు సమాధానం చెప్పలేదు. అయిదుగురు భర్తలు మౌనంగా ఉండిపోయారు. ఆ సమయంలో పలికిన భీముని ప్రతిజ్ఞలే కదా తనకు భవిష్యత్ మీద ఆశను కలిగించింది. ఆ దుర్మార్గులు తనను వివస్త్రను చేస్తారేమో నన్న అనుమానంతో, వీరులైన తన తండ్రిసోదరుల ప్రస్తావన తెచ్చి భయపెట్టాలని ప్రయత్నించింది. వారు లెక్క చేయలేదు. "రాజసూయంలో శిశుపాలుని కుత్తుక కత్తిరించాడు కదా ఆ యాదవ కృష్ణుడు నాకు అన్న. ఆయన వస్తాడు మీ పని పట్టడానికి" అంది తను. అందరూ భయపడింది అప్పుడేగా!

కృష్ణకు జీవితమంతా కర్తవ్యపు కట్టుబాటు, వ్రతం కట్టుబాటు, ధర్మం కట్టుబాటు. స్వయం ప్రకటిత కారాగృహం. యుద్ధరంగంలో అభిమన్యుడు వీరమరణం పొందినప్పుడు పాండవులు, కృష్ణుడు అందరూ సుభద్రను ఓదార్చారు. తర్వాత ప్రక్క గదిలో గర్భవతి అయిన ఉత్తర తలను కృష్ణ తన ఒడిలో ఉంచుకుని ఓదార్చుతోంది. అది చూసి అర్జునుడు "నీకు కాక ఈమెను ఓదార్చే శక్తి ఇంకెవ్వరికి లేదు" అంటాడు. అదీ కృష్ణ! కానీ, పంచపాండవులు ద్రౌపది కన్నబిడ్డల్ని అశ్వద్ధామ అన్యాయంగా హతమార్చినప్పుడు - గుండెలు పగిలేలా ఏడుస్తూ నిస్సహాయంగా అనుకుంటుంది "అభిమన్యుడు చనిపోయినప్పుడు సుభద్రను అందరూ ఓదార్చారు. అర్జునుడైతే ఆమెను పట్టుకొని వెక్కివెక్కి ఏడ్చాడు. ఘటోత్కచుడు చనిపోయినప్పుడు భీముడు శవాన్ని మోసి తెచ్చి కన్నీటితోనే రక్తపుమరకల్ని కడిగేశాడు. ఇప్పుడు నా అయిదుగురు కొడుకుల్ని కోల్పోయినప్పుడు తనని అక్కున చేర్చుకొని ఓదార్చేవారు ఎవరూ లేరు" అని.

అయిదుగురు భర్తలున్నా ఆమె గుండెలో ఒంటరితనం గూడుకట్టుకుని ఉందేమో! 'పర్వ'లో చివరిలో - ఉత్తరగర్భం నుండి జన్మించిన శిశువులో చలనంలేదు. కుంతి ద్రౌపది వద్దకు వచ్చి "నువ్వు గర్భవతివి కావాలి. లేకుంటే ఈ వంశం అంతం అవుతుంది" అంటుంది. ద్రౌపది కళ్ళలో ధిక్కారం నిండుకుంటుంది. తల అడ్డంగా ఊపుతూ "ఈ వంశం అంతం అయితే ఏమిటట" అంటుంది. ఆ పలుకులలో ఎంత నిరసన! ఎంత పదును, బాణపు ములుకులులా! ఆమెలో ఎన్నో సముద్రాలు పోటెత్తాయేమో!

భైరప్పగారిలా మరికొందరు మహాభారత కాలంనాటి స్త్రీల దుఃఖాన్ని, అనుభవించిన అప్రకటిత హింసను 'సహ అనుభూతి' చెందారు. రచనలు చేశారు. కొందరైతే రచయిత్రులకంటే అద్భుతంగ స్త్రీల హృదయాన్ని ఆవిష్కరించారు. 'పర్వ' కన్నడ నవలను తెలుగులోకి అనువదించిన గంగిశెట్టి లక్ష్మీనారాయణగారన్నట్లు భైరప్పగారు పండితులకోసంకాక ఈ ఇతిహాసం సామాన్యులందరికీ అర్థమయ్యేట్లు ప్రజలు మాట్లాడుకునే భాషలో రాశారు. అనువాదంలో కూడా అలానే ఆద్యంతం ఒకేరకమైన భాషాస్వరూపంతో, వాక్య నిర్మాణంలో సాగింది. "చిరు ప్రయత్నం" అన్నారు కానీ గంగిశెట్టిగారు చాల పెద్ద కార్యాన్ని తలకెత్తుకొని తెలుగు పాఠకులకి ఆనాటి చారిత్రక,

సంస్కృతీ పరిణామ క్రమాన్ని అందించి పరిపూర్ణత సాధించారు.

గాంధారి:

మహాభారతంలోని మరో ముఖ్యమైన మహోన్నతమైన స్త్రీమూర్తి "గాంధారి". భైరప్ప గారు కూడ 'పర్వ' నవలలో గాంధారి మూసిన కళ్ళ వెనక కదలాడే నీలినీడలని అవగతం చేసుకొని మనకు అందించారు. భారతంలోని చాల పాత్రలు, ముఖ్యంగా స్త్రీ పాత్రల మనసుల్లోని లోతైన గంభీరమైన భావాలు ఈ ప్రపంచం ఎలా తెలుసుకోలేకపోయిందో అలానే గాంధారి మనోప్రపంచాన్ని ఈ లౌకిక లోకం 'చూడ'లేకపోయింది. తన ఇష్టాయిష్టాలు తెలుసుకోకుండా తండ్రి, సోదరులు నిర్ణయించిన 'అంధుని'తో వివాహానికి ఎంత నిశ్శబ్దంగా ఒప్పుకుందో, ఆ తర్వాత తన జీవిత కాలమంతా అదే నిబద్ధతతో భర్తని అనుసరించింది గాంధారి. గాంధార దేశం! ఎత్తయిన కొండలు, వాటిని కప్పివేసేటట్లు పెరిగిన పచ్చటి చెట్లు, చేమలు, పొదలు, శిఖరాలు, స్వచ్ఛమైన ప్రకృతి ప్రాంతం, సహజమైన వాతావరణంలో పెరిగింది గాంధారి. నీలాకాశం, అన్ని ఋతువుల్లోనూ ఒకటి కాకుంటే మరొకటి చక్కగా పూలు పూచే మొక్కలు, తీగలు, తియ్యటి నీళ్ళు, వేడి అన్నదే లేని గాలి. బహుశా అంత అందమైన దేశం మరోటి లేదేమో. కానీ సారవంతమైన అంతగా లేదు. లోహాల, బంగారాల సంపద లేదు.

గాంధారి మేని ఛాయ చక్కటి ఎరుపు. పర్వత ప్రాంతపు సహజ ప్రకృతివల్ల గట్టి మైకట్టు, మృదువైన చర్మం. స్వచ్ఛమైన నీటి మడుగులో అందంగా, ఎలాంటి మురికీ లేని తన ముఖారవిందాన్ని తనివితీరా చూసుకొని మురిసిపోయేది. స్నేహితులు కూడ ఆమె మీద అపురూపమైన స్వప్న కథలను అల్లేవారు. ధృతరాష్ట్రుడికి పిల్లనివ్వమని భీష్ముడు గొప్ప గొప్ప కానుకలు, వస్త్రాభరణాలు, బయలు సీమలో పండే ధాన్యం దినుసులు, పెద్ద సైన్యాన్ని పంపాడు. వైభవాన్ని ప్రదర్శించి ఆశే చూపాడో, సైన్యాన్ని చూపి బెదిరించాడో, తండ్రికి లోభమే పుట్టిందో, భయమే వణికించిందో కానీ పుట్టుగ్రుడ్డికి పిల్లనివ్వడానికి ఒప్పుకున్నాడు. కనీసం తనని సంప్రదించకుండా తన జీవితాన్ని నిర్దేశించడంతో ఆయన ఎదుటే పైన కప్పుకున్న మేలు వస్త్రం చెరుగొకటి చర్రున చించి 'గుడ్డివాడికి కట్టబెడితే నేను అతని ముఖం చూడను' అనే నిరసనతో కళ్ళకు గంతలు కట్టుకుందేమో! లేదా, భర్తకు లేని దృష్టి తనకూ వద్దనుకుందో కానీ - పుట్టింటి నుండి వచ్చేటప్పుడే కళ్ళకు గంతలతో వచ్చింది.

అత్తవారింటి కొచ్చాక ఒక్కసారీ పుట్టింటికి వెళ్ళలేదు. "అక్కడికి వెళ్ళి మాత్రం ఎవర్ని చూడాలి గంతలు కట్టుకున్న కళ్ళతో! ఎలాగూ అన్నదమ్ములు ఇక్కడికే వచ్చారు కదా" అని సరిపుచ్చుకుంది. పుట్టి పెరిగిన గాంధార దేశం, అక్కడి అందమైన చక్కని పరిస్థితులు వేరు, ఈ అత్తవారిల్లు, అంతఃపురం వేరు. ఏ నియమాలకు తనను తాను బంధించుకుందో కానీ ఒకానొక జడత్వం మనసు నిండా ఆవరించుకుందేమో! స్వేచ్ఛగా, సహజంగా పెరిగిన పుట్టిల్లు వదిలి వచ్చాక తనది కాని జీవితాన్ని మొదలుపెట్టింది. సంపూర్ణంగా భర్తని అనుసరించిన అంతర్ముఖి గాంధారి. అందరిచే మహాసాధ్వీమణి అనిపించుకుంది. "నలుపు తెలుపుల" తారతమ్యం తెలీదామెకి. కానీ, ధర్మమే జయిస్తుంది అన్న స్థిర నిశ్చయమామెది. ఆ విషయంలో ఎలాంటి విఘ్నత కలిగినా ఉన్న విషయం ఉన్నట్లు కటువుగానైనా చెప్పేస్తుంది. తన భర్త గుడ్డివాడైనా కొందరి దాసీజనంతో సంబంధాలున్నాయని ఆమెకు తెలుసు. ధృతరాష్ట్రుడు పైకి ప్రకటించకపోయినా అంతరాంతరాల్లో సింహాసనం మీద ఆపేక్ష, తన అంధత్వం మీద చెప్పలేనంత నిరసన గాంధారి గ్రహించింది. అతనికి లేని చూపు తనకు వద్దనుకుందో, తనకు లేని చూపు భార్యకు ఉంటే ఓర్చుకోలేడని గ్రహించిందో తెలీదు కానీ - ధృతరాష్ట్రుని వంటివాడితో అన్నేళ్ళు సఖ్యంగా కాపురం చేసిన మహాసతి గాంధారి గంభీరహృదయ. పూజనీయ. అందరిచేత దేవతలా గౌరవింపబడుతున్న భార్యపట్ల ధృతరాష్ట్రునికి గర్వం ఉంది. "సకల కురుకులంలో మాత్రమే కాదు మొత్తం ఆర్య జగత్తుకే అద్వితీయ దేవి" అని మనసులో గౌరవం ఉంది. కర్ణుని మనసులో గాంధారి పట్ల ఎంత ఉన్నతమైన భావం ఉందో తెలిస్తే ఆశ్చర్యమేస్తుంది. కురుక్షేత్ర సంగ్రామానికి ముందు కుంతి కర్ణుని వద్దకు వచ్చి అతని జన్మవృత్తాంతం తెలియజేస్తుంది. అప్పుడు కర్ణుడు "నన్ను పెంచిన తల్లి రాధ చనిపోయిన తర్వాత నా స్నేహితుని తల్లి గాంధారీమాత

ఆ లోటును తీర్చింది. హస్తినావతిలో మాత్రమే కాదు, ఏ దేశంలోనైనా గాంధారివంటి మహామాత ఉన్నారని నేను వినలేదు. భర్త కోసం అంత త్యాగం చేసే స్త్రీలోనే మాతృత్వపు పరిపూర్ణత సిద్ధిస్తుందేమో! ఎప్పుడు ఆమెను సమీపించి 'తల్లీ, నీ కాళ్ళను తాకిన నేను కర్ణుణ్ణి' అన్నా , ఆపేక్షతో నా తలను తన రెండు చేతులతో పట్టుకుని 'దీర్ఘాయువు కా నాయనా' అని ఆశీర్వదిస్తుంది. ఆమె తన ప్రేమను, హృదయాన్ని, తన బిడ్డలతోపాటుగా నాకూ అంతో ఇంతో పంచి ఇచ్చింది"... అనడం ఆమెలోని మాతృత్వపు భావనకు గొప్ప సాక్ష్యం.

గాంధారికి మనోనేత్రంతో చుట్టూ జరిగేవి గ్రహించే నేర్పు, మంచి మనసు ఉంది. కుంతి హృదయంలోని భావాలు తెలుసామెకు. ద్రౌపది పడిన అవమానాలు, అల్లకల్లోలమైన ఆమె మనసుని గ్రహించగలిగింది. నిండు సభలో జరిగిన అవమానానికి ఒక స్త్రీ ఎంతగా క్షోభ పడగలదో ఊహించగలదు. అందుకే ఆ దుశ్చర్యను భర్తతో కలిసి వెళ్ళి ఆపగలిగింది. ఇంతటి దురాగతాలు చేసిన తన కుమారులకు శిక్ష పడుతుందని భయపడుతూనే ఉంది. వారించినా వినరని తెలిసి నిస్సహాయంగా ఉండిపోయింది.

కురుక్షేత్రంలో వరసగా తన బిడ్డల మరణ వార్తలు విని గుండెలు పగిలేలా ఏడ్చింది. సంజయుడు చెప్తున్న దుర్వార్తలకి, కఠోరమైన విషయాలకి తట్టుకోలేకపోయింది. కడుపారా కన్నబిడ్డల్ని కోల్పోయిన ఆ తల్లి హృదయం బద్దలైంది. క్రమంగా, ఎంత వద్దనుకున్నా , ఆమె గర్భశోకం శాపంగా మారుతోంది- కృష్ణభగవానుని వంశానికే శాపం పెట్టేంత! చివరకు కృష్ణుడు అడిగాడు గాంధారిని "నీతో ఒక ఆత్మీయ విషయం మాట్లాడాలని చాలకాలం నుండి ఆశ ఉంది. ఏమీ దాచకుండా నిజం చెప్పివేసే సమయం జీవితంలో ఒకసారైనా రావాలి. నీ అంతరంగాన్ని విప్పి చెప్పు. మహారాజయితే గుడ్డివానిగానే పుట్టాడు. నువ్వెందుకు గంతలు కట్టుకున్నావు?" ఆమె అంతరంగాన్ని తడుముతున్నట్టు.

"గుడ్డివాడికి కట్టబెడితే నేను అతని ముఖం చూడను అని రెండు కళ్ళకు గంతలు కట్టుకున్నాను. తర్వాత నన్ను నేను చూసుకోలేదు. చూసేటంత మొగుడూ దొరకలేదు. అయినా 'సాధ్వీ, మహా పతివ్రత అన్న పొగడ్తల రుచి



స్వయంవర ఫలం

ఎక్కిందేమో, ఆ దేవీ పట్టం పోగొట్టుకోడానికి మనసు రాలేదు. నేను కళ్ళకు కట్టేసుకున్న నిజమైన కారణాన్ని నేనే మరచి ఈ హస్తినావతి అంతఃపుర జనం ఆరోపించి పెట్టిన పావనతలో మునిగిపోయాను. నువ్వు నా మనసును తట్టి అడిగావు. ఇంతవరకు నా బిడ్డల్లో ఎవరూ కూడ 'అమ్మా, నువ్వెందుకిలా గుడ్డిదానివయ్యావు? మమ్మల్ని చూడటానికైనా కళ్ళు విప్పు' అని అడగలేదు, ఆడపిల్ల కూడ. తల్లి గుడ్డితనం మీదే పావనత, దివ్యత నిలబడి వుందని కాళ్ళు ముట్టి నమస్కరిస్తుండేవాళ్ళు...." గాంధారి మాటలకు చుట్టూ గాలి కూడ ఘనీభవించిందేమో ఆమె మనసులా. కృష్ణభగవానుడన్నాడు 'తల్లీ, నువ్వు పుట్టుగుడ్డివైతే కాదు. పైన గంతలు కట్టుకున్నంతమాత్రాన దృష్టి శక్తి నష్టమైపోదు. ఇప్పుడైనా ఎందుకు దాన్ని తీసేసి చుట్టూ చూడరాదూ!" మృదువుగా ఆమె కంటి పట్టీలను విప్పేశాడు. "కళ్ళు విప్పు తల్లీ. పట్టీలు కట్టుకోడానికి ముందు నిద్ర నుండి లేచాక కళ్ళు విప్పేదానివి కదా, అలా విప్పు" ఆమె రెండు రెప్పల మీద వేళ్ళతో సున్నితంగా నిమిరాడు. నిదానంగా కళ్ళు విప్పిందామె. పాండవులందరూ ఆమె ముందుకు వచ్చి

జూదం

కాళ్ళకు మొక్కారు. "కృష్ణా, వచ్చి నమస్కరించు" అని ఆయన చెప్పగనే ద్రౌపది వచ్చి మొక్కింది. ద్రౌపది తలను నిమిరింది. తన వేళ్ళను ఆమె తలవెంట్రుకలలో జొనిపి నిమిరింది. ఆప్యాయంగా కౌగిలిలోకి తీసుకుంది. అన్నీ కోల్పోయిన ధృతరాష్ట్రునికి గాంధారిని కూడ కృష్ణుడు తనకు దూరం చేశాడని మధన పడ్డాడు. ఆమెకైతే అంతా పోగొట్టుకున్న తర్వాత ఏమిటో పొందిన భావన. ఇన్నేళ్ళ అంధత్వం తర్వాత దేన్ని చూడాలి అనుకుంది. కానీ, బ్రతికుండగా ఏనాడూ చూడని తన కుమారుల్ని ఇప్పుడు నిర్జీవంగానైనా చూడాలి అని కృష్ణుని వేడుకుంది. యుద్ధరంగానికి వెళ్ళింది. అక్కడంతా శవాలు, విరిగిన శరీర భాగాలు, ఆభరణాలు, విల్లులు, రథాలు, గుర్రాలు, ఏనుగులు.... చూడలేకపోయింది. భయంకరమైన ఆ దృశ్యాలకి ఆమె చూపు చెదిరిపోయిందో, తనే మళ్ళీ అంధత్వాన్ని ఆహ్వానించిందో!! తెలీదు....!! అంతా కృష్ణమాయ...!!

మంత్రాలు, మానవాతీత సంఘటనలు చూసి 'అసలు రామాయణ భారతాలు జరిగిన కథలేనా' అన్న అనుమానం యువతకు రావడం సహజమే. ఆ అనుమానాల్ని తీర్చేవారు, తీర్చే పరిస్థితిని మన విద్యావ్యవస్థ కల్పించే అవకాశం లేదు. సహేతుకమైన 'పర్వ'లాంటి పుస్తకాలను పాఠ్యగ్రంథాలుగా ఉంచడం కాదు కదా, కనీసం రిఫెరెన్స్‌గా కూడ ఉంచే ధైర్యం విశ్వవిద్యాలయాలకు లేదనుకోవాలి. కన్నడంలో గొప్ప రచయిత భైరప్పగారి 'పర్వ' నవలను సరళ భాషలో, అందరికీ అర్థమయ్యేలా తెలుగు చేసిన ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ గారికి తెలుగువారు ఎంతైనా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. నిజానికి పర్వ నవల ఎంత గొప్పదో 'నేనెందుకు రాస్తాను' అన్న వ్యాసం కూడా చాల ముఖ్యమైంది. ఒక రచయిత సత్యాన్వేషణ కొరకు ఎంత శ్రమించాలో తెలుసుకోవాలంటే భైరప్ప గారి శారీరక మానసిక ప్రయాణం చదివి తీరాలి. తన స్వంత ధనం ఖర్చు చేసుకొని ఎన్నెన్ని ప్రాంతాలు తిరిగారో, ఎన్ని కష్టనష్టాలకు ఓర్చుకున్నారో తెలుసుకోవాలి. పుంఖాలు పుంఖాలుగా చారిత్రక, పౌరాణిక గాథలు రాసి పడేస్తున్న ఎందరో రచయితలకు కనువిప్పు కలగాలంటే 'నేనెందుకు రాస్తాను' చదివి తీరాలి. మహాభారతం జరిగిన అన్ని ప్రాంతాలకు వెళ్ళి, అక్కడి వారితో సంభాషించి, ఆయా ప్రాంతాల్ని చూసి, మమేకమైపోయి 'ఇక రాసి తీరాలి' అన్న తీవ్రమైన ఉద్వేగంతో పర్వ ప్రారంభించారాయన. ఆరోగ్యాన్ని లెక్కచేయలేదు. కానీ ఆయన చేసిన ఆ గొప్ప ప్రయత్నం ఎంతమందికి చేరింది! పర్వ తెలియకపోయినా ఫరవాలేదు. నేనెందుకు రాస్తాను అన్న వ్యాసం అయినా తెలుగు భాషాసాహిత్యాలు అధ్యయనం చేసే విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా నిర్దేశిస్తే భారతకథ జరిగిన ప్రాంతాల గురించి ఒక అవగాహన ఏర్పడుతుంది. పరిశోధన అంటే ఎంత నిబద్ధతతో చేయాలో, ఎంత కృషి చేయాలో తెలుస్తుంది. ఆయా దూరదూర ప్రదేశాలకు పర్యటించడం, సమాచారాన్ని సేకరించడం, వాటినే నిత్యం "చింతిస్తూ", రాత్రంతా రాస్తుండటంతో భైరప్ప గారి ఆరోగ్యం దెబ్బతిన్నదట. "ఆ తలలో ఉన్నదంతా వ్రాతలోకి దించితేగానీ ఆరోగ్యం కుదుటపడదు" అన్నారు డాక్టర్. దాదాపు నాలుగేళ్లు పట్టిందట పర్వ పూర్తి కావడానికి. అప్పుడు ఆయన వయసు 28 ఏళ్ళు మాత్రమే.

ఆధునిక దృష్టి కోణంలో భైరప్పగారు కన్నడంలో నవలా రూపంలో రాస్తే, మూలాన్ని ఏమాత్రం మార్పులు లేకుండా తెలుగు చేశారు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ గారు. నిజానికి ప్రపంచంలోని అన్ని భాషలలోకి అనువదించబడాల్సిన గొప్ప నవల 'పర్వ'.

చిత్రాలు - ఇటాలియన్ చిత్రకారుడు తోమశెట్టి

డా. సి.హెచ్. సుశీల, హైదరాబాద్. ఫోన్: 984 911 7879.

వేంకట భుజంగరాయ శర్మ

శ్రీ శ్రీరామ్ వేంకట భుజంగరాయ శర్మ

(1926 -1997)

– కాసుల శ్రీనివాసులు

మిసిమి అక్టోబర్ 2020 సంచికలో, పప్పు వేణుగోపాలరావ్‌గారి వ్యాసంలో (నాట్య నరస్వతికి నాణ్యమైన అభరణం కూచిపూడి) శ్రీ భుజంగరాయ శర్మగారి ప్రస్తావన ఉంది. శ్రీ శర్మగారి అపూర్వ రచనా వ్యాసంగంలోని శ్రావ్యత, దృశ్యత ఆస్వాదించడానికి వారు రాసిన కూచిపూడి నృత్యరూపకాల ప్రదర్శనలను తిలకించాలి. వాటి క్రమం:

1. *శ్రీ కృష్ణ పారిజాతం*, 2. *అభిజ్ఞాన శాకుంతలం*, 3. *చండాలిక*, 4. *కళ్యాణ రుక్మిణి*, 5. *పద్మావతి శ్రీనివాసం*, 6. *హరవిలాసం*, 7. *శివ ధనుర్భంగం*, 8. *అర్ధనారీశ్వరం*.

వాటిని వీక్షించడం అంటే - "రంగస్థలం మీద ఒక దృశ్య స్వర్గం, పారవశ్యమహాపవర్గం" అంటారు శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు తన అముఖంలో. "స్వదేశీయులనే కాదు, సముద్రాలకవతల తెలుగంటే తెలియని విదేశీయులను సైతం సమ్మగ్ధులను చేశాయి". బ్రిటన్, అమెరికా, పశ్చిమ యూరోప్, వెస్ట్ ఇండీస్, మారిషస్, శ్రీలంక, రష్యా తదితర దేశాల్లో వీటిని ప్రదర్శించారు. "చండాలిక" తప్ప మిగతా 7 నృత్య రూపకాల ఇతివృత్తాలు ప్రఖ్యాతమైన సాహితీ ప్రపంచంలో ప్రసిద్ధాలు. "చండాలిక" మాత్రం సాంఘిక ఇతివృత్తంతో అలరారుతూ ఉంది. శ్రీ రవీంద్రనాథ్ ఠాగోర్ రచన శర్మగారి నృత్య రూపకానికి మాతృక. రచయిత ఏకాంతంగా కూర్చుని రాసిన రచనలు కావివి. రచయితా, నాట్యాచార్యులు, సంగీతజ్ఞులు కలిసి కూర్చిని రూపొందించినవి. శర్మగారూ, పెంపటి చినసత్యంగారూ, సంగీత రావుగారూ, ద్వారం భావనారాయణ రావుగారూ కలిసి కూర్చిని రూపొందించిన అపురూప కళాఖండాలు. వారి కృషిని నేను ప్రత్యక్షంగా చూశాను. వీరు కలుసుకున్న వేదిక జవహర్ భారతి, కావలి. నేను అప్పుడు అక్కడ విద్యార్థిని - శర్మగారి శిష్యురాలి. వీళ్ళ ఉమ్మడి కృషిలో ఈ రూపకాలను విశ్వోదయ ప్రాంగణంలోని Open Air Theatreలో జవహర్ భారతి విద్యార్థులు *శ్రీ కృష్ణ పారిజాతం*, *చండాలిక*, *శాకుంతలం* ప్రదర్శించగా నేను చూశాను. ఇది 60 ఏళ్ళ నాటిమాట. ఈ అపురూపమైన రూపకాలను తన కూచిపూడి ఆర్ట్ అకాడమీ (మద్రాసు)లో ఎందరికో నేర్పారు చినసత్యం గారు. కేవలం ఈ కూచిపూడి నృత్యరూపకాలను మాత్రమే శర్మగారు రాయలేదు. అసంఖ్యాకంగా రేడియో ప్రసంగాలు, పాటలు, వ్యాసాలు రాసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. (ఆయన సంపూర్ణ రచనల్ని రెండు సంపుటాల్లో, 1200 పేజీల్లో, ఎమెస్కో వాళ్ళు ప్రచురించారు). శర్మగారి రేడియో ప్రసంగాలు 44 వరకు లభించాయి. వాటిని "దీపమాలిక" అన్న పేరున శ్రీమతి S.S. లక్ష్మిగారు ప్రచురించారు. ఇది కూడా ఎమెస్కోవారి సంపుటాల్లో భాగంగా ఉంది. ''సంస్కృతాంధ్ర సాహిత్యాలలో నాటికీ నేటికీ రసపిపాసువులనలరిస్తున్న కవుల అద్భుత సృష్టి, వరూధిని, మాళవిక, శకుంతల, ఊర్వశి, రాధ మొదలగు కావ్య నాయికలు ఈ గ్రంధంలో మనకు సాక్షాత్కరిస్తారు. లలితమైన భాషాసౌందర్యంతో, కావ్య నాయికలను మన హృదయాలకు మరీమరీ చేరువచేసి, ఒక అలౌకిక రసజగత్తులో వదలివేస్తారు" అంటారు లక్ష్మిగారు తన పరిచయ వ్యాసం ''వెలుగు రేఖ''లో. ''దీపమాలిక''ను సమీక్షిస్తూ "ఈ దీపమాలిక నిజంగా మన మనసులో మురిసిన చీకట్లను పారద్రోలు దీపమాలిక" అంటారు పురాణం. *ఆంధ్రజ్యోతి* ఇలా అంటుంది (ఆగస్టు 1990) - "రేడియోలో సాహిత్య ప్రసంగానికి ఒక కొత్త వరవడి పెట్టింది శ్రీ శర్మగారేనని నా నమ్మకం. ఏ విషయం మీద ప్రసంగం చేసినా, చెప్పదలచిన విషయాన్ని బలంగా, సూటిగా, సంక్షిప్తంగా, అందంగా చెప్పాలి. అలా చెప్పడం అందరికీ సాధ్యం కాదు. శ్రీ శర్మవంటివారికి తప్ప." "కవితా వాల్మీకం" అన్న ఆకాశవాణి ప్రసంగంలో శ్రీ శర్మగారు ఇలా అంటారు - కాళిదాసు

నిఘంటువులో కవి అనే శబ్దానికి ఒకే ఒక అర్థం - "వాల్మీకి". మరో అర్థం లేదు. "మానవలోకంలో కవితావిర్భావానికి శ్రీకారం చుట్టినవాడు, రసలోకాలకు తొలిసారి ద్వారం తెరిచినవాడు, అవ్యయమైన ఆనందామృతాన్ని యుగయుగాల హృదయాలకు చూరలిచ్చినవాడు, మనస్వి, మనీషి వాల్మీకిని మించి లోకంలో మరి కవి యెవడు?". పలుచటి మబ్బుల చాటున మెరిసే సూర్యుణ్ణి వర్ణిస్తూ వాల్మీకి - "సంధ్యాకాశం ముందువేసి కట్టుకట్టిన పుండులా ఉంది" అంటారు. ఈ వర్ణన యే సరియలిస్టో చేసిన వర్ణనగా లేదూ? కాళిదాస మాళవిక, శకుంతల, నన్నయ్యగారి ద్రౌపది, శర్మగారి రచనలలో అంతర్భాగం. "విధివంచిత ద్రౌపది" అన్న ప్రసంగంలో శర్మగారు ఇలా ప్రస్తావిస్తారు- "జీవితానికీ నటనకూ ఉన్న హద్దులు చెరిగిపోయి నటించడమే ఊపిరిగా, ఊపిరి పీల్చడమే నటనగా మారిపోయిన బ్రతుకులోని విషాదాన్నీ, ఆ విషాదంలోని ఆకర్షణనూ చిత్రించడం, నిజానికి ఏ రచయితకూ సులువుకాదు, తిక్కనవంటి యే ప్రతిభావంతులకో తప్ప."

సత్యభామ తెలుగింటి ఆడపడుచు ఎందుకయిందీ శర్మగారు వివరిస్తారు. "ఒకే ఒక్క రాధ"లో శర్మగారు యిలా అంటారు - "ఊహలోని నిజం, నిజంలోని కల, కలలోని వాస్తవం, వాస్తవంలోని కల్పన, కల్పనలోని సత్యం, సత్యంలోని ఊహ ఒకదాని చుట్టూ ఒకటి తిరుగుతున్నప్పుడు ఏర్పడే అపూర్వమైన ఇంద్రధనుర్వలయం రాధ!" ఇదంతా శర్మగారి మాటల గారడి అనుకున్నా వింత కాదు. ఈ మాటల్లో దాగిన సత్యాన్ని చూడండి - అప్పుడే రాధ ప్రత్యక్షమవుతుంది. "మీ తెలుగు కవుల్లో విశ్వకవుల్లో చేర్చదగిన కవులున్నారా? అని ఎవరైనా అడిగితే ఉన్నారు, ఎందరో అంటారు. ఒక్కరి పేరు మాత్రమే చెప్పండని కోరితే తటపటాయించి, కొంచెం ఆలోచించి, "పింగళి సూరన" అంటారు, కళాపూర్ణోదయాన్ని స్మరిస్తూ!" (శర్మగారి వ్యాసాన్ని చూడండి). "తెలుగు మాగాణంలో కవిత్వపు పంటకెప్పుడూ కొదవలేదు" అనే వ్యాసంలో శర్మగారు ఇలా అంటారు - "తాను నమ్మని విషయాన్ని చెప్పే రచన - ప్రాణం లేని ప్రతిధ్వని; ఆత్మహత్యకన్నా హీనమైన పని." గొప్ప రచన పుట్టడానికి చిత్తశుద్ధి ఒక్కటే చాలదు. రచనకు శిల్పం కావలి. అది దాని ప్రాణం. శిల్పం కొరవడిన రచన కలకాలం మన్నదు. వీరేశలింగంగారినీ, చలంగారినీ చూడండి. ఇద్దరికీ సిద్ధాంతాలే ముఖ్యం శిల్పం కాదు. "రచనాశిల్పంలోని బలంవల్ల చలం రచనలు కలకాలం నిలిచి తీరతాయి. వీరేశలింగంవంటి యుగపురుషుని రచనలు దుర్బల శిల్పంవల్ల ఈ పాటికే కనుమరుగవుతున్న సంగతి మీకు తెలియంది కాదు. అందుకే రచనకు ఊపిరి పోసేది శిల్పం. తేజస్సు నిచ్చేది చిత్తశుద్ధి. సార్వకత కలిగించేది సామాజిక స్పూర్తి" (రచనాశిల్పం అన్న వ్యాసంలో). కృష్ణశాస్త్రి గురించి, శ్రీశ్రీ గురించి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, జాషువా, ఆత్రేయల గురించి శర్మగారు విపులంగా చర్చించారు. అరవిందుల గురించి 120 పేజీల చరిత్ర రాశారు. శ్రీ అరవిందుల సావిత్రి చదవండి.

లోలోపల కాదు, పైకి / అలా ఊరికే చదువుతూ పోండి
ఎక్కడా ఆగి ఆలోచించకండి, వ్యర్థం.
సావిత్రి వేద ఋక్కులా వినబడుతుంది.
అనుభవానికి రాని కొత్త సుగంధమేదో / ప్రియంగా అవరించుకున్నట్లనిపిస్తుంది / మీ అల్పత్వం మీకు తెలిసివచ్చి,
మీ అహంకారం మాసిపోయి / జిజ్ఞాస మొదలవుతుంది
నిజానికి - శ్రీ అరవిందులను అర్థంచేసుకోవడమనేది,
అసలు లేదు.
వారిని అనుభూతికి తెచ్చుకోవలసిందే.
వారు భాషకు లొంగరు / మేధకు లొంగరు
భావనకు లొంగరు / వారిని అనుభూతికి తెచ్చుకోగల సహృదయత / అలవిమాలిన కవితాత్మగల / యోగికి మాత్రమే సహజం - "కథకంచికి" అనే పుస్తకంలో ఐక్యరాజ్య సమితిని ఆశీర్వదిస్తూ కంచి పీఠాధిపతులు చంద్రశేఖరేంద్రలవారు వ్రాసి పంపిన శ్లోకాలు, వారితో అనేకమంది విదేశీయ ప్రతినిధులతో 1931 -1964 మధ్య జరిపిన సంభాషణలు ఉన్నాయి. పాల్ బ్రాంటన్, ఆర్థర్ కొస్లర్, హజ్మీ నరకమురా, ఆర్థర్ ఐసెన్ బర్గ్, A.B. ఫ్రాంక్లిన్, తులయేవ్, మినోరుహా, వాసుదేవ ముని, జరిపిన సంభాషణలు ఉన్నాయి.

శ్రీ శర్మగారు చాలా పాటలు రాశారు.

గేయాలూ పాటలూ: "నేను పుట్టినరోజు" అనే ఖండిక లో ఇలా అంటారు- ***నన్నయగారి ఉగ్రావేశంలోని యెర్రటి ఎరుపును నేను / శ్రీనాథుని జీవన దర్శనంలోని చెరగని నిజాన్ని నేను పోతన్నగారి దాయతరంగంలోని ఆరని ఆర్ద్రతను నేను***

కృష్ణశాస్త్రి చిత్త స్పందనలోని తరగని ధావళ్యాన్ని నేను
శ్రీశ్రీ విశ్వ రూపంలోని అనంత వైతన్యాన్ని నేను
అన్యాయాన్ని సహించలేను / నిజాన్ని దాచిపెట్టలేను
అజ్ఞానాన్ని క్షమించగలను / అహంకారాన్ని త్యజించగలను
గాలిలా, వైతన్యంలా, అంతటా వ్యాపిస్తాను
నేను మనిషిని, నేను తెలుగువాణ్ణి, ప్రతి ఉగాది నా పుట్టినరోజు.

పాటలు రాయడం శర్మగారికి అలవాటు - ఎన్ని సొగసుల మూట మా తెలుగు పాట, ఎన్ని తెనియలొలుకు మా తెలుగు పలుకు. 1967 లో విడుదలైన వాహిని వారి "రంగులరాట్నం" లో థీమ్ సాంగ్ గా ఉన్న పాట శర్మగారు రాసిందే. సాలూరు రాజేశ్వరరావుగారు సంగీతం కూర్చారు - ఇంతేరా ఈ జీవితం - పేజీ 312 -

ఇంతేరా ఈ జీవితం, 'కలిమి నిలవదు - లేమి మిగలదు - కలకాలం ఒక రీతి గడవదు!
నవ్విన కళ్ళే చెమ్మగిల్లవా? వాడిన బ్రతుకే పచ్చగిల్లదా?
ఇంతేరా ఈ జీవితం! తిరిగే రంగులరాట్నమూ! బ్రతుకే రంగులరాట్నమూ!'
'ఏనుగు పైని నవాబు! గాడిదపైని గరీబు!
గుర్రం మీద జనాబు! పల్లకిలోని షరాబు!
నడిచేదారుల గమ్యమొక్కటే! నడిపేవానికి అందరొక్కటే!
ఇంతేరా ఈ జీవితం! తిరిగే రంగులరాట్నమూ! బ్రతుకే రంగులరాట్నమూ!'
'కోరిక ఒకటి జనించు! అది తీరక ఎడద దహించు!
కొరనిదేదోవచ్చు! శాంతి సుఖాలను తెచ్చు!
ఏది శాపమో ఏది వరమ్మో....ఏది శాపమో ఏది వరమ్మో
తెలిసీతెలియక అలమటించుటే ఇంతేరా ఈ జీవితం!
తిరిగే రంగులరాట్నమూ! బ్రతుకే రంగులరాట్నమూ!'
'త్యాగమొకరిదీ! ఫలితమొకరిదీ! అమ్మ ప్రాణమా ఇద్దరిదీ!
వ్యధలూ! బాధలూ! కష్టగాథలూ! చివరకు కంచికి వెళ్ళే కథలే!
ఇంతేరా ఈ జీవితం! తిరిగే రంగులరాట్నమూ! బ్రతుకే రంగులరాట్నమూ!'
'ఆగదు వలపూ! ఆగదు వగపూ! ఆగదు జీవనమాగదు!
ఎవరు కులికినా ఎవరు కుమిలినా ఆగదు కాలం ఆగదు!
జీవనవాహిని ఆగదు!
ఇంతేరా ఈ జీవితం! తిరిగే రంగులరాట్నమూ! బ్రతుకే రంగులరాట్నమూ!'
'కలిమి నిలవదు! లేమి మిగలదు! కలకాలం ఒక రీతి గడవదు!
నవ్వినకళ్ళే చెమ్మగిల్లును! వాడిన బ్రతుకే పచ్చగిల్లును!
ఇంతేరా ఈ జీవితం! తిరిగే రంగులరాట్నమూ! బ్రతుకే రంగులరాట్నమూ!
ఇరుగింటిలోన ఖేదం! పొరుగింటిలో ప్రమోదం!
రాలిన పువ్వులు చీకటి రేయి! ఇరువురి మనసుల వెన్నెల హాయి!
ఇంతేరా ఈ జీవితం! తిరిగే రంగులరాట్నమూ! బ్రతుకే రంగులరాట్నమూ!'

టాగోర్ ఒకేంపో లేఖలని తెలుగులోకి తర్జుమా చేశారు - "ఎవరీ సుందర స్త్రీమూర్తి ?" అన్న శీర్షికన.

శ్రీ శర్మగారి వ్యక్తిత్వం:

వారి రచనలకంటే ఉన్నతమైంది వారి వ్యక్తిత్వం. వారి సంస్కార సౌందర్యం (అంటే వారి మాటతీరు (voice culture) వారి వస్త్రధారణ)వారి అంతరంగ పరిమళాన్ని వెదజల్లుతుంది. శర్మగారి స్వరంలో సంగీతం ఉంది. గాత్రంలో మాధుర్యం ఉంది. మాటల కూర్పే కాదు, వాటి ఉచ్చారణలోని శ్రావ్యత కూడా మనల్ని పులకింపజేస్తుంది. శర్మగారి ప్రతి పలుకుకు రుచి, రంగు, వాసన ఉంటాయి.

వారిలో స్వాభావికంగా ఉన్న మాటల లాలిత్యం, వారి పలుకుల సంస్కారం శ్రోతల్ని వివశులను చేస్తుంది. వారి మాటల్లో ఉన్నది కేవలం ఆర్ద్రత కాదు, మార్దవం కాదు, అది వచస్సౌరభం మాత్రమే అయితే అంత ప్రగాఢంగా శ్రోతల మనస్సులపై ముద్ర వెయ్యదు. వారి మాటల్లోని సంస్కారం మన మాటలకూ సంస్కారం అద్ది, మన పలుకుల తీరునే మారుస్తుంది. వారి మనోనైర్మల్యం గంగా తరంగంలాగ చదువరుల లేత శ్రోతల మనస్సులను పునీతం చేస్తుంది. శర్మగారి రచనా సముచ్చయమంతా వారి అంతరంగ జీవితాన్ని సమగ్రంగా చిత్రించేదే. అదొక పరిపూర్ణ జీవన చిత్రం. సాహిత్యమే ఆయన ఊపిరి. సాహిత్యమే వాస్తవం. వాస్తవమే సాహిత్యంగా గడిచింది వారి జీవితం. వాల్మీకం ఎంత వాస్తవమో, మధురవాణీయం అంతే వాస్తవం. అదే శర్మగారి అద్వైతం. "నవచేతనను మాలో నింపి, సంస్కారాన్ని మాకు అద్ది, మానవతకు ప్రతిరూపంగా నిలిచిన శ్రీ శర్మగారు మా ఊపిరిలో ఊపిరి, మా ప్రాణంలో ప్రాణం" అంటారు విద్యార్థులు.

కాసుల శ్రీనివాసులు, హైదరాబాద్. ఫోన్: 970 478 6663.

డాక్టరు శ్రీమతి ముత్తులక్ష్మిరెడ్డి

(1886 -1968 A.D)

– *గారపాటి కోటమ్మ*

డా. శ్రీమతి ముత్తులక్ష్మిరెడ్డి విద్యావేత్త, సామాజిక సంస్కర్త, మహిళా హక్కుల కార్యకర్త, రచయిత, రాజకీయవేత్త మరియు అమితమైన ధైర్యశాలి. ఈమె భారతదేశంలో తొలి మహిళా హౌజ్ సర్జన్ మాత్రమేగాక తొలి మహిళా ఎమ్మెల్యేగా కూడా భారతదేశ స్వాతంత్ర్య సంపాదనకు ఎంతగానో కృషి చేశారు. అఖిల భారత మహిళా సమాఖ్య, మహిళా జాతీయ సమితి మరియు క్రైస్తవ, ముస్లిం సంఘాలను ఏర్పాటు చేసి మహిళలను చైతన్యవంతులను చేసేవారు. దానితో సరిపెట్టుకోక సైమన్ కమీషన్, రౌండ్ టేబుల్ సమావేశాలలో నిస్పాక్షపాతంగా, నిర్భయంగా మాట్లాడి మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారు. ముఖ్యంగా దేవదాసీ విధానాన్ని సమూలంగా రూపుమాపడానికి ప్రయత్నించడమేగాక విజయాన్ని సాధించినారు.

డా. ముత్తు లక్ష్మిరెడ్డి పుదుక్కోటై సంస్థానంలో నారాయణ సామి, చంద్రమ్మాళ్ దంపతులకు జూలై 30, 1886లో జన్మించారు. ఆడపిల్లల చదువులపై ఆంక్షలున్న ఆకాలంలోనే ముత్తులక్ష్మి 13 సంవత్సరాలకే 10వ తరగతి పూర్తిచేశారు. అమ్మాయి అనే కారణంతో మహారాజా కళాశాలలో ఈమెను చేర్చుకోలేదు. అయితే అప్పటి పుదుక్కోటై రాజావారు ఆమె ప్రతిభను గుర్తించి ఆ కళాశాలలో చేరేలా సాయం చేయడమేగాక స్కాలర్‌షిప్ కూడా ఇచ్చారు. ఆ తరువాత మద్రాస్ వైద్య కళాశాలలో 1912 నాటికి వైద్య విద్య పూర్తిచేసి దేశంలోనే తొలి హౌజ్‌సర్జన్‌గా నిలిచారు. అలాగే 1926లో మొదటి శాసన సభ్యురాలిగా ఎన్నుకోబడి అందరి మన్ననలు అందుకున్నారు. ఆ తరువాత దేశం మొత్తం మీద సత్యాగ్రహాలు, శాసన ధిక్కారాలు, పికెటింగులు ఎక్కువగా జరగడం సహించలేని ఆంగ్ల ప్రభుత్వం గాంధీజీని అరెస్ట్ చేసింది. అయితే దీనిని తట్టుకోలేని ఈమె గాంధీజీ మీద ఉండే గౌరవంతో తృణప్రాయంగా ఆ పదవిని వదిలివేసి గాంధీజీ శిష్యురాలిగా కొనసాగారు. ఈమె విద్యావేత్తగా స్త్రీలందరికి జాతీయ భావంతో పాటు రాజకీయ చైతన్యం కలిగించాలని ఎంతగానో ప్రయత్నించేవారు. బ్రిటీష్ ఇండియాలో జరుగుతున్న అవినీతిని, అసమానతలను ఎండగట్టడానికి డా. ముత్తు లక్ష్మిరెడ్డి "స్త్రీ ధర్మ" అనే ఇంగ్లీషు పత్రికను ప్రారంభించినారు. ఈ పత్రిక క్రమేణా ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. ఈమె బహిరంగ సభలు ఏర్పాటు చేసి స్త్రీలను చైతన్యవంతులను చేయడానికి అనేక గంభీరోపన్యాసాలు చేసేవారు. 1933లో గాంధీజీ మద్రాసు వచ్చిన సందర్భంలో మహిళా సమాఖ్యకు అధ్యక్షురాలిగా ఉన్న డా. ముత్తు లక్ష్మిరెడ్డి స్త్రీల సమస్యలను గాంధీజీతో చర్చించడానికి వీలుగా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి అందులో భాగంగా దేవదాసీ విధానం రూపుమాపడానికి "దేవదాసీ నిర్మూలనా చట్టాన్ని" ప్రవేశపెట్టి అది శాసనంగా రూపొందడానికి ప్రయత్నిస్తున్నాను అని చెప్పగానే గాంధీజీ తాను నడిపే "యంగ్ ఇండియా" పత్రిక ద్వారా ఈ బిల్లు విజయం సాధించడానికి చేతనయినంత సహకారం అందిస్తానని చెబుతూ, స్త్రీల సమస్యలకొరకు స్త్రీలు కూడా కృషి చేయాలన్నారు.

డా. ముత్తులక్ష్మిరెడ్డి తల్లి చంద్రమ్మాళ్ "ఇసాయివెల్లలార్" అనే దేవదాసి వర్గమహిళ. ఆమె తల్లి ఒక దేవదాసీగా పడిన కష్టాలను తెలుసుకొని దేవదాసీ వ్యవస్థకు వ్యతిరేఖంగా పోరాటం చేయడం ప్రారంభించారు. అందులో భాగంగానే దేవదాసీలకు వారి పిల్లలకు రక్షణగా ఈమె "అవ్వైహోం" అనే అనాధశరణాలయాన్ని 1930లో స్థాపించారు. జాతి, మత, కుల వివక్షత లేకుండా అనాధలందరిని ఆమె కాపాడేవారు. అంతేగాక వేశ్యాగృహాలను, మహిళలు మరియు ఆడపిల్లల అక్రమ రవాణాను అడ్డుకొనేవారు.

మిగతాది 79వ పేజీలో...

ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారిణులు
(1532– 1625)

– *తంగెడ విశ్వేశ్వర ప్రసాద్*

తమతో సమానమైన గుర్తింపు పొందకుండా అవరోధాలు కల్పించిన పురుష ప్రపంచంవల్ల, ఆర్టు, తదితర రంగాల్లో అణచివేయబడిన వ్యవస్థలవల్ల, ప్రతిభావంతులైన స్త్రీలు తగిన గుర్తింపు పొందలేకపోయారు. అంతేకాని ప్రతిభ లేకపోవడంవల్ల కాదు అని లిండా నాచ్‌లిన్ *(Linda Nochlin)* "గొప్ప స్త్రీ కళాకారులు ఎందుకులేరు?" అన్న తన పరిశోధనా వ్యాసంతో సంచలనం సృష్టించింది. చరిత్రలో గొప్ప కళాకారులు ఎందరో ఉన్నారని సోపపత్తికంగా తన వాదనను నిరూపించింది. లిండా నాచ్‌లిన్ అమెరికా ఆర్ట్ హిస్టోరియన్. న్యూయార్క్ యునివర్సిటీ ఫైనార్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రొఫెసర్. కళాచరిత్రలో ప్రముఖ స్త్రీవాది. 1971లో వెలువడిన *Why There Have Been No Great Women Artists* పెనుసంచలనం కలిగించిన మొదటి స్త్రీవాద వ్యాసం లిండా నాచ్‌లిన్‌ది. ఆ వ్యాసం ప్రేరణతోనే పెయింటింగ్ రంగంలో అసాధారణమైన ప్రజ్ఞను చూపి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన కొందరు మహిళా పెయింటర్లను కాలక్రమానుగతంగా పరిచయం చేయడమే ఈ వ్యాస పరంపర ఉద్దేశం.

సోఫోనిస్బా ఆంగ్విసోలా *(Sofonisba Anguissola)*:

అంతర్జాతీయ ఖ్యాతిగడించిన తొలి మహిళా పెయింటర్ సోఫోనిస్బా ఆంగ్విసోలా. స్పెయిన్ దేశ తొలిదశ మహిళా పెయింటర్లలో ప్రముఖురాలు. ఆమె జననం క్రోమేనియాలో (1539) కాగా, మరణం (1625) పాలెర్మోలో. పునరుజ్జీవన యుగపు పెయింటరు. ఉన్నత వర్గానికి చెందిన బీదకుటుంబంలో జన్మించింది. ఫైనార్ట్స్‌లో కావలసిన పరిపూర్ణవిద్యనభ్యసించింది. స్థానిక పెయింటర్ల దగ్గర అప్రెంటిస్‌గా పనిచేసి, తర్వాత గొప్ప పెయింటర్‌గా రాణించింది. భావితరాలవారికి మార్గదర్శిగా నిలిచింది. యౌవన దశలో రోమ్ పర్యటనలో మైఖలేంజిలోతో కలిగిన పరిచయంతో ఆమె ప్రతిభకు గుర్తింపు వస్తుంది. మిలన్‌లో అల్బా డ్యూక్ పెయింటింగ్‌ను రచిస్తుంది. స్పెయిన్ రాణీ ఎలిజబత్‌కు పెయింటింగు అభిరుచి ఉండటంచేత ఆమెకు (పెయింటింగు) పాఠాలు చెప్పడానికి 1559లో మాడ్రిడ్ వెళ్తుంది. రాణీ యిష్టసఖి హోదాను పొంది *(Lady in waiting)* రాజకుటుంబంతో సన్నిహితంగా మెలగుతుంది. తర్వాత రాజు ఫిలిప్‌కు అధికార పెయింటర్‌గా నియమించబడుతుంది. రాచమర్యాదలకు, వారి అభిరుచులు, స్థాయికి తగ్గట్టుగా తన శైలిని మార్చుకుని రాజుల పోర్ట్రెయిట్‌లను రచిస్తుంది. రాణి మరణించిన తర్వాత, రాజుఫిలిప్ II ఆంగ్లిసోలాకు ఒక దొర *(Noble)*తో పెండ్లి జరిపిస్తాడు. అనంతరం సిసిలీ, పీజా, జనీవాల్లో ప్రముఖ పెయింటర్‌గా జీవిస్తుంది. 1579లో భర్త మరణించగా ఒరాజియో మెలినోను పెళ్ళిచేసుకుని 1620వరకు జెనీవాలో నివసిస్తుంది. పరిపూర్ణ జీవితం గడిపి 93వ యేట మరణిస్తుంది.

సోఫోనిస్బా ఆంగ్విసోలా తనవి, తన కుటుంబంలోని ఇతరులవి ఆకర్షణీయమైన పోర్ట్రెయిట్లను రచించింది. స్పెయిన్ రాజకోటలో ప్రశేశించడానికి ముందు పిల్లల బొమ్మలను చిత్రించింది. వాటి చిత్రీకరణలో ఆమె

సోఫోనిస్బా ఆంగ్విసోలా

ఆర్టిమీసియా జెంటిలిస్కి

సునిశిత పరిశీలనాశక్తి ప్రత్యేకంగా కన్పిస్తుంది. మలిదశలో మతపరమైన సన్నివేశాలకు పెయింటింగ్ రూపం యిచ్చింది. వాటిలో చాలావరకు పోయినవి పోగా కొన్ని మాత్రమే మిగిలిపోయాయి. అన్నీ కలిపి యాభైకిపైగా పెయింటింగులు వేసివుంటుందని అంచనా. తర్వాతి తరాలవారిపై చెరగనిముద్ర వేయడమేగాక, మహిళలు ధైర్యంగా పెయింటింగ్ క్షేత్రంలోకి ప్రవేశించడానికి దారిచూపి ఆదర్శంగా నిలిచింది. నిస్సంతు ఐనప్పటికీ తన సోదరీసోదరులతో, వారి సంతానంతో సత్సంబంధాలను కలిగివుంది. పోర్ట్రెయిట్‌లు, మతపరమైన పెయింటింగులు సమకాలీన జీవన చిత్రణలలో ఆమె చూపిన లాలిత్యానికి, సౌందర్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి. స్వీయచిత్రం, లూసియా మినర్వాలు ఛెస్ ఆడుతున్న చిత్రం మొదలైనవి ఇందుకు ఉదాహరణలు. రాజవంశీకులకు వేసిన ఆమె పోర్ట్రెయిట్‌లు ఉన్నత శ్రేణికి చెందినవిగా పలువురు మెచ్చుకున్నారు.

"మా తరంలో ఏ యితర మహిళా పెయింటర్లలో కనిపించని అనువర్తితా సామర్థ్యం, సౌందర్యం, పనితనం సోఫోనిస్బా పోర్ట్రెయిట్లలో కన్పిస్తాయి. డ్రాయింగ్‌లో, రంగుల వాడకంలో, పెయింటింగ్ చేయడంలో ప్రకృతిని యథాతథంగా అనుసరించిన ప్రతిభాశాలి, ప్రముఖ పెయింటర్ల చిత్రాలకు ప్రతిచిత్రాలు రూపొందించడంలో అసమాన ప్రతిభ చూపించింది" అని జార్జియో వాసరి ప్రశంసలు అందుకుంది.

బోస్టను, బుడాపెస్ట్, మాడ్రిడ్, ఫ్లోరెన్స్, నేపుల్స్, పోలెండ్‌లలోని మ్యూజియంలలో ఈ పెయింటర్ ప్రకృతి దృశ్యాలు, పోర్ట్రెయిట్‌లు ప్రదర్శితమౌతున్నాయి. చరిత్ర సృష్టించిన ఈ గొప్ప ఆర్టిస్ట్ గౌరవార్థం క్రెమెనియంలోని ఒక పాఠశాల సోఫో నిస్బా ఆంగ్విసోలా పేరుతో నడుస్తోంది. పెయింటింగు చరిత్రలో మహిళలయుగం అంటూ ఒకటి లేకపోయినా ఆంగ్విసోలా స్థానం, ప్రభావం చారిత్రికమైనవి. ఇతర మహిళలు ధైర్యంగా, యిష్టంగా పెయింటింగ్ రంగాన్ని ఎంచుకోవడానికి ఆమె ప్రభావం ప్రేరణగా నిలిచింది.

ఆర్టిమీసియా జెంటిలిస్కి *(Artemisia Gentileschi)*:

16వ శతాబ్దపు చివరి దశకంలో జన్మించి 17వ శతాబ్దంలో గొప్పగా రాణించిన పెయింటర్ ఆర్టిమీసియా జెంటిలిస్కి. కారవాజియో *(Caravageeio)* సాంప్రదాయానికి *(school)* చెందిన ప్రముఖ పెయింటర్. జననం రోమ్‌లో (1593) కాగా మరణం నేపుల్స్‌లో (1654). తన శక్తివంతమైన వ్యక్తిత్వంతో, ప్రతిభతో యూరప్ అంతటా గొప్ప గౌరవం పొందింది. ఆడపిల్లలు చర్చికితప్ప ఇంకెక్కడికీ వెళ్ళడానికి వీలులేని కట్టుబాట్లున్న కాలం అది. కాన్వెంటులో మాత్రమే చదువుకోవడానికి వీలుంది. కానీ ఆమె అందులోచేరి చదువుకోలేకపోయింది. తండ్రి ఒరాజియో జెంటిలిస్కి కూడా పెయింటర్ కావడం చేత ఆర్టిమీసియా తండ్రి స్టూడియోలో గంటలు గంటలు గడుపుతుంది. అప్పట్లో మగపెయింటర్లు ఆడపిల్లల సాయం తీసుకునే పద్ధతి ఉండేది. స్త్రీల నగ్నచిత్రాలు వేయడం కోసం స్త్రీలను మోడళ్ళుగా వాడుకునేవారు. కానీ స్త్రీలు మగవారి నగ్నచిత్రాలు వేయడం నిషేధం. ఒక చేపలు పట్టేవానికి ముద్దుయిచ్చి బదులుగా అతని నగ్నదేహాన్ని చిత్రించింది. తండ్రికి పెయింటింగులో సాయంచేస్తూ రంగులు కలిపే పద్ధతినీ, శైలినీ పరిశీలిస్తూ తనదైన సహజ ప్రతిభను అభివృద్ధి చేసుకుంది. తండ్రీ బిడ్డలు ఇరువురి పెయింటింగులలోనూ కొరవాజియో ప్రభావం కన్పిస్తుంది. 17 సంవత్సరాల వయసులో రూపొందించిన సుసానా - పెద్దలు *(Susana And Elders)* తొలిదశలోని మరికొన్ని పెయింటింగులు అందుకు ఉదాహరణలు.

1616లో 23వ యేట ఫ్లోరెన్స్‌లోని డ్రాయింగు అకాడెమీ *(Academia del Desegno)*లో ప్రవేశం పొందిన తొలి సభ్యురాలిగా చరిత్ర సృష్టించింది. యుక్తవయసులోనే యూరప్ అంతటా గుర్తింపు, గౌరవం పొందిన తోటి ఆడపిల్లలకు అసాధ్యమైన, అరుదైన స్వేచ్ఛాజీవితం గడిపింది. చెప్పుకోదగిన ప్రతిభాశాలి. కొంతకాలం నేపుల్స్‌లోనూ నివసించింది.

1611లో జరిగిన సంఘటన ఆర్టిమీసియా జీవితంపై చెరగని ముద్రవేసింది. ఆగస్టినో టస్సీ *(Ogastino Tassi)*, తండ్రికి సహకళాకారుడు. ఇరువురూ చర్చి లోపలి భాగాన్ని పెయిం టింగులతో అలంకరించే పని సంపాదిస్తారు. టస్సీ మరో స్త్రీ సాయంతో ఆర్టిమీసియాను రేప్ చేస్తాడు. న్యాయస్థానంలో కేసు నడుస్తుంది. నేరం నిరూపించే సాక్ష్యం దొరకక కన్యత్వ నిర్ధారణ పరీక్షలతో నరకం అనుభవిస్తుంది. దాని ఫలితమే ఆమె రూపొందించిన జూడిత్, హాల్‌పెర్న్ పెయింటింగులు. బైబిల్‌లో కథ ఆధారంగా, తనపై జరిగిన అత్యాచారానికి వివిధ రకాలుగా రూపం కల్పించింది. వాటిలోని రక్తపిపాసతో, మగవాడి కంఠాన్ని భయంకరంగా నరికివేసే స్త్రీని చిత్రించి తన కసిని, ప్రతీకారాన్ని తీర్చుకుంది. మళ్ళీమళ్ళీ తన పెయింటింగుల్లో హింసాప్రవృత్తి కన్పించడానికి కారణం ఆమె అనుభవించిన జీవితమే. స్త్రీలకుండే సహజ పరిమితులను అధిగమించి, శక్తివంతమైన పోపుల *(Popes)* అధికారాన్ని ధిక్కరించగలిగిన ధీశాలి. తల్లి తన చిన్నతనంలోనే మరణించగా పన్నెండవ యేటనుండే పురుషాధిక్య ప్రపంచంలో జీవించడం నేర్చుకుంది. ఆర్టిమీసియా జీవితాన్ని స్థూలంగా మూడు దశలుగా విభజించవచ్చు.

ఫ్లోరెంటైన్ దశ:

1640-20 మధ్యకాలంలో ఫ్లోరెంటైన్‌లో గడచిన మొదటిదశ. అత్యాచారఘట్టం అనంతరం ఆ బాధ నుండి విముక్తి కోసం తండ్రి ఒరాజియో ఆమె పెండ్లి జరిపిస్తాడు. భర్త ఫ్లోరెన్స్ పెయింటర్ పియరాం టోనియో *(Pierantonio Stiattesi)*. ఫ్లోరెంటెయిన్‌లో గడిపింది కొద్దికాలమే అయినా అది ఆమె జీవితంలో ఆనందంగా గడిపిన దశ. అక్కడ ఉన్నప్పుడే పెయింటర్‌గా ఆమె ఖ్యాతి వ్యాపించడం మొదలవుతుంది. రాజాస్థానంలో ఆశ్రయం సంపాదించి, రాజు కొలువులో పెయింటర్‌గా గౌరవాన్ని సంపాదిస్తుంది. ఇంగ్లండు రాజు చార్లెస్ అండదండలు కూడా తోడవుతాయి. అతని పోషణలో పనిచేస్తూ పలుకుబడిగలిగిన నాటి ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు పెంపొందించుకుంటుంది. శాస్త్రవేత్త గెలీలియో, టస్కన్ డ్యూక్, డచెస్‌ల ఆదరణలో పెయింటర్‌గా విజయవంతమైన జీవితం గడుపుతుంది. నిండుగర్భిణీ అయివుండి కూడా చర్చి రెండవ అంతస్తు లోపలి భాగంలో 'అలగరీ ఆఫ్ ఇన్‌క్లినేషన్' పెయింటింగ్‌ను వేయగలిగింది. ఆ నగ్నచిత్రంలో తన పోలికలు బాగా కనిపిస్తాయి. అదొక్కటేకాక ఆమె చిత్రించిన మహిళా రూపాల్లో తానే కనిపిస్తుంది. సాటి ఫ్లోరెంటెయిన్ పెయింటర్లందరితో సత్సంబంధాలు కలిగివుంది. భర్త చేసిన అనవసరమైన ఖర్చులవల్ల అప్పులవారి బాధ నుండి బయటపడడానికని భర్తను వదిలివేసి కుమార్తెతో తిరిగి రోమ్ చేరుకుంటుంది.

రోమ్- వెనిస్ దశ (1621-1630):

ఆర్టిమీసియా రోమ్ చేరుకున్న సంవత్సరమే తండ్రి ఒరాజియో జెనీవాకు వెళ్లిపోవడంతో కుమార్తెతో రోమ్‌లో ఒంటరి జీవితం గడపవలసివస్తుంది. పెయింటర్‌గా తనకున్న ప్రతిభకు, గౌరవానికి, వ్యక్తిత్వానికి, పరిచయాలకు రోమ్‌జీవితం సరిపోదు. ఆమె ప్రతిభ బైబిల్‌లోని కొందరు హీరోయిన్లను చిత్రించడానికే పరిమితమైపోతుంది. తగినంత పని లేకపోవడంతో, అవకాశాలు వెతుక్కుంటూ 1630లో వెనిస్ చేరుకుంటుంది. పెయింటింగులోని తన మాస్టరీకి, టెక్నిక్‌కు కిరాన్క్యురో *(Chirascuro)*, టెనిబ్రిజం *(Tenebrism)* ప్రతీకలుగా నిలిచే ద స్లీపింగ్ వీనస్, ఎస్థేర్ - ఎయ్‌హా స్యూరస్ *(Esther Ahasuerus)* పెయింటింగులు అప్పుడు రచించిన గొప్ప చిత్రాలు. (వెలుగునీడల ఉపయోగంతో పెయింటింగులో 3డి ఫలితం సాధించే సాంకేతిక నైపుణ్యం కిరాస్క్యూరో. కాగా ముదురు రంగుల మిశ్రమంతో పెయింటింగు *(Tone)*లో ప్రత్యేకతను చూపించే ప్రక్రియ టెనిబ్రిజం).

నేపుల్స్- ఇంగ్లండు దశ (1630-1654):

అనేక వర్క్‌షాపులతో, కళాప్రేమికులు ఉన్న నగరం నేపుల్స్‌కు ఇంకా మంచి అవకాశాలు దొరుకుతాయన్న ఆశతో చేరుకుంటుంది. అంతకుముందే ఆర్టిమీసియా ప్రతిభ అక్కడా వ్యాపించడంవల్ల, రాజులవద్ద ఆమె గొప్ప పెయింటింగులు కొన్ని ఉండటంవల్లా మంచి ఆదరణతో పాటు చేతినిండా పని దొరుకుతుంది. జీవితమంతా అక్కడే గడుపుతుంది. అయినా మధ్యమధ్య లండన్ పర్యటనలు చేస్తుంది. తాను స్వయంగా వేయడమేకాక, యితర

జూడిత్ లెయిస్టర్

ఆర్టిస్టులతో కలిసి పెయింటింగ్ చేపట్టింది. తండ్రి ఇంగ్లండ్ రాజు చార్లెస్ I కొలువులో ఉన్నప్పుడు (1938లో) అక్కడ ఆస్థాన పెయింటర్‌గా కుదురుకుంటాడు. ఆ రాజు పనుపున గ్రెనిజ్ *(Green wich)*లోని రాణీవాసం పైకప్పు లోపలి భాగం పెయింటింగు బాధ్యతను తండ్రితో పాటు పంచుకుంది. 1939లో తండ్రి మరణించినప్పటికీ అప్పగించిన పనిని పూర్తి చేస్తుంది. ఇంగ్లండు అంతర్యుద్ధం *(Civil war)* ప్రారంభం కావడానికిముందే 1642లో లండన్ నుండి బయటపడుతుంది. అడపాతడపా గొప్పవారి పెయింటింగులు *(Commissions)* చేసుకుంటూ శేష జీవితం నేపుల్స్‌లో గడుపుతుంది. 1650 వరకు చురుకుగా పనిచేసుకుంటూ 1656లో ప్రబలిన ప్లేగువల్ల మరణిస్తుంది. నేపుల్స్‌లోని కళాకారులందరినీ ఆ మహమ్మారి పొట్టన పెట్టుకుంది. సుసానా-పెద్దలు, డేవిడ్-బాత్షీబా *(David-Bath Sheba)* అన్న కళాఖండాలు నేపుల్స్‌లోని మలిదశలో సృష్టించినవే.

జూడిత్ లెయిస్టర్ *(Judith Leyster)* :

పెయింటింగ్ రంగంలో ధృవతార జూడిత్ లెయిస్టర్. జూడిత్ జాన్సు లెయిస్టర్ డచ్ స్వర్ణయుగపు పెయింటర్. నిత్యజీవితంలో సాధారణంగా కన్పించే దృశ్యాలు *(Gener scenes)*, పోర్ట్రెయిట్లు, స్టిల్‌లైఫ్ పెయింటింగులలో దిట్టగా సమకాలికులలో గొప్ప ఆర్టిస్టుగా గుర్తింపు పొందినప్పటికీ మరణానంతరం మరుగున పడిపోయింది. నెదర్లాండ్సులోని హార్లెమ్ *(Haarlem)*లో 1609లో జన్మించి హీమ్‌స్టీడ్ *(Heemstead)*లో మరణించింది. ఆ తర్వాత రెండు సంవత్సరాలకు పైగా లెయిస్టర్ పెయింటింగులన్నీ వేరే ఆర్టిస్టుల పేరున చలామణి అయ్యాయి. లెయిస్టర్ తండ్రి స్థానిక మధ్య ఉత్పత్తిదారుడు, బట్టలవర్తకుడు. కుటుంబంలో ఎనిమిదవ సంతానం లెయిస్టర్. తండ్రి వ్యాపారంలో దివాలా తీయడంతో కుటుంబ బాధ్యత లెయిస్టర్‌పై పడుతుంది. ఎవరివద్ద పెయింటింగు విద్యను నేర్చుకుందో కచ్చితంగా తెలియదుగానీ ఫ్రాన్స్ గ్రెబర్ *(Frans Grebber)*వద్ద శిష్యరికం చేసి ఉంటుందని కొందరి అభిప్రాయం. చిన్న వయసులోనే పెయింటింగులు వేయడం ప్రారంభించి, 24వ యేట ప్రతిష్టాత్మకమైన హార్లెమ్ పెయింటర్సు గిల్డులో సభ్యురాలయింది. సాటి డచ్ పెయింటర్ల పరిధిని దాటి కొద్దిమంది జనర్ పెయింటర్లలో ఒకర్తిగా గుర్తింపు పొందింది. లెయిస్టర్ పెయింటింగుల్లో హాల్సు ప్రభావం కన్పిస్తుంది. (హాల్సు కూడా పెయింటర్స్‌గిల్డ్ సభ్యుడే. పోర్ట్రెయిట్లలో జీవత్వం, చైతన్యం చూపించిన ప్రతిభావంతుడు) 1629-35 మధ్యకాలంలో విరివిగా పెయింటింగులు సృజించింది. ఆ కాలంలో వేసిన స్వీయ పోర్ట్రెయిట్‌ను గిల్డ్‌కు బహుమతిగా ఇచ్చింది. ఆ పోర్ట్రెయిట్‌లో అప్పటివరకూ స్త్రీల పోర్ట్రెయిట్లలో కన్పించిన *rigidity*కి స్వస్తిచెప్పి జీవాన్ని, చైతన్యాన్నీ నింపి కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. అది పోర్ట్రెయిట్ చరిత్రలో కొత్త మలుపుగా గుర్తింపబడింది. టెనెబ్రిసీ శైలిలో కూడా అభిరుచి చూపించింది. కారవాజియో అతని అనుచరులు అనుసరించిన శైలి టెనెబ్రిజం. ముదురు రంగుల మిశ్రమంతో పెయింటింగుకు ప్రత్యేక లక్షణం కల్పించడం దీని ప్రత్యేకత.

17వ శతాబ్దంలో పెయింటర్స్ గిల్డ్‌లో చేరిన కొద్దిమంది మహిళా పెయింటర్లలో లెయిస్టర్ ఒక్కతే ప్రముఖురాలిగా గుర్తింపు పొందింది. పెండ్లి తర్వాత కూడా తన ఇంటిపేరుతోనే కొనసాగింది. లెయిస్టర్ పుట్టుకతో ఒక ధృవతార వెలిసింది అని చరిత్రకారులు అభిప్రాయపడ్డారు.

ప్రతిష్ఠాత్మక హారమ్ పెయింటర్స్ గిల్డ్ నుండి బయటకు వచ్చిన తర్వాత లెయిస్టర్ స్థాపించిన సొంత స్టూడియోలో వర్ధమాన కళాకారులెందరో శిక్షణ పొందారు. వారిలో ఒకణ్ణి ఫ్రాన్స్ హాల్స్ తన గిల్డ్‌లో చేర్చుకున్నందుకు, అతనిపై అభియోగం మోపి జరిమానా పడేలా చేసింది. అద్దంలో మహిళ *(Woman in the Mirror)* అన్న స్వీయ రూపచిత్రం, సంతోషపు జంట *(The Happy Couple)*

లెయిస్టర్‌కు పేరుప్రఖ్యాతులు తెచ్చిన పెయింటింగులు. గిల్డ్‌లో సహపెయింటర్ జాన్ మెన్సీ మోలెనేర్ *(Jam Mienese Molenaer)*తో వివాహం జరిగిన తర్వాత, కొంతకాలం భర్తతో ఆమ్‌స్టర్ డాంలో నివసించింది. పిల్లల పోషణ, కుటుంబ వ్యాపారం. ఆస్తిపాస్తుల వ్యవహారాలు చూసుకోవలసిరావడంవలన పెయింటింగ్ చేయడం దాదాపుగా తగ్గించుకుంది. 1643లో జన్మస్థలం హార్లెమ్‌కు చేరుకుని శేషజీవితం అక్కడే గడిపింది. అన్నీ కలిపి 35 పెయింటింగులు లెయిస్టర్‌విగా నిర్ధారింపబడినాయి. ఐతే అవన్నీ భర్తపేరిట, కొన్ని హాల్సుపేరిట ప్రచారం పొందాయి.

రెండు శతాబ్దాలకు పైగా మరుగునపడి లెయిస్టర్‌కు దక్కవలసిన పేరుప్రఖ్యాతులు, జరిగిన అన్యాయం వెలుగు చూసిన వైనం ఉత్సుకతను కలిగిస్తుంది. 1893లో యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనతో వాస్తవాలు బయటపడ్డాయి. పెయింటింగు నిపుణుడు లూవర్ *(Louvre)* కొనుగోలు చేసిన ఒక పెయింటింగుపైన పొడి అక్షరాలతో చేసిన విలక్షణమైన సంతకాన్ని చూశాడు. దానిపైన ఫ్రాన్స్‌హాల్స్ దొంగనంతకం ఉండటం గమనించాడు. మరుగునపడి ఉన్న సంతకం లెయిస్టర్‌దిగా నిర్ధారించాడు. పెయింటింగులన్నిటి మీదా JL అన్న పొడి అక్షరాలు, వాటిపైన నక్షత్రం గుర్తు *(monogram)* వేయడం లెయిస్టర్ సంతకంలోని ప్రత్యేకత. అలా మరుగునపడిపోయిన సంతకం ఎన్నో పెయింటింగ్‌ల మీద ఉండడంతో అవన్నీ లెయిస్టర్‌విగా ధృవీకరించబడ్డాయి. దానితో ఆమె అర్హతకు, ప్రతిభకు తగిన గుర్తింపు పొంది, పెయింటింగు చరిత్రలో తనదైన ప్రత్యేక స్థానాన్ని, ధ్రువతారగా గౌరవాన్ని పొందగలిగింది. లెయిస్టర్ పెయింటింగులు లండన్, పారిస్, వాషింగ్టన్, హేగ్, ఆమ్‌స్టర్‌డాంల మ్యూజియాలలో, స్వీయచిత్రం నేషనల్ గాలరీలోనూ ప్రదర్శింపబడుతున్నాయి.

ఎలీసబత్ విజీ లే బ్రాన్ *(Elisabeth Vigee Le Brun):*

పోర్ట్రెయిట్ క్వీన్ ఎలీసబత్ విజీ లే బ్రాన్‌ది 18వ శతాబ్దపు మేటి యూరోపియన్ పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్‌ల్లో ప్రత్యేకస్థానం. అనేక అకాడమీలలో సభ్యత్వం పొంది ఎక్కడికి వెళ్ళినా గొప్ప వ్యక్తుల అండదండలతో విజయవంతంగా వృత్తి జీవితాన్ని గడిపింది. అందచందాలతో, తెలివితేటలతో పెయింటింగ్ రంగంలో గొప్పగా రాణించింది. ఆమె పనితనంలోని అందం, ఆకర్షణ, సౌకుమార్యం వీక్షకులకు ఆహ్లాదం కలిగిస్తుంది. తన అనుభవాలు, జ్ఞాపకాలను *memoirs* పేరిట మూడు సంపుటాలుగా వెలువరించింది. తన పెయింటింగుల వివరాలను, నాటి యూరప్ రూపురేఖలను విపులంగా వర్ణించింది.

ఎలీసబత్ విజీ లే బ్రాన్

లూయీ విజీ ఫ్రెంచి పోర్ట్రెయిట్ పెయింటరు. అతని భార్య జీన్ హెయిరడ్రస్సర్. వారి సంతానమే ఎలీసబత్. పారిస్‌లో 1775లో జన్మించింది. ఐదోయేట కాన్వెంటులో చేరి తండ్రి మరణించేవరకూ చదువుకుంది. పెయింటింగులో తొలిపాఠాలు తండ్రివద్దే నేర్చుకుంది. తన పన్నెండవయేట తండ్రి మరణించడంతో, తల్లి జాక్వీస్ ఫ్రాంకోజ్ అన్న సంపన్న వజ్రాల వ్యాపారిని పెళ్ళి చేసుకుంటుంది. వారి నివాసం ధనికవర్గాలవారు నివసించే రాజభవన సమీపానికి మారుతుంది. ఫ్రాంకోజ్ తన తండ్రి వస్తువుల్ని, దుస్తుల్ని ఉపయోగించడం భరించలేకపోయిన ఎలీసబత్ అతణ్ణి అసహ్యించుకునేది. తొలి యౌవన దశలోనే అసంఖ్యాకంగా పోర్ట్రెయిట్లను పెయింట్ చేసింది. ప్రముఖవ్య క్తులు ఈమె చిత్రాలకు మోడళ్ళుగా పనిచేయడంతో పరిచయాలు పెరిగిపోయాయి. క్వీన్‌మేరీ ఆంటొనెట్‌వి చాలా పోర్ట్రెయిట్‌లను చిత్రించడంతో వారి మధ్య స్నేహం పెరిగిపోయింది. ఆ వివరాలు తరువాత తెలుసుకుంటాం. 1774లో తోడి ఆర్టిస్ట్ జీన్ బాప్టిస్ట్ లే బ్రాన్, కళాఖండాల వ్యాపారితో పెండ్లి జరుగుతుంది. 1780లో కుమార్తె జన్మించిన తర్వాత భర్తతో కలిసి ఫిన్లాండు పర్యటించింది. ఫ్లెమిష్ కళాకారుల, ముఖ్యంగా ప్రముఖ పెయింటర్ పీటర్ పాల్ రూబెన్స్

రోజా బూనర్

ప్రభావంతో, టోపీ ధరించిన తన స్వీయచిత్రాన్ని *(Straw hat portrait)* సృష్టించింది. ఎలీసబత్ పోర్ట్రెయిట్లలో దీన్ని ప్రముఖంగా చెప్పుకుంటారు. మైహోక జీవితం విఫలం కావడం, ఇంతలో ఫ్రెంచి విప్లవం రావడంతో భర్తను వదిలి తన ఏకైక కుమార్తెతో ఇటలీ చేరుకుంటుంది. కొంతకాలం ఇటలీలోనూ, రష్యాలోనూ గడిపిన తర్వాత తిరిగి ఫ్రాన్స్ చేరుకుంటుంది. నెపోలియన్ పాలన నచ్చక 1803-05ల మధ్య ఇంగ్లండులో పనిచేస్తుంది. తర్వాతి జీవితమంతా మధ్యమధ్య బయటి దేశాలకు ప్రయాణం చేస్తూ పారిస్‌లో గడుపుతుంది.

కుమార్తెను ప్రసవించిన రోజు స్టూడియోలో పనిచేసుకుంటూ, పురిటినొప్పులు పడుతూనే మధ్యమధ్య పెయింటింగ్ పనిచేశాను అని తన జ్ఞాపకాలలో రాసుకుంది. పైనంఘటన ఆమె వ్యక్తిత్వం ఎంత దృఢమైనదో తెలియజేస్తుంది. జీవించినంతకాలం 'మేడం లే బ్రాన్' గా పిలిపించుకుంది. ఈమె పనితనంలో రొకోకో *(rococo)*, నియోక్లాసిసిజం ప్రభావం కనిపిస్తుంది. ఎలీసబత్ పెయింటింగ్‌లు యూరప్, అమెరికాల్లోని ప్రముఖ మ్యూజియాలలో ప్రదర్శింపబడుతున్నాయి. బిడ్డను ఎత్తుకుని ఉన్న ఆమె స్వీయచిత్రం (పోర్ట్రెయిట్) నాటి కళావిమర్శకుల నిందలకు గురైంది. కొంచెం విచ్చుకున్న పెదాలలో, చిరునవ్వుతో కన్పించే ఆ చిత్రం సాంప్రదాయ విరుద్ధంగా ఉంది అన్న విమర్శను ఎదుర్కోవలసి వస్తుంది. ఒక విమర్శకుడు ఆ చిత్రం స్వీయాను రక్తికీ, అశ్లీలతకూ ప్రతీక అని తీసిపారేశాడు. ఐనా ఎలీసబత్ కాన్వాసుపై తన మాతృత్వపు చిరునవ్వుకు, చెరగనిరూపం యిచ్చినందుకు ఏమాత్రం బాధపడలేదు. ఫ్రెంచిరాణీ మేరీ ఆంటొనెట్ *(Marie Antoinette)* - విప్లవానికి ముందు ఫ్రాన్స్ దేశపు చివరిరాణి - ప్రాపకంలో ఆమెవి, ఆమె కుటుంబానికి చెందినవి ముప్పైదాకా పోర్ట్రెయిట్‌లు వేసింది. ఆస్థాన పెయింటర్‌గా కీర్తిప్రతిష్టలనార్జించింది. 1783లో రాయల్ అకాడమీ సభ్యురాలిగా సకల మర్యాదలు, సౌకర్యాలు పొందగలిగింది. పూర్తి సభ్యత్వంతో అలా గౌరవం పొందిన కొద్దిమందిలో ఎలీసబత్ ఒకరు. విప్లవానంతరం రాచరికం పోవడంతో ఆమె సభ్యత్వం కూడా తొలగించబడుతుంది. 1789లో రాజకుటుంబన్ని నిర్బంధించడంతో కూతుర్ని తీసుకొని ఎలాగో ఇటలీ చేరుకుని ఆపై పన్నెండు సంవత్సరాలు అక్కడే గడుపుతుంది. ఇటలీలో ఉన్న సమయంలో మూడు అకాడమీల సభ్యత్వం పొందగలిగిన ప్రతిభాశాలి. నేపుల్స్‌లో ఆస్ట్రియా యువరాణి మరియా కరోలినా *(Maria Corolina)*, ఆమె కుటుంబసభ్యుల పోర్ట్రెయిట్‌లను చిత్రించి వారి ఆదరణనూ పొందగలుగుతుంది.

గ్రీకు కథ ఆధారంగా రూపొందించిన సిబిల్ *(Cybele)* ఆమెకు అభిమానపాత్రమైన చిత్రం. వెనిస్, వియన్నా, డ్రెస్‌డెన్, పీటర్స్‌బర్గ్‌లలో సిబిల్ చిత్రాన్ని ప్రదర్శించి మెప్పుపొందినట్లు తన మెమోరియల్స్‌లో చెప్పుకుంది. రష్యా (1795-81)లో ఉన్న సమయాన పోలెండ్ రాజు చిత్రాన్నీ, ఇతర సంపన్నుల పోర్ట్రెయిట్‌లనూ రూపొందించి వారి గౌరవాన్నీ చూరగొంది. పీటర్స్‌బర్గ్ ఫైనార్ట్స్ అకాడమీ సభ్యత్వ గౌరవ పురస్కారాన్ని సాధించింది. ఆరువందలకు పైగా పోర్ట్రెయిట్‌లు, రెండువందల ప్రకృతి దృశ్యాలు, ఇంకా ఎన్నో ఇతర చిత్రాలను రూపొందించింది. తన జీవిత కాలంలోనే పలు ప్రదర్శనల్లో తన చిత్రాలనేకం ప్రదర్శింపబడడం విశేషం. యూరప్ పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్‌గా, పెయింటింగ్ క్వీన్‌గా గొప్ప ఖ్యాతినిగడించింది. ఆమె జీవితం, పోర్ట్రెయిట్‌ల మీద 2018లో వచ్చిన డాక్యుమెంటరీ ఆమె జీవితాన్నేకాక 18వ శతాబ్దపు యూరప్‌ను వాస్తవంగా చూపిస్తుంది. అమెజాన్ ప్రైమ్‌లో చూడవచ్చు.

రోజా బూనర్ *(Marie`Rosalie Bonheur)*:

ఫ్రెంచి దేశపు అత్యున్నత గౌరవం పొందిన, పందొమ్మిదవ శతాబ్దికి చెందిన ఫ్రెంచి దేశపు తొలి మహిళా పెయింటర్ రోజా బూనర్ (1822-1899) జంతు పెయింటర్. ఆర్టిస్టుల కుటుంబంలో జన్మించింది. తల్లి సోఫియా బూనర్, తండ్రి ఆస్కార్ రేమండ్ బూనర్‌ల పెద్ద సంతానం. తల్లి పియానో

టీచర్ కాగా, తండ్రి లాండ్‌స్కేపులు, పోర్ట్రెయిట్‌లు పెయింట్ చేసిన ప్రముఖుడు. బూనర్ తోబుట్టువులు గూడా పెయింటర్లే. అయినా, తండ్రి, రోజాలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాడు. బూనర్‌కు కళాప్రతిభ వంశపారంపర్యంగా సంక్రమించింది. రోజా బూనర్ బోర్డో *(Bordeux)*లో 1822లో జన్మించింది. ఫోన్‌టెన్ బ్లో *(Fontain- bleau)*లో 1899లో మరణించింది. రోజాకు ఆరేండ్ల వయసులో బూనర్ కుటుంబం పారిస్ చేరుకుంది. చిన్నతనం అంతా అల్లరిచేస్తూ, చదువులో శ్రద్ధపెట్టకుండా గడిపింది. మాటలు సరిగా రాకముందే పెన్సిల్‌తో ఏవేవో ఆకారాలు గీయగలిగింది. తల్లి సోఫియా అక్షరాలను చూపుతూ వాటికి జంతువుల బొమ్మలను అన్వయిస్తూ చదువు చెప్పింది. అలా చిన్నతనంలోనే రోజాకు జంతువుల పైన యిష్టం యేర్పడింది. స్కూలు జీవితం సరిగా సాగనందువల్ల పన్నెండేళ్ళ వయసులో కుట్టుపని శిక్షణలో చేరిస్తే దాన్నీ వదిలేసింది. ఆఖరికి తండ్రి రోజాకు పెయింటింగులో శిక్షణ గరుపుతాడు. సజీవ జంతువుల్ని ఇంటికి తీసుకవచ్చి వాటి శారీరిక కదలికలను, నిర్మాణాన్ని వివరించాడు.

ఆడపిల్లలకు, పైగా 14 సంవత్సరాలలోపువారికి అకాడమీలలో ప్రవేశం ఉండేదికాదు. అందువల్ల తండ్రి రోజాకు పారిస్‌లోని లూవర్ *(Louvre)* మ్యూజియంలో సభ్యత్వం తీసుకుని మ్యూజియంలోని ప్రముఖ కళాఖండాలను కాపీ చేసేపని అప్పగించాడు. అందులో రోజా ప్రావీణ్యం గడించి స్వయంగా పెయింటింగులు వేయడం మొదలుపెట్టి పరిపూర్ణత సాధించింది. 23 ఏండ్ల వయసుకే పెయింటర్‌గా ప్రత్యేస్థానం సంపాదించుకుంది. జంతు పెయింటింగుల ద్వారా అనేక బహుమతులు గెలుచుకుంది. 1845లో పారిస్ సెలూన్ అవార్డుగెలుచుకుంది. ఫ్రెంచి ప్రభుత్వం పనుపున పెద్ద ఆయిల్ పెయింటింగు నివర్‌నేలో పొలందున్నుతున్న *(Ploughing in the Nivernais)* దృశ్యాన్ని చిత్రించి 1849లో ప్రదర్శించింది. దాంతో రోజా ప్రతిభకు ప్రచారమూ, తొలి విజయమూ లభిస్తుంది. 1855లో రూపొందించిన గుర్రాల సంత *(Horse Fair)* 8 అడుగుల వెడల్పు, 16 అడుగుల పొడవు కొలతల పెద్ద పెయింటింగ్ రోజాను పెయింటింగ్‌లో సుప్రతిష్టం చేసింది. పారిస్‌లో వారంవారం జరిగిన హాస్పిటల్ రోడ్డు గుర్రాల సంతకు దెనుక దూరంగా లీలగా హాస్పిటల్ భవనం. గుర్రాల దెనుక చెట్లు, అందమైన ఆకాశం. అదుపు తప్పిన గుర్రాలు. వాటిని అదుపులో పెట్టే యజమానులను చూపించే గొప్ప పెయింటింగ్) శాశ్వతత్వం కల్పించింది. దీనితో రోజా అంతర్జాతీయ ఖ్యాతినార్జించింది. అదే సంవత్సరం స్కాట్‌లాండ్ పర్యటనలో విక్టోరియారాణిని కలుసుకుంది. ఆ పర్యటన తర్వాత రూపొందినవే హైలాండ్ షెపర్డ్, స్కాటిష్ రెయిడ్ పెయింటింగులు. ఆ రెండు చిత్రాలూ విక్టోరియా కాలపు ప్రజానీకాన్ని బాగా ఆకట్టుకున్నాయి. రోజా పెయింటింగులు ఫ్రాన్స్‌కంటే ఇంగ్లండులోనే ఆమెకు గుర్తింపును, గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. 1893లో షికాగోలో ప్రదర్శించబడి మన్ననలు పొందాయి. రోజా ప్రతిభను గుర్తించి ఫ్రాన్స్ ప్రభుత్వం ఆమెను అత్యున్నత పురస్కారం లీజియన్ ఆఫ్ ఆనర్‌తో గౌరవించింది. అంతటి గౌరవాన్ని పొందిన తొలి మహిళా పెయింటర్ రోజా బూనర్. ఆమె పెయింటింగులు, శిల్పాలు చాలా అమ్ముడుపోవడంతో ఆదాయం బాగా పెరిగిపోయింది. దాంతో ఫోన్‌టెన్ బ్లో సమీపాన పెద్ద ఎస్టేట్‌కు సొంతదారు అవుతుంది. దగ్గర నుండి పరిశీలించడానికై అందులో సింహాలను పెంచుకుంది. కుక్కలు, పందులు, గుర్రాలు, రకరకాల పక్షులకు తన ఎస్టేట్‌లో స్థానం కల్పించింది. బూనర్ మరణం తర్వాత ఎస్టేట్, ఆమె గౌరవార్థం మ్యూజియంగా మార్చబడింది.

వ్యక్తిగత జీవితం:

రోజాబూనర్ 19వ శతాబ్దపు నవీన మహిళగా గుర్తింపు పొందింది. తాను ఎంచుకున్న జంతు చిత్రణ వృత్తికి సౌకర్యంగా ఉంటుందని మగవారి దుస్తులు, పాంటు, షర్టు ధరించింది. లెస్బియన్‌నని బహిరంగంగా ఎన్నడూ ప్రకటించుకోలేదుగానీ ఆమె జీవనశైలినిబట్టి సులభంగా ఆ విషయం తెలిసిపోతుంది. తొలి జీవిత భాగస్వామి(ని) నథాలీ మికాస్ *(Nathale-Micas)*తో నలభైసంవత్సరాలు, మికాస్ మరణించిన తర్వాత అమెరికన్ పెయింటర్ ఏనా ఎలిజబత్ క్లంప్కే *(Anna Elizabeth Klumpke)*తోనూ సహజీవనం చేసింది. ఫ్రెంచి అధికారులు లెస్బియనిజాన్ని భ్రష్టత్వంగా, జంతుచర్యగా భావించినా, బూనర్ మాత్రం

తన వ్యక్తిగత జీవితాన్ని దాపరికం లేకుండా కొత్త దారిలో గడిపింది. పాంటు, షర్ట్, టై ధరించడం స్వేచ్ఛాప్రియత్వానికి గుర్తుగా భావించింది. లింగభేదాన్ని నిరసించింది. మగవారిలా సిగరెట్లు తాగడం, జుట్టు కత్తిరించుకుని, గుర్రపుస్వారీ చేయడం ద్వారా పురుషులకన్నా ఉన్నతమైన జీవితం గడుపుతున్నట్లు ప్రవర్తించింది. ఆమె జీవిత సహచరులు ఇంటిపనిలో నిమగ్నమైతే బాధ్యతగల ఇంటియజమానిగా తనను తాను భావించుకుంది. తన తర్వాతి తరం లెస్బియన్లకు ధైర్యంగా బ్రతికే దారిచూపింది. 77వ యేట చనిపోయినప్పుడు రోజాను, ఆమె మొదటి సహచరి పక్కనే సమాధి చేయడంతో ముగ్గురినీ ఒకేచోట చేర్చినట్లైంది. రోజా బూనర్ తర్వాత 1909 ఆమె సంపదకంతటికీ క్లంప్కే వారసురాలవుతుంది. బూనర్ మరణానంతరం కొంతకాలం మరుగున పడిపోయినా 1978 తర్వాత తిరిగి వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వం నిర్వహించిన ఫ్రెంచి లాండ్స్కేప్ అండ్ పెజంట్ (ప్రకృతి-గ్రామీణుడు) ప్రదర్శనతో ఆమె ప్రతిభ పునరుద్ధరింపబడింది. బూనర్ బ్రతికుండగానే ఆమెపై అనేక పుస్తకాలు వెలువడ్డాయి. రోజాబూనర్ స్వయంగా రాసిన పుస్తకం 'జ్ఞాపకాలు' 1910లో లండన్, న్యూయార్క్ నగరాల్లో విడుదలైంది. వాటిలో బూనర్ ఉత్తర ప్రత్యుత్తరాలు ఎన్నో చోటుచేసుకున్నాయి. ఆమె జీవితాన్ని, దృక్పథాన్ని తెలుసుకోవడానికి అవి బాగా తోడ్పడతాయి.

బూనర్ ప్రత్యేకతలు:

బూనర్ సజీవజంతువుల పెయింటింగులు, శిల్పాలు కూడా సృజించింది. ఆర్ట్‌లో రియలిజమ్ శైలిని పాటించింది. ఫ్రెంచి అత్యున్నత పురస్కారం పొందిన తొలి మహిళా పెయింటరే కాకుండా స్పెయిన్, బెల్జియం రాజుల సన్మానం, లండన్ రాయల్ అకాడమీ గౌరవ సభ్యత్వం పొందిన గొప్ప పెయింటర్. పారిస్ కళారంగంలో చోటుచేసుకుంటున్న నూతన ధోరణులకు ఆదరణ లభించడం ఒక కారణమైతే, వ్యాపార దృక్పథంతో ఫ్యాక్టరీ ఉత్పత్తులవలె బూనర్ పెయింటింగులు వేసిందన్న విమర్శ వ్యాపించడం మరోకారణంగా, రియలిజంపట్ల ఆదరణ తరిగిపోవడం, బూనర్ మహిళా పెయింటర్ కావడంతో ఆమెపట్ల చులకనభావం ఏర్పడింది. ఆమె కళాచరిత్రలో విజయవంతమైన పెయింటర్‌గాకంటే 19వ శతాబ్దపు అగ్రగామి ఫెమినిస్ట్‌గా చెరగని స్థానం సంపాదించుకుంది. ప్రస్తుతం బూనర్ పెయింటింగులు 56 దాకా వివిధ మ్యూజియాలలో ప్రదర్శింపబడుతున్నాయి. 1905లో ప్రపంచ మహిళా పెయింటర్లు అన్న పుస్తకం వెలువడగా బూనర్ గౌరవార్థం ఆ వ్యాస సంకలనానికి 'విగ్రే నుండి బూనర్ వరకు' అని ఉపశీర్షికను పెట్టారు.

టి.వి. ప్రసాద్, ఫోన్: +91 798 139 8250
e-mail: tangeda.prasad@gmail.com

"…. నేను చాలా సంవత్సరాలుగా **మిసిమి** పాఠకుడిని. ప్రతీ నెలా మొదటివారంలో తిరుపతిలోని విశాలాంధ్ర బుక్‌స్టాల్‌లో **మిసిమి** కొనటం అలవాటు. **మిసిమి** పత్రికలో ఎంతో అనుభవమున్న రచయితలచేత మంచిమంచి వ్యాసాలు వ్రాయిస్తున్నారు. వాటి ద్వారా ఆ పుస్తకాలు చదువుతున్న పాఠకులకు విజ్ఞానం, సంస్కారం అందిస్తున్నారు. అందమైన నాలుగు రంగుల చిత్రాలు మంచి పేపరుపై పుస్తకం అట్టలుగా ముద్రిస్తున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. నేను స్వతహాగా చిత్రకారుడిని. క్రితంనెల బాలి వ్రాసిన వడ్డాది పాపయ్యగారి జీవిత విశేషాలు బాగున్నాయి. మంచి పేపరు, అందమైన ముఖచిత్రాలు, విలువైన సమాచారంతో ఇంత మంచి పుస్తకం అందిస్తున్న మీ అందరికీ శతకోటి వందనాలు. నేను చెప్పేదేదీ అతిశయోక్తి కాదు. ఈ రోజులలో కరపత్రం వేయాలంటే చాలా ఖర్చవుతుంది. అటువంటిది 84 పేజీలు ఉన్న ఈ పుస్తకాన్ని కేవలం రూ. 30/- కే ఇవ్వటం ఆశ్చర్యం కలిగిస్తుంది. అందుకే నిజంగా మీది సమాజసేవే. పాఠకులకు ఊరికనే మీ పవిత్రమైన, విలువైన విజ్ఞానాన్ని పంచుతున్న మీ సంస్థవారికి మా తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను. మీరందరూ అన్నివిధాలా సుభిక్షంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను…"

సింగంపల్లి సత్యనారాయణ, తిరుపతి

మైసూరు వాసుదేవాచార్యులు

– వేలూరి కృష్ణమూర్తి

1945లో అనుకొంటా - నేను మైసూరు ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్‌గా ఉన్న సమయంలో ఒకరోజు నాతో మాట్లాడిన ఒక సంగీతజ్ఞుడు యిలా అన్నారు: "చూడండి! దూరపు కొండలు నునుపు. మనం బయటివారి సంగీతమే కావాలనుకొంటాము. ఇప్పుడు మీరు అరియకుడి రామానుజ అయ్యంగారిని పిలిపించండి. చంబై వైద్యనాథ అయ్యరుగారిని పిలిపించండి. వారూ పాడనీ, నేనూ పాడుతా. ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ అని మీరే నిర్ణయించండి!" నేను వారి మాటలను కొనసాగించక, "అంతటి ఘన విద్వాంసుల గానాన్ని బేరీజువేసి చూసి తీర్పు ఇచ్చే యోగ్యత నాకెక్కడ ఉన్నది స్వామీ?" అని చెప్పి విషయాన్ని మార్చా. కానీ అతను అన్నదానికంటే ఎక్కువ ధైర్యంగా, దర్పంతో అలాంటి మాటలనే చెప్పి బయటి విద్వాంసులతో పోటీచేసి జయభేరి కొట్టగలిగే మైసూరు సంగీత విద్వాంసుల జ్ఞాపకం వచ్చింది. అలాంటివారిలో ఇద్దరు - వీణె శేషణ్ణ, మరియు బిడారం కృష్ణప్ప - ఆ సమయానికే మరణించారు. ఇక మూడవవారు, మైసూరు వాసుదేవాచార్యులవారు - అంతటి ఆత్మప్రశంసపు మాటను తమకు తామే చెప్పుకొనేటటువంటివారు కాకున్నా, ఇతరులు ఆ మాటలను వారి విషయంలో చెప్పేవారు! ఆ సమయానికి, మైసూరు వాసుదేవాచార్యులవారు గాయకుడుగా మాత్రమేగాక వాగ్గేయకారుడుగానూ తమ కీర్తిని అప్రయత్నంగా స్థాపించుకొన్నారు. ఆ కాలానికంటే ముందు, బిడారం కృష్ణప్పగారు బ్రతికి ఉన్నపుడే నేను చూసిన దృశ్యమొకటి జ్ఞాపకానికి వస్తున్నది. మైసూరులోని శివరామపేటలో బిడారం కృష్ణప్పగారి ఇంటికి దగ్గరలోనే రత్నావళి థియేటర్ వద్ద కొబ్బరికాయ ఆకుల చప్పరమున్న రంగస్థలమొకటి ఉండేది. అక్కడ ఆనాటి సాయంత్రం అరియకూడి రామానుజ అయ్యంగార్‌వారి కచ్చేరి. అది ప్రారంభమై, అప్పటికే ఒకటి రెండు కృతులను వారు పాడి ఉన్నారు - ఆ సమయానికి మైసూరు వాసుదేవాచార్యులూ, బిడారం కృష్ణప్పగారూ ఒకటిగా అక్కడికి వచ్చారు. వారిని చూచిన తక్షణం అరియకుడివారు తాను పాడుతున్న పాటను అర్ధనిముషం ఆపి కూర్చొన్న చోటు నుండే తన నొసటిని నేలకు తాకించి నమస్కరించారు. నా ప్రక్కలో కూర్చొన్న ఒకతను, 'ఇతను సామాన్యులకు అంతటి గౌరవాన్ని చూపించేవారు కాదు' అని అన్నారు. అదొక విశేషమైన గౌరవం. ఊరికే చూపించుకోవడానికి చేసినది కాదన్న భావన నాకు కూడా కలిగింది. అరియకుడివారు ఆచార్యులవారికంటే చిన్నవారన్న విషయం కూడా ఈ సందర్భంలో గమనించాలి.

వెనుకటి కాలంలో సంగీతానికున్న స్థానం ఒక విచిత్రమైనటువంటిది. అందరూ సంగీత ప్రియులే; కానీ దానిని అభ్యసించే వారి విషయంలో, ఆ వృత్తి విషయంలో సమాజానికి చిన్నచూపు, నిర్లక్ష్యం. వాసుదేవాచార్యులు చిన్నతనంలో దొంగతనంగా సంగీతాన్ని అభ్యసించడం తెలిసి, వారి పెద్దలు, 'వేదవిద్య నేర్చుకోమంటే వేశ్యల విద్య నేర్చుకోవడానికి బయలుదేరావా!' అని తప్పుపట్టి నీళ్ళు చేదే పగ్గంతో వారిని కొట్టారట. అంటే, ఆ కాలంలో వారు ఆ విద్యను నేర్చుకొన్నది ఒక సాహసకరమైన కార్యం! ఆ సాహసానికి దైవ సహాయమూ తోడైంది!

మహారాజావారి సంస్కృత పాఠశాలలో అబ్బాయిలు ఏ విషయాలను తీసుకోవాలన్నది నిర్ణయించడానికి ఆ విషయాల పేర్లను ఒక చీటీలో వ్రాసి గణపతి ముందు ఉంచి ఏవైనా రెండింటిని ఎత్తిపించేవారట. ఆచార్యుల పాలిట సంగీతం, సాహిత్యాలు రెండూ ఎన్నికయ్యాయి. గణపతి - ఎంతైనా అన్ని విద్యల విషయంలోనూ అభిమాని! - ఆచార్యులవారి కోరికను నెరవేర్చారు. మనకందరికీ వారి కృతులు లభించేలాగా కృప చూపాడు. సంప్రదాయస్తులు సంగీతం నేర్చేవారిని తిరస్కారంతో చూచినా ఆ విద్య యిచ్చే ఆనందం సాంప్రదాయస్తులనూ చేర్చి, అందరికీ కావాలి. కృష్ణాష్టమి, గణేశ చతుర్థి, రామనవమిలాంటి పండగల సందర్భంగా మైసూరులోని నాలుగైదుచోట్ల పది-పదిహేను రోజులు ఘనమైన సంగీత కచ్చేరీలు జరిగేవి. కాడయ్యగారి

చత్రం, సంతేపేటలో ఉన్న కృష్ణప్పగారి రామమందిరం, అదే సంతేపేటలో దక్షిణానికి చివరన క్రాసులో ఉన్న శేషణ్ణగారి యిల్లు, శివరామ పేటలో వితలరావుగారి యిల్లు - ఎక్కడెక్కడో కచేరీలు! మాకేమో ఒకరకమైన అసహనం. రెండు-మూడు చోట్ల మేము మెచ్చిన సంగీతజ్ఞులు పాడుతున్నప్పుడు దేనిని వినాలి, దేనిని విడవాలి అన్న సమస్య! నాకు పదహేను సంవత్సరాల వయస్సులో (1915) సంగీతం యిష్టముండేదేగాక సంగీతజ్ఞుల స్థాన మానాలు తెలిసి ఉండేవి. ఆ సంగీతజ్ఞులకు మర్యాద దొరకుతుండినది సామాన్య జనుల నుండి మాత్రమే కాదు, రాజమహారాజుల నుండి కూడ! ఇలాంటి కాలంలో వీణె శేషణ్ణ, వీణె సుబ్బణ్ణ, బిడారం కృష్ణప్పలాంటి విద్వాంసుల మధ్య, తమదైన, విశిష్టమైన వెలుగులో వర్ధిల్లినవారు - వాసుదేవాచార్యులవారు!

నాకు వ్యక్తిగతంగా ఆచార్యులవారి గానం మరియు వారి కృతుల గురించి, ఎక్కువ పరిచయం ఉండేదని చెప్పలేను. నా తోటి సహోద్యోగులు, ఆప్తమిత్రులైన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఒకమారు, ఏదో ఒక సందర్భంలో ఆచార్యులవారితో పరిచయం కలిగించారు. కాని అది అంతగా అభివృద్ధి చెందలేదు. మా వృత్తులు వేరు. అదీగాక, నేను వారికంటే మూడున్నర దశాబ్దాలు చిన్నవాడిని. కానీ వారి కచేరీలను ఎన్నోమార్లు విని ఆనందించా. వారి వ్యక్తిత్వానికి సంబంధించిన ఎన్నో కథలను విని ఉన్నా. అలాంటి కచేరీని విన్న అనుభవమొకటి ఇపుడు జ్ఞాపకానికి వస్తున్నది. ఇది 1930 దశాబ్దం మాట. టెన్నిస్ ముగించి సాయంత్రం ఏడు గంటల సమయంలో కాలేజి నుండి ఇంటికి పోతున్నా. దారిలో ఉన్న సీతవిలాస అగ్రహారంలో వీణె శివరామయ్యగారి ఇంటిలో సంగీత కచేరీ జరుగుతున్నది. ఆచార్యులవారి ధ్వనిని గుర్తుపట్టా. ఆ యింటివారి ఒకరి పరిచయం కొద్దిగా ఉన్నందున ధైర్యంగా లోనికి వెళ్ళా. ఆ రోజు ఆచార్యులవారు ఖరహరప్రియ రాగం ఆలాపన చేస్తుండినది ఇప్పటికీ ఒక్కోమారు జ్ఞాపించుకొంటా! మన కర్ణాటక సంగీతానికి, అదెందుకో దృతగతి వ్యామోహం మితిమీరి పెరిగిపోయింది. వేగం పిశాచి పట్టుకొన్నది. ఆ రోజు ఆచార్యులవారు ఆలాపనలో మధ్యమ కాలం మరియు దృతపు కళాత్మకమైన కలయిక అద్భుతంగా ఉండినది. బహుశః మధ్యమంలో గానం చేయడం ఆచార్యులవారంత బాగా మరెవరూ కైవశం చేసుకోలేదు. రాగ ప్రపంచపు రాజ మార్గంలోనూ, కాలుదారిలోనూ కుతూహలంతో, ఆసక్తితో విహరించి, వికసించిన పూల పరిమళాన్ని ఆఘ్రాణించి ఆనందంతో తృప్త మందగతితో సాగింది ఆచార్యులవారి ఆనాటి ఆలాపన! రాళ్ళపల్లివారు ఒకరోజు ఆచార్యులవారి గానాన్ని 'ఆలోచనామృతం' అని అన్నది జ్ఞాపకమున్నది. ఆచార్యులవారు తమ నాలుగో లేక ఐదేళ్ళపుడు రాజాంతఃపురాన్ని ప్రవేశించారట. వారు పట్నం సుబ్రమణ్య అయ్యర్ వద్ద శిష్యవృత్తి జరిపినదీ రాజమందిరంవారి సహాయంతోనే. అయినా, నాల్వడి కృష్ణరాజ ఒడయరు రాజ్యమేలుతున్నపుడు రాజాంతఃపుర విద్వాంసుల శ్రేణిలో ఆచార్యులవారికి చెందాల్సిన స్థానం లభించలేదు! అలా జరుగడానికి కారణం వారి సంగీతపు శ్రేణి కాదు. 'మీరు, కన్నడంలో కృతులను రచించాలి' అని ఒకమారు దొరవారు సూచించారట. కానీ, ఆచార్యులవారి మనసులో ఎపుడూ తెలుగు, సంస్కృత కృతులే గుణుగుతుండేవట - వారు పెరిగినది త్యాగరాజువారి, దీక్షితులవారి, మరియు శ్యామశాస్త్రులవారి కృతుల వాతావరణంలో. అదీగాక, ద్రావిడ భాషలలో సంగీతానికి పొందుకొనే భాష తెలుగు మాత్రమేనన్న భావం ఆ కాలంలో సర్వసామాన్యమైన విషయం. అపుడు ఆచార్యులవారు, 'క్షమించాలి. కన్నడంలో కృతి రచన చేయాలనిపించినప్పుడల్లా నా బుద్ధి ముందుకు పోనంటుంది,' అని అన్నారట. ఈ ధోరణి దొరవారికి రుచించలేదు. ఆ కారణంతో ఆచార్యులవారికి న్యాయంగా చెందాల్సిన స్థాన మానాలు లభించలేదు. ఈ విషయం ఆ రోజులలో నా చెవిలో పడిన వీధి మాటలు. అది నిజమో కాదో - అంటూ విద్వాంసులపైకి వారి ప్రథమ శ్రేణి స్థానం లభించలేదు.

ఆ సమయంలో, మేమందరం, అంటే యువ సంగీత ప్రియులు, "అయ్యో, ఆచార్యులవారికి యిలాంటి అన్యాయం చేయడమా?" అని అనుకొన్నది జ్ఞాపకం. వారికి లభించాల్సిన స్థానం ముత్తయ్య భాగవతులకు లభించిందట. అయినా, వారు 'నేనెరిగిన కళాకారులు' (నా కండ కలావిదరు) అనే పుస్తకంలో ముత్తయ్య

భాగవతులను గురించి వ్రాసిన దానిని చదివితే, ఆచార్యులవారి మనసులో ఎలాంటి చేదు నీడ కూడా లేదన్నది స్పష్టంగా అగుపడుతుంది. అంతఃపురం విషయంలోనూ వారిపై ఉన్న సద్భావన ఒకింత తక్కువ కాలేదు. జయచామరాజ ఒడయర్ వారు పట్టానికి రాగానే ఆచార్యులవారికి ఎప్పుడో లభించాల్సిన సన్మానం లభించింది. జయచామరాజ ఒడయర్‌వారు తమ గురువుగారైన ఆచార్యులవారిని అత్యంత గౌరవంతో చూసుకొన్నారు. ఆ కాలంలోని అనేకమంది సంగీతకారులు - కృతి రచనలను చేయడానికి పోక, గానం చేయడం లేదా వీణ, ఫిడేలు, తబలా, పిల్లనగ్రోవిలాంటి వాద్యాలను నడిపించడంలో నిమగ్నులయ్యారు. సంగీతం తప్పించి వేరే యితర రకాల విద్వత్తును గడించినవారు కాదనిపిస్తుంది. జనులు అలా మాట్లాడుకొంటున్నది నేనే విని ఉన్నా. "జి.ఎన్.బి. గారు B.A (Hons.) డిగ్రీ గడించి ఉన్నారట," అని జనులు ఆశ్చర్యంతో పొగుడుతుండినది జ్ఞాపకమున్నది - ఆ కాలానికి అది అపురూపపు సాధన! నా తరం యువకులకు అది అప్రస్తుతం. మేము సంగీత ప్రియులం; అది కావాల్సినంత లభించేది; ఇక్కడ సంగీతేతర మాటలు వచ్చిన దానికి కారణం వాసుదేవాచార్యులు అధునిక విద్యలో పరిణితులు కాకున్నా సంస్కృత సాహిత్యంలో విద్వాంసులై ఉండేవారని జ్ఞాపకానికి తెచ్చుకోవడం. అపుడు మైసూరువారిగా ప్రసిద్ధి పొంది ఉన్న బిడారం కృష్ణప్ప, చిక్కరామరాయరు, మొదలైనవారిలో అంతగా లేని సంగీతేతర పాండిత్యం ఆచార్యుల వారిలో ఉండేది. వారు అపుడపుడూ రచించిన శ్లోకాలు నా చెవిలోనూ పడుతుండేవి. 1950 దశకం ఉత్తర భాగం, నేను కర్ణాటక ప్రభుత్వం వారి కన్నడ మరియు సంస్కృతి యిలాఖాకు డైరెక్టర్‌గా ఉన్న కాలం. ఏదో ఒక మీటింగు నిమిత్తం నేను మదరాసు వెళ్ళాను. నా స్నేహితుడు భాస్కర్ 'ది హిందు' దిన పత్రికకు ఉపసంపాదకులుగా ఉండేవారు; నేను దిగివున్న హోటల్‌కు వచ్చి ''కళాక్షేత్రం పోయివద్దాం, రండి'' అని నన్ను పిలుచుకొనిపోయారు. కళాక్షే త్రానికి చైతన్యమూర్తి శ్రీమతి రుక్మిణీదేవి అరుండేల్. వారు, మా యిలాఖాకు సంబంధించిన ఒక సమితిలో సభ్యులుగా ఉండేవారు. మార్యాద దృష్టిలో వారిని కలవడం ఉచితమని తలచి మేమిరువురూ 'కళాక్షేత్రం' వెళ్ళాము. మొదలు మేము వెళ్ళినది అప్పుడు కళాక్షేత్రంలోనే ఉంటున్న ఎం.డి. రామనాథన్ వారి యింటికి. భాస్కరన్‌కూ వారికీ పరిచయముండేది. నా ఈనాటి ఉపన్యాసానికి సంబంధం లేకున్నా రామనాథన్‌గారి గురించి ఒక మాట చెప్పాలనిపిస్తున్నది. బెంగళూరు ఆకాశవాణివారు ఆహ్వానితులైన అతిథుల ఒక చిన్న సభలో రామనాథన్ గారి కచ్చేరిని ఏర్పాటు చేశారు. శ్రీయుతులు డి.వి.జి., నిట్టూరు శ్రీనివాసరావు, నేనూ ఆహ్వానితులుగా వెళ్ళాము. ఆ రోజు వారు పాడిన కొన్ని కృతులు జ్ఞాపించుకొని, "తమరు ఆరోజు ఆకాశవాణి సభలో పాడినది ఇప్పటికీ నా చెవులలో గింగురుమంటున్నది, చాలా అద్భుతంగా పాడారు. చాలా బాగా ఉండినది," అని వినయంతో అన్నారు. దానికి వారు, "ఇపుడు కావాలంటే కొంతసేపు పాడుతా, వింటారా?" అని ఒకటిన్నర గంటలసేపు ఏమీ పరిచయంలేని ఒకడి సంతోషానికై తమకు తామే ముందుకు వచ్చి పాడినది పొగడ్తకు మీరిన సౌజన్యం! అక్కడి నుండి రుక్మిణీదేవిని చూడడానికి వెళ్ళినపుడు అదీ యిదీ మాట్లాడిన మీదట, Arent you going to see your Grand Old Man? అని రుక్మిణీదేవి అడిగారు. ఆ గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ మైసూరు వాసుదేవాచార్యులవారు! మేము కళాక్షేత్రానికి బయలుదేరినపుడు వారిని కలవాలన్న ఉద్దేశం ఉండే ఉండినది. రుక్మిణీదేవి మమ్మల్ని తీసుకొనిపోయి ఆచార్యులవారికి పరిచయం చేశారు. "రాళ్ళపల్లివారు, ఒకమారు మిమ్ములను నాకు పరిచయం చేశార"ని నేను ప్రవరం చెప్పినా, వారికి నా గుర్తు మిగిలి ఉండడం సాధ్యం లేదని నాకు తెలుసు. దానికి వారు, "ముసలివాడినైపోయానప్పా, మరుపు ఎక్కువ," అని అన్నారు. కాని వారి మాటలేమో ఎలాంటి అడ్డు లేకుండా పరిచయమున్నట్టే సాగింది. మధ్యమధ్యలో హాస్యం కూడా ఉండేది. ఏ సందర్భంలోనో జ్ఞాపకం లేదు. వారు తామే రచించిన బహుశాః అపుడే రచించిన ఒక శ్లోకాన్ని చెప్పారు. వివరాలు మరిచా. కాని చమత్కారంతో శ్లేష ఉండెనని అనిపిస్తుంది. మా మాటలింకా కొనసాగుతుండగా రుక్మిణీదేవి నవ్వుతూ తన దర్పాన్ని

చూపుతూ "Now you stop. It is time for his drive" అని అన్నారు. వెళ్ళి కారు తెచ్చి ఆచార్యులు మెట్లు దిగి కారు ఎక్కడానికి తొందర కానట్టు, వారు నేరుగా కారులోనికి కాలు పెట్టేలాగా కారు నిలిపారు. అపుడు ఆచార్యులవారు, "ఈమె చెప్పినట్టు వినాలప్పా. దర్పమంటే దర్పం!" అని నవ్వుతూ కారులో కూర్చొన్నారు. స్వంత కూతురుకంటే ఎక్కువ ప్రేమతో, పెచ్చరికతో, రుక్మిణీ దేవి ఆచార్యులవారిని చూచుకొంటున్నది చూచి మాకు చాలా అనందమైంది. సుమారుగా, అదే సమయానికి కన్నడ సాహిత్య కోటపై ఒక ముసలాయన దాడి చేసి కోటలోనికి ప్రవేశించారు. కోట లోపలున్నవారు రెండు చేతులనూ చాచి ఆ దాడి చేసిన ముసలాయనను స్వాగతించారు. ఆ ముసలాయనే, మైసూరు వాసుదేవాచార్యులవారు, రుక్మిణీదేవి Your Grand Old Man అని పిలిచినవారు! కన్నడ సాహిత్య కోటలోనికి వారికి ప్రవేశం లభించింది వారి "నా కండ కలావిదరు" (నేనెరిగిన కళాకారులు) అన్న కృతి ద్వారా. ఆచార్యుల వారు సాహిత్య క్షేత్రానికి ప్రవేశిస్తారని ఎవరూ నిరీక్షించి ఉండలేదు. ఆ కృతి విడుదలైన మీదట అందరి నోళ్ళలోనూ అదే మాట. అందులో చిత్రింపబడినవారందరూ సంగీత ప్రపంచంలో దిగ్గజాలు - పట్టం సుబ్రమణ్య అయ్యర్, ముత్తయ్య భాగవతులు, బిడారం కృష్ణప్ప, వీణె శేషణ్ణ, టైగర్ వరదాచార్యులు మొదలైనవారు. సంగీతంలో ఆసక్తి లేనివారు కూడా ఆ పుస్తకాన్ని చదివి అనందించారు. కారణం: ఆచార్యులవారి సరళ సుందరమైన శైలి. తాను సాహిత్యకారుడు కావాలన్న ప్రయత్నం చేయకనే సాహిత్యకారుడయ్యే రచనా శైలి!

వాసుదేవాచార్యులవారి సాహిత్యం గురించి మాట్లాడేటపుడు నేను ఈ ఒక్క పుస్తకాన్ని గురించి మాత్రమే కాక వారి 'నెనపుగళు' (జ్ఞాపకాలు) అన్న కృతి కూడా గమనంలో పెట్టుకొన్నాను. బహుశః ఈ పుస్తకాలను గురించి మొట్టమొదలు చెపాల్సినది - అవి నా తరంవారు చూడని, ఎంతో కొంత విన్న, తనదైన సుందరమైన కిందటి శతాబ్దం వాతావరణం గురించిన మరుసృష్టి! మైసూరు రాజభవనం; ముమ్మడి కృష్ణరాజ ఒడయరు; దివాన్ రంగాచార్లు; ఎదుటి పక్షం వారి ఎగురుతున్న గాలిపటాన్ని దింపివేయడానికి ఒక పిడికిలి వజ్రాన్ని పుడి చేయడానికి సిద్ధమైన రాజుగారు! దొరవారు చెప్పి పంపినపుడు నా దొర యిక్కడ ఉన్నాడని సాలగ్రామాన్ని చూపిన ఆత్మగౌరవపు సాకారమూర్తి రామకృష్ణప్ప గారు, మొదలైన రసగుళికలు అందులో ఎన్నో! ఈ పుస్తకంలో మెరిసే నక్షత్రాలంటే సంగీతకారులు! ఆచార్యులవారు, వారి గురించిన చేదు ప్రసంగాలను చూపడానికి భయపడరు. కానీ వాటిని చదివిన మీదట వారి గురించి ఎలాంటి చేదూ చదువరులలో మిగిలి ఉండదు! నా తరంవారికి పరిచయమున్న తమిళనాడు సంగీతకారులంటే: కొళలు (పిల్లనగ్రోవి) సంజీవరావు, చంబై, అరియకుడి, మధురమణి అయ్యర్ శ్రీమతులైన సుబ్బలక్ష్మి, పట్టమ్మాళ్, వసంతకుమారి, మొదలైనవారు. ఆచార్యులవారు తమ పుస్తకంలో చిత్రించిన పట్టం సుబ్రహ్మణ్యం అయ్యర్, రామనాడ్ శ్రీనివాస అయ్యంగార్, తిరుకోడి కావల్ కృష్ణయ్యర్ వీరినందరినీ నేనుగాని, నాకంటే 6-7 సంవత్సరాలు పెద్దవారైన రాళ్ళపల్లివారుగాని చూచినవారు కాదు. వారిని గురించి కథలను వినడమంటే మాకు రోమాంచక అనుభవం. వారందరూ ఎంతటి పెద్దమనుషులు! అలాగే, అదెంత చిన్న మనుషులు! మనలాగే! ఆచార్యులవారు, వారి గొప్పతనానికి ఇవ్వాల్సిన మెచ్చుకోలును ఇస్తారు. వారి చిన్నతనాన్ని మూసిపెట్టే ప్రయత్నం చేయరు - మెత్తగా చూపించి ముందుకు పోతారు. వారూ మనలాగే గొప్పతనం - చిన్నతనం రెండూ ఉన్న మానవమాత్రులే! అలాంటి ఒక ఘటనను ఇలా చెబుతారు ఆచార్యులవారు - అప్పుడు తానే వేరే రాజ్యం నుండి తిరువయ్యారుకు వచ్చిన అబ్బాయి - వెనుకాడుతూ ఒక యింటి తలుపులను తట్టాడు. తలుపులు తీసినవారు గొప్ప సంగీతజ్ఞులు చెంబై వైద్యనాథ అయ్యర్ వారు. 'ఎన్న, యార్ నీ?' అని అన్నారు గడుసుగా. ఆ అబ్బాయి 'పట్టం సుబ్రమణ్య' అని చెప్పే లోపలే వైద్యనాథ అయ్యర్ దభాలున తలుపులు మూసివేసి అదృశ్యులయ్యారు! పట్టంవారి ఇంటిని చూపివుంటే వారి గంటేమీ పోయేది కాదు. కానీ, వారి గురించి చెప్పేటపుడు, అదే వైద్యనాథ అయ్యర్ గారి గానం థళథళమని మెరిసే వజ్రాల బుగ్గలా ఉండేదట! సంభావనగా మహారాజా వారు ఇచ్చిన వెండి రుపాయలను, గొప్ప ఫిడేలు విద్వాంసుడు తిరుకోడి కావల్ కృష్ణయ్యర్ వాటిలో ఖోటా నాణ్యాలు ఉండవచ్చని అనుమానించి

మహారాజావారి ఎదుటే ఒక్కొక్క నాణ్యాన్నీ ఠణ్, ఠణ్ అనేలాగా క్రిందికి వేసి చూచేవారట! ఇలాంటి ప్రసంగాలను ఆచార్యుల వారు చిరు హాస్యంతో వర్ణిస్తారు తమ గ్రంథంలో! ఆచార్యుల వారి చిరునవ్వుకు వారి హాస్య ప్రవృత్తికి, అలాగే వారి ముగ్ధతకు కొంచెం ఎక్కువ గమనమివ్వాలి. ఆచార్యులవారి ముగ్ధతను గురించి వారి మనవడు కృష్ణమూర్తి ఎన్నో ఉదాహరణలను ఇచ్చాడు. రేడియోలో, 'బీనా మధుర మధుర' అన్న సినిమా పాటను విని మెచ్చుకొన్నారు - శాస్త్రీయ సంగీతంలో శిఖరంపై ఉన్న ఆచార్యులవారు! వారికి మరలా ఆ పాటను వినాలనిపించింది. ''దానిని కొంచెం వెనుకకు తిప్పమ్మా, ఇంకొకమారు విందాం'' అని అడిగారు. రేడియోను వెనుకకు తిప్పితే పాట మరలా రాదని వారికి తెలియదు. అంతటి ముగ్ధులు వారు! వారు ఎపుడూ చేతికి గడియారం కట్టి ఉండాలి; కానీ గంట ఎంతని చూచే విధానం తెలియదు. ఎవరైనా గంట ఎంతని అడిగితే గడియారాన్నే వారి ముఖం వద్దకు పెట్టేవారట! నాలుక చపలం తీర్చుకోవడానికి ఎవరూ లేని సమయం చూచి శబ్దం చేయకుండా వంట యింటికి వెళ్ళి ఏదైనా తిను పదార్థం దొంగలించి తింటున్నపుడు దొరికిపోతే, ''ఎంతటి గ్రద్ద కన్నులప్పా, ఈ పిల్లలది!'' అని వాపోయేవారట! అంతటి ముగ్ధత వారి స్వభావం. వారి హాస్య ప్రవృత్తిని గురించి పైన చెప్పినదంతా పీఠిక మాత్రమే. ''ముగ్ధ మనుష్యులు, వీరికేం తెలుస్తుంది, పాపం'', అని మీరేమైనా హెచ్చరిక తప్పితే - వద్దు మీ పాడు! వారి హాస్యప్రవృత్తి వారి ముగ్ధతంతే తీవ్రం. వారివీ గ్రద్ద కన్నులే! వారు చిత్రించిన టైగర్ వరదాచార్యుల చిత్రం వారి హాస్య ప్రవృత్తికి మంచి ఉదాహరణ. టైగర్ వారి రూపం అంతేమీ ఆకర్షణీయం కాదు. అది వారికీ తెలుసు. అద్దం ఎదుట నిలబడి తమ ముఖం చూసుకొని చేతులు జోడించి, ''ఆంజనేయ స్వామినే నమఃహ'' అని అనేవారట వరదాచార్యులు! వారి తలపైన ముఖమంతే వికారంగా ఉన్న టోపీ ఉండేది. దానిని ఎలాగైనా తీపించాలని వారి మిత్రులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వారందరూ వాసుదేవాచార్యులవారిని ఆశ్రయించారు. దానికి ఆచార్యులవారు, ''ఉండనీ చూద్దాం, దేవుడున్నాడు'' అని మంచి అవకాశం కోసం వేచి చూచారు. ఒకరోజు సభలో టైగర్ వారు ఉన్నపుడు ఆచార్యులవారిని నోటి నిండా పొగిడి ''బ్రహ్మానందమైనదన్నా. ఇలాంటి సంగీతానికి నేను ఏమివ్వను, చెప్పు'' అని అన్నారు టైగర్. అపుడు ఆచార్యులవారు, ''నేను అడిగినదానిని లేదన కూడదని హెచ్చరించి, వారి నుండి మాట తీసుకొని అనంతరం మీ తలపై ఉన్నదే ఆ టోపీ, దానిని దయచేయాలి,'' అని అన్నారు. ఈ ప్రసంగాన్ని వారు నోరు చప్పరించుకొని వ్రాసి ఉంటారు. బాల్యంలో వారు చాలా తుంటరివాడుగా ఉండేవారేమో! ఆచార్యులవారు దైవభక్తులు; ఆచార శీలురు; అంతా సరే. కానీ, వారి ప్రథమ ప్రేమ సంగీతానికి చెందుతుంది. అదే వారి జీవితానికి ఊపిరి. శేషణ్ణగారూ, ఆచార్యులవారూ రైలులో ప్రయాణం చేస్తున్నపుడు ప్రతీ స్టేషన్‌లోనూ రైలు నిలిచినపుడు, శేషణ్ణ ఒక వర్ణాన్ని ఆచార్యులవారికి ఒకే ఒకసారి చెప్పించేవారట. బెంగళూరును చేరిన వెంటనే ఆచార్యులు తు.చ. తప్పక దానిని గురువుగారికి ఒప్పించేసేవారు! ''మీకు సంగీతమెందుకు? పుష్కలంగా భోజనం చేసి సుఖంగా ఉండండ''ని వారిని అవహేళన చేసిన శేషణ్ణ ఆశ్చర్యపోయారు. అంతటి తీక్ష్ణమతులు ఆచార్యులవారు! సంగీతంలో నిమగ్నులై ఉన్నప్పుడు వారికి సామాజిక ఔచిత్యాల పరిచయమే ఉండేది కాదు. మైసూరులోని సంస్కృతం పాఠశలలో ఒకరోజు మధ్వనవమి ఆచరించారు. ఆ రోజు ఆచార్యులవారిదే సంగీతం. వారు మాధ్వులే కదా! మంచి శ్రద్ధాభక్తులు ఉన్నవారు. కానీ వారికి మధ్వ - పర మత ద్వేషం లేదు. ఆ రోజు పాడేప్పుడు సంగీతం మైకంలో ఉన్న ఆచార్యులవారికి తాము పాడుతున్నది మధ్వనవమి సందర్భమన్నది జ్ఞాపకం లేదు. సలక్షణంగా, ''శంకర గురువర మహిమా'' అన్న రాగ మాలికను గానం చేశారు! వీరమాధ్వులు చాలా అసమాధానం చెందారు. వారిలో ఒకరు, ''ఇదేమిటి ఇలా చేశారు!'' అని అడిగేశారు. ఆచార్యులవారికేమో తాము పాడిన పాటకు తృప్తి కలిగింది. వారేమీ పశ్చాతాపం చెందలేదు. వాసుదేవాచార్యులను గురించిన మాటలు వారి సంగీతంతోనే ముగియాలి - గాయనాన్ని మాత్రమే కాదు, వారి కృతులను గురించి కూడా. మొదలు స్వాభావికంగా జనులు వారిని పొగుడుతున్నది వారి గానం కోసం. అనంతరం వారు రచించిన వారి కృతుల సౌందర్యం అందరి

మనసులను ఆక్రమించి వారి గాయనాన్ని మెరిపించేటంత ప్రసిద్ధి పొందాయి. వారు కన్నడంలోనూ కృతులను రచించి ఉంటే బాగుండేదన్న ఆలోచన నాకు కూడా వచ్చినది. కానీ, వారు తెలుగులో రచించినది దోషమనడానికి లేదు. వారి ప్రతిభకు ఆ భాషలో హితకరమైన సంచారం దొరికింది. అదీగాక, సంగీతంలో భాష అంత ముఖ్యం కాదు.

ఆచార్యులవారి రచనలలో నేను మొట్టమొదట విన్నది, 'బ్రోచేవారెవరురా.' దానిని కూర్చిని గంభీరంగా వినడం కష్టమైంది కానీ, దాని లయకు తల ఊపాను. సంచారపు హెచ్చుతగ్గులకు స్పందించునట్టు చేతులను ఎత్తి దించినదేమిటి జ్ఞాపించుకొంటే నవ్వు వస్తుంది. కానీ, అలా ప్రవర్తిస్తున్నవాడిని నేనొక్కడినే కాదు, సభికులందరూ! అనంతరం ఒకటి తరువాత మరొకటి వారి రచనలు వెలుగులోనికి వచ్చాయి. వాటిని జనులు మెచ్చుకొని 'మన ఆచార్యులవారు,' రచించినది అన్న కారణానికి కాదు, ఆ కృతుల సౌందర్యానికి! నేను రెఫైరయిన మీదట సుమారుగా ఇరవై సంవత్సరాలు దేశవిదేశాలలో, ఎక్కడెక్కడో తిరుగుతూ జీవితం గడుపుతున్నందున కర్ణాటక సంగీతాన్ని వినడమే అపురూపంగా ఉండేది. 70వ దశాబ్దంలో, ఒకరోజు నా ఆకాశవాణి రోజులనాటి మిత్రులైన ఎం.వి. వరాహస్వామివారి గిటార్ (Guitar) కచ్చేరీ వినడానికి వెళ్ళా. కొన్ని కృతులైన మీదట వారు అభేరి రాగాన్ని ఎత్తుకొన్నారు. ఆలాపన ముగిసిన మీదట నాకు ప్రియమైన "నగుమోము గనలేని" వస్తుందని నా నిరీక్షణ. వాస్తవంగా వచ్చింది ఆ కృతి కాదు. అపూర్వమైన వేరొక మనమోహకమైన సౌందర్యమున్న కృతి. దాని పల్లవిని విన్నప్పుడే అది నన్ను ఆకట్టుకొంది. ప్రక్కలో ఉన్న వారిని 'ఇది ఏ కృతి?' అని అడిగా. అది ఆచార్యులవారిది, 'భజరే, రే, మానస!' ఆ కృతికే విశిష్టమైన సౌందర్యమున్నది. నా స్నేహితుడు జె.ఆర్. లక్ష్మణరావ్ 'ఒక్కో కృతికీ దానిదే అయిన విశిష్టమైన personality ఉన్నది' అని అన్నది జ్ఞాపకమొచ్చింది. మానవుల స్వభావంలో వైశిష్ట్యమున్నట్టు కృతులలోనూ ఉంటుంది!

ఒకే రాగం ఉన్న రచనలలోనూ దీనిని గమనించవచ్చు. త్యాగరాజ స్వాములవారి 'నా మనసునా సీతాపతే,' వాసుదేవాచార్యులవారి , 'బ్రోచేవారెవరురా,' యివి రెండూ ఒకే (కమాచ్) రాగంలోని కృతులు. 'నా మనసునా,' కృతిని 'బ్రోచావారెవరురా,' కృతిని వింటే (రాగ సంచారపు వైవిద్యంవల్ల) ఒకే జాతిరకమైన పుష్పాల (ఉదా: మల్లి, జాజిమల్లె) గుచ్ఛపు సంకీర్ణమైన పరిమళాన్ని నింపుకొన్న అనుభవమౌతుంది. త్యాగరాజులవారు కాంభోజి రాగంలో రచించిన, 'ఎవరి మాట,' మరియు 'ఓ రంగశాయి,' అన్న కృతులను పోల్చి చూడవచ్చు. రెండూ ఒకరిచేతే రచింపబడి, ఒకే రాగపు, ఒకే తాళపు కృతులు. కాని, వాటి నుండి మనపై కలిగే పరిణామం వేరు-వేరు రీతిలో ఉంటుంది. 'ఎవరి మాట' ప్రారంభమయ్యే రమ్యత యొక్క (romantic) మట్టంలోనె అనిపించి, 'అవనిలో అర్వేయ పౌరుషేయ' అన్న అనుపల్లవి వచ్చినంతనే భవ్యతతో పైకి సాగుతుంది. 'ఓ రంగశాయి' కూడా - మొదటి అక్షరం నుండి చివరివరకూ గగనంలోనే దివ్యగాంభీర్యంతో సాగుతుంది. స్వర్గంలో గానదేవి ఐరావతంపై కూర్చిని మహోత్సవమొకదానిలో మందగమనపు ఊరేగింపు బయలుదేరిందని అనిపిస్తుంది. ఆచార్యులవారి కృతులను శాస్త్రీయ (technical) దృష్టి నుండి పరిశీలించడానికి కావాల్సిన శాస్త్ర జ్ఞానం నాకు లేదు. దానికి మరొక జన్మ ఎత్తాలి! కానీ, వాటి సౌందర్యాన్ని రుచిచూడగలను. ఒక్కొక కృతిలోనూ 'భజరే రే మానసా,' 'బ్రోచేవారెవరురా,' 'రారా రాజీవలోచనా,' 'మానముతో నన్ను బ్రోవరాదా,' అన్నిటిలోనూ పైన తెలిపిన personality (వ్యక్తిత్వం) ఎత్తి కనపడుతుంది!

ఆచార్యులవారు తమ సార్థక జీవితాన్ని ముగించి తంబూర శృతిని 'ఇంథ ప్రభువ కాణనో (ఇలాంటి ప్రభువును చూడలేదో) అనే పురందరదాసులవారి రచనను చెవిలోనూ, మనసులోనూ నింపుకొని తమ చివరి శ్వాస విడిచారట. అప్పుడు వారి హృదయాన్ని సంపూర్ణంగా ఆవరించి వారికి దివ్య శాంతిని ఇచ్చినది ఏమిటి? 'ఇలాంటి ప్రభువా,' 'నాద బ్రహ్మమా? ఈ ప్రశ్నను అడగతగిందో కాదో? ఆచార్యులవారికి అవి రెండూ ఒకటే. శ్రీకృష్ణ 'గానమూర్తి' కూడా అని త్యాగరాజులవారు సూచించారు కదా!

కన్నడం: ఎ.ఎన్. మూర్తి రావ్

*

తెలుగు: వేలూరి కృష్ణమూర్తి, మైసూర్. ఫోన్: 94489 77877.

నేహల

– రాజా రామమోహన రావు

శ్రీ సాయి బ్రహ్మానందం గొర్తి రాసిన చారిత్రక నవల నేహల. చారిత్రాత్మిక నవల ఎలా ఉండాలి, అందులో ఏవేవి ఉండాలి అన్న వివరణలు చాలానే ఉన్నాయి. కేవలం చరిత్రే కావాలనుకుంటే, చరిత్ర పుస్తకాలే చదువుకోవచ్చు. అలాంటప్పుడు చారిత్రాత్మిక నవలని ఏ ఆశతో చదువుతాం. చరిత్ర ఆనాటి కాలాన్ని, రాజకీయ, సాంఘిక పరిస్థితుల్ని చెబుతూనే జనసామాన్యం మీద జరిగే ఉమ్మడి సంఘటనల్ని, ప్రభావాల్ని చెబుతుంది. వైయక్తిక సుఖదుఃఖాల లోతులకి వెళ్లదు. ఎవరైనా వ్యక్తి నాయకుడో, విప్లవవీరుడో, అధికారంలో ఉన్నవారైతేనే చరిత్ర పట్టించుకుంటుంది. సామాన్యుల గురించి, వారిలో అత్యంత విశిష్ట లక్షణాల గురించి చరిత్రకి అంత పట్టింపు లేదు. చారిత్రక నవల ప్రధానంగా చేయాల్సిన ఆ పనిని 'నేహల' చేసింది. ఓ చిన్న గ్రామంలో అతి సామాన్యంగా బతుకుతున్న నేహల చేసిన అసాధారణ సాహసం ఈ నవల మూల వృత్తాంతం.

హంపి - విజయనగరం అనగానే చాలామందికి వెంటనే గుర్తొచ్చేది కృష్ణదేవరాయలు, విజయనగర సామ్రాజ్య వైభవం. కానీ ఆ వైభవానికి, పటిష్టమైన ఆర్థిక వ్యవస్థకి, చక్కటి పరిపాలనకి బీజస్థాపన, కృష్ణదేవరాయలకన్నా చాలా ముందే జరిగిందన్నది చాలామంది దృష్టికి రాని విషయం.

కృష్ణదేవరాయలకి పూర్వం, నూటయాభై సంవత్సరాలు పైగానే విజయనగర సామ్రాజ్య చరిత్ర ఉంది. ఆ చరిత్రని తెలిపే పుస్తకం *Forgetten Empire* - ఆ సుదీర్ఘ గ్రంథంలో ఒకటవ దేవరాయల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు, ఒకమ్మాయి తిరుగుబాటు కథ రెండు పేజీలు మాత్రమే ఉంది. అదే నేహల కథ. చరిత్రలో ఇంకెక్కడా ఆమె గురించిన వివరాలు లేవు. కానీ అప్పటి కాలమాన పరిస్థితుల దృష్ట్యా గమనిస్తే ఆమెది గొప్ప సాహసం. అద్భుత వ్యక్తిత్వం. వాటిని మూలవస్తువుగా చేసి, చరిత్ర గ్రంథాలనెన్నింటినో పరిశోధించి సాయిగారు, నేహలని మూడువందల యాభైపేజీల రసవత్తర నవలగా తీర్చిదిద్దారు. ఆ రెండు పేజీల మూలకథని యథాతథంగానే తీసుకున్నానని, దానికి ఏ మాత్రం అన్యాయం జరగకుండా నేహల నవలా రచన చేశానని సాయిగారే రాసుకున్నారు.

క్రీ.శ. 1400 ఒకటవ దేవరాయలు పరిపాలిస్తున్న కాలం అది. విజయదశమి పండుగ వాతావరణంతో విజయనగరం ఎంతో అట్టహాసంగా ఉంది. దేవరాయలు బహమనీ రాజుల్ని సమర్థవంతంగా ఎదుర్కొని, గుల్బర్గా దాటి రానీయకుండా నిలువరించాడు. గజపతుల కూతురైన ఉమాదేవిని మూడో పట్టమహిషిగా చేసుకున్నాడు. ఇవి ప్రజలకి అదనపు ఆనందం. యోధులకి, పండితులకి సత్కార ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. అలా సత్కారానికి వచ్చినవారిలో వేదరాయశర్మ ఒకరు. ఆయనకి విజయనగరం రావటం, దేవరాయలని కలవటం కొత్త ఏమీ కాదు. వేదరాయశర్మకి సంగీతం, సాహిత్యం, నాట్యాల్లో విశేష ప్రావీణ్యం ఉంది. రాయచూరు దగ్గరలోని ముద్గల నివాసి. అక్కడొక పాఠశాలలో శిష్యులకి సంగీత, నాట్యాలని బోధిస్తుంటారు. ఆయన శిష్యురాలే నేహల.

వేదరాయశర్మ తండ్రి, విజయనగర ఆస్థాన పురోహితులు. ఆయన్ను సంప్రదించే ముఖ్యమైన పనులు చేసేవారు. ఇప్పుడు దేవరాయలు ముఖ్యమైన కార్యాలు తలపెట్టినప్పుడు వేదరాయశర్మకి చెబుతాడు. బహమనీ సుల్తానులని జయించినా, వారితో ముప్పు ఎప్పుడూ ఉంది. విజయనగర కోట ప్రాకారం కేవలం ఎనిమిది మైళ్ల వరకే ఉంది. ఆ ప్రాకారం చుట్టూ మరో ప్రాకారం నిర్మించ

తలపెట్టాడు దేవరాయలు. ఆస్థాన పండితులతో చర్చించి ఆ ప్రాకార నిర్మాణానికి ముహూర్తం పెట్టమని వేదరాయశర్మకి చెప్పాడు దేవరాయలు. ఆ ముహూర్తంనాటికి వచ్చి దగ్గరుండి ఆ కార్యక్రమం జరిపించాలని చెప్పాడు. రాయచూరు వివాదస్థలం. రాజ్యాల మధ్య అధీన రేఖలు ఉంటాయి. కానీ విజయనగరం, బహమనీ రాజ్యాల మధ్య రాయచూరు ఊరే ఆస్థానంలో ఉండటం విచిత్రం. రాయచూరు పేరుకి విజయనగర రాజుల అధీనంలో ఉన్నా, బహమనీలు తమదిగా భావిస్తారు. రాయచూరు ముసల్మానులు కూడా ఎక్కువే. దేవరాయల పట్టమహిషి ఉమాదేవి తమ్ముడు నరేంద్ర గజపతి రాజ్య కాంక్ష ఉన్న కుటిలుడు. మసూమ్ రాయచూర్ నివాసి. దేవరాయల వేగు సుల్తానుల కదలికలు కనిపెట్టి రాజుకు చెబుతుంటాడు. వీరిద్దరినీ వేదరాయశర్మకి పరిచయం చేశాడు దేవరాయలు. వేదరాయశర్మ కూడా ముఖ్యశిష్యుడు రేవన్న వచ్చాడు. అతని ప్రేయసి నేహల. నేహలకీ రేవన్న అంటే అమిత ప్రేమ. కూడా వచ్చిన రేవన్నకి విజయనగర పుట్టుపూర్వోత్తరాలు వివరించారు వేదరాయశర్మ. దేవరాయలు సొంత అన్నగారిని చంపి రాజయ్యాడు. అంతేకాదు స్త్రీలోలుడు. అయినా ప్రజలంటే ఎంతో ప్రేమ. ప్రజలకి దేవరాయలు మీద ఎంతో నమ్మకం. అందుకే విజయనగరానికి ఆ ప్రాభవం.

గుల్బర్గా సుల్తాను ఫిరోజ్ షా. ఆయన గురువు గిసుదరాజ్. హజ్రత్ గిసుదరాజ్ అంటే ప్రజలకి అమితమైన గురి. ఆయన మాటంటే, దాన్ని శాసనంలా స్వీకరిస్తారు. ఫిరోజ్ షా కూడా అంతే. గిసుద్‌రాజ్ దయాభిక్షవల్లే ఫిరోజ్‌షా సుల్తాన్ అయ్యాడు. రాజ్యకాంక్ష చెడ్డదని, రాయచూరుని వదిలేసి, దేవసుగుర్ దాటి వెళ్ళవద్దని, యుద్ధాలు వద్దని గిసుదురాజ్ ఉద్బోధ. ప్రజల క్షేమమే తనకి ముఖ్యమని, వారి రక్షణ కోసమే యుద్ధమని ఫిరోజ్ షా జవాబు. ఫిరోజ్ షా అంత తిన్నైనవాడు కాదు, అతని తమ్ముడు అహమ్మద్ ఖాన్ కపటి, అతనికి విపరీతమైన రాజ్యకాంక్ష. అవలీలగా అబద్ధాలు ఆడగలడు. నక్కజిత్తుల మనిషి. ఎప్పటికేనా విజయనగరాన్ని జయించి, తను రాజు కావాలన్న ఆశ అతనికి. యుద్ధంలో ఓడిపోయినా, అది దేవరాయలుకి ఓ హెచ్చరికలాంటిదని అన్నగార్ని ఉబ్బేశాడు అహమ్మద్‌ఖాన్. అంతేకాదు, భీమ నది ఒడ్డున మరో ఖిల్లా నిర్మాణానికి ఒప్పించాడు. అక్కడ నుంచి విజయనగరం మీద సైనిక చర్యకి వెసులుబాటు ఎక్కువ. కొత్త ఖిల్లా నిర్మించే ప్రాంతానికి ఫిరోజాబాద్ అని అన్నగారి పేరు పెడదాం అని అహమ్మద్ ఖాన్ అనేటప్పటికి ఫిరోజ్ షా పొంగిపోయాడు.

రాజకీయ వాతావరణం ఇలా ఉంటే, ముద్గలలో నేహల, రేవన్న పరస్పరం అనురాగంలో ములిగి తేలుతున్నారు. రాచకార్యం మీద వేదరాయశర్మ విజయనగరం ప్రయాణమయ్యారు రేవన్నని కూడా రమ్మన్నారు. నేహలని వదలి వెళ్లలేక, తల్లికి జబ్బుగా ఉందని వంకపెట్టి, ఆయన కూడా శంభుడిని తీసుకు వెళ్లమన్నాడు. ఆయన అలాగే చేశాడు. అదే వాళ్ళ ప్రాణం మీదకు వస్తుందని తెలియదు. శంభుడు మంచి చిత్రకారుడు. వేదరాయశర్మ చెప్పగా ఎంతో అందంగా నేహల చిత్రపటం గీశాడు. దానిని వేదరాయశర్మ దేవరాయలకి చూపించారు. నేహల అందానికి దేవరాయలు ముగ్ధుడయ్యాడు. ఆమెని వివాహమాడుతానని వేదరాయశర్మకి చెప్పాడు. తన శిష్యురాలు రాణి అవబోతోందని ఆయన ఎంతగానో సంతోషించాడు. రేవన్న, నేహల ప్రణయం గురించి ఆయనకు తెలియదు.

ఈ విషయం విన్న నరేంద్ర గజపతికి బెంగపట్టుకుంది. మరో రాణి వస్తే అక్కడ ఉమాదేవి ప్రాపకానికి దెబ్బ. అదీకాక దేవరాయలు మొదటి భార్య కూతురు మంజరిని పెళ్లి చేసుకుని, ఎలాగైనా రాజ్యాధికారం సంపాదించాలన్నది అతని ఎత్తు. భీమనది ఒడ్డున నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఫిరోజ్ షా కొడుకు హసన్. అతను సరైన దారిలో లేడు. నిత్యం తాగుడు, గానాభజానాలు. అతని గురించి ఫిరోజ్ షాకి, అతని భార్య రెహనాకి దిగులు. హసన్‌ని అంటిపెట్టుకొని ఉండే మెహజబీన్‌కి అతనంటే ప్రాణం. హసన్‌ని మంచి దారికి తెచ్చే కార్యభారాన్ని తమ్ముడు అహమ్మద్ ఖాన్‌కి అప్పచెప్పాడు ఫిరోజ్ షా. అహమ్మద్ ఖాన్ ఎంతో తంటాలుపడి, హసన్ తనకి అడ్డు రాకుండా అతన్ని మాల్వీ గిసుదరాజ్ దగ్గరికి పంపించగలిగాడు. మెహజబీన్ ఎప్పటికేనా హసన్‌ని పెళ్లి చేసుకుని రాణిని అవుతానని, అదే తన ధ్యేయం అని తల్లితో చెప్పింది. హసన్‌తోపాటే గిసుదరాజ్ మందిరంలోనే ఉండిపోయింది.

దేవరాయలు నేహలకి పంపిన నగలు, రత్నవైఢూర్యాలు, చీనిచీనాంబరాలు, ధనం ఓ బండిలో రాగా, మరో బండిలో వేదరాయశర్మ ముద్గల తిరిగి వచ్చారు. వాటన్నింటినీ నేహల తండ్రి హరీంద్రకి ఇచ్చి ఎంతో గొప్పగా విషయం తెలియజేశారు. హరీంద్ర అతని భార్య చంద్రమ్మ పొంగిపోయారు. అప్పుడు నేహల ఇంట్లో లేదు. స్నేహితురాలి ఇంటికి వెళ్లిన నేహల కబురు తెలిసి వెంటనే ఇంటికి వచ్చింది. విషయం విన్న వెంటనే నిర్ద్వందంగా ఆ పెళ్లిని తిరస్కరించింది. వేదరాయశర్మతో సహా అందరూ ఆశ్చర్యపోయారు. 'నువ్వు చిన్నపిల్లవి, ఇది ఎంతటి అదృష్టమో నీకు తెలియటంలేదు' అన్నాడు తండ్రి హరీంద్ర. "నాకు, మహారాజుకి ముప్ఫైఏళ్ల వయస్సు తేడా. పైగా నా ఈడు కూతురుంది. రాణివాసం భోగం కాదు, ఓ కత్తుల పంజరం. దానిమీద నాకు కోరిక లేదు. హాయిగా, సంతోషంగా మీ మధ్య గడిపితే చాలు. స్వేచ్ఛలేని జీవితం నాకు వద్దు. పట్టపురాణి అన్న బిరుదు, ఐశ్వర్యం చూసి మీరు ఈ పెళ్లి చేస్తే, అది పెళ్లి కాదు, నా పాడె కడుతున్నట్లే' అని ఖచ్చితంగా చెప్పేసింది.

మహారాజు ఈ తిరస్కారాన్ని సహించడని, ఆయన ఆగ్రహిస్తే ఎంత అనర్థమో ఆలోచించమన్నారు వేదరాయశర్మ. ప్రాణ త్యాగానికేనా సిద్ధం, కానీ స్వేచ్ఛ లేని జీవితం తనకి వద్దంది నేహల స్థిరంగా. చరిత్రలోనే అదో మహత్తర ఘట్టం. పంతొమ్మిదేళ్ల యువతి రాజాజ్ఞని ఎదిరించటం, రాజు పంపిన కానుకలన్నీ తిరిగి ఇచ్చేశారు. వేదరాయశర్మకి ఏం చేయాలో తోచలేదు. తనే వెళ్లి రాజుకు నచ్చచెప్పాలని ప్రయాణమయ్యారు. ఈ వార్త ముద్గల అంతా తెలిసిపోయింది. వేదరాయశర్మ ద్వారా నేహల తిరస్కార వార్త వినగానే, దేవరాయలుకి అపరిమిత ఆగ్రహం కలిగింది. రాజుగా తనకి తీరని అవమానం అనిపించింది. ఇదంతా గమనిస్తున్న నరేంద్ర గజపతి, ఉన్నవీ లేనివి చెప్పి, బావగార్ని ఒప్పించి మూడువందలమంది సైనికులతో ముద్గల ప్రయాణమయ్యాడు. నేహలను బంధించి తెస్తానని చెప్పినా, నేహలని రూపుమాపటమే అతని అసలు ఆలోచన.

సాయంత్రంవేళకి సైన్యంతో ముద్గల చేరాడు నరేంద్రగజపతి. అప్పటికే శంభుడు ముద్గల రావటం, ప్రమాదం గురించి చెప్పి రేవన్నని నేహలని ఊరు దాటించటం జరిగిపోయింది. నేహల దొరకని నరేంద్ర గజపతి ముద్గలని అల్లకల్లోలం చేశాడు. నేహల ఆచూకీ చెప్పమని ప్రజల్ని తీవ్రంగా హింసించాడు. అందరి ఇళ్లని నానా కంగాళీ చేశాడు. నేహల తల్లీ తండ్రిని కూడా మసూద్, శంభుడు ఊరు దాటించాడు.

నేహల కుటుంబం రాయచూరులో మసూద్ ఇంట్లో తలదాచుకున్నారు. రేవన్నా వాళ్లతోటే ఉండిపోయాడు. అజ్ఞాతవాసం. అహమ్మద్‌ఖాన్ యుద్ధ ప్రయత్నాలు తీవ్రతరం చేశాడు. దేవరాయలుని ఎలాగైనా జయించాలని అతని పట్టుదల. ఎలాగైనా తను రాజు కావాలి. దానికి అవసరమైతే అన్న ఫిరోజ్ షాని హత్య చేయడానికైనా అతను సిద్ధమే. ఎప్పుడేం జరుగుతుందో తెలియదు. వేదరాయశర్మవల్లే ముద్గలకి శనిపట్టిందని, తన తల్లితండ్రి పడిన హింసకీ ఆయనే కారణమని, గురువు వేదరాయశర్మని శంభుడు చీకటిమాటున హత్య చేశాడు. తమ్ముడు అహ్మద్‌ఖాన్ మీద నమ్మకం లేక, సైన్యంతో ఫిరోజ్ షా స్వయంగా బయలుదేరాడు. అనూహ్యంగా, ఏమాత్రం ప్రతిఘటన లేకుండా రాయచూరు అతనికి స్వాధీనమైంది. ఆ విజయోత్సాహంతో, అనగొంది కోటలో తక్కువ సైన్యంతో ఉన్న దేవరాయలుని, రాత్రికి రాత్రి ముట్టడించాడు. దేవరాయలు బందీగా చిక్కాడు. కానీ ఫిరోజ్‌షా కూడా తీవ్రంగా గాయపడ్డాడు. దేవరాయలుని బందీని చేసి, గాయపడ్డ ఫిరోజ్ షాతో తమ సైనిక స్థావరానికి తిరిగి వచ్చాడు సైనికాధికారి ఫరూక్. అస్వస్థతగా ఉన్న ఫిరోజ్ షాని గుల్బర్గా తీసుకెళ్లలేడు. సమయం కావాలి. అందుకని బందీగా ఉన్న దేవరాయలుని అడ్డుపెట్టుకుని సంధి ప్రయత్నాలు సాగించాడు ఫరూక్.

విజయనగరం మంత్రి మల్లప్ప తమ సైన్యాన్ని మోహరించి రాయచూరుని తిరిగి స్వాధీనపరుచుకున్నాడు. దేవరాయలుని వదిలేస్తే రాయచూరు ఇచ్చేస్తామని కబురు పంపాడు. ఫిరోజ్ షా కోలుకోవటానికి సమయం కావాలి. అందుకని సరైన జవాబు చెప్పక రెండు వారాలు గడిపారు. సైన్యానికి ఆహారం, కొంత డబ్బు తెప్పించుకున్నారు. ఫిరోజ్ షా దగ్గరికి గిసుదరాజే వచ్చారు. తమ ఉభయ రాజ్యాలు గొడవలుపడటంవల్ల ప్రజలకు అశాంతి అని, స్నేహంకన్నా బంధుత్వం కలుపుకోవటం మంచిదని దేవరాయలు

ఓ ప్రతిపాదన చేశాడు. తన కూతురు మంజిరిని ఫిరోజ్‌షాకిచ్చి పెళ్లి చేసి, రాయచూరు కట్నంగా ఇవ్వటమేకాక, ఇంకా అనేక విలువైన బహుమతులు, ధనం ఇస్తానన్నాడు. ఇది బావుందని గిసుదరాజే ఫిరోజ్‌షాని ఒప్పించాడు. సంధి కుదిరింది. ఫిరోజ్‌షా కోలుకున్నాకే పెళ్లి. అప్పటివరకు ఫిరోజ్‌షాకి అనెగొందిలో విడిది, విజయనగర రాజ వైద్యులతో వైద్యం. ఈ ఒప్పందంవల్ల మంజరి జీవితం బలైంది. తండ్రి వయసు సుల్తాన్‌తో వివాహం. పెళ్లి జరిగిపోయింది. విజయనగరం కోటని, ఆ వైభవాన్ని చూసి ఫిరోజ్‌షా ఆశ్చర్యపోయాడు. విజయనగరం ముందు, గుల్బర్గా ఏ రకంగానూ లెక్కలోకి రాదనుకున్నాడు. ఎప్పటికైనా విజయనగరాన్ని కైవసం చేసుకోవాలనుకున్నాడు. తిరిగి గుల్బర్గా చేరాడు ఫిరోజ్ షా.

ఇదంతా ఎలా జరిగింది అన్న పునశ్చరణలో, ప్రధాన కారణం నేహల అని ఆమె కోసం దేవరాయలు సైన్యం పంపటం తాము దండయాత్ర పారపాటుగా అర్థం చేసుకున్నామని, ఫిరోజ్‌షాకి అర్థమైంది. అంతటి అందగత్తె, ధైర్యశాలి నేహలని చూడాలని ఉందని ఫిరోజ్‌షా, గిసుదరాజ్ ఇద్దరూ మసూద్‌కి చెప్పారు. మసూద్‌కి నేహలని వాళ్లకి చూపించక తప్పలేదు. నేహలని చూసి ఆశ్చర్యపోయిన వారు ఆమె వ్యక్తిత్వం నచ్చి నేహలని హసన్‌కిచ్చి పెళ్లి చేయాలనుకున్నారు.

గతంలోలాగే ఆ పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించింది నేహల. చివరికి తల్లీతండ్రిని చంపేస్తారన్న దిగులుతో లొగిపోయింది. స్త్రీ జీవితానికి, అందులో రాజ్యాధికారాల మధ్య ఎంతమాత్రం విలువ లేదని తెలుసుకుంది. మంజరి, మెహజబీన్ కూడా దీనికి మినహాయింపు కాదు. మంజరి, నేహల జీవితాలు నాశనం కావటానికి కారణమైన నరేంద్ర గజపతిని మంజరి మట్టుపెట్టింది. హసన్‌తో నిక్కాకి ముందురోజే తనని పూర్తిగా రేవన్నకి సమర్పించుకుంది నేహల. అయినా అంతటి సాహసి నేహలకి జీవితంలో ఓటమి తప్పలేదు. చివరికి చేతకాని దానిలాగే ఆమె పాత్ర ముగిసింది. నవల కూడా ఇక్కడే ముగిసిపోయింది. ఫిరోజ్ షా అహమ్మద్ ఖాన్, మెహజబీన్ పాత్రలు కూడా అర్థాంతరంగానే ఉండిపోయాయి. నేహలవరకే కథాప్రాధాన్యం అనుకోవటం దీనికి కారణం కావచ్చు. ఇది పాఠకులకు కొంత అసంతృప్తే.

నేహల నవల ముఖ్యసుగుణం, 350 పేజీలు ఎంతో హాయిగా చదివిస్తాయి. ఎక్కడా క్లిష్టమైన వాక్యాలు, వర్ణనలు, సంభాషణలు లేవు. రెండో విషయం సాయి బ్రహ్మానందం నవలా రచనకి ఎన్నుకున్న ప్రణాళిక. ప్రతి చాప్టర్‌కీ కథ జరుగుతున్న ప్రదేశం పేరునే శీర్షికగా పెట్టారు. దీనివల్ల ఆ కథాభాగం ఎక్కడ జరుగుతుందో చాలా స్పష్టంగా తెలిసి, ఎటువంటి ఊహాగానాలకి అవకాశం లేకుండా చేశారు. కథని ముందు వెనుకలు చేసి గందరగోళపరచకుండా ఓ వరుస క్రమంలో చెప్పుకు రావటంవల్ల మంచి సరళత వచ్చింది. ఇంక లోటుగా అనిపించేటట్టున్న కొన్ని చిన్నచిన్న విషయాలున్నాయి. ప్రకృతి, రుతువర్ణనలు, వ్యాఖ్యానాలు మోతాదు మించటంవల్ల నవల బిగి కొంచెం సడలింది. శంభుడు వేదరాయశర్మని హత్య చేయటం అంతగా పొసగలేదు. ముఖ్యంగా నవలని అలా అర్థాంతరంగా ముగించటానికిగల కారణం ఉదాహరణకి చారిత్రక విషయాలు దొరకకపోవటంలాంటి వివరాలు తెలియజేస్తే బావుండేది.

కృష్ణదేవరాయలు ముందు విజయనగర చరిత్ర, కర్కశమైన రాజరికాన్ని ధైర్యంగా ఎదిరించిన స్త్రీచైతన్యానికి నాందిలాంటి నేహల వీరగాథకోసమైనా తప్పక చదవదగ్గ నవల.

నేహల - రచయిత (తెలుగు): ***సాయిబ్రహ్మానందం గోర్తి,***

పేజీలు: 376, వెల: రూ. 250/-

ప్రతులకు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

రాజా రామమోహనరావు
హైదరాబాద్. ఫోన్: 9394738805.

లఘుకావ్యం
అక్షరాంజలి

– రాయవరపు సత్యనారాయణ

"... కొంతి సంవత్సరాల దూరాలకు విస్తరిస్తున్న విశాలవిశ్వం, కంటికి కనబడనంత చిన్నదైన వింతల 'క్వాంటం' కనికట్టులా నన్ను కవ్విస్తూనే ఉన్నాయి. సృష్టికర్త ప్రేరణతోనే సృష్టిలోని విశేషాలనీ, వింతలనీ సృష్టికర్తకు విన్నవించుకునే ప్రయత్నం" అంటూ డా. ఎ.ఎస్. రామశాస్త్రిగారు (కలం పేరు 'అనామకుడు') 'అక్షరాంజలి' కావ్యరచనను మొదలుపెట్టారు. ఆరు దవాబ్దాల పాటు అంతర్ముఖంగా విశ్వవైచిత్రిని ఆరాధనా భావంతో దర్శించి, తరచి చూచి, విస్మయం చెంది తద్వారా ఉత్పన్నమయిన తన భావాలను కావ్యఖండికగా 'అక్షరాంజలి'ని ఆవిష్కరించారు. పరమేష్టికి పద్యమాలగా సమర్పించారు.

అరవై పద్యాలను 'ఆత్మనివేదన - నీ వినోదం - మా సందేహం - నీ విలాసం - సనాతన విజ్ఞానం - నా విన్నపం' అనే విభాగాలుగా పొందుపరిచారు. 'వేల సంవత్సరాల తరువాత, మనం విజ్ఞానపరంగా ఎంతో ముందుకు సాగిన తర్వాత కూడా మాన్య మహర్షులు వేసుకొన్న ప్రశ్నలు, సంబంధించిన సమాధానాలు మనలను ఆలోచింపజేస్తాయని' వాటికి నేటికున్న ప్రాధాన్యతను 'ఉపనిషత్తులు' విభాగం ప్రస్తావించారు. పద్యాలలో పొదగబడిన సాంకేతిక పదాల సాధికారిక వివరణలను 'అనుబంధం' విభాగంలో ఆంగ్ల భాషలో ప్రస్తావించారు.

ఈ పద్యాలను దేశీమార్గ ఛందస్సులలో ఉత్పల మాలలుగా, సరళోసములుగా అందమయిన కందాలుగా డా. రామశాస్త్రిగారు రచన చేశారు.

అక్షరాంజలిలోకి ప్రవేశిద్దాం:

ఆటను సృష్టి చేసి నియమావళి సర్వము నిర్ణయించి మ
మ్మాటల నాడనిచ్చెదవు – అంతియెగాక జయించనిచ్చి ఆ
బూటకమైన గెల్పునకు పొంగెదు మాపయిజాలితోడ – ఏ
నాటికొ మాకు తెల్పెదవు – నాటకమంతయు నీదికేళిగాన్

ఆ జగన్నాటక సూత్రధారి మాయలోపడి జయాలు మన పత్రిభ అన్న భ్రమలో పడవేసి, జాలిగా మనల్ని ఆ మాయనుంచి బయటపడేట్టు భగవంతుడు చేసే వైచిత్రిని 'నీ వినోదం' అనే విభాగంలో మనసుకు హత్తుకొనే విధంగా రచయిత చెప్పారు. 'నీ విలాసం'లో ఖగోళ, భౌతిక, జన్యు ఇత్యాది శాస్త్రాల క్లిష్ట సాంకేతిక విషయాలను పదకొండు పద్యాలలో సరళ శైలిలో ఆవిష్కరించిన తీరు పాఠకులను అబ్బురపరుస్తుంది. మచ్చుకు:

కంటికి కానరానిదగు 'క్వాంటము'ను నందునవింతలెన్నియో,
క్వాంటకణంబులొక్క పరికల్పదునంతతరంగమట్లుగా
జంటగ కొల్వజాలమట స్థానమువేగము ఒక్కసారిగా
తుంటరివందునానిను? అతుల్పపు విశ్వసృష్టిచేసెదున్

ఈ పద్యానికి స్ఫూర్తి నోబెల్ విజేతలు ఐన్‌స్టీన్ - మాక్స్‌ప్లాంక్‌లు కనుగొన్న 'క్వాంటం భౌతికశాస్త్ర' మూలసూత్రం. కాస్త వివరంగా చెప్పాలంటే మన చర్మ చక్షువులకు కనిపించే పదార్థం ఘనరూపకణమా? లేక తరంగమా? ఇవి చిక్కు ప్రశ్నలు. ఆ మేధావులు ప్రతిపాదించిన దాని ప్రకారం ఈ రెండు స్థితులు వాస్తవమే. తరంగ స్థితిని మనోనేత్రంతో ఊహించుకొనవలసినదే. వీటిని సమన్వయం చేసి ఆలోకేశుని 'తుంటరి' అంటూ సంబోధిస్తూ రమ్యంగా రచయిత ఆటపట్టించిన తీరు ఆలోచనాత్మకంగా, ప్రశంసనీయంగా ఉంది.

వైజ్ఞానిక ప్రపంచం విస్తరిస్తూనే ఉంటుంది. అనునిత్యం ఎన్నో ప్రాథమిక సత్యాలు వెలుగులోకి వస్తూంటాయి. ఇది నిరంతర పరిణామం. తరచి చూస్తే ఆధునిక, సనాతన విజ్ఞానాల మధ్య ఎంతో అవినాభావ సంబంధం కనిపిస్తుంది. ఈ దిశగా 'సనాతన విజ్ఞానం' అన్న విభాగంలో 'పూర్ణ - ఈశ, బ్రహ్మము - ఓంకారం - అమంబ్రహ్మాస్మి - నిరాకారం - అద్వైతం - పరమపద

సోపానం - విశ్వరూపం - యజ్ఞ - యోగమార్గం - కోపం' అన్న శీర్షికలతో, సరళ సీస / కంద పద్యాల ద్వారా జ్ఞానామృతాన్ని ఆస్వాదింపజేశాయి. ఒక ఆణిముత్యం:

పూర్ణంబిది పూర్ణంబిది / పూర్ణంబుదయించుచుండు పూర్ణమునందున్
పూర్ణంబు తొలగించిన / పూర్ణంబును - మిగిలియుండు పూర్ణంబంతన్

పూర్ణం గురించి అందమయిన కంద పద్యంలో గణితశాస్త్ర సమ్మితంగా నిర్వచించిన తీరును మెచ్చుకోకుండా ఉండలేము.

'సనాతన విజ్ఞానం'లో ఓంకారం విశిష్టతను గురించి చెప్పిన పద్యంలో ఒక సృష్టి రహస్యాన్ని నిక్షిప్తం చేశారు.

అదియెసకలార్థక సృష్టికి ఆదియు తుదియు
అదియె జగతికి ఆధారమనవరతము
అదియె ఓంకారనాదంబు - ఆదిలేదు
అదియె ఓంకారనాదంబు - అంతమవదు

ఈ పద్యంలో ఐన్‌స్టీన్ $E=me^2$ విఖ్యాత సమీకరణంలోని విడదీయలేని 'పదార్థ-శక్తి' సంబంధాన్ని సూచనాత్మకంగా కవి ఆవిష్కరణ చేశారు. 'అక్షరాంజలి' లఘుకావ్య పరిణామంలో యాదృచ్ఛికంగా విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన పరమ నిగూఢ సత్యాలను పద్యరూపంలో ప్రామాణికతతో వివరణ చేయటం అరుదైన ప్రయోగం. ఎక్కువగా వచన కవితలు వెల్లువవుతున్న ఈ రోజులలో సాంప్రదాయ ఛందోబద్ధంగా వాస్తవికతా ప్రాధాన్యంగా పద్యరచన చేసి మెప్పించడంలో డా. రామశాస్త్రిగారు విజయం సాధించారు. పోతనామాత్యుని మకరంద పద్యశైలిలో సమాన, పదభూయిష్టం లేకుండా రచించిన తీరు పరితల మనస్సును హత్తుకొంటుందనటంలో సందేహం లేదు. ఆరు దశాబ్దాల క్రితం డా. వసంతరావు వేంకటరావుగారు వైజ్ఞానిక విషయాలు పై వ్యాసాలు పద్యాలు రచన చేశారు. ఆ తర్వాత కాలంలో సైన్సుకు సంబంధించిన వ్యాసాలు, పుస్తకాలు ఎన్నో వచ్చాయి. ఈ మధ్యకాలంలో ఇటువంటి విలక్షణ పద్యరచన నా పరిమిత పఠనంలో తారసపడలేదు (విజ్ఞులు సవరించమని నా వినతి).

సృష్టిసౌందర్యం, శాస్త్రవిజ్ఞానం, సనాతనధర్మం - వీటి త్రివేణీ సంగమం డా. రామశాస్త్రిగారి కావ్యఖండిక 'అక్షరాంజలి'. ఈ పుస్తక ముఖచిత్రం కవి హృదయానికి దర్పణం.

అంతరిక్షానికి 'అక్షరాంజలి' సుందర సుమాంజలి. పాఠకుల అభిరుచులు వేరుగా ఉండటం సహజం - కొందరికి వైజ్ఞానిక విషయాలపై మక్కువ ఎక్కువగా ఉంటే మరికొందరికి సాహితీ పిపాస మెండు. ఈ రెండు పాఠక వర్గాల సమ్మితంగా 'అక్షరాంజలి' రూపుదిద్దుకొందని చెప్పవచ్చు. 'నా విన్నపం' విభాగంలో రచయిత ఆత్మశోధన చేసుకుంటూ ఆ పరమేశ్వరుని మార్గదర్శనం చేయమని అందమయిన కంద పద్యాల రూపంలో విన్నవించుకొన్నారు. ఈ పద్యాలలో ప్రస్తావించిన విషయాలు వయోభేదం లేకుండా అందరికీ వర్తిస్తాయి.

అజ్ఞాతంబుగనుండెడు / విజ్ఞానంబును నిరతము వెదకుటకొరకై
అజ్ఞానము పోగొట్టెడు / 'జిజ్ఞాస'ను నిలువనిమ్ము జీవితమెల్లన్

ఈ విన్నపం సార్వకాలీనం, సార్వజనీనం. ఈ లఘుకావ్యంలో ఇటువంటి మననం చేసుకొనవలసిన పద్యాలు ఎన్నో ఉన్నాయి. అధ్యాపకులు ముఖ్యంగా 'నీ విలాసం' 'నా విన్నపం' భాగాల పద్యాలను నేటి విద్యార్థులకు బోధించి విద్యార్థులలో జ్ఞానసముపార్జన సంపుష్టి చేయవలసిన అవశ్యకత ఎంతో ఉంది. ఆ దిశగా మన రెండు రాష్ట్రాల విద్యాశాఖాధికారులు ఈ గ్రంథంలో కొన్ని పద్యాలను ఎంపిక చేసి పాఠ్యాంశాలుగా చేర్చే విషయాన్ని తప్పక పరిశీలించమని నా విజ్ఞప్తి.

ఈ చింతనాత్మక చిన్న పొత్తాన్ని **మిసిమి** పాఠకులు సాదరంగా స్వాగతిస్తారని ఆశిస్తున్నాను.

'అక్షరాంజలి' *- రచయిత* ***డా. ఎ.ఎన్. రామశాస్త్రి*** *(అనామకుడు), పేజీలు: 54, వెల: అమూల్యం.*

అపరాజిత పబ్లికేషన్స్, ఫ్లాట్ నెం. 401, బ్లాక్ 3, మైహోమ్ *విహంగ, గచ్చిబౌలి, హైదరాబాద్-32.*

For Free Circulation: asramasastri.com / books / aksharanjali.pdf., https://kinige.com/book/aksharanjali.

రాయవరపు సత్యనారాయణ
ముంబై/కాకినాడ. ఫోన్: 9391429717.

డాక్టరు శ్రీమతి ముత్తులక్ష్మిరెడ్డి

58వ పేజీ తరువాయి..

1935 సంవత్సరంలోనే డా. ముత్తు లక్ష్మిరెడ్డి కాన్సర్ హాస్పటల్ ఆవశ్యకతను గురించి అందరికి చెప్పడమేగాక మహిళా సమాఖ్య ద్వారా విరాళాలు కూడా సేకరించారు. ఆ తరువాత 1954లో అడయార్ క్యాన్సర్ హాస్పటల్ శంకుస్థాపనకు భారతదేశపు మొదటి ప్రధాన మంత్రిగా ఉన్నటువంటి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను ఆహ్వానించారు. ఇలా అడయార్‌లో హాస్పటల్‌ను ప్రారంభించి పేద రోగులకు వైద్య సహాయం చేశారు. ప్రస్తుతం భారతదేశంలోనే అగ్రగామి కాన్సర్ హాస్పటల్‌గా వెలుగొందుతుంది.

సుబ్బరాయన్ కృష్ణయ్య, యామిని పూర్ణతిలకం, నాగరత్నమ్మవంటి సంఘసంస్కర్తల సహకారంతో డా. ముత్తు లక్ష్మిరెడ్డి దేవదాసీ వ్యవస్థకు వ్యతిరేకంగా దశబ్దాల పోరాటం ఫలితంగా 1947లో నాటి మద్రాసు రాష్ట్రంలో దేవదాసీ నిషేధ చట్టం రూపొందింది. 1988లో ఈ చట్టాన్ని నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వర్తించే విధంగా సవరణలు చేశారు. ఈ చట్టం ప్రకారం దేవదాసీ వ్యవస్థ పూర్తిగా నిషేధించబడింది. అయితే ఎవరైన ఈ వ్యవస్థను ప్రోత్సహిస్తే వారికి మూడు సంవత్సరములు జైలు శిక్ష మరియు మూడు వేల రూపాయల జరిమానా కూడా విధించడం జరుగుతుంది. ఇలా దేవదాసీలకు డా. ముత్తు లక్ష్మిరెడ్డి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. శ్రీమతులు సరోజినినాయుడు, మాగంటి అన్నపూర్ణమ్మవంటివారితో డా. ముత్తు లక్ష్మి రెడ్డికి స్నేహం ఏర్పడడంవల్ల ఆంధ్రప్రాంతంలో జరిగే కాంగ్రెస్ సభలకు తరచుగా వచ్చేవారు. ఆ తరువాత శ్రీ కందుకూరి వీరేశలింగం ఆధ్వర్యంలో డా. టి. సుందర రెడ్డితో ఆమెకు వివాహం జరిగి తెలుగింటి కోడలయ్యారు. డా. ముత్తు లక్ష్మిరెడ్డి చేసిన అనేక సేవలకుగాను 1956లో భారత ప్రభుత్వము ఈమెను ''పద్మభూషణ్'' బిరుదుతో సత్కరించింది. ఈమె అనేక విజయాలను సాధించి సంపూర్ణమైన జీవితం గడిపి జూలై 22, 1968లో శాశ్వతంగా కనుమూశారు. మహిళలందరికి ఈమె ఆదర్శవంతంగా నిలిచి శాశ్వత కీర్తిని గడించారు.

గారపాటి కోటమ్మ, రాజమండ్రి. ఫోన్: 630 341 1820.

సహజాతం

– ముంగర జాషువ

కొలానికి,
కాలం చెల్లుతోంది!
ప్రతిక్షణం ప్రతి నిమిషం కూడా!
కాలం సర్వాంతర్యామి
కాలానికి సరిహద్దుల్లేవ్!
కాలానికి సిద్ధాంతాల్లేవ్!
కాల స్థలాలు, సర్వాన్ని
హరించివేస్తాయి
దుప్పటి కప్పుకొని
ముడుచుకొని పడుకున్న
ముసలోడికి
ఎప్పుడో కాలం చెల్లుతుంది
కాలంతో ఏం పని?
మరణానికి ఆహ్వానం పలుకుతూ,
తను చేసిన మంచిచెడులను,
బేరీజు వేసుకుంటూ!
త్రాసు మంచివైపుకే కొంత మొగ్గు
చూపటంతో
సంతృప్తిపడి సంతోషపడ్డాడు
జీవిత కాలాన్ని ఎంతో వృధా
చేశాడని వేదనపడ్డాడు
చివరికి *Intelectualised instinct is intution* అని
తెలుసుకొని సహజాతం
*(instinct)*ని తిట్టి
నిద్రలోకి జారిపోయి పీడకలల్తో
ఆందోళన చెందాడు
కొత్త ఉషోదయం చూస్తాడా?

వెతికి వెతికి

వలపు తలపులన్ని వలలౌము
మురిపించ
కాంక్షలన్ని రేగి కల్లలౌగ!
అణువణువును వెదకి అలసిపోతిని
దేవి;
మరణమొకటి నాకు మార్గమౌను!

చివరిచూపులైన చిక్కునోదక్కునో,
ఆకసమ్ము జూచి అడుగుచుంటి!
నిదురరాదు హృదియు నెమ్మదించదు
ముగ్ధ!
కాటి దారి నుంటి కలువరమ్ము!

(అస్తిత్వ వేదనలు చదివిన తరువాత)

ముంగర జాషువ
నల్లగొండ. ఫోన్: 958 181 0406.

చదవండి...

- మిసిమి

సరళసుందర సునిశిత మమత: మీకు బెంగాల్ తెలుసా?

అక్కడ 20 సంవత్సరాలు కమ్యూనిస్టులు ప్రభుత్వాన్ని నడిపారు తెలుసా? అలాంటి కరీంద్రాన్ని నిర్వీర్యం చేసి కేవలం తెల్లచీర కట్టిన బ్రహ్మచారిణి మమతా బెనర్జీ, ఒంటి చేతితో ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. ఆమె మమత - ఈ కవిత్వం ఆమె రాసిందే. సామాన్య తెలుగు చేశారు. ఎంతైనా టాగోర్ నేలకదా - కళలో, కవిత్వంలో గంగలా ప్రవహిస్తుంటుంది. ఈ పుస్తకానికి 'అభినందన్' మూర్తీదేవి సమ్మాన గ్రహీత కొలకలూరి ఇనాక్ అందించారు. *'జీవించటానికి, తిరగటానికి బంధాలు వేయని నేల కావాలి, ఎక్కడుంటుంది చెప్పండి - ఈ ప్రపంచం కొందరు కూర్చిని అల్లిన కల్పిత గాథ'* ఎంత సత్యం. మనకు కేవలం వార్తల ద్వారా తెలిసిన 'మమత'లో ఇంత మమతానురాగాల ఆర్ద్రత ఉన్నదంటే విశేషమే.

పేజీలు: 117, ₹ 100/- ప్రతులకు: ఫోన్: 984 878 7284.

విరోధాభాస: ఝాన్సీ కొప్పిశెట్టి. నవలలు అరుదైపోయిన

ఈ రోజుల్లో నవల రాయటమే ఎంతో శ్రమతో సమయంతో కూడుకున్న పని! ఈ 'Paradox' నవల - విరుద్ధాతల సంకలనం - విభిన్నతల సమాహారం - భిన్నభావాల ఏకత్వం, మంచిచెడుల సమ్మేళనం - అంటూ రచయిత్రి తెరతీశారు. అందరం ముసుగులతోనే బయటకు వస్తాం, ఇప్పుడు మాస్కులు ఆ పని నెరవేరుస్తున్నాయి. ఎటువంటి మానసిక రుగ్మతలకైనా సమాజసేవ - మానవసేవ - మాధవసేవగా సాంత్వన పొందవచ్చు. డా. సి. మృణాళినిగారు 'వాస్తవికత ఆదర్శాలు' అంటూ ప్రస్తుతించారు.

పేజీలు: 164, ₹ 150/- ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

అంతర్వేది: డా. అవధానం రఘుకుమార్ రచయిత. పేరు చాలా మర్మగర్భితంగా ఉంది కదూ - అంతర్వేది అంటే ఒక పుణ్య యాత్రాస్థలం ఇంకా మిస్సమ్మ తప్పిపోయిన



తిరుణాల. కానీ అవధానం వారి అంతర్వేది - ఇది అంతర్నిర్వేదం. అంతరాంతరవేదం - అది ఏది! ఇది ఒక భావధార - కవితలల్లి నివేదన - స్త్రీని గౌరవించేవారు - స్నేహాన్ని ప్రేమించేవారు - అరుదైన 'Species'. కీర్తికి పాకులాడనివారు - సిద్ధాంత రాద్ధాంతాలతో చిక్కుపడనివారు. 'గొప్ప' వాళ్లను 'చూసి' భయపడేవారు - వీరూ అరుదైన 'Species' మరి ఇన్ని గుణాలున్న ఒక వ్యక్తిని ఏ కోవలోకి చేర్చాలి? అసలు ఏ కోవకైనా ఎందుకు చేర్చాలి - వద్దనే అంటారు - అవధానంగారు - 'సామాజిక స్పృహ' - సామాజిక చైతన్యం - కవిత్వపు అంతిమ లక్ష్యం - సమాజ శ్రేయస్సు కూడా - ఉద్ధరించటం' ఇలాంటి పదాలకు అర్థం ఏమిటి అని ఆశ్చర్యపోయే వ్యక్తి - ఎలాంటి కవిత్వం రాస్తారు? 'ఎందుకీ శూన్యం శుష్కించదు - ఎందుకీ చీకటి చెరిగిపోదు?' అని వాపోయే వ్యక్తి కవిత్వం ఎలా ఉంటుంది - అయితే చదవండి 'అంతర్వేది'ని.

పేజీలు: 87, ₹ 60/- ప్రతులకు: ఎ. నాగమణి, ఫ్లాట్ నెం. 401, శశాంక్ రెసిడెన్సి, స్ట్రీట్. 11, తార్నాక, హైదరాబాద్-17. ఫోన్: 040-2700 0327, 939 195 5136, 900 006 4165.

ఊపిరిపాట: సంపాదకులు: గోపగాని రవీందర్. ఇది



కరోనాపై కవన శరాలు. ఈ విధంగా కరోనాను కట్టడి చేయగలమా? అయినా కవిత్వానికి హద్దుపొద్దు ఏమిటి? ఏదైనా రాయవచ్చు - దేనిమీద అయినా రాయవచ్చు. 50 వచన కవితలున్న ఈ సంకలనంలో

కరోనా సంచలనం ప్రధాన ఇతివృత్తం. నివారణ ఏమీ ఉండదు.

పేజీలు: 104, ₹ 80/- ప్రతులకు: పాలపిట్ట, హైదరాబాద్. ఫోన్: 984 878 7284.

సాహితీవనంలో ఒక మాలి: డా. కపిలవాయి లింగమూర్తి. కూర్పు: డా. కొల్లోజు కనకాచారి.



పేజీలు: 189, ₹ 180/- ప్రతులకు: డా. ఎం.వి. వసంతరావు, 6-3-26/ఎ, రామగిరి, నల్లగొండ-508001.

కందిలి మరికొన్ని కవితలు: ఇది కవితా సంపుటి. పాలపిట్టవారిది. "విషాదాన్ని స్మృతి పథంలో నుంచి బయటికి నెట్టెయ్యాల్సిందే - ధైర్యమై ముందుకు సాగిపోవాల్సిందే' అదీ కవి పాఠకునికి ఇస్తున్న ధైర్యం!

ఉపాధ్యాయుడు పిల్లల్ని నడిపించినట్లు కవి సమాజాన్ని నడపాలని ముందుమాటలో గోపగాని రవిందర్ చెబుతున్నారు. లేదాళ్ల రాజేశ్వరరావు గారి మొదటి పుస్తకం ఇది.

పేజీలు: 184, ₹ 100/- ప్రతులకు: లేదాళ్ల జయరాజ్వేరరావు, 6-41/3, అంకటివాడి, లక్నెట్టిపేట-504215, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 040-27678430, 984 878 7284.

రామణీయకం: ద్విశతి - ఆటవెలదులు. కళాదిత్య - డి. రాములు (రాము). డి. రాములుగారికి ప్రజల బాసలో వారికర్థమయ్యే రీతిలో ఆటవెలదులు ఒక

వేయి రాయాలని కోరిక ఉన్నట్లు ఎస్.ఆర్. భల్లంగారు అంటున్నారు. కవితా వస్తువు వ్యక్తి - సమాజం సంఘర్షణతో నిండిపోయింది. ఏమీ పాలుపోని స్థితిలో కవితలల్లుకుంటూ కూర్చుంటున్నామా? రాములుగారి పద్యాలు ఆర్ద్రంగా పాఠకులను తడుపుతాయి.

పేజీలు: 80, వెల: అమూల్యం. ప్రతులకు: రచయిత, 24సి-3-22, మంచినీళ్ల తోట, వినాయకగుడి వీధి, పత్తేబాద, ఏలూరు-534 002. ఫోన్: 944 037 6688.

కొండవీటి కైఫియతు: సంపాదకుడు: మోదుగుల రవికృష్ణ. కొండవీటి కోట అభివృద్ధి కమిటీ తరపున శ్రీ కల్లి శివారెడ్డిగారు సమర్పించిన ఈ కైఫీయతు రవికృష్ణగారి కనుసన్నల్లో జరిగింది. కొండవీటి చరిత్ర తెలుసుకోవాలంటే ఈ కైఫీయతు కూడా తెలుసుకోవాలి. అసలు కైఫీయ్యతు అనే అరబ్బీ పదానికి అర్థం ఏమిటి? స్థితిగతులు, వర్తమానం, సమాచారం, చరిత్ర, వృత్తాంతం, వివరం - ఇన్ని రకాల అర్థాలు చెప్పవచ్చని రవికృష్ణగారి మాట. ఏతావాతా చరిత్ర వివరాలనే కదా - మన ఇంగ్లీషు చదువులు మనకు నేర్పింది. ఇంగ్లీషువారు రాకముందు ఇక్కడ ఏమీ లేదు అని ఇది ఎంత అసంబద్ధం అంటే 'ధర్మపాల్'గారి *The Beautiful Tree* చదవండి - అది మనవాళ్లు తయారు చేసింది కాదు - 1750 ముందు భారతదేశంలో ఉన్న విద్యా విధానాన్ని ఇంగ్లీషువారు చక్కగా డాక్యుమెంటరీ చేసి ఇంగ్లండులో భద్రపరిచారు. వారి మతవ్యాప్తి పరిపాలనా బానిసల కోసం ఆంగ్ల విద్యా విధానాన్ని దేశంమీద రుద్దారు. ఇది అక్షరాలా నిజం. సరే, కైఫీయతు విషయానికి వస్తే మెకంజీ గుర్తుకు రాక మానడు. ఇవే ప్రామాణికంగా చదువులు చెప్తున్నారు. రవికృష్ణగారు కల్లి శివారెడ్డిగారు ఎంతో శ్రమ చేసి ఆర్ట్ పేపరు మీద ముద్రించి ఈ కొండవీటి చరిత్రను అందిస్తున్నారు. పెద్దలు బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, వాసిరెడ్డి వెంకటరావు టెక్నాలజీ సంస్థ సహాయ సహకారాలు అందించారు. కేవలం రూ. 100/- కే అందిస్తున్న ఈ విలువైన పుస్తకం తప్పక మీ గ్రంథాలయంలో ఉండాల్సిందే.



పేజీలు: 92, వెల: ₹ 100/- ప్రతులకు: సాహితీ ప్రచురణలు, 33-22-2, చంద్రం బిల్డింగ్, సి.ఆర్. రోడ్, చుట్టుగుంట, విజయవాడ-4. ఫోన్: 0866-2436642 / 43.

శివరామ బ్రహ్మేంద్రస్వామి చరిత్ర: డా. కపిలవాయి లింగమూర్తి. ఇది శివరామ బ్రహ్మేంద్రస్వామి చరిత్ర.

పేజీలు: 165, ₹ 200/- ప్రతులకు: ఫోన్: 879 072 7772.

మిసిమి
మాసపత్రిక

మీరు చందాదారులుగా చేరండి **బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ ద్వారా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com)*, ద్వారాగానీ తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

చందా వివరాలు:

₹ 360/- (సంవత్సర చందా),
₹ 720/- (రెండు సంవత్సరాలకు),
₹ 1080/- (మూడు సంవత్సరాలకు),
₹ 1440/- (నాలుగు సంవత్సరాలకు).
₹ 1,800/- (అయిదు సంవత్సరాలకు)

Our A/c Details for Online Transfer:

Bank : **HDFC Bank**
Account : **MISIMI**
A/c. No. : **50200010161999**
Branch : **RTC X ROADS, Hyderabad.**
IFS Code : **HDFC0000472**

Scan here to pay

MISIMI AUNIT OF KALAJYO
PAO NO. 99537004

BHIM G Pay paytm UPI PhonePe MobiKwik & more

Ph: 939 343 6969

మిసిమి ప్రచురణలు

నోబెల్ వ్యాసాలు


మిసిమి పార్థసారథి వ్యాసాలు

చిత్రకళా నీరాజనం


చార్లీ చాప్లిన్


భైరప్ప

ప్రపంచ సాహిత్యం

పాలబొమ్మ

పెళ్లి జీవిత కథ

సిద్ధార్థ


దోసిట చిన్నుకులు

ప్రతులకు:
మిసిమి కార్యాలయాన్ని సంప్రదించండి.
ఫోన్: **994 951 6567**

మిసిమి మాసపత్రిక
Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**